సత్యమేవ జయతే

సాక్షి

'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 248

శనివారం 29-11-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

Brides of India

MALABAR GOLD & DIAMONDS
CELEBRATE THE BEAUTY OF LIFE

Brides of India

వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య, వధూవరులిద్దరూ జీలకర్ర బెల్లాన్ని ఒకరి తలపై ఒకరు ఉంచుకుంటారు – తీపి చేదు కలబోసిన జీవిత ప్రయాణాన్ని ఒకరితో ఒకరు పంచుకుంటామని ప్రమాణం చేస్తారు. ప్రేమానురాగాలతో ఆ క్షణం మరింత ప్రకాశవంతంగా మారుతుంది. అయితే, దివ్యాభరణాలతో అలంకరించబడిన వధువు, తన లావణ్యం మరియు ప్రశాంతతో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

ఆమె లాంటి వధువుల అనురాగం నుండి ప్రేరణ పొంది, బంగారం, వజ్రాలు, పోల్కి మరియు విలువైన రాళ్లతో మా ఆభరణాల సేకరణలు రూపొందించబడ్డాయి. వారి లావణ్యం మరియు ప్రశాంతతను ప్రతిబింబించే ప్రతి ఆభరణం, ఒక అందమైన వేడుకకు అద్దం పడుతుంది.

ప్రతి భారతీయ వివాహం ఒక అద్భుత వేడుక

తగ్గింపు
30%* వరకు
అన్ని బంగారు, అన్‌కట్ & రత్నాభరణాల తరుగు ఛార్జీలపై.

తగ్గింపు
30%* వరకు
వజ్రాల విలువపై.

*షరతులు వర్తిస్తాయి

ఈ ఆఫర్ నవంబర్ 28, 2025 - జనవరి 18, 2026 వరకు మాత్రమే

ఆంధ్రప్రదేశ్ : విశాఖపట్నం | తిరుపతి | కర్నూలు | విజయవాడ | కాకినాడ | రాజమహేంద్రవరం | గుంటూరు | భీమవరం | కడప | నెల్లూరు | అనంతపురం | శ్రీకాకుళం | ఏలూరు | ఒంగోలు | అనకాపల్లి | విజయనగరం | గాజువాక | **ఇప్పుడు నంద్యాల, మచిలీపట్నం, అమలాపురంలో**

09562 916 916

MALABAR
GOLD & DIAMONDS
CELEBRATE THE BEAUTY OF LIFE

BUY ONLINE AT: malabargoldanddiamonds.com | 410 కి పైగా షోరూములు 14 దేశాలలో

'బూచాడమ్మా బూచాడు బుల్లిపెట్టెలో ఉన్నాడు' సరదాగా పాడుకున్న పాట. బుల్లిపెట్టెలో ఆ బూచాడు లేకపోవచ్చు. కాని ఇప్పటి బుల్లిపెట్టెలలో (స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్, ట్యాప్)లలో ఒక రాక్షసుడు దాగి ఉన్నాడు. మహిళలను లక్ష్యంగా చేసుకొని క్రూరత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఆ రాక్షడుసుడి పేరు...

'డిజిటల్ హింసాసురుడు'

'ఇంటర్నేషనల్ డే ఫర్ ది ఎలిమినేషన్ ఆఫ్ వయోలెన్స్ అగేనెస్ట్ ఉమెన్' సందర్భంగా ఐక్యరాజ్య సమితి డిజిటల్ హింసకు వ్యతిరేకంగా పదహారు రోజుల ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమాలలో సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ఎంతోమంది భాగస్వాములు అవుతున్నారు... కాలంతో పాటు మహిళలపై జరిగే హింసా రూపాలు మారుతున్నాయి.'డిజిటల్ వయోలెన్స్' అనేది ఇప్పుడు సరికొత్త సాంకేతిక హింస.

వైరల్ అయినా ప్రమాదమేనా?!

కేవలం రెండు సెకన్‌ల వీడియోతో ఇటీవల ఇంటర్నెట్ అబ్సెషన్‌గా మారింది ప్రియంగన. తక్కువ టైమ్‌లోనే ఈ వీడియో క్లిప్ 50 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. అయితే ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే. మరోవైపు... ఆమె ఏఐ వీడియోలు ఆన్‌లైన్‌లో వెల్లువెత్తాయి. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఆమె ఏఐ వీడియోలను క్రియేట్ చేస్తున్నారు. పరిస్థితి ప్రమాదం వైపు వెళుతుందని గ్రహించిన ప్రియంగన మెల్లగా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లను తొలిగించడం మొదలుపెట్టింది. తన వీడియో క్లిప్ వైరల్ కావడం వల్ల ఎదురైన సమస్యలను ఏకరువు పెట్టిన ప్రియంగన తన ఏఐ జనరేటెడ్ వీడియోలు, ఇమేజ్‌ల వల్ల తాను, తన కుటుంబం ఇబ్బందులు పడినట్టు తెలియజేసింది. ఇది మచ్చుకు చిన్న ఉదాహరణ మాత్రమే!

డిజిటల్ హింసపై యునైటెడ్... ఫైట్

అవమానాలు... ఆత్మహత్యలు

డిజిటల్ హింస భరించలేక మానసిక సమస్యల బారిన పడుతున్నవారూ, ఆత్మహత్యలు చేసుకుంటున్నవారూ దేశవ్యాప్తంగా ఎంతోమంది ఉన్నారు. టెక్నాలజీ–ఫెసిలేటెడ్ జెండర్–బేస్డ్ వయోలెన్స్(టీఎఫ్‌జీబీవి) వల్ల మన దేశంలోని ఆన్‌లైన్ స్పేస్‌లు మహిళల పాలిట ప్రమాదకరంగా మారుతున్నాయని ఒక నివేదిక హెచ్చరించింది. బహిరంగంగా అవమానించడం, అవహేళన చేయడం, బెదిరింపులు... మొదలైన రూపాల్లో మహిళలపై డిజిటల్ హింస జరుగుతోంది.

డిజిటల్ హింసపై వార్

జెండర్–ఆధారిత హింసకు వ్యతిరేకంగా యునైటెడ్ నేషన్స్ విమెన్ ఇండియా పదహారు రోజుల ప్రచారకార్యక్రమం నిర్వహిస్తోంది. నవంబర్ 25న మొదలైన ఈ ప్రచార కార్యక్రమాలు డిసెంబర్ 10 వరకు కొనసాగుతాయి. ఈ జెండర్‌బేస్డ్ వయోలెన్స్ వ్యతిరేక క్యాంపెయిన్‌లో యునైటెడ్ విమెన్ ఇండియాతో కలిసి పనిచేస్తోంది సినీ నటి, నిర్మాత సమంత.

'మహిళలు, పిల్లలపై జరిగే హింసను అంతం చేయడానికి ఐక్యం అవ్వండి' అనే నినాదంతో ఈ క్యాంపెయిన్ కొనసాగుతుంది. పెరుగుతున్న ఆన్‌లైన్ వేధింపుల గురించి సమంత అవగాహన పరుస్తుంది. అప్రమత్తం చేస్తుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై అమ్మాయిలు, మహిళలు ఎదుర్కొంటున్న స్టాకింగ్, డాక్సింగ్, డీప్‌ఫేక్స్, ఇమేజ్ మాన్యుపులైజేషన్‌పై గట్టిగా గొంతు విప్పుతోంది. 'హింస అనేది ఇప్పుడు శారీరక హింస మాత్రమే కాదు. అది స్క్రీన్ రూపంలో కూడా వెంటాడుతుంది. మన గొంతులను నొక్కి మౌనంగా చేస్తుంది. మహిళలే లక్ష్యంగా చేసుకునే జరిగే డిజిటల్ హింస వారి భద్రత, గుర్తింపు,ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంది' అంటుంది సమంత. సోషల్ మీడియాలో లక్షలాది ఫాలోవర్స్ ఉన్న సమంత డిజిటల్ హింసకు సంబంధించి తన వ్యక్తిగత చేదు అనుభవాలను పంచుకుంటుంది. క్యాంపెయిన్‌లో భాగంగా 'వీడియో మెసేజ్'ను విడుదల చేసింది 'యూఎన్ విమెన్ ఇండియాతో కలిసి పనిచేయడం గర్వంగా ఉంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు జవాబుదారీతనం పెరగాలి. రక్షణ చట్టాలను బలోపేతం చేయాలి' అంటుంది సమంత.

ఐశ్వర్య... హైకోర్టు వరకు

తన వ్యక్తిగత హక్కులను రక్షించుకోవడానికి కోర్టును ఆశ్రయించింది బాలీవుడ్ సెలబ్రిటీ ఐశ్వర్యరాయ్ బచ్చన్. ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీని ఉపయోగించి తన చిత్రాలను మార్ఫింగ్ చేస్తున్నారని, అసభ్యకరమైన వీడియోలు సృష్టిస్తున్నారని తన పిటిషన్‌లో తెలియజేసింది ఐశ్వర్య. తన వ్యక్తిగత గోప్యతా హక్కును పరిరక్షించాలని కోర్టుకు విజ్ఞప్తి చేసింది. 'ఐశ్వర్య ఫొటోలు దుర్వినియోగం చేయడం అనేది ఆమె గౌరవ, ప్రతిష్ఠలను దెబ్బతియడమే' అని పేరొన్న న్యాయస్థానం పిటిషన్‌లో ఐశ్వర్య పేర్కొన్న యూఆర్‌ఎల్‌లను బ్లాక్ చేయాలని గూగుల్‌తో సహా రకరకాల డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించింది.

ఫొటోల డిజిటల్ మాన్యుపులేషన్, ఫేక్ ఎకౌంట్స్, సైబర్ బుల్లీయింగ్, కోఆర్డినేటెడ్ ఎటాక్స్.. మొదలైనవి డిజిటల్ హింస తాలూకు వివిధ రూపాలు. అశ్లీల సైట్లు, చాట్ ప్లాట్‌ఫామ్‌లలో తాము టార్గెట్ చేసిన మహిళల చిత్రాలను పోస్ట్ చేసి అసభ్య రాతలు రాస్తుంటారు. 'ఇది నా ఫోన్ నంబర్ కాల్ చేయండి' అని ఫోన్ నెంబర్ పెడుతుంటారు.

ఫిర్యాదు చేయాలా, వద్దా?

డిజిటల్ వేదికలలో కొందరు నేరస్థులు మంచి మాటలతో అమ్మాయిలను పరిచయం చేసుకొని, స్నేహం చేస్తారు. ఆ తరువాత రకరకాలుగా బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. ఇంత జరుగుతున్నా చాలామంది బాధితులు పోలిస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు.

'ఫిర్యాదు చేయడం అనేది మరొకరకమైన హింస. నా దురదృష్టం అని బాధపడి ఊరుకున్నాను' అంటుంది ఢిల్లీకి చెందిన ఒక బాధిత మహిళ. పదిమందికి తెలిస్తే పరువు పోతుంది అనుకోవడం, కుటుంబ ఒత్తిళ్లు, న్యాయం జరగదు అనే అపోహల వల్ల చాలా మంది బాధితులు ఫిర్యాదు చేయడానికి దూరంగా ఉంటున్నారు. కొందరు బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేసినా, ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవడానికి ఎంతో కాలం పట్టడం లేదు. భద్రతతో పాటు ఇంకా ఎన్నో అంశాలు ఫిర్యాదును వెనక్కి తీసుకోవడానికి కారణం అవుతున్నాయి. ఫిర్యాదులు అందినప్పుడు కొన్ని కేసులకు సంబంధించి ఎలా స్పందించాలో పోలీసులకు తెలియడం లేదు.

చట్టం ఉన్నా సరే...

మన దేశంలో సైబర్ నేరాలను నిరోధించే ప్రధాన చట్టం సమాచార సాంకేతిక చట్టం–2000 (ఐటీ చట్టం) అయితే ఇది ప్రధానంగా ఆస్తి, డేటాకు సంబంధించిన నేరాలపై మాత్రమే ప్రధానంగా దృష్టి సారిస్తోంది.

'మహిళలపై జరిగే డిజిటల్ హింసకు సంబంధించి ఈ చట్టం సమర్థంగా ఉపయోగపడడం లేదు' అని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు కొందరు.

'ఫిర్యాదు అందిన వెంటనే హానికరమైన కంటెంట్‌ను తక్షణమే తొలగించాలి. ఈ విషయంలో కొన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయి' అని ఆగ్రహం వ్యక్తం చేసింది బెంగళూరుకు చెందిన ఒక బాధితురాలు.

'డిజిటల్ స్పేస్‌లను సురక్షితంగా మార్చడానికి తగిన న్యాయ, విధాన సంస్కరణలు, బలమైన చట్టాలు అవసరం. వేగంగా న్యాయం జరగాలి. టెక్ కంపెనీలు తమ వేదికలపై జరిగే హానికి బాధ్యత తీసుకోవాలి' అంటుంది విద్యావేత్త, రచయిత్రి అమంద. 'ఆన్‌లైన్ కేసుల నుంచి తప్పించుకోవడానికి చట్టంలోని లొసుగులను వాడుకుంటున్నారు. అలాంటివి జరగకుండా చూడాలి' అంటోంది ముంబైలోని ఒక స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్న జీవని.

సాక్షి సినిమా

డిసెంబరు 1నుంచి సావిత్రి మహోత్సవ్

అందం, అభినయంతో ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశారు మహానటి సావిత్రి. డిసెంబరు 6న ఆమె 90వ జయంతి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని డిసెంబరు 1 నుంచి 6వ తేదీ వరకు 'సావిత్రి మహోత్సవ్' పేరిట ఉత్సవాలు నిర్వహించనున్నట్లుగా సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ''మా మాతృమూర్తి సావిత్రిగారి 90వ జయంతి వేడుకలను హైదరాబాద్ రవీంద్రభారతిలో 'సావిత్రి మహోత్సవ్' పేరిట నిర్వహించనున్నాం. సంగమం ఫౌండేషన్‌తో కలిసి నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో డిసెంబరు 1 నుంచి 5 వరకు సావిత్రిగారి సినిమాల ప్రదర్శన, పాటల పోటీలు ఉంటాయి. డిసెంబరు 6న జరిగే జయంతి సభలో 'మహానటి' చిత్రదర్శకుడు నాగ్ అశ్విన్, నిర్మాతలు ప్రియాంక దత్, స్వప్న దత్‌లను, 'సావిత్రి క్లాసిక్స్' పుస్తక రచయిత సంజయ్ కిశోర్, ప్రచురణకర్త బొల్లినేని కృష్ణయ్యలను సత్కరిస్తాం'' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వంద జన్మలైనా నటుడిగానే పుట్టాలనుకుంటున్నాను - రజనీకాంత్

''సినిమాను సెలబ్రేట్ చేసుకోవడం కోసం మనందరం ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యాం. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన కథలను సెలబ్రేట్ చేస్తున్నాం. ఈ రోజు ఈ వేడుకలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఈ రోజుతో ఈ ఫెస్టివల్ ముగినట్లు కాదు... సృజనాత్మక ఆలోచనలు, ప్రపంచవ్యాప్త సినీ కళాకారుల సమ్మేళనానికి ఓ నిదర్శనం. ఇఫీలోని మరో కొత్త అధ్యాయానికి మరో ముందడుగు'' అని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ పేర్కొన్నారు. గోవా వేదికగా ఈ నెల 20న మొదలైన 'ఇఫీ' (ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా) వేడుకలు శుక్రవారం (నవంబరు 28)తో ముగిశాయి. సినీ పరిశ్రమలో నటుడిగా యాభై ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు రజనీకాంత్‌ని ఈ వేడుక చివరి రోజున గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ సత్కరించారు.

రజనీకాంత్‌ని సత్కరిస్తున్న ప్రమోద్ సావంత్

ఈ సందర్భంగా **రజనీకాంత్ మాట్లాడుతూ** – ''యాభై ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు సత్కరించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. 'ఇఫీ' వేడుకలను నిర్వహిస్తున్న గోవా ప్రభుత్వానికి శుభాకాంక్షలు. సినిమాల్లో నాకు యాభై సంత్సరాలు పూర్తయ్యాయి. కానీ నాకు మాత్రం పదో–పదిహేనో సంవత్సరాలు పూర్తయినట్లుగా ఉంది. నటనను, సినిమాను ప్రేమిస్తున్నందువల్లే ఇలా అనిపిస్తోంది. నాకు వంద జన్మలున్నా నేను ప్రతి జన్మలోనూ నటుడిగానే, రజనీకాంత్‌గానే పుట్టాలనుకుంటాను. దర్శకులు, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్, టెక్నీషియన్స్... ఇలా ఇండస్ట్రీతో పాటుగా నా జర్నీలో కూడా భాగమైన వారందరికీ నా ఈ 50 ఏళ్ల సత్కారం దక్కుతుంది'' అని రజనీకాంత్ అన్నారు.

భారత సమాచార, ప్రసార శాఖ మంత్రి ఎల్. మురుగన్ మాట్లాడుతూ – ''ఇండియన్ సినిమాను గ్లోబల్ స్టేజ్‌కి తీసుకెళ్లడమే 'ఇఫీ' లక్ష్యం. గౌరవ భారత ప్రధాని నరేంద్ర మోదీగారి నేతృత్వంలో ఈ ఏడాది మేలో తొలిసారిగా 'వేవ్స్ – 2025' (వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్) జరిగింది. ఇఫీలో 'వేవ్స్ బజార్–2025'ను ఏర్పాటు చేశాం. ఈ ఏడాది రూ. 1000 కోట్ల బిజినెస్ జరిగిందని గర్వంగా చెప్పగలను. నరేంద్ర మోదీ గారు మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తారు. ఈ ఏడాది 'ఇఫీ'లో మహిళా దర్శకులు తీసిన యాభై సినిమాలు ప్రదర్శితమయ్యాయి'' అని చెప్పారు.

ఈ చిత్రోత్సవాల్లో బెస్ట్ ఫీచర్ ఫిల్మ్‌కి అందించే ప్రతిష్ఠాత్మక గోల్డెన్ పీకాక్ అవార్డును వియత్నాం ఫిల్మ్ మేకర్ యాష్ మేఫెయిర్ డైరెక్ట్ చేసిన 'స్కిన్ ఆఫ్ యూత్' దక్కించుకుంది. ఇండియన్ ఫీచర్ ఫిల్మ్ బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ అవార్డు విభాగంలో కరణ్ సింగ్ త్యాగి ('కేసరి చాప్టర్ 2')కి దక్కింది. ఇక 'ఇఫీ' వేడుక చివరి రోజున 'సంక్రాంతికి వస్తున్నాం' (ఇండియన్ పనోరమా విభాగం) స్క్రీనింగ్ అయింది. ఇందులో భాగంగా చిత్రనిర్మాత 'దిల్' రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ ఐశ్వర్యా రాజేశ్ ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ వేడుకల్లో ఇంకా రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

వచ్చే నెల పెళ్లి చేసుకుందాం

వెంకటేశ్, సౌందర్య

వెంకటేశ్ హీరోగా నటించిన 'పెళ్లి చేసుకుందాం' సినిమా మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. డిసెంబరు 13న వెంకటేశ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సూపర్ హిట్ మూవీని రీ రిలీజ్ చేస్తున్నారు. వెంకటేశ్, సౌందర్య జోడీగా లైలా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'పెళ్లి చేసుకుందాం'. ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో సి. వెంకట్రాజు, జి. శివరాజు నిర్మించిన ఈ సినిమా 1997 అక్టోబరు 9న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. 28 ఏళ్ల తర్వాత ఈ మూవీని రీ–రిలీజ్ చేయనున్నట్లు సాయిలక్ష్మీ ఫిలిమ్స్ అధినేత వరప్రసాద్ తెలిపారు. ''పెళ్లి చేసుకుందాం' హక్కులను మూడేళ్లకు పొందాం. ఈ చిత్రాన్ని 4కె వెర్షన్‌లో ఆంధ్ర, తెలంగాణలో భారీ స్థాయిలో రీ–రిలీజ్ చేస్తున్నాం. వెంకటేశ్ అభిమానులతో పాటు రెగ్యులర్ సినీ అభిమానులు కూడా 'పెళ్లి చేసుకుందాం'ను ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అని వరప్రసాద్ తెలిపారు.

నా సినిమా ఉగాది పచ్చడిలాంటిది - బాలకృష్ణ

ఆది, సంయుక్త, బోయపాటి శ్రీను, బాలకృష్ణ, తమన్, రామ్ ఆచంట, గోపి ఆచంట

''నేను పాదరసంలాంటివాణ్ణి.. ఏ పాత్రలో అయినా ఒదిగిపోతా. నా సినిమా ఉగాది పచ్చడిలాంటిది.. అన్ని రుచులు ఉంటాయి. డిసెంబరు 5న థియేటర్లలో అఖండ తాండవం చూస్తారు'' అని బాలకృష్ణ చెప్పారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలకృష్ణ, సంయుక్త జంటగా నటించిన చిత్రం 'అఖండ 2: తాండవం'. ఆది పినిశెట్టి విలన్‌గా నటించారు. ఎం. తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో **బాలకృష్ణ మాట్లాడుతూ–** ''నేను, బోయపాటి సినిమా చేయాలనుకుంటే మూడే నిమిషాలు మాట్లాడుకుంటాం.. నాలుగో నిమిషం ఆ మహాయజ్ఞంలోకి దిగిపోతాం. రామ్, గోపీగార్లు కానీ, నేను కానీ విజయాలకు పొంగిపోం.. అపజయాలకు కృంగిపోం.. నా అభిమానులూ అంతే. మన సినిమా విడుదల సందర్భంగా జీవహింస చేయొద్దని నా అభిమానులను కోరుతున్నా. వాటికి కూడా జీవించే హక్కు ఉంది'' అని తెలిపారు.

బోయపాటి శ్రీను మాట్లాడుతూ– ''చిత్ర పరిశ్రమ ఒక్కరిది కాదు.. అందరిది. ఇక్కడ కుల, మత, భేదాలు లేవు. ప్రజలకు మంచి చెప్పాలి, వినోదం పంచాలన్నది మాత్రమే ఉంటుంది. మన 'అఖండ 2' సక్సెస్ కొట్టాలి. 'ది రాజా సాబ్' కూడా విజయం సాధించాలి. ఆ తర్వాత వచ్చే చిరంజీవి గారి 'మన శంకర వరప్రసాద్‌గారు' కూడా హిట్ కావాలి. ఇలా పరిశ్రమ బాగుండాలి. అప్పుడే అందరూ బాగుంటారు'' అని తెలిపారు.

గోపి ఆచంట మాట్లాడుతూ– ''బోయపాటి, బాలకృష్ణగారి కాంబినేషన్‌లో వచ్చిన మూడు చిత్రాల కంటే 'అఖండ 2' బ్లాక్‌బస్టర్ అవుతుంది'' అన్నారు.

తమన్ మాట్లాడుతూ– ''రామ్ ఆచంట, గోపి ఆచంట, అనీల్ సుంకరగార్లతో 'దూకుడు, ఆగడు' వంటి సినిమాలు చేశాను. ఆ చిత్రాల తర్వాత 'అఖండ 2' కోసం పనిచేయడం సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు.

దివిజ, అఖిల్ రాజ్

గీతోపదేశం

'రాజు వెడ్స్ రాంబాయి' ఫేమ్ అఖిల్ రాజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'అర్జునుడి గీతోపదేశం'. వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో దివిజా ప్రభాకర్, ఆదిత్య శశికుమార్, సదన్, వసంతిక మచ్చ, రాజీవ్ సాలూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సతీష్ గోగాడ దర్శకత్వంలో త్రిలోక్‌నాథ్ కాశిశెట్టి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. ''80 శాతం షూటింగ్ పూర్తయింది. డిసెంబరులో ఆఖరి షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు త్రిలోక్‌నాథ్.

పతంగుల పోటీ రెడీ

''కొత్తవాళ్లంతా కలిసి ఎంతో రిచ్‌గా 'పతంగ్' సినిమా చేశారు. నాని బండ్రెడ్డి క్రియేటివిటీ ఉన్న వ్యక్తి. ఈ సినిమా కోసం ఎంతో ఖర్చు పెట్టి ఓ స్టేడియంలో పతంగుల పోటీ పెట్టి భారీగా పతాక సన్నివేశాలు తీశారు. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుంది'' అని నిర్మాత సురేష్‌బాబు తెలిపారు. ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్, ఎస్పీ చరణ్‌లతో ముఖ్య తారలుగా నూతన నటీనటులతో రూపొందిన చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించారు.

వంశీ పూజిత్, ప్రీతి, ప్రణవ్

డి. సురేష్‌బాబు సమర్పణలో విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 25న విడుదల కానుంది. జోస్ జిమ్మి సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'ఎమోషనల్ డ్రామా...' అంటూ సాగే పాట ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ పాటని సురేష్‌బాబు విడుదల చేశారు. నాని బండ్రెడ్డి మాట్లాడుతూ– ''పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'' అన్నారు. ''ఎమోషనల్ డ్రామా..' పాటలో శ్రీమణిగారి లిరిక్స్ ఆకట్టుకుంటాయి'' అన్నారు ప్రణవ్ కౌశిక్. ''మా సినిమాలోని పతంగుల పోటీ ప్రేక్షకుల్లో ఉత్సుకతను కలిగిస్తుంది'' అని నిర్మాతలు తెలిపారు.

కథ విన్నప్పుడే థ్రిల్ అయ్యాను - నటుడు ఉపేంద్ర

పి. మహేశ్‌బాబు, ఉపేంద్ర, వై. రవిశంకర్

''ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా కథ విన్నప్పుడు థ్రిల్ అయ్యాను. ఎమోషనల్‌గా అద్భుతంగా అనిపించింది. కానీ ఈ సినిమా టైటిల్ చెప్పినప్పుడు కాస్త టెన్షన్‌గా అనిపించింది. నేనెలా ఆంధ్ర కింగ్ అవుతానని అనిపించింది. కానీ ఇప్పుడు అనిపిస్తోంది. ఇక్కడ ఉన్నవాళ్లందరూ కూడా ఆంధ్ర కింగ్స్. నేను కింగ్‌లా ఫీల్ అవుతున్నాను అంటే అది మీ (ప్రేక్షకులు, అభిమానులను ఉద్దేశించి) గొప్పతనం'' అని ఉపేంద్ర అన్నారు. రామ్, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్లుగా, ఉపేంద్ర ఓ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదలైంది. తమ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన థ్యాంక్స్ మీట్‌లో ఉపేంద్ర మాట్లాడుతూ– ''ఈ సినిమాకు ఇంత మంచి స్పందన ఇస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్. మహేశ్‌గారు అద్భుతమైన సినిమా తీశారు. హీరో, ఆ హీరో అభిమాని మధ్య ఉన్న డివైన్ ఎమోషన్‌ని చక్కగా చూపించారు. నా ఫ్యాన్ సాగర్ (సినిమాలో రామ్ పాత్ర), మహాలక్ష్మి (భాగ్యశ్రీ) ఈ సినిమాను అమెరికాలో ప్రమోట్ చేస్తున్నారు'' అన్నారు. ''ఈ చిత్రంలో రామ్, ఉపేంద్రగార్లు ఓ మ్యాజిక్ చేశారు. మంచి టీమ్‌తో పని చేసినప్పుడు వండర్స్ జరుగుతాయి. అలాంటి వండర్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'. నన్నో బ్రదర్‌లా చూసుకున్న నిర్మాతలు నవీన్, రవిశంకర్‌గార్లకు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యాను'' అని తెలిపారు పి. మహేశ్‌బాబు. ''ఈ చిత్రంలోని రామ్, ఉపేంద్రగార్ల కాంబినేషన్ సీన్స్, వారి నటన గురించి అభినందనలు వస్తున్నాయి. దర్శకుడిగా మహేశ్‌కి మంచి పేరు వచ్చింది. ఇది చాలా లాంగ్ రన్ ఉన్న సినిమా'' అని అన్నారు వై. రవిశంకర్. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎస్‌కేఎన్, మ్యూజిక్ డైరెక్టర్స్ వివేక్–మెర్విన్ మాట్లాడారు.

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు.
పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు
ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 248

శనివారం 29-11-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

భారత్ శుభారంభం

తొలి మ్యాచ్‌లో 7–0తో చిలీపై విజయం.. జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీ -10లో



జీడీపీ జైత్రయాత్ర..

అంచనాలను మించి సెప్టెంబర్ క్వార్టర్‌లో 8.2 శాతం వృద్ధి -10లో

పేద దేశాలకు నో ఎంట్రీ

పేద, అంతగా అభివృద్ధి సాధించని దేశాల ప్రజలను వలసదారులుగా అంగీకరించబోమని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

వివరాలు 6లో ▸

అర్ధరాత్రి వరకు కోర్టులోనే ఉంటా

పేదలకు న్యాయం అందించేందుకు అవసరమైతే అర్ధరాత్రి వరకు కోర్టులోనే ఉంటానని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

వివరాలు 6లో ▸

128కి పెరిగిన మరణాలు

హాంకాంగ్‌లో భవనసముదాయాన్ని నలువైపులా అగ్నికీలలు చుట్టుముట్టిన ఘటనలో మరణాల సంఖ్య 128కి పెరిగింది.

వివరాలు 6లో ▸

వచ్చే నెలలో భారత్‌కు పుతిన్

రష్యా అధినేత పుతిన్ వచ్చేనెల 4, 5వ తేదీల్లో భారత్‌లో జరిగే ఇండియా–రష్యా వార్షిక సదస్సులో పాల్గొననున్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

రాజధానికి మరో రూ.7,500 కోట్ల అప్పు

రాజధాని అమరావతి కోసం చంద్రబాబు ప్రభుత్వం మరో రూ.7,500 కోట్ల అప్పు చేస్తోంది. నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఏబీఎఫ్ఐడీ) నుంచి సీఆర్‌డీఏ తీసుకునే ఈ అప్పునకు ప్రభుత్వం అసలుకు, వడ్డీకి గ్యారెంటీ ఇచ్చింది.

వివరాలు 2లో ▸

ఏపీని దృష్టిలో పెట్టుకుని పాలసీలు

ఏపీని దృష్టిలో పెట్టుకుని వినూత్న పాలసీలు అమలు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకర్లకు సూచించారు. రాజధానిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి ఆమె శుక్రవారం శంకుస్థాపన చేశారు.

వివరాలు 5లో ▸

నేడు, రేపు భారీ వర్షాలు

'దిత్వా' తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు, ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.

వివరాలు 3లో ▸

విమాన ప్రయాణంలో ఇరుముడికి అనుమతి

శబరిమల భక్తులకు కేంద్రం శుభవార్త చెప్పింది. విమానంలో ఇకపై ఇరుముడి సహా ప్రయాణించవచ్చని వెల్లడించింది. ఇప్పటి వరకు ఇరుముడిని చెక్–ఇన్ లగేజీగా అనుమతిస్తున్నారు. దీంతో మాలధారులు అసౌకర్యానికి గురయ్యేవారు. తాజాగా ఈ నిబంధనను కేంద్రం సడలించింది.

వివరాలు 6లో ▸

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹90	ఫారం దగ్గర లైవ్ బర్డ్	111 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	200 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	138 కిలో	స్కిన్ లెస్	228 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదండీ సంగతి

వ్యవసాయ భూములన్నీ మనమే తీసుకున్నాం..! ఇక కూరగాయలు ఎక్కడ సాగు చేస్తార్సార్!!

అంతులేని భూ దాహం!

రాజధానిలో రెండో విడత 7 గ్రామాల్లో 20,494.57 ఎకరాల భూ సమీకరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

బినామీల భూముల ధరలు పెంచుకోవడం, నిర్మాణ పనుల్లో కమీషన్ల వసూలే అజెండా

- 2015లో రాజధాని నిర్మాణానికి తొలి విడతలో 53,748 ఎకరాల సమీకరణ
- భవనాలు, వసతులు, రైతుల ప్లాట్లకు పోగా ఇంకా 8,250 ఎకరాలు మిగులుతుందన్న చంద్రబాబు
- ఆ భూమిని అమ్మగా వచ్చే నిధులతోనే నిర్మాణం.. అదో సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అంటూ గొప్పలు
- 2024లో అధికారంలోకి వచ్చాక మాట మార్చిన ముఖ్యమంత్రి.. 29 గ్రామాలకే పరిమితమైతే అదో చిన్న మున్సిపాలిటీగా మిగిలిపోతుందని పదే పదే ప్రకటనలు
- రాజధానిలో భూముల ధరలు పెరగాలంటే స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలని స్పష్టీకరణ
- అది జరగాలంటే ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్ సిటీ నిర్మించాలని వెల్లడి

2లో

- ఈ క్రమంలోనే 11 గ్రామాల్లో 44,676.74 ఎకరాల సమీకరణకు సిద్ధం.. మలి విడత భూ సమీకరణకు జూన్ 24న కేబినెట్‌లో ఆమోద ముద్ర
- జూలై 1న భూ సమీకరణ పథకం-2025 విధి విధానాలు జారీ
- తొలి విడత భూములు ఇచ్చిన రైతుల ఆగ్రహంతో తాత్కాలికంగా వెనక్కు తగ్గిన సర్కారు
- చిన్న మున్సిపాలిటీగా మిగిలి పోకూడదంటూ తాజాగా కేబినెట్‌లో పచ్చ జెండా
- మూడో విడతలో మిగతా 24,182.17 ఎకరాల సమీకరణ దిశగా పావులు.. 53,748 ఎకరాల్లో రాజధాని తొలి దశ నిర్మాణానికే రూ.77,249 కోట్లు అవసరమన్న సీఎం
- ఆ భూముల్లో, రెండు, మూడో దశల్లో సమీకరించే భూముల్లో రాజధాని నిర్మాణానికి మరో రూ.3 లక్షల కోట్లు అవసరం
- ఇదంతా అప్పుగా తేవాల్సిందే.. ఈ భారమంతా ప్రజలపై తప్పదంటున్న ఆర్థిక నిపుణులు

మరో 16,666 ఎకరాల సమీకరణ

7 రాజధాని గ్రామాల్లో రెండో దశ పూలింగ్‌కు కేబినెట్ ఆమోదం

మరో 3,828 ఎకరాలు అసైన్డ్, పోరంబోకు భూములు కూడా..

ఇంధన శాఖకు రూ.3,762.26 కోట్ల నాబార్డు రుణం మంజూరుకు ఆమోదం

2లో

మూడో దశ ల్యాండ్ పూలింగ్‌కు వెళ్తాం

మంత్రి నారాయణ

2లో

బాబు క్రెడిట్ చౌర్యం..

క్యాబినెట్ సాక్షిగా బట్టబయలు!

విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు 480 ఎకరాల కేటాయింపు

అదానీని గూగుల్ నోటిఫైడ్ పార్ట్‌నర్‌గా గుర్తిస్తూ మంత్రివర్గం ఆమోదం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి క్రెడిట్ వస్తుందని సంకుచిత బుద్ధితో కప్పిపుచ్చిన బాబు

వైఎస్ జగన్ హయాంలోనే అదానీ డేటా సెంటర్‌కు భూమి కేటాయింపు, శంకుస్థాపన

సముద్రంలో కేబుల్ ఏర్పాటుకు సింగపూర్ ప్రభుత్వానికి నాడే లేఖ

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు క్రెడిట్ చౌర్యం.. విశాఖకు గూగుల్ రాక వెనుక నిజాలను తొక్కిపెట్టి సంకుచిత బుద్ధితో ప్రజలను తప్పుదోవ పట్టించిన వైనం తాజాగా మంత్రివర్గ సమావేశం సాక్షిగా మరోసారి బట్టబయలైంది! విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రాంబిల్లి, అనకాపల్లి పరిధిలో అడవివరం, తర్లువాడ గ్రామాలలో 480 ఎకరాలను గూగుల్‌తో డేటా సెంటర్లకు సంబంధించి వ్యాపార అనుబంధం ఉన్న అదానీకి కేటాయించేందుకు శుక్రవారం

మిగతా 3వ పేజీలో ▶

దక్షిణ గోవాలోని పార్తాగలీలో 77 అడుగుల ఎత్తయిన శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం

- ప్రజలు ఐక్యంగా ఉంటేనే 'వికసిత్ భారత్' సాధ్యం: మోదీ
- గోవాలో 77 అడుగుల ఎత్తయిన శ్రీరాముడి విగ్రహం ఆవిష్కరణ

6లో

'సుదర్శన చక్ర'తో శత్రు నాశనం

- బెదిరింపులు, దాడులకు నవ భారత్ లొంగదు: ప్రధాని
- దేశ రక్షణ కోసం ఎంతదూరమైనా వెళ్తాం
- ఉడుపిలో 'లక్ష కంఠ గీతా పారాయణం'లో పాల్గొన్న మోదీ

లడ్డూ, పరకామణిపై

రాజకీయం సరికాదు

- పరకామణి వ్యవహారంలో నిందితులపై చర్యలు తీసుకోవాలి.. సీఐడీ విచారణకు పూర్తిగా సహకరించా
- మనోభావాలకు సంబంధించి అంశాలను రాజకీయ సమస్యలుగా మారుస్తున్నారు
- ఆలయ పవిత్రతను కాపాడాలి
- రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

5లో

ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనం వికటించి..

11 మంది విద్యార్థులకు అస్వస్థత

వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ హైస్కూల్లో ఫుడ్ పాయిజనింగ్

3లో

- వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని వసంతపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 11 మంది విద్యార్థులు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. కాగా, హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీని 29వ వార్డు టీడీపీ కౌన్సిలర్ మోతుకూరు జయలక్ష్మి నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో వడ్డించిన పప్పు ఎలుకల మందు వాసన వచ్చిందని కొందరు, నాఫ్తలిన్ గోళీల వాసన వచ్చిందని మరికొందరు విద్యార్థులు అధికారులకు చెప్పారు.

అధికారులు పట్టుకున్న నీళ్లు కలిసిన కల్తీ మద్యం బాటిళ్లు

కూన అనుచరుడు పైడి ముఖలింగం

టీడీపీ నేత కల్తీ మద్యం దుకాణం

శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి పీఆర్ వైన్ షాప్‌లో నీళ్లు కలిపి విక్రయాలు

10.88 లీటర్ల నీళ్లు కలిపిన మద్యం పట్టివేత

షాప్ యజమాని ముఖలింగం టీడీపీ ఎమ్మెల్యే కూన అనుచరుడు

కల్తీ మద్యం అమ్ముతున్నట్లుగా తీవ్రస్థాయిలో ఆరోపణలు

ఎవరైనా ప్రశ్నిస్తే ఇది ఎమ్మెల్యే షాపు అంటూ దబాయింపు

తాజా కల్తీ ఉదంతంలో ఓనర్‌పై కాక సేల్స్‌మెన్‌లపై కేసు నమోదు

నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కన, చర్చి సమీపంలో షాప్

ఎక్సైజ్ అధికారుల అండదండలు.. పట్టించుకునేవారు కరువు

5లో

బంగారు ఆర్బీకేలు

వైఎస్ జగన్ రైతు భరోసా కేంద్రాలకు అంతర్జాతీయ గుర్తింపు

- బెస్ట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఇంగ్లాండ్‌లోని బర్మింగ్ హోమ్ యూనివర్సిటీ.. రైతు భరోసా కేంద్రాలపై ఆ వర్సిటీ విద్యార్థిని నిరోషా అధ్యయనం.. ప్రత్యేక ప్రాజెక్టుగా ప్రజెంటేషన్
- నిరోషాను వరించిన బంగారు పతకం
- జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా నిరోషా విద్యాభ్యాసం
- గోల్డ్ మెడల్‌ను వైఎస్ జగన్‌కు అంకితం ఇచ్చిన బంగారు తల్లి
- మహోత్తర వ్యవస్థను నిర్వీర్యం చేసిన చంద్రబాబు సర్కారు

12లో

నిరోషా

స్నాన యంత్రం

- హ్యూమన్ వాషింగ్ మెషిన్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చిన జపాన్ సంస్థ
- నాజిల్ స్ప్రే, తుంపర్లు, సూక్ష్మ బుడగలతో అత్యంత పరిశుభ్రమైన స్నానం
- ధర రూ. 3 కోట్లు

6లో

కర్ణాటకం.. ఓవర్ టు ఢిల్లీ

సోనియా నేతృత్వంలో నేడు ఏఐసీసీ పెద్దల సమావేశం

- కర్ణాటకలో అధికార మార్పిడి రాజకీయ సంక్షోభంపై చర్చ
- సీఎం పదవిపై ఒక నిర్ణయానికి రానున్న అధిష్టానం..
- రేపు ఢిల్లీకి రావాలని సీఎం, డిప్యూటీ సీఎంకు పిలుపు!
- ఆదివారంతో సీఎం మార్పు వివాదానికి పూర్తి తెర?
- శివకుమార్‌ను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించిన సీఎం సిద్ధు

12లో

రాజధానికి మరో రూ.7,500 కోట్ల అప్పు

ఎన్‌ఏబీఎఫ్ఐడీ నుంచి తీసుకునే ఈ రుణానికి సర్కారు గ్యారెంటీ

ఈ మొత్తంపై రెండు శాతం గ్యారెంటీ కమీషన్ సీఆర్‌డీఏ చెల్లించాలి

మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ

దీంతో రాజధాని అప్పులు రూ.40,000 కోట్లకు చేరిక

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి కోసం చంద్రబాబు ప్రభుత్వం మరో రూ.7,500 కోట్ల అప్పు చేస్తోంది. నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఏబీఎఫ్ఐడీ) నుంచి సీఆర్‌డీఏ తీసుకునే ఈ అప్పునకు రాష్ట్ర ప్రభుత్వం అసలుకు, వడ్డీకి గ్యారెంటీ ఇచ్చింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రుణ సంస్థకు ఈ మొత్తం చెల్లించడంలో సీఆర్‌డీఏ విఫలమైన పక్షంలో ప్రభుత్వ హామీ అమలులోకి వస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు రుణ ఒప్పందంపై ఆర్థికశాఖ అధికారి సంతకం చేయనున్నారు. సీఆర్‌డీఏ తన సొంత వనరుల నుంచి రుణసేవలకు బాధ్యత వహిస్తుందని అందులో పేర్కొన్నారు. హామీ ఇచ్చిన మొత్తంపై రెండు శాతం గ్యారెంటీ కమీషన్ సీఆర్‌డీఏ చెల్లించాలని స్పష్టంచేశారు. దీంతో.. రాజధాని కోసం ఇప్పటివరకు చేసిన అప్పులు రూ.40,000 కోట్లకు చేరాయి.

సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అని చెప్పి...

రాజధాని సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని సీఎం చంద్రబాబు అనేక సందర్భాల్లో చెప్పారు. అయితే, అందుకు భిన్నంగా భారీగా అప్పులు తెస్తున్నారు. బడ్జెట్ నుంచి నిధులు విడుదల చేస్తున్నారు. అప్పులు తెస్తూ బడ్జెట్ నుంచి నిధులు విడుదల చేస్తున్నప్పుడు సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు ఎలాగవుతుందో ముఖ్యమంత్రికే తెలియాలని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.



మంగళవారం మళ్లీ బాబు సర్కారు అప్పు

రూ.3,000 కోట్ల రుణాన్ని నోటిఫై చేసిన ఆర్‌బీఐ

సాక్షి, అమరావతి: వచ్చే మంగళవారం చంద్రబాబు సర్కారు మళ్లీ బడ్జెట్ పరిధిలో అప్పు చేస్తోంది. రూ.3,000 కోట్లు అప్పు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా ఈ మొత్తం రుణాన్ని ఆర్‌బీఐ సమీకరించి ప్రభుత్వానికి ఇవ్వనుంది. ఈ మేరకు ఆర్‌బీఐ శుక్రవారం నోటిఫై చేసింది.

ఇప్పటి వరకు రాజధాని కోసం ఏ సంస్థ నుంచి ఎంత అప్పు అంటే... (రూ.కోట్లలో..)	
ప్రపంచ బ్యాంకు, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు	15,000
హడ్కో	11,000
ఎన్‌ఏబీఎఫ్ఐడీ	7,500
జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ	5,000
ఏపీపీఎఫ్‌సీఎల్	1,500
మొత్తం	40,000

అంతులేని భూ దాహం!

రాజధానిలో రెండో విడత ఏడు గ్రామాల్లో 20,494.57 ఎకరాల భూ సమీకరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి కాజేసిన భూముల ధరలు పెంచుకోవడం, నిర్మాణ పనుల్లో కమీషన్ల వసూలే అజెండా

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి ఇప్పటికే 53,748 ఎకరాలు సమీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి భూ దాహం తీరడం లేదు. మలి విడతలో తుళ్లూరు, తాడికొండ, అమరావతి, మంగళగిరి మండలాల్లోని 11 గ్రామాల పరిధిలో 44,676.74 ఎకరాల భూమిని సమీకరించే దిశగా అడుగులు వేశారు. గత జూన్ 24న మంత్రివర్గంలో మలి విడత భూ సమీకరణకు ఆమోద ముద్ర వేయించారు. రాజధాని మలి విడత భూ సమీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ జూలై 1న ల్యాండ్ పూలింగ్ స్కీం (భూ సమీకరణ పథకం)–2025 విధి విధానాలు జారీ చేశారు. మొదటి విడత సమీకరణ కింద పదేళ్ల క్రితం భూములు ఇచ్చిన తమకు అప్పట్లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు చేయలేదని.. అభివృద్ధి చేసిన నివాస(రెసిడెన్షియల్), వాణిజ్య (కమర్షియల్) ప్లాట్లు ఇవ్వలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల్లో ఆగ్రహావేశాలు గమనించిన చంద్రబాబు సర్కార్ కాస్త వెనక్కు తగ్గినట్లు తగ్గి.. మలి విడత భూ సమీకరణకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతూ వచ్చింది. రాజధాని ప్రాంతంలో భూముల ధరలు పెరగాలంటే స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలని, అవి రావాలంటే ఇంటర్నేషనల్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్ సిటీ నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, పురపాలక మంత్రి నారాయణ పదేపదే చెబుతూ వచ్చారు. వీటి నిర్మాణానికి భూమి అందుబాటులో లేదని వాపోతూ వచ్చారు. రాజధాని 29 గ్రామాలకే పరిమితమైతే అదో చిన్న మున్సిపాల్టీగా మిగిలి పోతుందని, అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చెందాలంటే– మలి విడత భూ సమీకరణ తప్పదంటూ గురువారం రాజధాని రైతులతో సీఎం చంద్రబాబు కుండబద్దలు కొట్టారు. ఇందుకు రైతులు సహకరించకపోతే అమరావతి చిన్న మున్సిపాల్టీగా మిగులుతుందని అన్నారు.

మూడో విడత కూడా ఖాయం

- ఈ నేపథ్యంలో శుక్రవారం కేబినెట్‌లో రెండో విడత తుళ్లూరు, అమరావతి మండలాల పరిధిలో వైకుంఠపురం, పెద్దమద్దూరు, ఎండ్రాయి, కార్లపూడి, వడ్లమాను, హరిశ్చంద్రాపురం, పెద్దపరిమిలో రైతులకు చెందిన 16,666.57 ఎకరాల పట్టా భూమి, మరో 3,828 ఎకరాల ప్రభుత్వ భూమి వెరసి.. 20,494.57 ఎకరాల భూ సమీకరణకు ఆమోద ముద్ర వేయించారు.



- మిగతా నాలుగు గ్రామాల్లో (మోతడక, తాడికొండ, కంతేరు, కాజా) 24,182.17 ఎకరాలను మూడో విడతలో సమీకరించడం ఖాయమని అధికార వర్గాలు తెలిపాయి. భూ సమీకరణ మూడో విడత కూడా ఉంటుందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేయడం దీన్ని బలపరుస్తోంది.
- మొత్తంమ్మీద 98,424.74 ఎకరాలలో రాజధాని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని స్పష్టమవుతోంది. అందుకయ్యే వ్యయాన్ని అప్పుగా తెచ్చి.. రాష్ట్ర ప్రజలు చెల్లించే పన్నులతోనే తీర్చాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు తేగిసి చెబుతున్నారు. రాజధాని అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ ఏమాత్రం కాదన్నది మలి విడత భూ సమీకరణతోనే స్పష్టమైందని చెబుతున్నారు.

మిగిలిందన్న 8,250 ఎకరాల మాటేంటి?

- గుంటూరు జిల్లాలో తుళ్లూరు, తాడికొండ, మంగళగిరి మండలాల పరిధిలోని 29 గ్రామాలలో రాజధాని నిర్మాణం కోసం భూ సమీకరణ కింద 29,442 మంది రైతుల నుంచి 34,823.12 ఎకరాలు 2015లో ప్రభుత్వం సమీకరించింది. మరో 18,924.88 ఎకరాల ప్రభుత్వ, అటవీ భూమి కలిపి 53,748 ఎకరాల్లో (217 చదరపు కిలోమీటర్లు) రాజధాని నిర్మాణం చేపట్టినట్లు ప్రకటించింది.
- ప్రభుత్వ భవనాల నిర్మాణం, రహదారులు.. మురుగు నీటి వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు.. రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చినా ప్రభుత్వానికి 8,250 ఎకరాలు మిగులుతుందని, దాన్ని అమ్మగా వచ్చే నిధులతో అమరావతి తనను తానే నిర్మించుకుంటుందని సీఎం చంద్రబాబు అనేకసార్లు సెలవిచ్చారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అంటూ గొప్పలు చెప్పారు.
- కానీ ఇప్పుడు ఇంటర్నేషనల్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్‌కు భూములు లేవని చెప్పడంపై రైతులే విస్తుపోతున్నారు. ఇప్పటికే సమీకరించిన 53,748 ఎకరాల్లోనే.. రాజధాని తొలి దశ నిర్మాణానికే రూ.77,249 కోట్లు అవసరమని గత ఏప్రిల్ 16న 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్ ఇచ్చారు.
- తొలి దశ రాజధాని నిర్మాణం పూర్తయ్యే సరికి రూ.1.50 లక్షల కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన తాజాగా సమీకరిస్తున్న 44,676.74 ఎకరాల్లో రాజధాని నిర్మాణం పూర్తికి మరో రూ.1.5 లక్షల కోట్లు అవసరమవుతాయి. రాజధాని నిర్మాణం పూర్తయ్యే సరికి వ్యయం రూ.3 లక్షల కోట్లకు చేరుకుంటుందని అధికారుల అంచనా. ఆ రూ.3 లక్షల కోట్లను అప్పుగా తేవాల్సిందే. ఇక వాటిని వడ్డీతో కలిపి చెల్లించడానికి ఇంకెన్ని రూ.లక్షల కోట్లు అవసరమవుతాయో అంచనా వేసుకోవచ్చని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

రాజధానా.. రియల్ ఎస్టేట్ వెంచరా?

చంద్రబాబు ప్రభుత్వం రాజధాని నిర్మిస్తోందా.. లేక రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి వ్యాపారం చేస్తోందా.. అని ఆర్థిక రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే సమీకరించిన భూమిలో రాజధాని నిర్మాణంపై దృష్టి సారించకుండా.. మలి విడత భూ సమీకరణకు సిద్ధమవ్వడం ఏమిటని నిలదీస్తున్నారు. పదేళ్ల క్రితం రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ హామీలు నెరవేర్చలేదని.. అభివృద్ధి చేసిన ప్లాట్లు కూడా ఇవ్వలేదని గుర్తు చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి18 నెలలైనా, రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్న తీరు ఏమాత్రం ఆశాజనకంగా లేవని రాజధాని రైతులు బాహాటంగా వ్యాఖ్యానిస్తుండటాన్ని వారు ఎత్తిచూపుతున్నారు. ఈ స్థితిలో మలి విడతగా 44,676.74 ఎకరాల సమీకరణకు సిద్ధమవడంపై అటు రైతులు, ఇటు ఆర్థిక వేత్తలు, నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అమరావతిపై బాబు పలుకులివీ...

రాజధానిగా అమరావతి కామధేనువు వంటి ప్రాజెక్టు. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా సెల్ఫ్ ఫైనాన్షియల్ ప్రాజెక్టుగా టీడీపీ ప్రభుత్వం రూపొందించింది. భూ సమీకరణ కింద తీసుకున్న భూములు.. రైతులకు అభివృద్ధి చేసే ఇచ్చే ప్లాట్లతో సహా అన్నీ పోను ప్రభుత్వానికి 8,250 ఎకరాలు మిగులుతాయి. వాటిని అమ్ముకుంటే భారీగా నిధులు వస్తాయి.
- 2020 ఆగస్టు 7న నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు

ఐదు కోట్ల మంది ప్రజల కల అమరావతి. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు. అందరికీ ఇవ్వగా మిగిలే 8 వేల ఎకరాలకుపైగా భూములను అమ్ముకుంటే ప్రభుత్వానికి రూ.లక్ష కోట్ల వరకు ఆదాయం వస్తుంది. అక్కడ ఏ భవనం తాత్కాలిక కాదు.. అన్నీ శాశ్వత భవనాలే.
- 2020 ఆగస్టు 14న నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు

అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ మోడల్ సిటీ అని గతంలోనే చెప్పా. మిగిలిన భూములు అమ్మితే రాజధానిని నిర్మించుకోవచ్చు. ఇక్కడ సృష్టించే సంపదతో వచ్చే ఆదాయంతో సంక్షేమ పథకాలను చేపడతాం.
- 2024 జూన్ 19న సీఎం చంద్రబాబు

అమరావతిలో రైతులు ఇచ్చిన భూములతోపాటు ప్రభుత్వ భూముల్లో రోడ్లు, భవనాలు, ఇతర నిర్మాణాలు చేపట్టగా మిగిలిన భూములు అమ్మితే రాజధానిని నిర్మించుకోవచ్చు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు. ఇక్కడ వచ్చే ఆదాయమే రాజధాని నిర్మాణానికి సరిపోతుంది.
- 2024 జూన్ 20న సీఎం చంద్రబాబు

భూముల ధరలు పెంచుకోవడం, కమీషన్లే లక్ష్యం

- రాజధాని ప్రాంతంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా కాజేసిన భూముల ధరలు పెంచుకోవడం కోసం.. ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు అధిక ధరలకు నిర్మాణ పనులు అప్పగించి కమీషన్లు వసూలు చేసుకోవడం కోసం మలి విడత రాజధాని భూ సమీకరణకు చంద్రబాబు సర్కార్ సిద్ధమైందనే ఆరోపణలు బలంగా వ్యక్తమవుతున్నాయి. దీనికి 2015 నుంచి ఇప్పటి వరకు జరిగిన, జరుగుతున్న పరిణామాలను నిపుణులు, అధికార వర్గాల వారు ఎత్తిచూపుతున్నారు.
- సరైన ఆర్థిక ప్రణాళిక (నిధులు ఉన్నాయా లేదా అన్నది చూసుకోకుండా) లేకుండా రాజధాని ప్రాంతంలో 2016–19 మధ్య రహదారులు, మౌలిక సదుపాయాలు, ల్యాండ్‌పూలింగ్ స్కీం లేఅవుట్ల అభివృద్ధికి సంబంధించిన పనులను 55 ప్యాకేజీల కింద రూ.33,476.23 కోట్లకు అప్పగించారు. ఈ పనుల కోసం సీఆర్‌డీఏ రూ.8,540.52 కోట్లను అప్పు తెచ్చింది. కానీ.. ఆ పనులకు రూ.5,428.41 కోట్లను మాత్రమే 2019 మే నాటికి వ్యయం చేసింది. ఆ పనులు పూర్తి కావాలంటే రూ.28,047.82 కోట్లు కావాలి. ఇప్పుడు ఆ పనులన్నింటినీ ప్రభుత్వం రద్దు చేసింది. 2018–19 ధరలతో పోల్చితే.. పెట్రోల్, డీజిల్, సిమెంటు, స్టీలు తదితర ధరల్లో పెద్దగా మార్పులేదు. అయినా సరే మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని 50 నుంచి 105% పెంచేసి కొత్తగా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించింది.
- రాజధాని నిర్మాణ పనుల కోసం ఇప్పటికే ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నుంచి రూ.15 వేల కోట్లు, హడ్కో (హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి రూ.11 వేల కోట్లు, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి రూ.5 వేల కోట్లు, ఎన్‌ఏబీఎఫ్ఐడీ నుంచి రూ.7,500 కోట్లు, ఏపీఎస్‌పీసీఎల్ నుంచి రూ.1,500 కోట్లు వెరసి రూ.40 వేల కోట్లు అప్పు తీసుకోవడానికి ఒప్పందం చేసుకుంది.
- సీఆర్‌డీఏ బాండ్ల ద్వారా మరో రూ.21 వేల కోట్లు సమీకరించడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంటే.. ఇప్పటికే రూ.61 వేల కోట్లు అప్పులు చేస్తున్నారన్నది స్పష్టమవుతోంది. ఇక 2025–26 బడ్జెట్‌లో రాజధాని నిర్మాణానికి రాష్ట్ర ఖజానా నుంచి రూ.6 వేల కోట్లు కేటాయించారు. వీటిని పరిశీలిస్తే.. రాజధాని కామధేనువు కాదు.. అప్పులకుప్ప అన్నది స్పష్టమవుతోంది. మరి సెల్ఫ్ ఫైనాన్స్ మోడల్ ఎక్కడ ఉందన్నది పెరుమాళ్లకెరుక!
- రాజధాని నిర్మాణ పనులు రూ.62 వేల కోట్ల అంచనా వ్యయంతో ఇప్పటికే కాంట్రాక్టర్లకు అప్పగించి.. అందులో పది శాతం అంటే రూ.6,200 కోట్లను మొబిలైజేషన్ అడ్వాన్సుగా ముట్టజెప్పేసి నీకింత–నాకింత అంటూ పెద్దలు పంచుకుతిన్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. 2014–19 మధ్య రాజధాని నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థల నుంచి పెద్దల తరఫున కమీషన్లు వసూలు చేస్తూ ఆదాయపు పన్ను శాఖ అధికారులకు దొరికిపోయిన అధికారికే ఇప్పుడూ అదే బాధ్యతలు అప్పగించడం గమనార్హం. అటు తమ భూముల ధరలు పెంచుకోవడం, ఇటు నిర్మాణ పనుల్లో కమీషన్లు కాజేయడమే లక్ష్యంగా ప్రభుత్వ పెద్దలు ముందుకు వెళుతున్నట్లు స్పష్టమవుతోంది.
- ప్రభుత్వం ఇటీవల జపిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు 5వేల ఎకరాలు, మరో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ నిర్మాణాన్ని సమీప వ్యక్తులకు కట్టబెట్టి.. కమీషన్లు దండుకునేందుకు వ్యూహం సిద్ధమైందని సమాచారం.

పీపీపీ మెడికల్ కాలేజీల్లో ప్రభుత్వ కోటా 50 శాతం

- మిగతా 50 శాతం వైద్య సీట్లు మేనేజ్‌మెంట్, ఎన్నారై కోటాలో భర్తీ
- తొలుత 33 ఏళ్లు, అనంతరం మరో 33 ఏళ్లు లీజు
- లీజు ధర ఎకరానికి ఏడాదికి రూ.100
- రెండేళ్లపాటు ప్రభుత్వ బోధనాస్పత్రులను వినియోగించుకునేందుకు అనుమతి
- నాలుగు వైద్య కళాశాలలకు భూ కేటాయింపుల్లో 59.89 ఎకరాలు తగ్గింపు
- ఇకపై ప్రైవేట్ ఆయుష్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సాక్షి,అమరావతి: పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ)తో చేపడుతున్న ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల వైద్య కళాశాలల్లో ప్రభుత్వ కోటా కింద 50 శాతం సీట్లు భర్తీ చేసి, మిగతావి యాజమాన్యం, ఎన్ఆర్ఐ కోటా కింద కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. తొలుత 33 ఏళ్లపాటు, తర్వాత మరో 33 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏడాదికి ఎకరానికి రూ.100 చొప్పున లీజుకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ సంస్థలు ఆస్పత్రులను నిర్మాణం చేసుకునే వరకు రెండేళ్లపాటు ప్రభుత్వ బోధనాస్పత్రులను వినియోగించుకునేందుకు అనుమతించారు. అప్పటివరకు ప్రస్తుత ఆస్పత్రుల్లోని సిబ్బంది జీతభత్యాలకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది. కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ప్రీ బిడ్ సమావేశాల్లో పీపీపీ సంస్థలు కోరిన మేరకు ఆర్ఎఫ్‌పీలో 6 సవరణలను ఆమోదించినట్లు చెప్పారు.

కాలేజీలకు 59.89 ఎకరాలు కుదింపు..

పీపీపీ ఆస్పత్రుల్లో 70 శాతం పడకలు ప్రభుత్వ ఆరోగ్య పథకాలకు కేటాయిస్తారు. మిగతా 30 శాతం పడకలకు యాజమాన్యాలు ఫీజులు వసూలు చేసుకుంటాయి. గతంలో ఈ నాలుగు కొత్త వైద్య కళాశాలలకు 257.60 ఎకరాలను కేటాయించగా, ఇప్పుడు 197.71 ఎకరాలకు తగ్గించారు. భవిష్యత్తులో డెంటల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, పారా మెడికల్ ఇన్‌స్టిట్యూట్, ఆయుష్, శిక్షణ, పరిశోధన కేంద్రాల అభివృద్ధికి అనుమతిస్తారు. అయితే వాటి నుంచి వచ్చే ఆదాయంలో 3శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. వైద్య కళాశాలలు, ఆస్పత్రులు ప్రభుత్వ, ప్రైవేట్ బ్రాండింగ్‌తో పని చేస్తాయి. 30 శాతం వరకు ప్రైవేట్ బ్రాండింగ్ ఉంటుంది. ప్రభుత్వ వైద్య కళాశాలలుగా పెద్దగా పేరు పెట్టి కింద పీపీపీ సంస్థల పేర్లు పొందుపరుస్తారు. వచ్చే నెల 10వ తేదీ వరకు బిడ్ల సమర్పణకు గడువు ఉంది. డిసెంబర్ 31న బిడ్డర్లను ప్రకటిస్తారు.

నియంత్రణ పరిధిలోకి ప్రైవేట్ ఆయుష్ ఆస్పత్రులు

అర్హతలు లేని, నకిలీ వైద్యులు ఆస్పత్రులను నిర్వహించకుండా నియంత్రించేందుకు ప్రైవేట్ ఆయుష్ ఆస్పత్రులను క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్ 2010 పరిధిలోకి తేవాలని కేబినెట్ నిర్ణయించింది. ఇప్పటి వరకు ప్రైవేట్ అల్లోపతిక్ ఆస్పత్రులను మాత్రమే ఈ చట్టం కింద నియంత్రిస్తున్నారు. చట్ట సవరణ ద్వారా ఇకపై ప్రైవేట్ ఆయుష్ ఆస్పత్రులను కూడా నియంత్రిస్తారు. దీంతో ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్యం అందించే ప్రైవేట్ ఆస్పత్రులు నియంత్రణ పరిధిలోకి రానున్నాయి.

మరో 16,666 ఎకరాల సమీకరణ

7 రాజధాని గ్రామాల్లో రెండో దశ పూలింగ్‌కు కేబినెట్ ఆమోదం

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిలో రెండో దశ భూ సమీకరణ చేపట్టేందుకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. అనంతరం మంత్రివర్గ నిర్ణయాలను సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి మీడియాకు వెల్లడించారు. వైకుంఠపురం, పెద్ద మద్దూరు, ఎండ్రాయి, కార్లపూడి, వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాల్లో 16,666.57 ఎకరాల విస్తీర్ణంలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ప్రారంభించి రైతుల నుంచి భూమి తీసుకునేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మరో 3,828 ఎకరాల అసైన్డ్, పోరంబోకు భూమిని రాజధాని కోసం తీసుకోనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాల కోసం అవసరమైన భూములను సమీకరణలో తీసుకుంటామని, ఇందులో భాగంగా దేవదాయ, వక్ఫ్ భూములున్నా నిబంధనల మేరకు తీసుకుంటామని స్పష్టం చేశారు.

- ధాన్యం సేకరణ కోసం మార్క్‌ఫెడ్ ద్వారా రూ.5,000 కోట్లు రుణం తీసుకునేందుకు ఆమోదం.
- ఎస్సీ, ఎస్టీ వర్గాల గృహాలపై సోలార్ రూఫ్ టాప్ కోసం నాబార్డు నుంచి ప్రభుత్వ గ్యారెంటీతో డిస్కమ్‌లు రూ.3,762.26 కోట్లు రుణం పొందేందుకు ఆమోదం.
- రాష్ట్ర నూర్ బాషా, దూదేకుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను రద్దు చేసి ఏపీ నూర్ బాషా, దూదేకుల కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ పేరుతో కొత్త సంస్థ ఏర్పాటుకు ఆమోదం.
- పట్టణాభివృద్ధి శాఖలో పలు చట్ట సవరణలకు ఆమోదం. పట్టణ స్థానిక సంస్థల్లో రెగ్యులేషన్, డిస్‌ప్లే కంట్రోల్ డివైజెస్ ఏర్పాటు. నిర్మాణ సమయంలో ఖాళీ భూమిపై పన్ను మినహాయింపు కోసం మునిసిపాలిటీల చట్టం 1965, మునిసిపల్ కార్పొరేషన్ల చట్టం 1955సవరణలకు ఆమోదం.
- ఒడిశా పవర్ కన్సార్షియంకు రెండు ప్రాజెక్టులు కేటాయింపు.
- భారత్ నెట్‌లో భాగంగా స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు ఆమోదం.
- ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ బలోపేతంలో భాగంగా 16 పోస్టులు డిప్యుటేషన్/కాంట్రాక్ట్/అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియామకానికి ఆమోదం.

సమావేశంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, మంత్రులు

అమరావతి రైతులు పూర్తి సంతృప్తిగా ఉన్నారు!

మంత్రులతో సీఎం చంద్రబాబు వ్యాఖ్య

రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులు పూర్తి సంతృప్తిగా ఉన్నారని సీఎం చంద్రబాబు చెప్పారు. కేబినెట్ సమావేశం తర్వాత మంత్రులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. మార్కాపురం, మదనపల్లె, పాడేరు, పులివెందుల మెడికల్ కాలేజీలను త్వరగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రెవెన్యూ శాఖలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

- పోలవరం పనులకు రూ.542.85కోట్లతో పరిపాలన అనుమతి.
- గతేడాది జూన్ 15 వరకు తెల్లపేపర్‌పై అగ్రిమెంట్ చేసుకున్న చిన్న, సామాన్య రైతుల భూముల లావాదేవీల క్రమబద్ధీకరణకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించేందుకు చట్ట సవరణలకు ఆమోదం.
- తిరుపతి రూరల్ మండలం దామినేడులో ఎకరా రూ.2.5 కోట్ల విలువైన భూమి ఉచితంగా స్పోర్ట్స్ అథారిటీకి బదిలీ చేసేందుకు ఆమోదం.
- ఇతర రాష్ట్రాలలో మరణించిన వారి వారసత్వ వ్యవసాయ ఆస్తుల బదిలీ విషయంలో విభజన డీడ్‌లపై స్టాంప్ డ్యూటీని నిర్దేశిస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌కు ఆమోదం.

మూడో దశ ల్యాండ్ పూలింగ్‌కు వెళ్తాం

- ఎన్ని విడతలు తీసుకున్నా మొదటి విడత పూలింగ్‌లో ఇచ్చిన రాయితీలే రైతులకు ఇస్తాం
- కౌలు పెంచే అవకాశం లేదు: మంత్రి నారాయణ

సాక్షి, అమరావతి: రాజధానిలో మూడో దశ ల్యాండ్ పూలింగ్‌కు కచ్చితంగా వెళ్తామని మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. ఎంత భూమి సేకరించాలన్నదానిపై వర్కవుట్ చేస్తున్నామన్నారు. కనీసం మరో 20వేల నుంచి 25వేల ఎకరాలు అవసరమవుతాయని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు. ఆయన శుక్రవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే రెండో విడతలో ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే స్టేషన్, రైల్వేట్రాక్, ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం రాజధాని ప్రాంతంలోని ఏడు గ్రామాల రైతుల నుంచి 16,666.57 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించాలని నిర్ణయించామని తెలిపారు. వీటితోపాటు 3,828 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఉందన్నారు. రాజధానిలో రాబోయే 30 ఏళ్లకు సరిపడా ప్రజల జీవనస్థితి ఉండేలా కార్యాచరణ రూపొందించామన్నారు. అమరావతి రాజధానిలో భూముల రేట్లు పెరగాలన్నా, గ్రోత్ రేటు పెరగాలన్నా కచ్చితంగా స్మార్ట్ ఇండస్ట్రీలు ఉండాలన్నారు. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లేనిదే ఈ ప్రాంతం అభివృద్ధి చెందదని పేర్కొన్నారు. రెండో దశలో వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడిలో 7,562 ఎకరాలు, వడ్లమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమిలో 9,104.57 ఎకరాలు సమీకరిస్తున్నామని చెప్పారు.

గతంలోని నిబంధనలే వర్తింపు...

ల్యాండ్‌పూలింగ్‌లో భూములిచ్చే రైతులకు గతంలో ఇచ్చిన విధంగానే నిబంధనలు వర్తిస్తాయని నారాయణ చెప్పారు. జరీబు భూములు ఇచ్చిన వారికి నివాస ప్లాటు కింద 1,000 చదరపు గజాలు, వాణిజ్య ప్లాటు కింద 450 చదరపు గజాలు, మెట్ట భూములు ఇచ్చిన వారికి నివాస ప్లాట్ కింద 1,000చదరపు గజాలు, వాణిజ్య ప్లాట్ కింద 250 చదరపు గజాలు కేటాయిస్తామన్నారు. కౌలు కూడా గతంలో మాదిరిగానే చెల్లిస్తామని, పెంచే ఆలోచన లేదని నారాయణ తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి పంపించిన తీర్మానాలను కేబినెట్ ఆమోదించిందని పేర్కొన్నారు. గతంలో స్పోర్ట్స్ సిటీకి 70 ఎకరాలు కేటాయించగా, ఒలింపిక్స్ వంటి ఇంటర్నేషనల్ క్రీడలు నిర్వహించే స్థాయిలో ఈ సిటీని తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. ఇందుకోసం 2,500 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ ఉండాలని సీఎం నిర్ణయించారని నారాయణ వెల్లడించారు. అందుకోసమే స్పోర్ట్స్ సిటీకి భూ కేటాయింపులు పెంచుతున్నామన్నారు. గతంలో భూములిచ్చిన రైతులందరికీ ప్లాట్లు ఇచ్చామన్నారు. కొన్నిచోట్ల ప్లాట్ల కేటాయింపుపై ఉన్న సమస్యలు నెల రోజుల్లో పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. గ్రామ కంఠాల విషయంలో ఎవరికైనా పొరపాటున ఎక్కువ భూమి ఇచ్చి ఉంటే మళ్లీ వెనక్కి తీసుకుంటామని మంత్రి చెప్పారు. మరోవైపు అసైన్డ్ రైతుల సమస్యను మంత్రివర్గ ఉప సంఘం పరిశీలిస్తుందని తెలిపారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

బాబు క్రెడిట్ చౌర్యం.. క్యాబినెట్ సాక్షిగా బట్టబయలు!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడమే దీనికి నిదర్శనం. అదానీ గ్రూపు సంస్థలు అదానీ ఇన్ఫ్రా, అదానీ కోనెక్స్, అదానీ పవర్ లిమిటెడ్ తదితర సంస్థలను గూగుల్ నోటిఫైడ్ పార్టనర్స్‌గా గుర్తిస్తూ మంత్రివర్గం ఆమోదించడం గమనార్హం. విశాఖలో అదానీ సంస్థ డేటా సెంటర్ నిర్మిస్తుందని.. అందుకోసం భూమి అప్పగించాలంటూ గత అక్టోబర్ 4న రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్‌కు గూగుల్ ప్రతినిధి అలెగ్జాండర్ లేఖ రాయడం గమనార్హం.

జగన్ హయాంలోనే డేటా సెంటర్‌కు శంకుస్థాపన

విశాఖ నగరాన్ని అంతర్జాతీయ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ హయాంలోనే 2020 నవంబర్‌లో (కోవిడ్ సమయంలో) అదానీ డేటా సెంటర్‌కు బీజం పడింది. ఆ తర్వాత 2023 మే 3న అదానీ డేటా సెంటర్‌కి శంకుస్థాపన కూడా జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు గత ప్రభుత్వంలోనే ప్రక్రియ మొదలైంది. ఇందుకోసం సింగపూర్ నుంచి 3,900 కి.మీ. మేర సముద్రంలో కేబుల్ ఏర్పాటు ప్రక్రియకు నాడే శ్రీకారం చుట్టారు. ఈమేరకు సింగపూర్ ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ హయాంలోనే 2021 మార్చి 9న లేఖ రాయడం గమనార్హం. విశాఖలో అదానీ డేటా సెంటర్‌కు 190 ఎకరాలు కేటాయించి 2023 మే 3న శంకుస్థాపన చేసింది వైఎస్ జగన్ ప్రభుత్వమే. దాని కొనసాగింపులో భాగంగానే ఇప్పుడు 1,000 మెగావాట్లకు డేటా సెంటర్‌ను విస్తరిస్తున్నారు. ఇందులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సింగపూర్, కేంద్ర ప్రభుత్వం, అదానీ కృషి ఎంతో ఉన్నట్లు తేటతెల్లమవుతోంది. అదానీ పేరెత్తితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి క్రెడిట్ వస్తుందని బాబు సంకుచిత బుద్ధితో వ్యవహరించి, గూగుల్ డేటా సెంటర్‌గా ప్రచారం చేసుకున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఉద్యోగాలు కూడా ఇచ్చేలా నాడు ఒప్పందం..

డేటా సెంటర్‌కు అవసరమైన హార్డ్‌వేర్, ఇతర టెక్నాలజీని గూగుల్ సమకూరుస్తుండగా.. అదానీ గ్రూప్ దాదాపు రూ.87 వేల కోట్లు పెట్టుబడి పెట్టి దీన్ని నిర్మిస్తోంది. రాష్ట్రానికి గూగుల్‌ను తెస్తున్నందుకు అదానీకి ధన్యవాదాలు చెప్పాల్సిన చంద్రబాబు కనీసం క్రెడిట్ ఇవ్వలేదు. ఆ పేరు చెబితే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కృషి గురించి కూడా ప్రస్తావించాల్సి వస్తుందనే భయంతోనే నిజాలను కప్పిపుచ్చి గుట్టుగా వ్యవహరించారు. కేంద్రం, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, సింగపూర్ ప్రభుత్వం, అదానీ.. ఇంతమంది కృషితో గూగుల్ రాకకు మార్గం సుగమమైందని చెప్పటానికి చంద్రబాబు సంకోచించారు. కేవలం డేటా సెంటర్ ఏర్పాటు మాత్రమే కాకుండా 25 వేల ఉద్యోగాలు కల్పించాలని ఆ రోజు అదానీతో చేసుకున్న ఒప్పందంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కోరడం గమనార్హం. తద్వారా ఐటీ పార్క్, స్కిల్ సెంటర్, రిక్రియేషన్ సెంటర్ల ద్వారా యువతకు ఉద్యోగాలు కల్పించేలా ఒప్పందంలో పొందుపరిచింది.

క్లుప్తంగా...

మహిళలకు విద్యా ద్వారాలు తెరిచిన విప్లవకారుడు పూలే

మహాత్మా జ్యోతిరావు పూలేకు వైఎస్ జగన్ నివాళి

సాక్షి, అమరావతి: దేశంలో మహిళలకు విద్యా ద్వారాలు తెరిచిన విప్లవకారుడు జ్యోతిరావు పూలే అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. 'మహిళా విద్యను నేరంగా చూసిన రోజుల్లోనే మహిళలకు విద్యా ద్వారాలు తెరిచిన విప్లవకారుడు జ్యోతిరావు పూలే. తన సతీమణి సావిత్రిబాయిని చదివించి ఈ దేశపు మొదటి మహిళా టీచర్‌గా నిలబెట్టిన దార్శనికుడు ఆయన. శుక్రవారం ఆ మహనీయుడి వర్ధంతి సందర్భంగా ఆయన సమాజానికి చేసిన సేవలను స్మరించుకుంటూ నివాళులు' అని వైఎస్ జగన్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

దొమ్మర కులం పేరు దొరవంశగా మార్పు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 'దొమ్మర' కులం పేరును 'దొర వంశ'గా ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెనుకబడిన కులాల జాబితాలో గ్రూప్ 'ఎ'లోని గ్రూప్ నంబర్ 7లో ఉన్న దొమ్మర కులాన్ని ఇకపై దొర వంశగా మాత్రమే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఆదేశించింది.

డాక్టర్ ఇండ్లకు లెజెండ్ ఆఫ్ సైకియాట్రీ అవార్డు

అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి

లబ్బీపేట (విజయవాడతూర్పు): రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జరుగుతున్న జాతీయ మానసిక వైద్యుల వార్షిక సమావేశంలో విజయవాడకు చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డిని జాతీయ స్థాయిలో లెజెండ్ ఆఫ్ సైకియాట్రీ అవార్డుతో సన్మానించారు. మానసిక వైద్య రంగంలో నాలుగు దశాబ్దాలకు పైగా బహుముఖ సేవలందించినందుకు గాను డాక్టర్ ఇండ్లకు ఈ అవార్డు లభించింది. ఏపీ నుంచే కాకుండా దక్షిణ భారతదేశం నుంచి అవార్డు అందుకున్న తొలి మానసిక వైద్యునిగా గౌరవం దక్కింది. జాతీయ మానసిక వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మృగేశ్ వైష్ణవ్, కార్యదర్శి డాక్టర అరుణ్ మార్వాలే, ఇతర అతిథుల చేతుల మీదగా డాక్టర్ ఇండ్లకు అవార్డును అందజేశారు. వివిధ రాష్ట్రాల మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డిని అభినందించారు.

గోదావరి పుష్కరాలకు ఘనంగా ఏర్పాట్లు

అధికారులతో మంత్రి ఆనం సమీక్ష

సాక్షి, అమరావతి: గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిందిగా దేవాదాయ శాఖ మంత్రి అనం రామనారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. గోదావరి పుష్కరాలకు చేయాల్సిన ఏర్పాట్లు, సదుపాయాలపై శుక్రవారం ఆయన సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. గోదావరి పుష్కరాలు–2027 అధికారిక లోగో డిజైన్ చేయాలని ఆదేశించారు. ప్రొటోకాల్, విస్తృత పబ్లిసిటీ, అవగాహన కార్యక్రమాలు, ఘాట్‌ల ఏర్పాట్లు, శానిటేషన్ చర్యలు, మహిళలు దుస్తులు మార్చుకునే సౌకర్యాలు, టూరిజం శాఖ ద్వారా ప్రత్యేక ప్యాకేజీలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, రద్దీ నియంత్రణ చర్యలు, ఫైర్ సర్వీస్, తాగునీరు, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. 5 కోట్ల మందికి పైగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని, ఆ మేరకు వారు స్నానాలు ఆచరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిధుల కేటాయింపుపై నివేదిక ఇవ్వాలని సూచించారు. సమావేశంలో దేవదాయ శాఖ సెక్రటరీ హరి జవహర్ లాల్, కమిషనర్ కే.రామచంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై 5న తీర్పు

విజయవాడలీగల్: మద్యం అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చెరుకూరి వెంకటేష్ నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ తరపున దాఖలైన బెయిల్ పిటిషన్లపై వాదనలు శుక్రవారం పూర్తయ్యాయి. తీర్పును ఏసీబీ న్యాయమూర్తి పి.భాస్కరరావు డిసెంబరు 5వ తేదీకి వాయిదా వేశారు. కాగా ఇదే కేసులో గుంటూరు జైలులో ఉన్న ఏ–35, ఏ–36 బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణలు గుంటూరు జైలు నుండి విజయవాడ జైలుకు మార్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై తీర్పును కూడా న్యాయమూర్తి 5వ తేదీకి వాయిదా వేశారు. ఇదిలావుండగా ఈ కేసులో సిట్ పోలీసులు స్వాధీనం చేసుకున్న కారుకు మద్యం కేసుతో ఎటువంటి సంబంధం లేదని, కారును తిరిగి అప్పగించాలని కోరుతూ సత్యం ఇన్‌ఫ్రా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వచ్చే నెల 1వ తేదీకి వాయిదా పడింది.

నో బ్యాగ్ డే అమలుకు నిధులు కేటాయింపు

సాక్షి, అమరావతి: జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో ప్రతి శనివారం నో బ్యాగ్ డే కు విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి పాఠశాలకు నిధులు కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ప్రాథమిక పాఠశాలకు రూ.500, ఉన్నత పాఠశాలకు రూ.వెయ్యి చొప్పున కేటాయించింది. ఈ నిధులతో నెలల వారీగా చేపట్టాల్సిన అంశాలపై సమగ్ర మార్గదర్శకాల్లో పేర్కొంది.

మధ్యాహ్న భోజనం వికటించి 11 మంది విద్యార్థులకు అస్వస్థత

- వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ హైస్కూల్‌లో ఫుడ్ పాయిజనింగ్
- వంట ఏజెన్సీ నిర్వాహకురాలు టీడీపీ కౌన్సిలర్

ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని వసంతపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దాదాపు 350 మంది విద్యార్థులు రోజూ తరహాలోనే శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలలో భోజనం చేశారు. మొదటగా పప్పు తిన్న 11 మంది తీవ్ర అస్వస్థతకు గురవడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. భోజనాలను నిలిపేసి విద్యార్థులను ఇంటికి పంపేశారు. వాంతులు, కడుపు నొప్పితో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న 11మందిని ప్రధానోపాధ్యాయుడు స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఏడుగురు బాలికలు, నలుగురు బాలురు ఉన్నారు. హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీని 29వ వార్డు టీడీపీ కౌన్సిలర్ మోతుకూరు జయలక్ష్మి నిర్వహిస్తున్నారు.

పప్పులో కలిసిందేమిటి?

పప్పు ఎలుకల మందు వాసన వచ్చిందని కొందరు విద్యార్థులు అధికారులకు తెలియజేశారు. మరికొందరు నాఫ్తలిన్ గోళీల వాసన వచ్చిందన్నారు. దీనిపై విచారణ జరగాల్సిఉంది. మరోవైపు సంఘటనకు కారణమైన హైస్కూల్ వంట ఏజెన్సీ నిర్వాహకులను తొలగిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి షంషుద్దీన్ తెలిపారు. కందిపప్పుతోపాటు నీటిని పరీక్షలు చేయిస్తామని, ఇందులో ఎవరిదైనా నిర్లక్ష్యం ఉందని తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని విద్యాధికారి తెలిపారు. షంషుద్దీన్‌తోపాటు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు విద్యార్థులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఫోన్‌లో అధికారులతో మాట్లాడి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే వరదరాజులురెడ్డితో జయలక్ష్మి

మంత్రి పేరు చెప్పి నన్ను బెదిరించాడు

- సాలూరు స్టేషన్లో అనధికారిక పీఏ సతీష్ బాధితురాలు వెల్లడి
- దీనికి సాక్ష్యంగా ఇవిగో వాట్సాప్ మెసేజ్‌లు, ఫొటోలు
- ఆర్థికంగా దోచుకున్నాడు.. లైంగికంగా వేధించాడు

సాక్షి ప్రతినిధి, విజయనగరం/సాలూరు: ''మంత్రి సంధ్యారాణి అనధికార పీఏ బందాపు సతీష్ నన్ను ఆర్థికంగా దోచుకోవడమే కాక వేధించాడు. అతడు చెప్పినట్లు వినకపోతే నన్ను, నా కుటుంబాన్ని కోలుకోలేంత దెబ్బకొడతానని బెదిరించాడు. ఇవిగో.. వాట్సాప్ మెసేజ్‌లు, ఫొటోలు'' అంటూ సాలూరుకు చెందిన ఒంటరి మహిళ పోలీసులకు చూపించారు. శుక్రవారం సాలూరు స్టేషన్లో ఆమెను పోలీసులు విచారించారు. ఈ సందర్భంగా ఆమె తాను ఎదుర్కొన్న ఇబ్బందులను పోలీసులకు వివరించారు. అనంతరం రాత్రి సాలూరు ఏరియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. కాగా, మంత్రి అనధికార పీఏ అరాచకాలను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి' మీడియాపై టీడీపీ నాయకులు అక్కసు వెళ్లగక్కారు. శుక్రవారం ఉదయం ర్యాలీగా పోలీస్ స్టేషన్ ముందు సాక్షి ప్రతులను దహనం చేశారు. సీఐ అప్పలనాయుడికి ఫిర్యాదు చేశారు.

''అనధికార పీఏ...' సతీష్ రాజీనామా

మంత్రి అనధికారిక పీఏగా అరాచకాలకు పాల్పడిన సతీష్ శుక్రవారం సాయంత్రం రాజీనామా చేశాడు. తనకు పరపతి, పేరు పెరుగుతుండడాన్ని సహించలేక కొందరు టార్గెట్ చేశారని లేఖలో పేర్కొన్నారు. తన కారణంగా మంత్రి సంధ్యారాణికి చెడ్డ పేరు, ఇబ్బంది రాకూడదనే రాజీనామా చేస్తున్నట్లు చెప్పాడు. అయితే, అనధికారిక పీఏగా కొనసాగుతూ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.

మంత్రి పీఎస్‌పై లైంగిక దాడి కేసు

స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అనధికార పీఏ (పీఎస్) బందాపు సతీష్‌పై లైంగికదాడి కేసు నమోదైంది. టీచర్‌గా పనిచేస్తున్న భర్త కరోనాతో చనిపోయిన తన నుంచి కారుణ్య నియామకం కోసం డబ్బులు వసూలు చేయడంతోపాటు మానసికంగా, శారీరకంగా వేధించాడని, లైంగిక వాంఛ తీర్చాలంటూ వేధించాడని బాధితురాలు గురువారం ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. సాలూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆమెను విచారణ జరిపారు. అనంతరం ఆమెను సాలూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించారు. సతీష్‌పై 64(1),74,79, 318(4), 329(3),115(2), 324(4) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కింద పోలీసులు కేసు నమోదుచేశారు.

అసమానతలు లేని సమాజమే పూలే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి

పూలే వర్ధంతి కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, అమరావతి: అసమానతలు లేని నవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా మహాత్మా జ్యోతిరావు పూలే ఉద్యమించారని వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ పూలే లక్ష్యాలు, ఆశయాలను ఆదర్శంగా తీసుకుని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగించారని గుర్తుచేశారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించారని చెప్పారు. సమాజంలో మార్పు తీసుకొచ్చే శక్తి విద్యకే ఉందని నమ్మిన వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలతో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేశారని గుర్తుచేశారు. వైద్య రంగానికి కూడా పెద్దపీట వేశారని తెలిపారు. మహిళలు రాణిస్తేనే సమాజం పురోగమిస్తుందని నమ్మి పార్టీ, ప్రభుత్వ పదవుల్లో వారికి 50 శాతం ఇచ్చి గౌరవించారన్నారు. కీలకమైన హోంమంత్రి పదవిని కూడా మహిళకు ఇచ్చారని గుర్తుచేశారు. విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళల ఉన్నతి కోసం పాటుపడిన మహానుభావుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించడమే కాకుండా స్వయంగా తన భార్య సావిత్రిబాయి పూలేని చదివించి టీచర్‌ని చేసి ఎంతో మంది మహిళలకు ప్రేరణగా నిలిపారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ నాయకులు నారాయణమూర్తి, షేక్ దస్తగిరి, మందపాటి శేషగిరిరావు, షేక్ మస్తాన్ వలీ, బూదాల శ్రీను, అడపా శేషు, ప్రకాశ్, తోలేటి శ్రీకాంత్, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు భారీ వర్షాలు

- రేపు తీవ్ర వాయుగుండంగా మారనున్న 'దిత్వా'
- దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలపై అధిక ప్రభావం
- విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడి

సాక్షి, అమరావతి/వాకాడు: 'దిత్వా' తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ప్రస్తుతం శ్రీలంక తీరంలో 'దిత్వా' తుపాను ఉత్తర–వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతూ శుక్రవారం రాత్రి సమయానికి పుదుచ్చేరికి 410 కి.మీ., చెన్నైకి 510 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందన్నారు. ఆదివారం తెల్లవారుజామున తీవ్రవాయుగుండంగా మారి తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో శనివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బాపట్ల, పల్నాడు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆదివారం ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించారు. ఆయా జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. ప్రజలు అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ టోల్ ఫ్రీ నంబర్లు 1070, 112, 18004250101లను సంప్రదించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంగళవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు.

'బ్యాటరీ స్టోరేజ్' విద్యుత్ కొనుగోలుకు అనుమతివ్వండి

- విద్యుత్ నియంత్రణ మండలికి విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదన

సాక్షి, అమరావతి: నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) నుంచి 500 మెగావాట్ల (1000 మెగావాట్ హవర్) బ్యాటరీ ఎనర్జీని కొనుగోలు చేసేందుకు అనుమతినివ్వాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)ని డిస్కంలు కోరాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ తూర్పు (ఏపీఈపీడీసీఎల్), మధ్య (ఏపీసీపీడీసీఎల్), దక్షిణ (ఏపీఎస్పీడీసీఎల్) ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్‌సీకి తాజాగా ప్రతిపాదనలు పంపించాయి. విద్యుత్ సంస్థలకు ఎన్‌హెచ్‌పీసీకి మధ్య బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ పర్చేజ్ అగ్రిమెంట్ (బీఈఎస్ఎస్‌ఏ) ఈ ఏడాది జూలై 10న జరిగింది. దాని ప్రకారం 12 ఏళ్లపాటు ఎన్‌హెచ్‌పీసీ నుంచి డిస్కంలు విద్యుత్‌ను కొనుగోలు చేయనున్నాయి. దీనికి సంబంధించి టారిఫ్‌ను నిర్ణయించాల్సిందిగా కూడా ఏపీఈఆర్‌సీని డిస్కంలు కోరాయి. అయితే, ఎన్‌హెచ్‌పీసీ నుంచి నేరుగా ఈ విద్యుత్‌ను తీసుకోవడంలేదు. 500 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్‌కు రెండు ప్రైవేటు సంస్థలు దెవలపర్లుగా వ్యవహరిస్తున్నాయి. వీటిలో జమ్మలమడుగు (400 కేవీ) సబ్‌స్టేషన్ పరిధిలో పటేల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ 225 మెగావాట్లు, కుప్పం (220 కేవీ) సబ్‌స్టేషన్ పరిధిలో 50 మెగావాట్లు, ఘని (400కేవీ) సబ్‌స్టేషన్ పరిధిలో 225 మెగావాట్ల ప్రాజెక్టులను ఏసీఎంఈ సోలార్ హోల్డింగ్స్ లిమిటెడ్ సంస్థలు అభివృద్ధి చేస్తాయి. దీనిపై ప్రజలు తమ అభ్యంతరాలు, అభిప్రాయాలను డిసెంబరు 12లోగా కమిషన్ ఈ–మెయిల్ commn.secy@aperc.inకు గానీ, అడ్రస్‌కుగానీ పంపాల్సిందిగా మండలి సూచించింది. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలకు డిసెంబరు 19లోగా డిస్కంలు సమాధానం చెప్పాలని ఆదేశించింది.

రాజధాని రైతుల పరిస్థితి అత్యంత దయనీయం

వైఎస్సార్‌సీపీ నేతలు దొంతిరెడ్డి వేమారెడ్డి, బాలవజ్రబాబు

వేమారెడ్డి, బాలవజ్రబాబు

సాక్షి, అమరావతి: ''కూటమి ప్రభుత్వ తీరుతో రాజధాని రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. 30 వేల మందికి పైగా చిన్న, సన్నకారు రైతులు భూములిచ్చారు. వీరిలో 85 శాతం 2 నుంచి 5 ఎకరాల లోపు ఉన్న చిన్న రైతులే. వారికి రిటర్న్‌బుల్ ప్లాట్లు ఇవ్వలేదు. అసలు రైతులకు ఇచ్చిన ఏ హామీనీ సీఎం చంద్రబాబు అమలు చేయలేదు'' అని వైఎస్సార్‌సీపీ మంగళగిరి ఇన్‌చార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలవజ్రబాబుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాదిన్నరలో రూ.2.50 లక్షల కోట్లు అప్పు చేసిన బాబు సర్కారు రాజధానితో సహా దేనికి ఖర్చుపెట్టిందో శ్వేత పత్రం విడుదల చేయాలని నిలదీశారు. ''వ్యవసాయంపై మాత్రమే ఆధారపడిన చిన్న రైతులు దాదాపు 12 ఏళ్లుగా భూములు కోల్పోయి ఏ పనీ లేనివారు అయిపోయారు. వీరి భవిష్యత్తు ఏమిటి? 2015లో కేవలం మూడేళ్లలో రైతులకు రావాల్సిన భూమిని అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పించి ఇస్తామని చెప్పారు. ఇంతవరకు అమలు కాలేదు. ఇప్పుడు మళ్లీ 40 వేల ఎకరాలు సేకరించి రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్టు కట్టనున్నట్లు తెలిసింది. చంద్రబాబూ పేద, చిన్న సన్నకారు రైతులను బతకనివ్వండి. దాదాపు 12 ఏళ్లుగా పిల్లల చదువులకు బ్యాంకు రుణాలు తీసుకునే అవకాశం కూడా లేకపోయింది'' అని ఆవేదన వ్యక్తం చేశారు. ''ఓ పెద్ద రైతు రాజధానికి 20 ఎకరాలిస్తే బదులుగా ఎకరం కేటాయించారు. అక్కడికెళ్తే అది నా భూమి అని వేరే వాళ్లు చెబుతున్నారు. ఇలాంటివి చాలా సమస్యలున్నాయి. రైతులు అడిగితే సీఆర్డీఏ ఆఫీసులో స్పందన లేదు. మంత్రి నారాయణవి మాటలే తప్ప ఆచరణ లేదు'' అని మండిపడ్డారు. బాలవజ్రబాబు మాట్లాడుతూ... నమ్మి భూములిచ్చిన రైతులను చంద్రబాబు నిలువునా మోసం చేశారని, వారికి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని అన్నారు. 18 నెలలుగా రాజధాని భూముల్లో తట్టెడు మట్టి అయినా ఎత్తిపోయకుండా మళ్లీ 40 వేల ఎకరాల పూలింగ్‌కు ఎలా సిద్ధమవుతారని నిలదీశారు. మీ అనుకూల పత్రికల రాతలను నమ్మే రోజులు పోయాయని, రైతులు వాస్తవాలు తెలుసుకుని రోడ్డెక్కడం ఖాయమని చెప్పారు. ''మరో 40 వేలు ఎకరాలు తీసుకుని అద్భుతాలు చేస్తానని చెప్పొద్దు. గతంలో తీసుకున్న భూముల్లో అద్భుతాలు చేసి పూలింగ్‌కు వెళ్లండి. అంతే తప్ప రాష్ట్ర ఖజానాను మీ స్వప్రయోజనాలకు తాకట్టు పెడతాం అంటే చూస్తూ ఊరుకోం. వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టడం ఖాయం'' అని హెచ్చరించారు.

చెడు అలవాట్లు వద్దన్నందుకు సీపీఎం నేత హత్య

- అసాంఘిక కార్యకలాపాలు మానుకోమన్నందుకు కక్షగట్టిన మహిళ
- బంధువులు, కొందరు యువకులతో హత్యచేయించిన వైనం

పెంచలయ్య (ఫైల్)

నెల్లూరు సిటీ: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలో శుక్రవారం దారుణహత్య జరిగింది. పిల్లలతో స్కూటీపై వెళుతున్న సీపీఎం నాయకుడు కొట్టివిడి పెంచలయ్య (38)ను కత్తులతో పొడిచి చంపేశారు. స్థానికులు, డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన మేరకు.. నెల్లూరు రూరల్ పరిధిలోని కల్లూరుపల్లి ఆర్డీటీ కాలనీ ముత్యాలమ్మ గ్రామాభివృద్ధి కమిటీ ట్రెజరర్‌గా ఉన్న పెంచలయ్య ఎలక్ట్రీషియన్‌గా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సీపీఎం నాయకుడైన అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాలనీకి చెందిన ఆరవ కామాక్షి నేరచరితులకు ఆశ్రయం ఇవ్వడం, దొంగతనాలకు పాల్పడేవారితో అసాంఘిక కార్యకలాపాలు చేయించడం గమనించిన పెంచలయ్య ఆమెను పద్ధతి మార్చుకోమని మందలించాడు. గంజాయి విక్రయిస్తున్న యువకులను అలా విక్రయించవద్దని చైతన్యవంతం చేసేందుకు ప్రయత్నించాడు. పోలీసులకు సమాచారం ఇచ్చి గంజాయి విక్రయాలను అడ్డుకుంటున్నాడు. తమ వ్యాపారాలకు అడ్డువస్తున్నాడని పెంచలయ్యపై కామాక్షి కక్షపెంచుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం పెంచలయ్య పిల్లలతో స్కూటీపై వెళుతుండగా హౌసింగ్ బోర్డు ఆర్చ్ వద్ద తొమ్మిదిమంది దుండగులు అడ్డుకున్నారు. ఒక్కసారిగా కత్తులు తీసి పెంచలయ్యను వెంటాడి పొడిచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన పెంచలయ్యను స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వేణు, ఎస్ఐ లక్ష్మణ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కామాక్షి తన బంధువులు, చెడునడతగల యువకులతో పెంచలయ్యను హత్య చేయించినట్లు డీఎస్పీ తెలిపారు.

> జీవితంలో ఏది ఎప్పుడు రావాలో అప్పుడే వస్తుంది. ఏది ఎంత కాలం నీతో ఉండాలో అంత కాలమే ఉంటుంది. నీ చేతిలో ఉన్నది ఒక్కటే. నీతో ఉన్న వాటి విలువను తెలుసుకొని జీవించటం.
>
> – హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 29 నవంబర్ 2025

మళ్లీ క్రీడా సంరంభం

ఎంతో ప్రతిష్ఠాత్మకమని భావించే కామన్వెల్త్ శతవార్షిక క్రీడా సంరంభం 2030లో నిర్వహించే అవకాశం లాంఛనంగా మన దేశానికి దక్కింది. గత నెలలో కామన్వెల్త్ క్రీడల కార్యనిర్వహణా బోర్డు ఈ క్రీడోత్సవాలకు అహ్మదాబాద్ వేదికైతే బాగుంటుందని సిఫార్సు చేసింది. మనతోపాటు నైజీరియా కూడా పోటీపడినా ఇంత పెద్ద ఉత్సవాన్ని నిర్వహించగల సామర్థ్యం భారత్‌కే ఉన్నదని మెజారిటీ సభ్యులు భావించారు. కామన్వెల్త్ క్రీడల్లో దాదాపు వంద దేశాలకు చెందిన వేలాది మంది మెరికల్లాంటి క్రీడాకారులు, క్రీడాకారిణులు పాల్గొంటారు. బహుళ మాధ్యమాల ప్రభావం ఎంతగానో పెరిగిన వర్తమానంలో ఈ క్రీడలు యువతపై చూపే ప్రభావం అపారం. అయితే అట్టహాసంగా నిర్వహించటం, పరమాద్భుతమని ప్రపంచం మెచ్చటంతోనే సంతృప్తిపడకూడదు. 2036లో ఒలింపిక్ క్రీడోత్సవాల నిర్వహణకు సైతం భారత్ సంసిద్ధంగా ఉన్నదని ప్రపంచం గుర్తించే స్థాయికి తీసుకెళ్లాలి.

ఈ సందర్భంలో 2010 నాటి కామన్వెల్త్ క్రీడోత్సవాల్లో మనకెదురైన చేదు అనుభవాలు, తత్కారణంగా మన దేశం అభాసుపాలైన వైనమూ దృష్టిలో పెట్టుకోవాలి. అప్పటికే మనకు పలు క్రీడోత్సవాలు నిర్వహించిన నేపథ్యం ఉంది. 1951, 1982 సంవత్సరాల్లో ఆసియా క్రీడోత్సవాలు నిర్వహించాం. 2003లో ఆఫ్రో–ఆసియన్ క్రీడలకు భారత్ వేదిక పరిచింది. ఇక క్రికెట్ టోర్నమెంట్లు, హాకీ ప్రపంచ కప్ ఈవెంట్లు దేశంలో పలు నగరాల్లో నిర్వహించిన అనుభవం ఉంది. అయినా 2010 కామన్వెల్త్ క్రీడోత్సవాల నిర్వహణ అసమర్థంగా, కుంభకోణాలమయంగా మారడం, అందరూ మనల్ని వేలెత్తి చూపే దుఃస్థితి ఏర్పడటం ఎవరూ మరిచిపోలేరు. భారీ మొత్తాలకు కాంట్రాక్టులు కట్టబెట్టడం, నాసిరకం నిర్మాణ పనులు, అవి కూడా సమయానికి పూర్తికాకపోవటం, ఆర్థిక అవకతవకలు, విధానపరమైన ఉల్లంఘనలు దిగ్భ్రాంతిపరిచాయి. సీబీఐ దర్యాప్తు, అప్పటి కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు సురేష్ కల్మాడీ అరెస్టు కావటం, నిర్మాణ పనుల్లో ఏమాత్రం అనుభవం లేనివారికి కాంట్రాక్టులు అప్పగించారనీ, లంచాలు మెక్కి నాసిరకం ఉపకరణాలు కొన్నారనీ సీవీసీ తేల్చటం ఎవరూ మరిచిపోరు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ క్రీడా బృందాలకు అద్భుతమైన సదుపాయాలున్న వసతి కల్పించి, ఆఫ్రికా దేశాల నుంచి వచ్చిన బృందాలకు నాసిరకం వసతినిచ్చారని ఆరోపణలు వెల్లువెత్తాయి. తమపై జాతివివక్ష చూపారని ఆ దేశాల క్రీడాకారులు తీవ్ర విమర్శలు చేయటం దేశ ప్రతిష్ఠను మట్టిపాలు చేసింది.

భారీ క్రీడోత్సవాలు జరగబోయే నగరాల్లో మౌలిక సదుపాయాలపై ప్రభుత్వాలు దృష్టిసారిస్తాయి. సరికొత్త స్టేడియాలు నిర్మాణమవుతాయి. ఆతిథ్యం ఇచ్చే దేశం గనుక ప్రతి ఈవెంట్‌లోనూ విజయం సాధించేలా క్రీడా బృందాల నైపుణ్యాలకు పదును బెడతారు. అథ్లెట్లకు మంచి సదుపాయాలతోపాటు మెరుగైన పారితోషికాలు లభిస్తాయి. ముఖ్యంగా ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామస్థాయి వరకూ యువతలో క్రీడలపై ఉత్సాహాన్ని పెంచేలా చేయగలిగితే, ప్రాథమిక పాఠశాలలు మొదలుకొని విద్యా సంస్థలన్నీ పిల్లల్లో క్రీడాసక్తిని పెంపొందిస్తే, క్రీడా ఉపకరణాల కొనుగోలుకూ, ఈవెంట్ల నిర్వహణకూ, విజేతలకు ప్రోత్సహకాలిచ్చేందుకూ ఇతోధిక కేటాయింపులు చేస్తే భవిష్యత్తరాలు పదునైన క్రీడాకారులను చూడగలుగుతాయి.

స్టేడియంలో గెలుపే లక్ష్యంగా ప్రత్యర్థి పక్షాల ఆటగాళ్లు నువ్వా నేనా అన్నట్టు తలపడటం ఒక్కటే కాదు క్రీడలంటే. అవి యువతకు శారీరక, మానసిక దృఢత్వాన్నిస్తాయి. క్రమశిక్షణను నేర్పుతాయి. నిబంధనల పరిమితుల్లోనే ప్రత్యర్థిని మట్టి కరిపించి పైచేయి సాధించటానికి ఏం చేయాలన్న వ్యూహ రచనా నైపుణ్యాన్ని పెంచుతాయి. ఓటమిని సైతం అంగీకరించగల స్థైర్యాన్నందిస్తాయి. ఒక టీమ్‌గా కలిసి పనిచేయటం, ఆ క్షణమే దాని ఫలితాలు కళ్లెదుట కనబడటం క్రీడల్లోనే చూడగలం. అవి అహంభావం స్థానంలో ఆత్మవిశ్వాసాన్ని ప్రతిష్ఠిస్తాయి. తనలోని దార్ఢ్యమెంతో, పరిమితులేమిటో గుర్తించటానికి క్రీడలే తోడ్పడతాయి. ఈసారి కుంభకోణాల క్రీనీడ పడకుండా నిర్వహించి శభాష్ అనిపించుకుంటామని మన ప్రతినిధులు హామీ ఇచ్చివచ్చారు. చూద్దాం... ఎంతవరకూ నిలబెట్టుకుంటారో!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.నవమి సా.5.35 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.9.55 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.5.57 నుండి 7.38 వరకు, **అమృత ఘడియలు:** ప.2.01 నుండి 3.53 వరకు

సూర్యోదయం : 6.16
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

వృథా చేయొద్దు!

మీ టీమ్‌లో ఐదుగురు నిపుణులు ఉంటే, మీ సమావేశంలో ఐదు మెదళ్లు ఉన్నట్లు! ఐదు ఆలోచనలకు, ఐదు నిర్ణయాలకు, ఐదు అభిప్రాయాలకు, ఐదు అనుభవాలకు అక్కడ స్థలం ఉన్నట్లు! వారిలో ఏ ఒక్కరి పనిని మీరు మీద వేసుకున్నా ఒక మెదడు వృథా అయినట్లే.

– అరుంధతీ భట్టాచార్య, 'సేల్స్ ఫోర్స్' చైర్మన్

కొత్త మార్గం

చింత, రేపటి దుఃఖాన్ని ఖాళీ చేయదు. నేటి బలాన్ని పీల్చేస్తుంది. కనుక మీ కష్టాల గురించి అదేపనిగా ఆలోచించకండి. వాటి నుంచి బయట పడేందుకు మీరు సులభమైన మార్గాలను వెతకటం మానేస్తే... కొత్త, మెరుగైన మార్గాన్ని కనుగొంటారు.

– ఉజ్వల్ పాట్నీ, మోటివేషనల్ స్పీకర్

చేయి కలపాలి!



అసహనాలు, ఆరోపణలు, నిందలు, మతపరమైన తీవ్రవాదం, రాజకీయ సంఘర్షణలు, హక్కుల నిరాకరణ పెరుగుతున్న ఈ యుగంలో మనం న్యాయం కోసం జరిగే ఏ పోరాటంలోనైనా తప్పక పాల్గొనాలి. సమాజ పునర్నిర్మాణానికి మనమందరం సమైక్యంగా చేయి కలపాలి.

– థామస్ కె.ఊమెన్, బిషప్

అనిపించాలి...

ఎవరో చెప్పినందు వల్ల నేనెప్పుడూ జిమ్‌కి వెళ్లలేదు. చువ్వలా, చురుగ్గా ఉండాలని; చెమట పట్టాలని, నన్ను నేను ఆరోగ్యంగా ఉంచుకోవాలని నాకై నాకు అనిపించి నేను జిమ్‌కు వెళతాను. మీ మనసు దానిలో లేకపోతే, మీరెంత ప్రయత్నించినా మీరు అక్కడికి ఎప్పటికీ చేరుకోలేరు.

– గుర్బానీ జడ్జ్, మోడల్, నటి

మంచిదే కానీ...

పనే జీవితంగా అంకిత భావంతో ఉండేవాళ్లు తమ పనికి చిన్న అడ్డంకి ఎదురైనా తట్టుకోలేరు. అంకిత భావం మంచిదే కానీ, అడ్డంకులకు కూడా పనిని ఎప్పటికప్పుడు ఉత్తేజభరితంగా మార్చటంలో కీలకమైన భాగస్వామ్యమే ఉంటుందని గుర్తించండి.

– శేఖర్ రవ్‌జియానీ, సంగీత దర్శకుడు

'జీరో–టెన్షన్'

మీరు ఆరోగ్యకరంగా జీవించాలంటే 'జీరో–టెన్షన్' లైఫ్ స్టైల్‌ను అలవరచుకోవాలి. కొలెస్ట్రాల్ మాత్రమే కాదు, ఒత్తిడి కూడా ప్రాణాంతకమే. ఆరోగ్యం అంటే ఏ వ్యాధీ లేకపోవటం మాత్రమే కాదు. మనసు ప్రశాంతంగా ఉండటం కూడా.

– డా॥ బిమల్ ఛేజర్, కార్డియాలజిస్ట్

సమాజం ఎవరికీ పట్టదా?

అభిప్రాయం



టంకశాల అశోక్

సమాజం పరిస్థితి తీవ్రమైన విచారాన్ని కలిగిస్తున్నది. ఈ మాట అంటున్నది అభివృద్ధి, పేదరికం, అవినీతి, తారతమ్యాలు, కులతత్వం, మతతత్వం వంటి విషయాల గురించి కాదు. ఆ సమస్యలపై చర్చలు ఎప్పుడూ జరుగుతున్నవే. ఉద్యమాలూ సాగుతున్నవే. అందుకు పరిష్కారాలపై అనేక థియరీలు, ఆలోచనలు చూస్తున్నాం. ఇక్కడ ప్రస్తావిస్తున్నది వీటన్నింటికి భిన్నమైనది. కుటుంబ సంబంధాలు, సామాజిక సంబంధాలు, వ్యక్తులకు తమతో తమకు ఉండే ఆత్మ సంబంధాలు, ఈ సంబంధాలకు ఆలవాలమయే విలువల గురించి. ఇవి అన్నింటికీ అన్నీ క్రమక్రమంగా క్షీణిస్తుండటం గురించి.

సామాజిక క్షీణత

ఆ యా కాల పరిస్థితులను బట్టి ఈ సంబంధాలు బలంగా ఉండటం, బలహీనపడటం జరుగుతూనే ఉంటుంది. అది సాధారణ స్థాయిలో ఉండటానికీ, ఒక ధోరణిగా మారి తీవ్రతరం కావటానికీ తేడా ఉంది. దానికదే ఒక ఆందోళనకరమైన స్థితి కాగా, అంతే ఆందోళన కలిగిస్తున్నది మరొకటి ఉంది. అది, ఈ విషయమై ఎవరికీ పట్టినట్లు లేకపోవటం. ప్రభుత్వం, పార్టీలు, పెద్దలు, మేధావులు, రచయితలు, కళాకారులు, వివిధ మతాల పెద్దలు, గురువులు, సంస్కర్తలు, లెక్క లేనంతగా ఉన్న సంఘాల వారు, ఆ యా ఇజాల వారు. అందరికీ అందరూ. ఎవరికి ఏదీ పట్టడం లేదు.

ఒక మాట సూటిగా చెప్పుకోవాలంటే, మనుషులు తమను తాము చంపుకోవటం, ఇతరులను చంపటం ఎక్కువవుతున్నాయి. అందుకు స్థూలంగా కనిపిస్తున్న కారణాలు ఆర్థికం, లైంగికం, మద్యం, మాదక ద్రవ్యాలు, జూదం, బలహీనపడుతున్న కుటుంబ సంబంధాలు, పెరిగిపోతున్న అసహనం వంటివి. ఇది స్థూలమైన పరిభాష. వీటిలో ఒక్కొక్క అంశాన్ని విడిగా పరిశీలిస్తే అన్నింటికీ కలిపి ఒక సమగ్ర సామాజిక స్థితి కనిపిస్తుంది. ఈ అంశాలలో కొన్నింటికి పరస్పర సంబంధం ఉన్నట్లు కూడా అర్థమవుతుంది. వాటి జమిలి ప్రభావాలతో మన సమాజం, మనుషులు, కుటుంబాలు ప్రమాదానికి గురవుతున్నాయి. వాస్తవానికి ఇటువంటి అధ్యయనాలను సామాజిక శాస్త్రజ్ఞులు చేయాలి. సమాజ అధ్యయన శాస్త్రంలోకి రాజకీయం, ఆర్థికం, సమాజ సంస్కృతి, కుటుంబం, వ్యక్తిత్వ రూపకల్పనలు, మానసికతలు వీటన్నింటి పరస్పర సంబంధాలు, పరిణామాలు, మంచి చెడులు అన్నీ వస్తాయి. సామాజిక శాస్త్రం మనకు శ్రీకృష్ణుని నోటిలో సమస్త విశ్వ సందర్శనం వంటిది. కానీ దురదృష్టవశాత్తు, ఇతరత్రా మన విద్యా రంగాల వలె, సామాజిక శాస్త్ర విభాగాలు కూడా బలహీనపడుతూ, ఇటువంటి అధ్యయనాలు చేయటం లేదు. తెలుగు రాష్ట్రాలలోని ఈ విభాగాల వారికి ఆ స్పృహ అయినా ఉన్నట్లు లేదు.

◆ సంస్కర్తలు, మేధావులు, కళాకారులు సామాజిక పరిస్థితుల పట్ల ఆందోళన చెంది సంస్కరణోద్యమాలు తెస్తారు. పాలకులపై ఒత్తిడిని సృష్టిస్తారు. కానీ ఈ వర్గాలు నిష్క్రియాపరంగా మారటం పెద్ద సమస్య అవుతున్నది.

చెదురుతున్న సంబంధాలు

వివరాలలోకి వెళితే, పైన పేర్కొన్న కారణాల వల్ల హత్యలు, ఆత్మహత్యలు జరగని రోజంటూ ఉండటం లేదు. డబ్బు, వ్యసనాలు, లైంగికాలు, హీన సంస్కృతి, వినియోగదారీతత్వం పాత్రలు పెరుగుతూ, మనుషులకు తమతో తమకు స్వీయ సంబంధాలు, వ్యక్తిత్వాలు, కుటుంబ సంబంధాలు, సామాజిక సంబంధాల పాత్రలు, అనుబంధాలు బలహీనపడి అప్రధానమవుతున్నాయి. ధన ప్రభావం, క్రమంగా వ్యాపిస్తున్న కొత్త కన్స్యూమరిజం, కొత్త సంస్కృతి ప్రభావం పట్టణ ప్రాంతాలకు, కొన్ని తరగతులకు పరిమితమై ఉండక గ్రామాలకూ, అన్ని తరగతులకూ విస్తరిస్తున్నది. పట్టణాలకు ఎక్స్‌పోజర్, కొత్త మీడియా, వినోదం, బలహీనపడిన విద్య, కుటుంబ శిక్షణలు, క్రమశిక్షణలు, కన్స్యూమరిజం పెంచుతున్న కోరికలు ఈ సరిహద్దులను చెరిపివేస్తున్నాయి. అది జరిగినప్పుడు మనిషి ఒక భిన్నమైన ప్రపంచంలోకి ప్రవేశించటంతో మొదట తనతో తనకే స్వీయ సంబంధం చెదిరిపోతుంది. వ్యక్తిత్వం కలుషితమవుతుంది. ఒకసారి అది జరగటం మొదలైతే కుటుంబంతో, ఇతర వ్యక్తులతో, సమాజంతో సంబంధాలు చెదిరిపోవటమన్నది తార్కికమైన సహజ పరిణామం. అది, వేర్లకు పురుగుపట్టిన చెట్లు మామూలు గాలికే కూలిపోవటం వంటిది. అట్లా కూలటంలో భాగంగానే అన్ని విధాలైన సంస్కారాలూ దెబ్బతిని వ్యక్తులు ఆత్మహత్యలకు, హత్యలకు, కుటుంబ సభ్యులపై దాడికి, లైంగిక నేరాలకు, ఇతర నేరాలకు, వ్యసనాలకు, తత్సంబంధిత అకృత్యాలకు పాల్పడటం పెరుగుతున్నది. ఇదే సామాజిక క్షీణ స్థితి.

పైన చెప్పుకున్నట్లు, ఇటువంటి స్థితి ఏర్పడటం వర్తమాన కాల పరిస్థితుల ప్రభావంతో జరుగుతున్నది. అటువంటి కాల పరిస్థితులకు పరిష్కారం ఏమిటన్నది ఒక ప్రశ్న కాగా, పరిష్కార ప్రయత్నాలు ఒక స్థాయిలో జరుగుతూనే వీలైనంత నివారణ ప్రయత్నాలు కూడా ఏమి జరగాలన్నది మరొక ప్రశ్న. ఈ ధోరణిని భిన్న కోణాల నుంచి మౌలికంగా ఎదుర్కోవటం, పరిష్కరించటం, ప్రభుత్వాలు విధానపరంగా తీసుకోగల చర్యలపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. పైన పేర్కొన్న వివిధ సమస్యలకు సంబంధించి విధానపరమైన నిర్ణయాలు సాధ్యమే. విద్య, వినోదం, ఆర్థికం, కొత్త తరహా మీడియా, కన్స్యూమరిజం, సమస్త అంశాలలో డబ్బు పాత్ర మొదలైనవి విధానపరమైన నిర్ణయాల పరిధిలోకి రాగలవు.

క్రియాశీలంగా మారితేనే...

కానీ, అది మాత్రమే ఎంత మాత్రం చాలదు. అందుకు సమాజపరంగా జరిగేది సరిసమానంగా అనుబంధం కావాలి. ప్రస్తుతం ప్రభుత్వాలు, సమాజం ఏదీ శ్రద్ధ చూపటం లేదన్నది సమస్యగా మారింది. ఒకోసారి ప్రభుత్వం ఎట్లా వ్యవహరించినా కనీసం సామాజికులు, సంస్కర్తలు, మత పెద్దలు, మేధావులు, రచయితలు, కళాకారులు ఇటువంటి పరిస్థితుల పట్ల ఆందోళన చెంది చైతన్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తారు. సంస్కరణోద్యమాలు తెస్తారు. ఆ విధంగా పాలకులపై కూడా ఒత్తిడిని సృష్టిస్తారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చూపినా ఇటువంటి సామాజిక వర్గాల క్రియాశీలతపై సమాజాలు ఆశలు పెట్టుకుంటాయి. కానీ ఈ వర్గాలు నిష్క్రియాపరంగా మారటం ఇంకా పెద్ద సమస్య అవుతున్నది. వారికి రాజకీయాలపై ఉన్న ఆసక్తి సమాజం పట్ల కలగటం లేదు. కనీసం ఇప్పటికైనా, ఈ సామాజిక ఉపద్రవం మరింత తీవ్రంగా మారకముందే, ఈ వర్గాలు కళ్ళు తెరవటం అవసరం. లేనట్లయితే, కొంతకాలంగా మారుతున్న కాల పరిస్థితుల ప్రభావాలు పెరిగి సమాజం మరింత ప్రమాదకరం అవుతుంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

మీదీ బిలియనీర్ మైండే!

వ్యూ పాయింట్:

పాడ్‌కాస్ట్: ఫిగరింగ్ అవుట్ విత్ రాజ్ శమనీ

అతిథి: డాక్టర్ శ్వేత అదాతియా న్యూరాలజిస్ట్, 'లిమిట్‌లెస్ బ్రెయిన్ ల్యాబ్' వ్యవస్థాపకురాలు

హోస్ట్: రాజ్ శమనీ పాడ్‌కాస్టర్, ఆంట్రప్రెన్యూర్

బిలియనీర్‌ల మెదడుకు, మామూలు వ్యక్తుల మెదడుకు మధ్య వ్యత్యాసాన్ని తెలుసుకోవటానికి డాక్టర్ శ్వేతను చేసిన ఇంటర్వ్యూ ఇది. శ్వేత ప్రధానంగా 'న్యూరో ప్లాస్టిసిటీ' (మెదడుకు ఉండే 'తర్ఫీదుకు మారగల' సామర్థ్యం) గురించి మాట్లాడారు. సగటు మనిషికి భిన్నంగా 'సంపన్న' ఆలోచనలు కలిగిన బిలియనీర్‌లో 'ఫ్రంటల్ కార్టెక్స్' శక్తిమంతంగా పని చేస్తుందన్నారు. మెదడుకు తర్ఫీదు ఇవ్వగలిగితే ఎవరైనా బిలియనీర్లు కావచ్చంటారు. ఆమె మాటల్లోని ముఖ్యాంశాలు:

స్ట్రాటెజిక్ మార్నింగ్ రొటీన్

''ఉదయం మేల్కొన్నాక, తొలి గంట ఎంతో అమూల్యమైనది. 'గోల్డ్' అంటాను ఆ గంటను నేను. ఆ రోజంతా మనం ఎలా ఉండబోతున్నాం అన్నది ఆ 'గోల్డెన్ అవరే' నిర్ణయిస్తుంది. ఆ గోల్డెన్ అవర్ ఎలా ఉండాలన్నది మాత్రం మనం నిర్ణయించగలగాలి. ఉదా: ఉదయం లేవగానే మీరు ఒక గంట వరకు ఫోన్‌ను చేతుల్లోకి తీసుకోకండి. తీసుకుంటే ఏమౌతుందంటే, మీ మెదడు ప్రతిచర్యాశీలకమైన (రియాక్టివ్) 'బీటా వేవ్' స్థితిలోకి వెళ్లిపోతుంది. అలా కాకుండా... తీటా, ఆల్ఫా వంటి శాంతియుతమైన తరంగ స్థితుల్లోకి మీరు ఉద్దేశపూర్వకంగా వెళ్లిపోవాలి. ఫోన్‌ను మీరు టచ్ చేయకుండా, ఉషోదయ కిరణాలను కాసేపు మిమ్మల్ని టచ్ చేయనివ్వండి. మెదడులో ఉండే హైపోథాలమస్‌లోని చిన్న కేంద్రకాల జతలు క్రియాత్మకమై, మీ జీవ గడియారాన్ని లయబద్ధం చేస్తాయి. దీనినే 'స్ట్రాటెజిక్ మార్నింగ్ రొటీన్' అంటాం.

రాజ్ శమనీ - డాక్టర్ శ్వేత అదాతియా

లక్ష్యానికి మేల్కొలుపు 'మూవర్స్'

''స్ట్రాటెజిక్ మార్నింగ్ రొటీన్‌ను పాటించటానికి 'మూవర్స్' అనే ఒక సరళమైన సూత్రాన్ని మేము వృద్ధి చేశాం. మూవర్స్ అనే సంక్షిప్త నామంలోని 6 ఇంగ్లిష్ లెటర్స్‌లో ఒక్కో లెటర్‌కు ఒక్కో అర్థం ఉంది. ఎం–మెడిటేషన్, ఒ–ఆక్సిజనేషన్, వి–విజువలైజేషన్, ఇ–ఎక్సర్‌సైజ్, ఆర్–రీడింగ్, ఎస్–స్క్రైబింగ్. ధ్యానం, శ్వాస, మనోవీక్షణ, వ్యాయామం, చదవటం, రాయటం అనే ఈ ఆరు సాధనలలో ప్రతి దానికీ కనీసం ఐదు నిముషాలు కేటాయించాలి. అవన్నీ కూడా అంతిమంగా మెదడును చురుకెత్తించేవే. మొత్తంగా మూవర్స్ అనే ఈ మెళుకువ మీలో ఒక లక్ష్యం ఏర్పరచి, ఆ లక్ష్య సాధనకు మిమ్మల్ని సిద్ధం చేస్తుంది.

'ఫ్రంటల్ కార్టెక్స్'దే కీలకమంతా!

''మెదడు ముందు భాగంలో ఉండే 'ఫ్రంటల్ కార్టెక్స్' తార్కికమైన ఆలోచనను జనింపజేస్తుంది. భావోద్వేగాలను అదుపు చేస్తుంది. వ్యసనాలను నియంత్రిస్తుంది. ఇందుకు భిన్నంగా మెదడు మధ్యభాగంలో ఉండే 'లింబిక్ సిస్టమ్' వాయిదా మనస్తత్వానికీ, ఒత్తిళ్లకూ కారణం అవుతుంది. మామూలు మనుషుల్లో లింబిక్ సిస్టమ్ పైచేయిగా ఉంటే, బిలియనీర్‌లలో ఫ్రంటల్ కార్టెక్స్ బలంగా ఉన్నట్లు పరిశోధకులు కనిపెట్టారు. 'మూవర్స్' టెక్నిక్ లింబిక్ సిస్టమ్‌ను మందగింపజేసి, ఫ్రంటల్ కార్టెక్స్‌ను క్రియాశీలం చేస్తుంది. దాంతో బిలియనీర్స్ లేదా 'హై–పెర్ఫార్మర్'ల ఫ్రంటల్ కార్టెక్స్ శక్తి పుంజుకుని, తద్వారా ఒక భావోద్వేగ నిర్లిప్తత అలవడుతుంది. ప్రాక్టికల్‌గా మారిపోతారు.

పుట్టుకురారు... తయారౌతారు

''చివరికి, నేను చెప్పొచ్చేది ఏమిటంటే, 'బిలియనీర్ మెదడు' అనేది జన్యువుల లాటరీలో తగిలిన సంపద కాదు. క్రమం తప్పని, స్వల్పమైనవైన, సోమరితనంతో వాయిదా వేయని దినచర్యల 'సాగు ఫలితం'. ఐదు నిమిషాల రోజువారీ నిశ్శబ్ద ధ్యానం, క్రమబద్ధం చేసుకున్న ఉదయపు వేళ అలవాట్లు, 4–7–8 వంటి శ్వాస వ్యాయామాలు (ముక్కు ద్వారా 4 సెకన్ల పాటు గాలిని గుండెల్లోకి పీల్చటం, 7 సెకన్ల పాటు శ్వాసను పట్టి ఉంచటం, 8 సెకన్ల పాటు గాలిని నోటి ద్వారా బయటికి వదలటం) మెదడు సామర్థ్యాన్ని పెంచుతాయి. బిలియనీర్లు పుట్టుకురారు. తయారౌతారు. బికారులు కూడా సాధనతో, స్థితిగతుల నియంత్రణతో బిలియనీర్లుగా ఎదగవచ్చు. కీలకమంతా మెదడుకు తర్ఫీదు ఇవ్వటంలోనే ఉంది. ఈ న్యూరోప్లాస్టిసిటీ ఏ వయసులోని వారికైనా సాధ్యమే!

❑ ఎడిటోరియల్ టీమ్

పాఠాలు చెప్పనీయండి!

ఇన్ బాక్స్

ఆంధ్రప్రదేశ్‌లో నేటి ప్రభుత్వం 'ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం' అని పదేపదే చెబుతున్నప్పటికీ, కనిపిస్తున్న వాస్తవాలు మాత్రం దీనికి విరుద్ధంగా ఉన్నాయి. నిజమైన బలోపేతం అంటే– పిల్లల సంఖ్య పెరగాలి, సరిపడా ఉపాధ్యాయులు ఉండాలి, వారికి బోధనకు పూర్తిస్థాయి సమయం ఉండాలి. అలాగే పాఠశాలల్లో గుణాత్మక విద్య వికసించాలి. కానీ నేడు దీనికి బదులు సమస్యలే పెరుగుతున్నాయి. ఫలితంగా విద్యార్థులు ప్రభుత్వ బడులను వదిలేస్తున్నారు. 2023–24లో 81,08,406 మంది విద్యార్థులు ఉండగా... 2024–25లో 78,69,714కూ; 2025–26కి వచ్చేటప్పటికి 76,02,854కూ సంఖ్య తగ్గిపోతూ వచ్చింది. ప్రతి సంవత్సరం లక్షల్లో పిల్లలు ప్రభుత్వ పాఠశాలల నుండి జారిపోవడం దేనికి సంకేతం? బలోపేతానికా? బలహీనతకా?

విద్యా సంవత్సరం మొదలైన రోజు నుంచే పాఠాలు చెప్పే అవకాశాన్ని యాప్‌లు, రికార్డులు, మీటింగులు, అప్రయోజక కార్యక్రమాలు అడ్డుకుంటున్నాయి. లీప్ యాప్‌లో 70 రకాల టైల్స్, విద్యామిత్ర, ఐఎమ్ఎమ్ఎస్, దీక్ష, పీఎమ్, ఎస్ఏఎస్ఏ వంటి అప్లికేషన్ల పనులు ఉపాధ్యాయుల సమయాన్ని పూర్తిగా తినేస్తున్నాయి. ఆన్‌లైన్ ట్రైనింగులు, 20 రోజులపాటు యోగా డే, మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాలు– వీటన్నింటి ఫలితంగా బోధనా పీరియడ్లు తీవ్రంగా తగ్గాయి. పరీక్షల మూల్యాంకనం గందరగోళంగా ఉందని ఉపాధ్యాయుల అభిప్రాయం. ఇతర రాష్ట్రాల్లో ఎప్పుడూ చూడని విధంగా ఉపాధ్యాయులు 'పాఠాలు చెప్పనీయండి' అంటూ ఉద్యమానికి దిగాల్సిన పరిస్థితి వచ్చింది.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు తగ్గిపోతున్నారు, ఉపాధ్యాయులు తగ్గుతున్నారు, తరగతులు విలీనమవుతున్నాయి. అదే సమయంలో అనేక పాఠశాలలు మూతపడుతున్నాయి. వర్క్ ఫౌండేషన్, ఎన్ఎఫ్ఈఆర్ నివేదికల ప్రకారం ఉపాధ్యాయులు అత్యధిక ఒత్తిడికి గురవుతున్నారు. సెలవుల్లో కూడా వృత్తికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు నిజంగా బలపడాలంటే నష్టదాయక సంస్కరణ లను తక్షణ రద్దు చేయాలి. ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకే పరిమితం చేయాలి. పరీక్షలు, మూల్యాంకన విధానాల పునర్విమర్శ జరగాలి. ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక నిధులను కేటాయించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలతో విస్తృత చర్చలు జరపాలి. విద్యారంగం మాటలతో బలోపేతం కాదు. లోపాలను అంగీకరించి, విధానాలను సరిచేసి, ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంచే దిశగా ప్రభుత్వం నడవాలి. పిల్లల అభివృద్ధి కేంద్రంగా ఉండే పాఠశాల వ్యవస్థను పునర్నిర్మించడం ద్వారా మాత్రమే విద్యావ్యవస్థ బలోపేతం అవుతుంది.

– కె. విజయ । యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు

డిజి'డల్' ప్రోత్సాహకాలు

డేటా పాయింట్

డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు ఈ ఆర్థిక సంవత్సరంలో భారీగా తగ్గిపోయాయి.

ఆధారం: కేంద్ర ఆర్థిక శాఖ

సంవత్సరాల వారీగా కేటాయించిన సబ్సిడీలు (రూ.కోట్లలో)

2021-22	1,500
2022-23	2,600
2023-24	3,500
2024-25	2,000
2025-26	427

(బడ్జెట్ అంచనాలు)

నిరీక్షణా కాలం



దీన్నే ఆగమన కాలంగా క్రైస్తవులు క్రిస్మస్‌కు ముందటి నాలుగు ఆదివారాల పాటు పాటిస్తారు. క్రిస్మస్‌కు మానసికంగా సిద్ధపడే రోజులే ఈ ఆయత్త దినాలని కూడా అంటారు. ఈ రోజుల్లో నాలుగు కేండిల్స్ వెలిగించి ప్రభువు రాక కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఒకటి ఆశతో కూడిన నిరీక్షణా కేండిల్, రెండు శాంతి సమాధానాల కేండిల్, మూడు ప్రేమ జ్వాలా కేండిల్, నాలుగు సంతోష కేండిల్.

ఈ అందమైన విశ్వాన్ని దేవుడు అతి శ్రద్ధగా చెక్కాడు. జగత్తు మొత్తం ఎలా ఉండాలో నేర్పించాడు. కానీ అది దారి తప్పి అపమార్గంలో పయనించడం చూచి, భక్తులూ, ప్రవక్తలూ విలపించడం చూచి, తాను తప్పక వస్తానని దేవుడు వాగ్దానం చేశాడు. ఆయన రాకడ కోసం ఎంతో ఆశతో నిరీక్షించారు. ఇదే మొదటి కేండిల్. సాతాను వెంటాడుతూ పన్నిన అనేక సమస్యల వలయంలో చిక్కుకొని అలజడి చెందిన సమయంలో... దేవుని నుంచి శాంతి సమాధానాల కోసం ఎదురు చూశారు. ఇది రెండో కేండిల్.

మనిషిని మనిషి ద్వేషించుకోవడం, హింసించుకోవడం మొదలైంది. ఆ దశలో నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించాలి అనే దేవుని ఆనతితో సాటి మానవ ప్రేమతో దైవ ప్రేమనూ సంపాదించుకోడానికీ ప్రయత్నిస్తారు. ఇదే క్రీస్తు రాకకై ఆయత్తపడి వెలిగే మూడో ప్రేమ కేండిల్. దేవుని రాకడ కోసం హృదయాల్లో కక్షలు కార్పణ్యాల చీకట్లు తొలగించుకొన్న వెలుగు ముఖాలతో, రెట్టింపు ఉత్సాహంతో ప్రభువు కోసం నిరీక్షిస్తూ వెలిగేదే నాలుగో కేండిల్.

ఈ నాలుగు కేండిల్స్ క్రైస్తవ కుటుంబాల్లో వెలిగే నిరీక్షణా దీపాలు. ఈ నెల రోజుల పాటు (నవంబర్ 30 నుంచి డిసెంబర్ 24 వరకు) వేకువ నుంచే ప్రార్థనలతో స్తుతి గీతాలతో ఆరాధనలు చర్చి ప్రాంగణంలో జరుగుతూ ఉంటాయి. సరిగా పాటిస్తే, వాస్తవానికి క్రిస్మస్ పండుగ అనేది, ఈ ఆయత్త దినాల్లోనే జరిగిపోతుంది. పండుగలనేవి మనిషిలోని మాలిన్యం తొలగించుకోడానికి, మనసులో ప్రేమ భావం పెంచుకోవడానికి, కసి, కక్షలూ మరచిపోయి, సమైక్యంగా శాంతి జీవనం గడపడానికి సిద్ధం చేస్తాయి.

– డా॥ సోహినీ బెర్నార్డ్ రాజు

క్లుప్తంగా...

కిడ్నీ రాకెట్ కేసులో డీసీహెచ్ఎస్ సస్పెన్షన్

మదనపల్లె: కిడ్నీ రాకెట్ కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న అన్నమయ్య జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ కంప ఆంజనేయులును సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 9న అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఇద్దరికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరిగాయి. వీరిలో వైజాగ్‌కు చెందిన సాడి యమున (29) మృతి చెందింది. ఆమె తల్లి సూరమ్మ ఫిర్యాదుపై కేసు నమోదుచేసిన పోలీసులు ఆంజనేయులను మొదటి నిందితునిగా పేర్కొనగా ఈనెల 15న ఆయన్ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక వెళ్లడంతో ఆయన్ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

తంబళ్లపల్లె కోర్టుకు అద్దేపల్లి జనార్దన్‌రావు

15 రోజుల పాటు రిమాండ్ విధింపు

ములకలచెరువు: అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావుతో పాటు మరో ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. గతంలో ఇదే కోర్టులో ఎక్సైజ్ అధికారులు వీరి కోసం పీటీ వారెంట్ దాఖలు చేయడంతో ఈనెల 30 లోపు వారిని కోర్టులో హాజరు కావాలని ఆదేశించింది. కోర్టులో హాజరుపరచగా జడ్జి ఉమర్ ఫారుక్ 15 రోజులు రిమాండ్ విధించారు. అనంతరం జనార్దన్‌రావుతో పాటు ఇతర నిందితులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, పి. రమేష్‌బాబు, షేక్ అల్లాభక్షులను మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు.

వైవీ సుబ్బారెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: వాడరేవు, నిజాంపట్నం పోర్ట్స్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్స్(వాన్‌పిక్) భూముల కేసులో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో తనను నిందితుడిగా చేర్చడంపై దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేయడంతో వైవీ సుబ్బారెడ్డి గతేడాది మే 30న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ ఎంఎం.సుందరేష్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మల ద్విసభ్య ధర్మాసనం ఎదుట శుక్రవారం విచారణకు వచ్చింది. అడిషనల్ సోలిసిటర్ జనరల్ ఏఎస్‌జీ రాజు సీబీఐ తరపున వాదనలు వినిపించాల్సి ఉండగా ఆయన అందుబాటులో లేరు. దీంతో కేసును మరో రోజుకు వాయిదా వేయాలని సీబీఐ తరపు న్యాయవాది ధర్మాసనాన్ని కోరగా ధర్మాసనం జనవరికి వాయిదా వేసింది. జనవరి 21న విచారణకు రావొచ్చు.

ముగిసిన జోగి బ్రదర్స్ మూడో రోజు కస్టడీ

విజయవాడ లీగల్: నకిలీ మద్యం కేసులో మాజీమంత్రి జోగి రమేష్, అతని సోదరుడు జోగి రాముల మూడోరోజు కస్టడీ పూర్తయ్యింది. విచారణలో ఎక్సైజ్ అధికారులు సుమారు 50కుపైగా ప్రశ్నలు అడిగారు. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించి, అలాగే బ్యాంకు ఖాతాలలో జరిగిన లావాదేవీలపై ఎక్కువ ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. జోగి రామును 120కిపైగా ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. విచారణ అనంతరం విజయవాడ జైలుకు తరలించారు.

అప్రూవర్ షరతుతో ముందస్తు బెయిలా..?

వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌ల ముందస్తు బెయిల్ పిటిషన్లను వ్యతిరేకిస్తూ వాదనలు

సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసులో అప్రూవర్లుగా మారతామని, అందువల్ల తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ప్రధాన నిందితులైన అప్పటి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఎక్సైజ్ శాఖ స్పెషలాఫీసర్ దొడ్డా సత్యప్రసాద్ దాఖలుచేసిన వ్యాజ్యాలను వ్యతిరేకిస్తూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సువర్ణరాజు తరపున దాఖలైన ఇంప్లీడ్ పిటిషన్లపై హైకోర్టులో శుక్రవారం వాడివేడి వాదనలు జరిగాయి. చెవిరెడ్డి తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది చిత్తరావు నాగేశ్వరరావు, న్యాయవాది టీఎంకే చైతన్య వాదనలు వినిపిస్తూ ఇంప్లీడ్ పిటిషన్ల దాఖలు చేయాల్సిన అత్యంత ఆవశ్యకతను న్యాయస్థానానికి వివరించారు. 'అప్రూవర్లుగా మారతామన్న షరతుతో ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేయడం న్యాయవ్యవస్థలో ఎక్కడాలేదు.దీనిపై దర్యాప్తు సంస్థ సైతం అభ్యంతరం చెప్పడంలేదు. దీంతో మేం ఇంప్లీడ్ అవుతున్నాం. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఉన్నాయి. వాస్తవానికి ఏసీబీ కోర్టు వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌ల క్షమాభిక్ష పిటిషన్లను కొట్టేసింది' అని వారు న్యాయస్థానానికి విన్నవించారు. ఇంప్లీడ్ పిటిషన్లను వ్యతిరేకిస్తూ వాదనలు వినిపించిన వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌ల తరపు న్యాయవాది ఆదిత్య హర్షవర్ధన్.. కౌంటర్ల దాఖలుకు సమయం కోరారు. ఇంప్లీడ్ పిటిషన్ల విచారణ అర్హతను తొలుత తేల్చుతామని పేర్కొన్న న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కేసు తదుపరి విచారణను డిసెంబర్ 2వ తేదీకి వాయిదా వేశారు.

టీడీపీ నేత కల్తీ మద్యం దుకాణం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : నకిలీ మద్యంలో తమ పార్టీ నేతలను ఆదర్శంగా తీసుకున్నాడేమో..? పార్టీలోని పెద్దలే అక్రమ దందాను ప్రోత్సహిస్తుంటే తాను మాత్రం ఎందుకు చేయొద్దు అనుకున్నాడేమో..? టీడీపీ నేత కల్తీ మద్యం దుకాణం తెరిచాడు..! శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రధాన అనుచరుడు, ఆ పార్టీ నాయకుడు అయిన పైడి ముఖలింగం అలియాస్ నూకరాజు పేరిట సరుబుజ్జిలిలో ఉన్న పీఆర్ వైన్స్‌లో శుక్రవారం 10.88 లీటర్ల నీళ్లు కలిపిన మద్యం పట్టుబడింది. లీటర్ పరిమాణంలోని కల్తీ మద్యం వాటర్ బాటిళ్లు 9, నీళ్లు కలిపిన 11 క్వార్టర్ బాటిళ్లను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా ఈ షాప్‌లో అమ్ముతున్న మద్యంపై ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. కల్తీ సరుకు విక్రయిస్తున్నట్లుగా మందుబాబులు ఫిర్యాదులు చేస్తున్నారు. అధిక రేట్లు, చిల్లర విక్రయాలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వచ్చాయి. ఎవరైనా ప్రశ్నిస్తే... ''మాకు ఎమ్మెల్యే అండదండలున్నాయి. ఇది ఆయన షాప్'' అని బెదిరించేవారని చెబుతున్నారు. దీంతో ఫిర్యాదు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు.

సేల్స్ సిబ్బందిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

ఎమ్మెల్యే ఈశ్వరరావు, మంత్రి అచ్చెన్నాయుడుతో మద్యం దుకాణం యజమాని ముఖలింగం

ఓనర్‌ను వదలి వర్కర్లపై కేసు

దుకాణ యజమాని అయినా కల్తీ మద్యం వ్యవహారంలో ముఖలింగంపై కేసు పెట్టలేదు. పీఆర్ వైన్స్‌లో కల్తీ మద్యానికి బాధ్యులుగా అందులో సేల్స్‌మెన్లుగా పనిచేస్తున్న కుసుంపోలవలస గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, దన్నానపేటకు చెందిన సాసుపల్లి శ్రీనివాసరావులను అరెస్ట్ చేశారు.

కాగా, ముఖలింగం ఎమ్మెల్యే కూనకు అత్యంత సన్నిహితుడు. ఆయన అమరావతితో పాటు ఎక్కడకు వెళ్లినా వెన్నంటే ఉంటాడు. ఈ నేపథ్యంలోనే పలుకుబడి ఉన్న షాప్ యజమానిని తప్పించి వర్కర్లను బలి చేశారంటూ తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కేసును ఆమదాలవలస ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. దుకాణాన్ని సీజ్ చేసి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావులను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఆమదాలవలస ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పల్లి మురళీధర్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ మర్రాపు శ్రీనివాసరావు దాడుల్లో పాల్గొన్నారు.

దుకాణమే అక్రమం..

పీఆర్ వైన్స్ దుకాణం నిబంధనలకు విరుద్ధంగా పాలకొండ ప్రధాన రహదారి పక్కనే, చర్చి సమీపంలో ఏర్పాటు చేయడం గమనార్హం. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలు వచ్చినా ఎక్సైజ్ అధికారులు చూసి వెళ్లారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు ఎక్సైజ్ శాఖలో ఓ ఉన్నతాధికారి అండదండలు సమృద్ధిగా ఉండడంతోనే పీఆర్ వైన్స్ యజమాని ఇష్టారీతిన వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.

సాక్షిపై దాడి ఘటనలో కీలకపాత్ర

సాక్షి పత్రిక యూనిట్ కార్యాలయంపై జరిగిన దాడిలో పీఆర్ వైన్స్ యజమాని పైడి ముఖలింగం కీలక పాత్ర పోషించాడు. కార్యాలయం బయటి భాగం ధ్వంసం చేయడంలో ఇతడే ప్రధానంగా వ్యవహరించాడు. పెద్దల మెప్పు కోసం చాలా హడావుడి చేశాడు.

నందిగం రాణికి చుక్కెదురు

కోట్ల రూపాయల మోసం కేసులో ముందస్తు బెయిల్ తిరస్కరణ

సాక్షి, అమరావతి: ఏలూరు జిల్లా, కామవరపు కోట మండలం, తడికలపూడి గ్రామంలో శ్రీ హర్షిత ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటు పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన వ్యవహారంలో నిందితురాలు నందిగం రాణికి హైకోర్టులో చుక్కెదురైంది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. నేర తీవ్రత నేపథ్యంలో ముందస్తు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని పేర్కొంది. ఇదే కేసులో ఇతర నిందితులుగా కొందరికి షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు ఇటీవల తీర్పునిచ్చారు. హర్షిత ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఏర్పాటు పేరుతో నందిగం రాణి, అతని భర్త పలువురి నుంచి దాదాపు రూ.33 కోట్ల వరకు డబ్బు వసూలు చేశారు. వీరి చేతిలో మోసపోయిన కొర్రపాటి చంద్రశేఖర్ అనే వ్యక్తి నందిగం రాణి తదితరులపై సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. నందిగం రాణి, ఆమె భర్త, ఇతర కుటుంబ సభ్యులను నిందితులుగా చేర్చారు. దీంతో వీరంతా కూడా ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయమూర్తి, తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న నందిగం రాణి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేశారు. మిగిలిన వారికి మాత్రం ముందస్తు బెయిల్ మంజూరు చేశారు.

కేసుల మాఫీకి బాబు అడ్డదారులు

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఫైర్

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ఆయనపై ఉన్న కేసులను మాఫీ చేసుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతం నుంచి స్టేలతో తప్పించుకుంటున్న చంద్రబాబు స్కిల్ కేసులో అనారోగ్య కారణాలు చూపి, జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చారని, ఇప్పుడు కుతంత్రాలతో ఆ కేసులన్నీ మాఫీకి శతవిధాలా యత్నిస్తున్నారని విమర్శించారు. దీనికోసం కేసుల్లో సాక్షులు, అధికారులు, పిటిషనర్లను బెదిరించి, ప్రలోభపెట్టి వారిచేతే కేసులు విత్‌డ్రా చేయించుకుంటున్నారని ధ్వజమెత్తారు. నిజాయితీగా విచారణ ఎదుర్కొనే ధైర్యంలేక, చట్టం తనపని తాను చేసుకుంటూపోతే జైలుకు పోవడం ఖాయమని గ్రహించిన సీఎం నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు.

చట్టాలపై చంద్రబాబుకు గౌరవం లేదు

''చంద్రబాబుకు చట్టాలపై గౌరవం లేదు. ఈ దేశంలోనే అత్యంత సంపన్న సీఎం చంద్రబాబు. దేశంలోనే ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న సీఎం కూడా చంద్రబాబే. ఏలేరు స్కాం నుంచి నోటుకు కోట్లు, స్కిల్ స్కాం వరకు అన్ని ఆధారాలతో అడ్డంగా దొరికిపోయారు'' అని తాటిపర్తి విమర్శించారు.

2014-19 మధ్య అడ్డగోలు దోపిడీ

''2014-19 మధ్య అడ్డగోలుగా రాష్ట్ర ఖజానాను టీడీపీ నాయకులకు చంద్రబాబు దోచిపెట్టారు. బార్లకు ప్రివిలేజ్ ఫీజును రద్దుచేసి రూ.5 వేల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. కేబినెట్ ఆమోదం లేకుండానే మూడు చోట్ల సంతకాలు చేసి దొరికిపోవడమే కాకుండా రూ.వేల కోట్ల ప్రభుత్వ సొమ్మును దారి మళ్లించారు. ఇప్పుడు అదే లిక్కర్ కేసును కూడా నీరు గార్చే యత్నం జరుగుతోంది. ఇదే కాకుండా అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, ఏపీ ఫైబర్‌నెట్, రాజధాని అసైన్డ్ భూములు, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర కేసుల్లో ఆధారాలతో సహా బాబు దొరికిపోయారు. ఇప్పుడు కోర్టులను వంచించేందుకు యత్నిస్తున్నారు'' అని చంద్రశేఖర్ మండిపడ్డారు.

బెయిల్ నిబంధనలూ ఉల్లంఘన

''స్కిల్ కేసులో అనారోగ్య కారణాలు చూపి బెయిల్ పొందిన చంద్రబాబు, బెయిల్ నిబంధనల్ని తుంగలో తొక్కుతున్నారు. సాక్షులు, పిటిషనర్లు, అధికారులను బెదిరించి, ప్రలోభపెట్టి కేసులను క్లోజ్ చేసుకునేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారు'' అని తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు.

దుష్ప్రచారం చేయబోయి అడ్డంగా బుక్కయిన జనసేన!

- డిప్యూటీ సీఎం హత్యకు ఈ నెల 26న రెక్కీ అంటూ హడావుడి
- వైఎస్సార్‌సీపీ కార్యకర్త పవన్ వెంట తిరిగాడని అధిష్టానానికి ఫిర్యాదు
- పోలీసుల విచారణలో అతను జనసేన కార్యకర్తగా నిర్ధారణ
- అసలు విషయం బట్టబయలు కాగానే అంతా గుప్‌చుప్

మలికిపురం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో ఈ నెల 26న జరిగిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పర్యటనలో వైఎస్సార్ సీపీ కార్యకర్త పాల్గొన్నాడని.. పవన్‌ను హత్య చేసేందుకు పర్యటన ఆద్యంతం ఆయన వెనకే తిరిగాడంటూ జనసేన నాయకులు చేసిన హడావుడి వికటించింది. ఈ వ్యవహారాన్ని అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌సీపీ మీద బురదజల్లాలనే ప్రయత్నాలు బెడిసికొట్టాయి. రాజోలు దీవిలో బుధవారం పవన్ కల్యాణ్ పర్యటనలో మలికిపురం మండలం గూడపల్లి గ్రామానికి చెందిన పున్నం నరసింహమూర్తి అనే వ్యక్తి పాల్గొన్నాడు. అతడు వైఎస్సార్‌సీపీకి చెందిన వాడని, పవన్‌ను హత్య చేయడానికి రెక్కీ చేశాడని జనసేన నాయకులు ప్రచారం మొదలుపెట్టారు. దీనిపై ఆ పార్టీ నాయకులు అమరావతిలోని పార్టీ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ ప్రారంభించారు. తీరా చూస్తే నరసింహమూర్తి జనసేన కార్యకర్తగా నిర్ధారణ అయ్యింది. అసలేం జరిగిందంటే.. గూడపల్లికి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుందర శ్రీనుబాబు అనారోగ్యం వల్ల పవన్ పర్యటనకు రాలేదు. అతడి పాస్ మీద నరసింహమూర్తి పవన్ పర్యటనలో పాల్గొన్నాడు. ఈ వివాదానికి రాజోలులో జనసేన నాయకుల మధ్య ఆధిపత్య పోరు కూడా ఒక కారణం. పవన్ పర్యటనలో రైతుల సభకు వచ్చే వారికి ఇచ్చే పాస్‌ల పంపిణీ ఆ పార్టీలోని రెండు వర్గాల మధ్య విభేదాలకు కారణమైంది. పాస్‌లు పెద్దగా పొందలేకపోయిన ఒక వర్గం.. జనసేన కార్యకర్తలకు కాదని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పాస్‌లు ఇచ్చారనే ప్రచారానికి దిగారు. ఇలా పాస్ పొందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పవన్‌కు హాని కలిగించేందుకు వచ్చారంటూ జనసేన వ్యక్తులే ప్రచారం చేశారు. విచారించిన పోలీసులు నరసింహమూర్తి జనసేన కార్యకర్తేనని, అతనికి ఆ పార్టీ సభ్యత్వం కూడా ఉందని నిర్ధారించడంతో ఆ పార్టీ నాయకులు ఖంగుతిన్నారు. అసలు విషయం బయటపడగానే అందరూ కుక్కిన పేనులా మారిపోయారు.

మంత్రి సంధ్యారాణిని బర్తరఫ్ చేయాలి

మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఫైర్

మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి. చిత్రంలో.. జల్లపల్లి సుభద్ర, గొడ్డేటి మాధవి

సాక్షి, విశాఖపట్నం: చంద్రబాబు పాలనలో మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మండిపడ్డారు. ఆమె శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవితో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. సాక్షాత్తు మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి పీఏ సతీష్ మహిళా ఉద్యోగిని వేధించటం అమానుషమని చెప్పారు. ఏకంగా పక్కలోకి రావాలంటూ బెదిరించినా.. అతనిపై చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. హోంమంత్రి అనితతో పాటు, సంధ్యారాణిని తక్షణమే బర్తరఫ్ చేయాలని, మంత్రి పీఏ సతీష్‌ను వెంటనే అరెస్టుచేయాలని డిమాండ్ చేశారు. 'ఒక మహిళకు అన్యాయం జరుగుతుంటే.. ఆమెను రక్షించాల్సిన సంధ్యారాణి పీఏను వెనకేసుకుని రావడం సిగ్గుచేటు. మహిళలకు రక్షణ కల్పించకుండా వ్యవహరించడం బాధాకరం' అని భాగ్యలక్ష్మి అన్నారు.

లడ్డూ, పరకామణిపై రాజకీయం సరికాదు

పరకామణి వ్యవహారంలో నిందితులపై చర్యలు తీసుకోవాలి

- సీఐడీ విచారణకు పూర్తిగా సహకరించా
- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, అమరావతి/విజయవాడ: పరకామణి చోరీ కేసులో సీఐడీ పూర్తి స్థాయిలో విచారించి నిందితులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. లడ్డు, పరకామణి కేసుల్లో రాజకీయం తగదని కూడా ఆయన హితవు పలికారు. కానూరు ఏపీ సీఐడీ కార్యాలయంలో శుక్రవారం పరకామణి చోరీ కేసులో ఆయన విచారణకు హాజరయ్యారు. గంటన్నర పాటు జరిగిన విచారణలో సీఐడీ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. విచారణ అనంతరం పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

సీఐడీ కార్యాలయానికి వస్తున్న వైవీ సుబ్బారెడ్డి

ఆలయ పవిత్రతను కాపాడాలి

''తిరుమల పరకామణి కేసు వ్యవహారంలో అప్పటి టీటీడీ పాలకమండలి ఎటువంటి తప్పు చేయలేదు. ఆ విషయాన్ని అధికారులే పర్యవేక్షించారు. అసలు ఈ వ్యవహారం టీటీడీ చైర్మన్‌గా తన పదవీకాలం ముగిసిన తరువాతే నా దృష్టికి వచ్చింది. సీఐడీ విచారణకు పూర్తిగా సహకరించా. మనోభావాలకు సంబంధించి అంశాలను రాజకీయ సమస్యలుగా మారుస్తున్నారు. లడ్డు, పరకామణి అంశాలను రాజకీయ వివాదాలుగా మార్చడం సరికాదు. తప్పు ఎవ్వరు చేసినా తప్పే. దోషులను శిక్షించాలని మేము చెబుతున్నాము. నన్ను పిలిచినా, భూమన కరుణాకర్‌రెడ్డిని పిలిచినా విచారణ కోసమే. మమ్మల్ని దోషులుగా చూపాలనుకోవడం సరైన పద్ధతి కాదు. దీనిపై రాజకీయ దుష్ప్రచారం చేసేందుకు యత్నించవద్దు. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి ఆలయ పవిత్రతను కాపాడాలి'' అని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మరోసారి విచారణకు హాజరుకావాలని చెప్పలేదని కూడా ఆయన తెలిపారు. సుబ్బారెడ్డితో పాటు ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పార్టీ అధ్యక్షులు పేర్ని నాని, దేవినేని అవినాష్, విజయవాడ సెంట్రల్, పెనమలూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్‌లు మల్లాది విష్ణు. దేవభక్తుని చక్రవర్తి, నియోజకవర్గాల పరిశీలకులు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, అవుతు శ్రీనివాసరెడ్డి, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు సుబ్బరాజు, పోతిన మహేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా సుబ్బారెడ్డి విచారణకు వస్తున్నారన్న సమాచారంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు సీఐడీ కార్యాలయం వద్దకు పెద్దఎత్తున తరలివచ్చాయి.

జనవరి 1న ఆయుధాలు విడిచి లొంగిపోతాం

మాకు సహకరించే రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధం

- మావోయిస్టు ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరిట లేఖ విడుదల
- లేఖ విడుదల చేసిన మరుసటి రోజే లొంగిపోయిన అనంత్ టీమ్

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆయుధాలు విడిచి జనవరి 1న లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు వెల్లడించారు. ఈ మేరకు ఎంఎంసీ (మహారాష్ట్ర -మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్) జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో గురువారం రాత్రి విడుదల చేసిన లేఖ శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కాల్పుల విరమణపై ప్రతిపాదన చేస్తూ ఇటీవలే అనంత్ లేఖ విడుదల చేయగా.. తాజా లేఖలో ఏకంగా కాల్పుల విరమణ తేదీ ప్రకటనతోపాటు ఉమ్మడిగా తాము లొంగిపోయేందుకు సిద్ధమన్న కీలక నిర్ణయాలున్నాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, విష్ణుదేవ్ సాయ్, మోహన్ యాదవ్‌లను ఉద్దేశించి రాసిన రెండు పేజీల లేఖలో అనంత్ పలు అంశాలను ప్రస్తావించారు. అయితే, లేఖ విడుదల చేసిన మరుసటి రోజే అనంత్ టీమ్ లొంగిపోవడం గమనార్హం.

అప్పటి వరకు సంయమనం పాటించాలి

'కామ్రేడ్స్, 2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించుకుని, ఆయుధాలను విడిచిపెట్టి, ప్రభుత్వం ఇచ్చే పునరావాసాన్ని అంగీకరించడం ద్వారా జనజీవన స్రవంతిలోకి చేరతాం. అప్పటివరకు, మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించి భద్రతా కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయాలని అభ్యర్థిస్తున్నాం. వచ్చే నెలలో ఈ మొత్తం ప్రక్రియను శాంతియుతంగా పూర్తి చేయడంలో మద్దతును అందించే రాష్ట్ర ప్రభుత్వానికి మా ఆయుధాలను అప్పగించాలనుకుంటున్నాం. భద్రతా దళాలు ఆ తేదీ వరకు కార్యకలాపాలను నిలిపివేసి ఎన్‌కౌంటర్ వంటి ఘటనలకు పాల్పడకుండా ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఈ ప్రక్రియ సుఖాంతమయ్యే వరకు మన సహచరులందరూ తమ కార్యకలాపాలన్నింటినీ నిలిపివేయాలి. సోను దాదా, సతీశ్ దాదా కూడా మా ఆందోళనలను మూడు రాష్ట్రాల ప్రభుత్వాలకు తెలియజేయాలని, వారి పూర్తి మద్దతును ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాం'అని అనంత్ లేఖలో పేర్కొన్నారు.

ఎంఎంసీ అధికార ప్రతినిధి అనంత్

మహారాష్ట్రలో లొంగుబాటు

అజ్ఞాత జీవితం వదిలేస్తామని వరుసగా లేఖలు విడుదల చేస్తూ వచ్చిన ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ శుక్రవారం లొంగిపోయింది. ఎంఎంసీ అధికార ప్రతినిధి అనంత్‌తోపాటు మరో 11మంది మావోయిస్టులు మహారాష్ట్రలో అడవిని వీడి గోండియా పోలీసుల ఎదుట లొంగిపోయారు. నిర్బంధం పెరగడంతోనే అడవిని వీడాల్సి వస్తోందని అనంత్ చెప్పారు. హిడ్మా తర్వాత ఛత్తీస్‌గఢ్ నుంచి సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఎదిగిన రణ్‌ధీర్ ఇంకా అడవిలోనే ఉన్నాడని, వారు కూడా అజ్ఞాతం వీడాలని అనంత్ కోరారు.

చైతూ సహా 10 మంది లొంగుబాటు

చర్ల/దుమ్ముగూడెం: దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన ముఖ్య నేతతో పాటు మరో 10 మంది ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జగ్దల్‌పూర్‌లో శుక్రవారం లొంగిపోయారు. రూ.25 లక్షల నగదు రివార్డు కలిగిన మావోయిస్టు ముఖ్య నేత, డీకేఎస్‌జెడ్‌సీ మెంబర్ చైతూ అలియాస్ శ్యాందాదా, రూ.8 లక్షల రివార్డు కలిగిన డీవీసీ ఎం సరోజ్‌తో పాటు మరో 8మంది లొంగిపోయారు. వీరిపై ఉన్న రూ.65 లక్షల రివార్డు వారికే ఇస్తామని ఐజీ తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ పోలీసుల జల్లెడ?

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతా దళాలు ఛత్తీస్‌గఢ్‌తోపాటు రాష్ట్రంలోనూ జల్లెడపడుతున్నట్లు సమాచారం. మావోయిస్టులకు ఆ ప్రాంతం సురక్షితమైంది కాకపోవడంతో ఇటీవల ఏపీకి వచ్చి తల దాచుకున్న విషయం తెలిసిందే. చివరకు పోలీసుల దాడుల్లో పదుల సంఖ్యలో పట్టుబడ్డారు. ఈ కోవలోనే నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలానికి మావోయిస్టులు వచ్చారని స్థానికంగా చర్చనీయాంశమైంది. రెక్కీ నిర్వహించేందుకే వచ్చారనే చర్చ జరుగుతోంది. నందిపాడు-తిమ్మనాయినపేట మధ్యలో పవర్‌గ్రిడ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న వారిలో మావోయిస్టులు ఉండి ఉంటారని అనుమానిస్తున్నారు. ఓబులేసు కోన కొండపై గాలిమరలు ఏర్పాటయ్యాయి. అక్కడ దట్టమైన అడవిని తలపించే పరిసరాలు ఉండడంతోసేఫ్‌జోన్‌గా భావించి మావోయిస్టులు వచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు.

ఏపీని దృష్టిలో పెట్టుకుని పాలసీలు

- బ్యాంకర్లకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సూచన
- వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా చర్యలు తీసుకోవాలి
- ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజీలకూ సహకరించాలి
- అమరావతిలో వివిధ బ్యాంకుల కార్యాలయాలకు శంకుస్థాపన

సాక్షి, అమరావతి/తాడికొండ: వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌ను దృష్టిలో పెట్టుకుని వినూత్న పాలసీలు అమలు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకర్లకు సూచించారు. రాజధానిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల రాష్ట్ర ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి సీఎం చంద్రబాబుతో కలిసి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ బ్యాంకులు అంటే భవనాలు నిర్మిస్తే సరిపోదని, కేవలం కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలకే పరిమితం కారాదని సూచించారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేలా నూతన పాలసీలు రూపొందించి అమలు చేయాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజీ వంటి పరిశ్రమలకు రుణాలు ఇవ్వాలని చెప్పారు. పూర్వోదయ పథకం కింద రాయలసీమ జిల్లాల అభివృద్ధికి రాష్ట్ర ప్రణాళికలు అద్భుతంగా ఉన్నాయన్నారు. మహారాష్ట్ర నుంచి అరటి, తమిళనాడు నుంచి కొబ్బరి ముంబై, ఢిల్లీ లాంటి ప్రాంతాలకు రైళ్లలో తరలుతున్నాయని.. అదే తరహాలో రాయలసీమతోపాటు మిగిలిన జిల్లాల్లో రైతులు పండించే పండ్లు, కూరగాయలు, ఉద్యాన ఉత్పత్తులు సైతం తరలించేందుకు బ్యాంకర్లు సహకరించాలని చెప్పారు. రాజధాని అభివృద్ధికి కేంద్ర సహకారం ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్లానెటోరియం, తదితర సైన్స్ ప్రాజెక్టులు నెలకొల్పాలని సూచించారు.

శిలాఫలకం ఆవిష్కరించిన నిర్మలా సీతారామన్. పక్కన చంద్రబాబు తదితరులు

ఆర్థిక కేంద్రంగా అమరావతి: సీఎం

రైతుల త్యాగం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి అభివృద్ధి సాధిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. రూ.1,334 కోట్లతో అమరావతిలో 13 ప్రభుత్వ రంగ బ్యాంకులు, రెండు బీమా సంస్థల రాష్ట్ర ప్రధాన కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయని, వీటి ద్వారా 6,556 మందికి ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు చెప్పారు. రాజధాని పునర్నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయించినందుకు నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. 2028 నాటికి అమరావతి ఒక స్థాయికి వస్తుందని, 2027కి పోలవరం పూర్తవుతుందని చెప్పారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేస్తే రాష్ట్రం మొత్తం సస్యశ్యామలం అవుతుందని, ఇందుకు కేంద్రం సహకరించాలని కోరారు. రాజధాని నిర్మాణానికి 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూమి ఇచ్చిన నేపథ్యంలో క్యాపిటల్ గెయిన్స్ గడువును మరికొంత కాలం పొడిగించాలని కేంద్రాన్ని కోరారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, నారాయణ, పయ్యావుల, కందుల దుర్గేష్ పాల్గొన్నారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కాస్మోస్ ప్లానెటోరియం నిర్మించడానికి నిర్మలా సీతారామన్, చంద్రబాబు సమక్షంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ సంస్థ–సీఆర్‌డీఏ ఎంవోయూ చేసుకున్నాయి. దీని నిర్మాణానికి 5 ఎకరాల భూమిని కేటాయించారు.

సుదర్శన చక్రతో శత్రు నాశనం

ముఖ్యమైన ప్రాంతాలకు బలమైన రక్షణ కవచం

- బెదిరింపులు, దాడులకు నవ భారత్ లొంగదు
- దేశ ప్రజల రక్షణ కోసం ఎంతదూరమైనా వెళ్తాం
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- ఉడుపిలో 'లక్ష కంఠ గీతా పారాయణం'లో పాల్గొన్న మోదీ



ఉడుపి/యశవంతపుర: దేశ రక్షణ పట్ల ప్రభుత్వ సంకల్పాన్ని ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రజలంతా ప్రత్యక్షంగా చూశారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఎర్రకోట నుంచి శ్రీకృష్ణుడి సందేశాన్ని వినిపించామని తెలిపారు. శత్రువులను నాశనం చేయడానికి 'మిషన్ సుదర్శన చక్ర'ను ప్రకటించామని గుర్తుచేశారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా కీలకమైన ప్రాంతాలు, పారిశ్రామికవాడలకు బలమైన రక్షణ కవచం ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. ప్రధాని మోదీ శుక్రవారం కర్ణాటకలోని ఉడుపి పట్టణంలో పర్యటించారు. ఉడుపి శ్రీకృష్ణ మఠం ఆధ్వర్యంలో 'లక్ష కంఠ గీతా పారాయణం'లో పాల్గొన్నారు. లక్ష మందికిపైగా భక్తులతో కలిసి భగవద్గీత పారాయణం చేశారు. 18 శ్లోకాలను పఠించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మన దేశంలో గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వాలు నిశ్శబ్దంగా ఉండిపోయాయని, ప్రతిదాడులు చేయడానికి సంకోచించాయని ఆక్షేపించారు. కానీ, ఇప్పటి నవ భారతదేశం ఒత్తిళ్లు, బెదిరింపులు, దాడులకు ఎంతమాత్రం లొంగబోదని తేల్చిచెప్పారు. ప్రజల రక్షణ కోసం ప్రభుత్వం ఎంతదూరమైనా వెళ్తుందని ఉద్ఘాటించారు. దేశ భద్రతే తమకు ముఖ్యమని పేర్కొన్నారు. ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉన్నట్లు వ్యాఖ్యానించారు.

పథకాలకు భగవద్గీత బోధనలే పునాది

''శాంతి, సత్యం కోసం ఎల్లప్పుడూ కృషి చేయాలని భగవద్గీత బోధిస్తోంది. అదేసమయంలో దుష్టులు, దుర్మార్గులను అంతం చేయాలని చెబుతోంది. వసుధైక కుటుంబం అనే సూత్రాన్ని విశ్వసిస్తున్నాం. ధర్మో రక్షిత రక్షితః అని పఠిస్తున్నాం. పహల్గాంలో మన పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ముష్కరులపై యుద్ధం చేశాం. వారికి తగిన గుణపాఠం నేర్పించాం. మన నిత్య జీవితంలో భగవద్గీత పాత్ర ఎంతో ఉంది. గీత బోధనలు ప్రతి తరానికీ వర్తిస్తాయి. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం జాతీయ విధానాల రూపకల్పనలో భగవద్గీత దిశానిర్దేశం చేస్తూనే ఉంది. జనం బాగు కోసం పనిచేయాలని గీతలో శ్రీకృష్ణుడు పిలుపునిచ్చాడు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్.. సర్వజన హితాయ నినాదాలకు భగవద్గీత శ్లోకాలే స్ఫూర్తి. ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన వంటి ప్రజా సంక్షేమ పథకాలకు పునాది భగవద్గీత బోధనలే. భగవద్గీత చూపిన మార్గంలో నడుస్తూ మహిళల భద్రత, సాధికారత కోసం నారీశక్తి వందన్ అధినియం తీసుకొచ్చాం'' అని ప్రధాని మోదీ వివరించారు.

తొమ్మిది ప్రతిజ్ఞలు

వికసిత్ భారత్, నవ్య భారత్ కోసం తొమ్మిది ప్రతిజ్ఞలు చేయాలని ప్రధాని మోదీ ఉడుపి శ్రీకృష్ణుడి ఆలయం నుంచి దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. అవి ఏమిటంటే..

- మాతృమూర్తి పేరిట ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి.
- నదులు, చెరువులు, ఇతర జల వనరులను కాపాడుకోవాలి. జల సంరక్షణే మన ధ్యేయం కావాలి.
- కనీసం ఒక నిరుపేద జీవితాన్ని మెరుగుపర్చడానికి కృషి చేయాలి.
- బాధ్యత కలిగిన దేశ పౌరులుగా స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేసి, ఉపయోగించుకోవాలి. 'వోకల్ ఫర్ లోకల్' అనేది మన నినాదం కావాలి. 'ఆత్మనిర్భర్ భారత్' సాధనకు తోడ్పాటునందించాలి.
- పర్యావరణహితమైన సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి.
- ఆరోగ్యాన్నిచ్చే తృణధాన్యాలను మన ఆహారంలో భాగంగా చేసుకోవాలి. వంట నూనెల వినియోగం తగ్గించుకోవాలి.
- నిత్యం యోగాసనాలు సాధన చేయాలి. తద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి.
- మన ప్రాచీన గ్రంథాలు, రాత ప్రతులను పరిరక్షించుకోవాలి.
- భారతీయ సాంస్కృతిక వారసత్వానికి సంబంధించి కనీసం 25 క్షేత్రాలు, కట్టడాలను సందర్శించాలి.

శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఉడుపి పట్టణంలో ప్రధాని మోదీ తొలుత రోడ్డు షోలో పాల్గొన్నారు. రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన ప్రజలకు అభివాదం చేశారు. తనపై చల్లిన పూలను తిరిగి జనంపై చల్లారు. అనంతరం శ్రీకృష్ణుడి ఆలయానికి చేరుకున్నారు. పర్యాయ పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్ర తీర్థ ఆధ్వర్యంలో మోదీకి అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తర్వాత ఆలయ ఆచారం ప్రకారం కిటికీ(కనకన కిండీ) నుంచి శ్రీకృష్ణుడి మూలమూర్తిని ప్రధానమంత్రి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మోదీకి వెండి దారంతో కూడిన తులసి జపమాల, శంకు, చక్ర, గద, పద్మం ముద్రలను బహూకరించారు. మఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామి ప్రధాని మోదీకి 'భారత భాగ్య విధాత' బిరుదునిచ్చి సన్మానించారు. కాశీ కారిడార్ తరహాలో ఉడుపి కారిడార్‌ను అభివృద్ధి చేయాలని మోదీని కోరారు.

కనకదాసకు నివాళులు

ఉడుపిలోని చరిత్రాత్మక కనక మండపాన్ని మోదీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 14వ శతాబ్దానికి చెందిన తత్వవేత్త, కీర్తనకారుడు కనకదాసకు ఘనంగా నివాళులర్పించారు. ఉడుపిలో శ్రీకృష్ణుడు పశ్చిమ ముఖంగా కొలువుదీరడం వెనుక కనకదాస పాత్ర ఉందని భక్తులు విశ్వసిస్తారు. మోదీ ఉడుపి ఆలయాన్ని సందర్శించడం ఇది రెండోసారి. 2008 ఏడాదిలో గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న సమయంలో ఈ ఆలయానికి వచ్చారు.

స్నాన యంత్రం

హ్యూమన్ వాషింగ్ మెషీన్ ఇది

ధర 3 కోట్లు

అధునాతన సాంకేతికత, ఆవిష్కరణలకు నిలయమైన జపాన్‌లో మరో వినూత్న సాధనం రూపుదిద్దుకుని విశ్వవిపణిలోకి అడుగుపెట్టింది. హాయిగా నచ్చిన సంగీతం వింటూ, సినిమా చూస్తూ కేవలం 15 నిమిషాల్లో అత్యంత శుభ్రంగా స్నానం పూర్తిచేయాలనుకునే వారి కోసం 'ఏ సైన్స్ కో' సంస్థ ప్రపంచంలోనే తొలిసారిగా మానవ వాషింగ్ మెషీన్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇటీవల ఒసాకా నగరంలో 'ఎక్స్‌పో–2025'లోనూ దీని నమూనాను ప్రదర్శించగా ఇప్పుడిది మార్కెట్లోకి వచ్చింది. దీని ధర మూడు కోట్ల రూపాయలు.

కష్టపడకుండా చక్కటి స్నానం

ఎలాంటి ఇబ్బంది లేకుండా హాయిగా స్నానం కానిచ్చేలా ఈ వాషింగ్ మెషీన్‌ను డిజైన్‌చేశారు. చూడ్డానికి యుద్ధవిమాన కాక్‌పిట్‌లాగా తోచినా ఇది వాస్తవానికి పారదర్శక పదార్థంతో చేసిన ఒక పాడ్. 2.3 మీటర్ల పొడవైన ఈ పాడ్‌లో తల కాస్తంత ఎత్తులో ఉండేట్లు పడుకున్నాక పైన మూత మూసుకుంటుంది. సగం వరకు గోరువెచ్చని స్వచ్ఛమైన నీరు నిండాక అత్యంత వేగంతో నీరు శరీరమంతా చిమ్ముతుంది. వేగం ధాటికి చర్మం మీది మట్టి, మృతకణాలు చెల్లాచెదురవుతాయి. ఈ నీటికి బ్యాక్టీరియావంటి హానికారక సూక్ష్మజీవులను చంపేసే ఔషధ గుణముంది. అసౌకర్యంగా అనిపిస్తే మనసును ఆహ్లాదపరచడానికి ఎదురుగా ఎల్‌ఈడీ తెరలు సిద్ధంగా ఉంటాయి. నచ్చిన పాట, సినిమా, సంగీతం వెనువెంటనే వినే ఏర్పాట్లు ఉన్నాయి. శరీర ఉష్ణోగ్రతకు తగ్గట్లు నీటి వేడిశాతం మారుతుంది. తుంపర్లు సైతం తమ వంతు కృషిచేస్తూ స్నానంచేసే వ్యక్తి బడలికను పోగొడతాయి. అత్యంత సూక్ష్మ బుడగలు చర్మం మీది మృతకణాలు, చెడు రసాయనాలు, జిడ్డును మటుమాయం చేస్తాయి. ఈ మొత్తం స్నానపర్వం 15 నిమిషాల్లోనే ముగుస్తుంది. శరీరంలో ఏ భాగంలో ఇంకా మురికి ఉండిపోయిందో అప్పటికప్పుడు తనిఖీచేసే బయోమెట్రిక్ స్కానర్లను సైతం ఈ వాషింగ్ మెషీన్‌లో అమర్చారు. దీంతో అసమగ్రంగా స్నానం కానిచ్చేశామన్న భావన అస్సలు కలగదు.

మూడింటి కలబోత

స్నానం, స్పా, ఆరోగ్య స్కానింగ్.. ఇలా మూడింటి కలబోతగా తయారైన ఈ వాషింగ్ మెషీన్‌కు మిరాయ్ నింజెన్ సెంటకుకీ అని పేరు పెట్టారు. జపనీస్ భాషలో మిరాయ్ అంటే భవిష్యత్తు, నింజెన్ అంటే మనిషి, సెంటకుకీ అంటే శుభ్రపరచడం. పూర్తిస్థాయిలో ఆటోమేటిక్‌గా పనిచేసే వ్యక్తిగత స్నానగదిలా ఇప్పుడిది ఇంటర్నెట్‌లోనూ హల్‌చల్ చేస్తోంది. 3 కోట్లరూపాయలు పెట్టి కొనే వ్యక్తులు ప్రపంచవ్యాప్తంగా పెద్దసంఖ్యలో ఉన్నారని కంపెనీ అధికారప్రతినిధి సచికో మయూకురా చెప్పారు. విలాసవంత రిసార్ట్‌లు, లగ్జరీ హోటళ్లు, రెస్టారెంట్లు, వెల్‌నెస్ సెంటర్లు, సంపన్నులు దీనిని కొనేందుకు అమితాసక్తి కనబరుస్తున్నారని ఆమె వెల్లడించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం

- ప్రజలు ఐక్యంగా ఉంటేనే 'వికసిత్ భారత్' సాధ్యం: మోదీ
- 77 అడుగుల ఎత్తయిన శ్రీరాముడి విగ్రహం ఆవిష్కరణ

పణజి: దేశ ప్రజలంతా ఐక్యంగా ఉంటేనే వికసిత్ భారత్ స్వప్నం సాకారం అవుతుందని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. సమాజమంతా ఒక్కటిగా, అన్ని రంగాలూ భుజంభుజం కలిపి పనిచేస్తే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ఆయన అన్నారు. దేశంలో నేడు సాంస్కృతిక పునరుజ్జీవనం కొనసాగుతోందని మోదీ చెప్పారు. అయోధ్యలో రామమందిరం పునర్నిర్మాణం, కాశీలో విశ్వనాథ్ ధామ్ అభివృద్ధి, ఉజ్జయినిలో మహాకాళ్ మహాలోక్ ఆలయ విస్తరణ వంటి చర్యలు జాతి మేల్కొల్పునకు ప్రతీకలు అని ఆయన వివరించారు. మన సాంస్కృతిక వారసత్వం నూతన శక్తితో ముందుకు పరుగులు తీస్తోందని అన్నారు. భవిష్యత్తు తరాల ప్రజలు వారి మూలాల నుంచి దూరం కాకుండా ఈ పునరుజ్జీవనం స్ఫూర్తినిస్తుందని తెలిపారు. మోదీ శుక్రవారం గోవాలో పర్యటించారు. దక్షిణ గోవాలోని పార్తాగలీలో శ్రీసంస్థాన్ గోకర్ణ జీవోత్తం మఠం 550వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 77 అడుగుల ఎత్తయిన శ్రీరాముడి కంచు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన శ్రీరాముడి విగ్రహం కావడం విశేషం. గుజరాత్‌లో నర్మదా నది తీరాన నెలకొల్పిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని రూపొందించిన శిల్పి రామ్ సుతార్ ఈ విగ్రహాన్ని తయారుచేశారు.

హాంకాంగ్ ఘటనలో 128కి పెరిగిన మరణాలు

- మరో 200 మంది జాడ గల్లంతు
- ఒక్కో అపార్ట్‌మెంట్‌కు వెళ్లి తనిఖీచేస్తున్న అధికారులు
- ఎట్టకేలకు మంటలను ఆర్పేసిన అగ్నిమాపక సిబ్బంది

హాంకాంగ్/బీజింగ్: హాంకాంగ్‌లో నలభై ఏళ్ల క్రితం కట్టిన ఎత్తయిన భవనసముదాయాలను నలువైపులా అగ్నికీలలు చుట్టుముట్టిన ఘటనలో మరణాల సంఖ్య శుక్రవారానికి 128కి పెరిగింది. ఇంకా 200 మంది జాడ తెలీడంలేదని అధికారులు చెప్పారు. పలువురు గాయపడి ఇంకా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒక భవనానికే అంటుకున్న మంటలు ఎలా అంతవేగంగా మరో ఆరు భవనాలకు వ్యాపించయనే అంశం మీదనే దర్యాప్తు అధికారులు ప్రధానంగా దృష్టిసారించారు. బుధవారం మధ్యాహ్నం మొదలైన మంటలను ఎట్టకేలకు శుక్రవారం ఉదయం 10 గంటలకు పూర్తిగా ఆర్పేయగలిగారు. నిప్పులకుప్పగా మారిన బహుళ అంతస్తుల భవనాల అపార్ట్‌మెంట్లలోకి అధికారులు ఒక్కోటిగా తనిఖీలుచేయడం మొదలెట్టారు. దీంతో అగ్ని, పొగ, ఊపిరాడకపోవడం వంటి కారణాలతో చనిపోయిన మరికొంత మంది మృతదేహాలు బహిర్గతమవుతున్నాయి. శుక్రవారానికి మరణాల సంఖ్య 128కి పెరిగిందని, ఈ సంఖ్య మరింత అధికమయ్యే అవకాశముందని హాంకాంగ్ ప్రభుత్వంలో భద్రతాశాఖ కార్యదర్శి క్రిస్ టాంగ్ పింగ్ కుంగ్ చెప్పారు. మరోవైపు భవనాల మరమ్మతు, ఆధునీకరణ పనులతో సంబంధమున్న ఎనిమిది మందిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్‌చేశారు.

పేదల కోసం అర్ధరాత్రి వరకు కోర్టులోనే ఉంటా

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ: నిరుపేద కక్షిదారులకు న్యాయం అందించేందుకు ప్రాధాన్యమిస్తానని, అందుకు అవసరమైతే అర్ధరాత్రి వరకు కోర్టులోనే ఉంటానని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, తదితరులపై తిలక్ సింగ్ దాంగి అనే వ్యక్తి వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఆయన ఈ వ్యాఖ్య చేశారు. ధనికులైన కక్షిదారులు వేసే ఇలాంటి పిటిషన్లను తాను విచారించబోనన్నారు. 'క్యూలో చిట్టచివరి నిలబడిన చిన్న, నిరుపేద కక్షిదారుకు న్యాయం చేసేందుకు నేనిక్కడున్నా. అవసరమైతే వారి కోసం అర్ధరాత్రి వరకు ఇక్కడే కూర్చుంటా' అని ఆయన అన్నారు. ఈ ధర్మాసనంలో సీజేఐతోపాటు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ఉన్నారు.

బ్యాంకు పరిధి కోర్టులోనే చెక్ బౌన్స్ కేసు: సుప్రీం

న్యూఢిల్లీ: చెక్ బౌన్స్ కేసులపై సుప్రీంకోర్టు కీలకమైన స్పష్టత ఇచ్చింది. చెక్ బౌన్స్ కేసును చెల్లించాల్సిన వ్యక్తి బ్యాంకు ఉన్న అధికార పరిధిలోని కోర్టులో మాత్రమే దాఖలు చేయాలని పేర్కొంది. నెగోషియల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం –1881లోని సెక్షన్ 138 ప్రకారం చెక్ బౌన్స్ కేసులను ఏ న్యాయస్థానంలో దాఖలు చేయాలనే దానిపై అనేక వాదనలున్నాయి. బ్యాంకు అకౌంట్‌లో తగిన బ్యాలెన్స్ లేకపోవడంతో బౌన్స్ అయిన చెక్కులను గురించి సెక్షన్ 138లో ఉంది. ఇలాంటి కేసులకు సంబంధించి ట్రాన్స్‌ఫర్ అయిన కొన్ని పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'అక్కౌంట్ పేయీ చెక్కుకు సంబంధించిన వివాదమిది. సెక్షన్ 138 ప్రకారం చెల్లింపుదారు అక్కౌంట్ కలిగిన బ్యాంకు శాఖ అధికార పరిధిలో ఉన్న కోర్టులోనే కేసు నమోదుచేయాలి' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

విమాన ప్రయాణంలో ఇరుముడికి అనుమతి

సాక్షి,న్యూఢిల్లీ: శబరిమల భక్తులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విమానంలో ఇకపై ఇరుముడి సహా ప్రయాణించవచ్చని వెల్లడించింది. అయ్యప్ప మాలధారులు ఇరుముడిని ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఇప్పటి వరకు ఇరుముడిని చెక్–ఇన్ లగేజీగా మాత్రమే అనుమతిస్తున్నారు. దీంతో మాలధారులు అసౌకర్యానికి గురయ్యేవారు. తాజాగా ఈ నిబంధనను సడలించినట్లు శుక్రవారం కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. శబరిమల వెళ్లే స్వాములు విమాన ప్రయాణ సమయంలో తమ పవిత్ర ఇరుముడిని (కొబ్బరికాయతో సహా) ఇప్పుడు చేతి సామానుగా తమతోపాటు విమానం క్యాబిన్‌లోకి తీసుకెళ్లవచ్చని స్పష్టం చేశారు.

వలసలపై ట్రంప్ కన్నెర్ర

- శ్వేతసౌధం వద్ద భద్రతాబలగాలపై కాల్పుల ఘటనతో కఠిన నిర్ణయం
- 44 దేశాల ప్రజలకు అమెరికా తలుపులు మూసేస్తానని ప్రకటన

న్యూయార్క్/వాషింగ్టన్: అగ్రరాజ్యాధినేత అధికారిక నివాసం సమీపంలో గురువారం భద్రతాబలగాలపై అఫ్గాన్ దేశీయుడు జరిపిన కాల్పుల ఘటనపై డొనాల్డ్ ట్రంప్ కన్నెర్రజేశారు. పేద, అంతగా అభివృద్ధి సాధించని దేశాల ప్రజలను వలసదారులుగా అంగీకరించే సంస్కృతికి చరమగీతం పాడుతున్నట్లు శుక్రవారం ప్రకటించారు. శరణార్థులుగా వచ్చి అమెరికా ప్రభుత్వం మీదనే కత్తిదూస్తున్న ఇలాంటి వ్యక్తులకు ఇక ఏమాత్రం ఆశ్రయం కల్పించబోమని ట్రంప్ తెగేసి చెప్పారు. అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని మెట్రోస్టేషన్ సమీపంలో అఫ్గాన్ దేశస్తుడు రహ్మనుల్లా లఖన్‌వాలా గురువారం జరిపిన కాల్పుల్లో గాయపడిన వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డు మహిళా జవాను సారా బెక్‌స్ట్రోమ్(20) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం ప్రాణాలు కోల్పోయారు. ఈ వార్త తెలిశాక ట్రంప్ అనూహ్యంగా 'థర్డ్ వరల్డ్' దేశాలపై వలస నిషేధ కొరడా ఝులిపించారు. ఈ మేరకు శుక్రవారం ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్‌సోషల్‌లో ఒక పోస్ట్‌పెట్టారు. ''సాంకేతికంగా అమెరికా ఎంతో పురోగమిస్తున్నా కాలంచెల్లిన వలసవిధానాల కారణంగా వాటి ప్రయోజనాలను అమెరికన్లు పొందలేపోతున్నారు. జీవనప్రమాణాలు మెరుగుపడట్లేవు. ఈ సమస్య సమసిపోయేలా మూడో ప్రపంచదేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపేస్తా. దీంతో బైడెన్ స్వదస్తూరీతో సంతకాలు చేయకున్నా ఆటోపెన్ విధానంతో సమ్మతి సాధించిన లక్షలాది అక్రమ వలసల పరంపరకు అడ్డుకట్టపడుతుంది. అమెరికా ఆస్తిగా పరిగణించబడని, అమెరికాను ప్రేమించని వాళ్లందరికీ ఫెడరల్ ప్రభుత్వ ప్రయోజనాలు, సబ్సిడీలను రద్దుచేస్తా. వలసదారులుగా వచ్చి పౌరసత్వం పొందాక దేశ ప్రశాంతతకు భంగం కల్గించే వాళ్ల శాశ్వతనివాస హోదాను రద్దుచేస్తా. అనధికార అక్రమ ఆటోపెన్ విధానంలో అనుమతి సాధించిన చట్టవ్యతిరేక జనాభాను భారీగా తగ్గిస్తా. తిరోగమన వలస విధానం మాత్రమే అమెరికా పురోగతికి బాటలు వేయగలదు. ఇకపై అమెరికా వ్యతిరేకులు ఇక్కడ ఉండబోరు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి వర్గీకరణ ప్రకారం ప్రపంచంలోని 44 దేశాలను తక్కువ అభివృద్ధి సాధించిన దేశాలుగా లెక్కిస్తున్నారు. ఈ దేశాల నుంచి వలసలను ట్రంప్ అడ్డుకునే వీలుందనే అంచనాలున్నాయి.

వాళ్ల గ్రీన్‌కార్డ్‌లను పునఃసమీక్షిస్తాం

బైడెన్ హయాంలో అఫ్గాన్ నుంచి వలసదారునిగా వచ్చి ప్రత్యేక కారుణ్య పథకంలో భాగంగా అమెరికాలో నివాసఅనుమతి సాధించిన రహ్మనుల్లా కాల్పులకు తెగబడడంతో ట్రంప్ ప్రభుత్వం అప్రమత్తమైంది. గతంలో వలసదారులుగా వచ్చిన విదేశీయులకు జారీచేసిన గ్రీన్‌కార్డ్‌లను పునఃసమీక్షిస్తామని శుక్రవారం అమెరికా సిటిజెన్‌షిప్, ఇమిగ్రేషన్ సేవలు(యూఎస్‌సీఐఎస్) డైరెక్టర్ జోసెఫ్ ఎలో చెప్పారు. '' మాదేశం, అమెరికన్ల పరిరక్షణే మాకు పరమోన్నతం. గత పాలకుల తప్పిదాలను ఉపేక్షించే పరిస్థితి లేదు. అఫ్గాన్ దేశస్తుల వలస, శరణార్థి అభ్యర్థనల దరఖాస్తులను నవంబర్ 27వ తేదీ నుంచి పక్కనపడేస్తున్నాం. అత్యంత ప్రమాదకర దేశాలైన అఫ్గానిస్తాన్, మయన్మార్, బురుండీ, చాద్, కాంగో రిపబ్లిక్, క్యూబా, ఈక్వెటోరియల్ గినియా, ఎరిత్రియా, హైతీ, ఇరాన్, లావోస్, లిబియా, సియెర్రా లియోన్, సోమాలియా, సూడాన్, టోగో, తుర్క్‌మెనిస్తాన్, వెనిజులా, యెమెన్‌ల నుంచి వచ్చే శరణార్థి అభ్యర్థనల విషయంలో మరింత అప్రమత్తంగా ఉంటాం'' అని ఆయన అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మరోసారి నూతన మార్గదర్శకాలను విడుదలచేశారు.

మొదటి ప్రపంచదేశాలంటే?

ట్రంప్ ప్రకటనతో మొదటి, రెండో, మూడో ప్రపంచదేశాలు ఏమిటి? అనే చర్చ మొదలైంది. ప్రజాస్వామ్యయుత పాలనతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన, అమెరికాతో జట్టుకట్టిన దేశాలను మొదటి ప్రపంచదేశాలు అంటారు. వీటిల్లో ఉత్తర అమెరికా, పశ్చిమ యూరప్ దేశాలతో దక్షిణకొరియా, ఆస్ట్రేలియా, జపాన్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, స్వీడన్, ఐర్లాండ్, ఫిన్లాండ్ ఉన్నాయి.

రెండో ప్రపంచదేశాలంటే?

కమ్యూనిస్ట్–సామ్యవాద దేశాలను రెండో ప్రపంచదేశాలుగా భావిస్తారు. ఆనాటి సోవియట్ రిపబ్లిక్ దేశాలతోపాటు పోలండ్, తూర్పు జర్మనీ, చెకస్లోవేకియా, బాల్కన్స్, చైనా, మంగోలియా, ఉత్తరకొరియా, వియత్నాం, లావోస్, కాంబోడియాలను రెండో ప్రపంచ దేశాలుగా పరిగణిస్తారు.

మూడో ప్రపంచ దేశాలేంటి?

ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికాకు మద్దతు పలికిన పశ్చిమ దేశాలను మొదటి ప్రపంచదేశాలుగా భావించగా, కమ్యూనిస్ట్ భావజాలంతో నిండిన తూర్పు దేశాలను రెండో ప్రపంచ దేశాలు అన్నారు. ఈ కూటములకు మద్దతు పలకకుండా, తటస్థంగా ఉండిపోయిన వాటిని మూడో ప్రపంచదేశాలుగా భావించారు. ఆఫ్రికా, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఆసియా దేశాలు ఈ వర్గంలో ఉన్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా పేద, అంతగా అభివృద్ధి చెందని దేశాలను థర్డ్‌వరల్డ్ కంట్రీస్‌గా లెక్కిస్తున్నారు. ఫ్రాన్స్‌కు చెందిన జనాభా నిపుణుడు ఆల్‌ఫ్రెడ్ సావీ 1952లో తొలిసారిగా 'మూడు ప్రపంచాలు, ఒక్కటే భూమి' పుస్తకంలో ఈ భావనను ప్రతిపాదించారు.

భారత్ ఏ జాబితాలో ఉంది?

సోవియట్ రష్యా పతనం తర్వాత మూడో ప్రపంచదేశాలు అనే భావన మనుగడలో లేదు. తక్కువ అభివృద్ధి సాధించిన దేశాలనే మూడో ప్రపంచదేశాల గాడిన కడుతున్నారు. ఐక్యరాజ్యసమితి జాబితా ప్రకారం ఇందులో 44 దేశాలున్నాయి. ఆఫ్రికా ఖండంలో 32, ఆసియాలోని 8 దేశాలతోపాటు కరేబియన్ దేశం హైతీ, పసిఫిక్ ద్వీపదేశాలు మూడు మొత్తంగా 44 దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. గత భావనల ప్రకారం స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారత్ పేద దేశమే. కానీ ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతూ పెద్ద ఆర్థికశక్తిగా మారింది. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ ఆవిర్భవించింది. ఈ లెక్కన ట్రంప్ చెప్పిన మూడో ప్రపంచ దేశాల జాబితాలో భారత్ లేదనే చెప్పాలి.

మూడింటినీ మోదీ పరిష్కరించారు

నక్సలిజం, ఈశాన్య రాష్ట్రాలు, కశ్మీర్ సమస్యలపై అమిత్ షా వ్యాఖ్య

రాయ్‌పూర్: నక్సలిజంతోపాటు ఈశాన్యరాష్ట్రాల్లో వేర్పాటువాదం, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద సమస్యలను ప్రధాని మోదీ శాశ్వతంగా పరిష్కరించారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో మూడ్రోజులపాటు జరిగే డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ పోలీస్/ఇన్‌స్పెక్టర్స్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ/ఐజీపీ)ల వార్షిక సదస్సులో శుక్రవారం అమిత్ షా పాల్గొని ప్రసంగించారు. ''మాదక ద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాల ముఠాలపై అన్ని వైపుల నుంచి పోలీసులు ముప్పేట దాడులు చేయాలి. మత్తుపదార్థాల అక్రమరవాణా ముఠాలు, నేరగాళ్లకు దేశంలో నిలువనీడలేకుండా చేయాలి. లక్ష్యంపై సాటిలేని గురి, నిఘా, సమర్థవంతమైన ప్రణాళికతో భద్రతా బలగాలు, పోలీసులు దేశంలోని అతివాదం, వేర్పాటువాదం, మత్తు మహమ్మారిల అంతుచూస్తున్నారని అమిత్ షా కొనియాడారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోతో ఇక అన్ని రాష్ట్రాల పోలీస్‌విభాగాలు కలిసి పనిచేస్తూ రాష్ట్ర,దేశ, అంతర్జాతీయ స్థాయిలో చీకటి వ్యాపారంచేస్తున్న డ్రగ్స్ ముఠాల సూత్రాధారులను బంధించి చట్టం ముందు నిలబెట్టాల్సిన తరుణం ఆసన్నమైంది. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ఇండియా వంటి నిషేధిత సంస్థను కూకటివేళ్లతో పెకలించి రాష్ట్ర, కేంద్ర బలగాలు తమ సమిష్టకృషిని అద్భుతంగా చాటాయి. 40 ఏళ్లుగా పట్టిపీడిస్తున్న నక్సలైట్ల దాడి బెడదను తగ్గించేందుకు దేశవ్యాప్తంగా 586 పోలీస్‌స్టేషన్లను శత్రుదుర్భేద్యంగా నిర్మించాం. దేశంలో నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 2014 ఏడాదిలో 126 ఉంటే నేడు ఆ సంఖ్య 11కు దిగివచ్చింది. వచ్చే వార్షిక డీజీపీ/ఐజీపీల సదస్సులోపు దేశంలో నక్సలిజం పూర్తిగా అంతరించిపోతుంది'' అని అమిత్‌షా వ్యాఖ్యానించారు. ఈ నవంబర్ 30న ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగిస్తారు. వికసిత్ భారత్‌లో భాగంగా దేశాన్ని సురక్షితంగా ఉంచే లక్ష్యంతో చేపట్టిన 'సురక్షిత్ భారత్'కు మార్గసూచీని సూచించడంతోపాటు డీజీపీ, ఐజీపీలకు మోదీ ఆరోజు దిశానిర్దేశంచేయనున్నారు. '' వికసిత్ భారత్: భద్రతాంశాలు'' ఇతివృత్తంగా ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవ్యతిరేక చర్యలు, విపత్తు నిర్వహణ, మహిళా భద్రత, పోలీస్ విధుల్లో ఫోరెన్సిక్ శాస్త్రం, కృత్రిమమేధల విస్తృతస్థాయి వినియోగం అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు.

భారత్–రష్యా బంధానికి కొత్త శక్తి!

- వచ్చే నెల 4, 5వ తేదీల్లో పుతిన్ పర్యటన
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక సమావేశం
- కీలక రంగాల్లో ఒప్పందాలు కుదిరే అవకాశం

న్యూఢిల్లీ: రష్యా అధినేత పుతిన్ వచ్చేనెల 4, 5వ తేదీల్లో భారత్‌లో పర్యటించబోతున్నారు. 23వ ఇండియా–రష్యా వార్షిక సదస్సుకు ఆయన హాజరవుతారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమై, ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తారు. మోదీ ఆహ్వానం మేరకు పుతిన్ రాబోతున్నారని భారత విదేశాంగ శాఖ శుక్రవారం వెల్లడించింది. పుతిన్ అధికారిక పర్యటన పట్ల సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. ప్రస్తుత ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక వ్యూహాత్మక సంబంధాల మరింత బలపడడానికి ఈ పర్యటన దోహదపడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, రక్షణ తదితర రంగాల్లో కీలకమైన నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు. పుతిన్–మోదీ భేటీ తర్వాత ఉమ్మడి ప్రకటన విడుదల చేయబోతున్నట్లు సమాచారం. అలాగే కొన్ని ఒప్పందాలపై ఇరుపక్షాలు సంతకాలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి పుతిన్ రాకతో భారత్–రష్యా బంధానికి నూతన శక్తి లభించడం తథ్యమని అంటున్నారు.

ముడి చమురుపై అదనపు డిస్కౌంట్లు?

స్థానిక కరెన్సీల్లో వాణిజ్య లావాదేవీలను మరింత ముందుకు తీసుకెళ్లడం, ఇంధన రంగంలో సహకారం, రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకోవడం వంటి అంశాలపై పుతిన్, మోదీ చర్చించబోతున్నారు. పౌర అణు ఇంధన రంగంలో సహకారంపైనా సంప్రదింపులు జరుగనున్నాయి. అంతేకాకుండా రెండు దేశాల మధ్య సంబంధ బాంధవ్యాల్లో పురోగతిని వారు సమీక్షిస్తారు. ఇరుదేశాల ఉమ్మడి ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకుంటారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రష్యా అధ్యక్షుడి గౌరవార్థం ప్రత్యేక విందు ఇవ్వబోతున్నారు. మరోవైపు రష్యా నుంచి అత్యాధునిక ఆయుధాల కొనుగోలుపై భారత్ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఉపరితలం నుంచి గాల్లోకి ప్రయోగించే ఎస్–400 మిస్సైల్ వ్యవస్థలను అదనంగా కొనుగోలు చేయడంపై పుతిన్‌పై చర్చించనున్నట్లు సమాచారం. భారత్‌కు పుతిన్ శుభవార్త చెప్పే అవకాశాలు కూడా లేకపోలేదు. ముడి చమురుపై అదనపు డిస్కౌంట్లను ఆయన ప్రకటించే వీలుందని అంచనా వేస్తున్నారు. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇటీవలి కాలంలో రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు కొంత తగ్గుముఖం పట్టాయి. చమురు ఎగుమతులను భారీగా పెంచాలని పుతిన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. పుతిన్ చివరిసారిగా 2021లో ఇండియాలో పర్యటించారు. గత ఏడాది జూలైలో ప్రధాని మోదీ రష్యాలో పర్యటించి, పుతిన్‌తో భేటీ అయ్యారు. భారత్–అమెరికా సంబంధాలు గత రెండు దశాబ్దాల్లో ఏనాడూ లేనంతగా బలహీనపడిన సమయంలో పుతిన్ భారత్ పర్యటనకు వస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సాక్షి
గుంటూరు
శనివారం । 29 । నవంబర్ । 2025

వీవీ ప్యాట్స్ తనిఖీ

ఫిరంగిపురం: రేపూడి వ్యవసాయ మార్కెట్‌లో భద్రపరిచిన ఈవీఎం, వీవీ ప్యాట్స్‌ను ఆర్డీవో శ్రీనివాసరావు శుక్రవారం తనిఖీ చేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2900 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2000 క్యూసెక్కులు వదులుతున్నారు. నీటి నిల్వ 42.1600 టీఎంసీలు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 581.50 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 48,929 క్యూసెక్కుల వచ్చి చేరుతోంది.

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో కాలభైరవస్వామికి పూజలు

అమరావతి: అమరావతిలోని అమరేశ్వరాలయంలో కాలభైరవస్వామి సందర్భంగా దేవాలయంలోని కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారికి భక్తుల సమక్షంలో అర్చకులు కైతేపల్లి సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం ఏడుగంటలకు అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమరేశ్వరాలయానికి చేరుకుని రెండో ప్రాకారంలో ఉన్న కాలభైరవస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం అమరేశ్వరున్ని దర్శించుకున్నారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

44 ఏళ్ల వ్యాజ్యంలో తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి

తెనాలి రూరల్: 44 ఏళ్ల క్రితం నాటి సివిల్ వ్యాజ్యంలో న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. గుంటూరు జిల్లా తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 1981 సంవత్సరానికి సంబంధించిన పార్టిషన్ పిటిషన్ (ఓ.ఎస్ నెంబరు 135/1981) పెండింగ్‌లో ఉంది. దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన సూరపనేని సూరయ్య తనకు వారసత్వంగా ఉన్న ఆస్తిలో హక్కు ఉందంటూ 1981లో కోర్టును ఆశ్రయించారు. ప్రతి వాదిగా సూర పనేని వెంకయ్య ఉన్నారు. వాది, ప్రతివాది, వీరి 1981లో పెట్టుకున్న న్యాయవాదులూ మృతి చెందారు. వీరి తరఫున వారసులు కేసును కొనసాగిస్తూ వచ్చారు. తెనాలి న్యాయ చరిత్రలోనే అత్యంత ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉన్న ఈ కేసును శుక్రవారం విచారించిన న్యాయమూర్తి ఎం. శ్రీధర్. సూరయ్యకు అనుకూలంగా తీర్పు చెప్పారు. సూరయ్య తరఫున మాదినేని రాంప్రసాద్ వాదించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ మహోత్సవం

[illegible] మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తోన్న పడిపూజ శుక్రవారం తెల్లవారుజామున ముగిసింది. శబరిమల ఆచారం ప్రకారం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గురుస్వామి ఏ.శ్రీనివాసన్ నాయర్ నేతృత్వంలో పూజలు చేపట్టగా, సంతోష్ స్వామి బృందం అయ్యప్ప, భవానీ పూజలను భక్తితో నిర్వహించారు. వందలాది మంది భక్తులకు పూజ కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. పడిపూజ మహోత్సవంలో సీనియర్ వైద్యులు ఆర్.మురళీబాబూరావు, బీవీ.సుధీర్‌బాబు, వంశీకృష్ణ, శ్రీబాలాజీ డయాగ్నోస్టిక్స్ నిర్వాహకులు ఆనం సంజీవరెడ్డి, బాలాజీ, వైద్యులు ఆనం గోపాల్‌రెడ్డి, నర్సింహారావు, లక్ష్మీరెడ్డి, రెడ్డి అంకమ్మరెడ్డి, ఆనం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సరస్వతీ దేవాలయం నిర్మాణ పనులకు అంకురార్పణ

తెనాలి: పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులో సువర్ణభారతి క్షేత్ర సరస్వతీ దేవాలయ నిర్మాణ పనులకు శుక్రవారం అంకురార్పణ చేశారు. నీటిపంపు వేయటం ద్వారా గంగ పూజతో పనులను అక్కడ ఆరంభించారు. మహిళలతో లలితా సహస్ర పారాయణం, విష్ణుసహస్ర పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం చేయించారు. భక్తులచే ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో శ్రీసాలగ్రామ మఠం ట్రస్ట్ సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుల రమణయ్య, గోప్ప రామకృష్ణ, రావూరి సుబ్బారావు, గోదావర్తి సాయి హరేరామ్, మాజేటి గోపి పాల్గొన్నారు.

పేరుకే కొనుగోలు కేంద్రాలు

- నత్తను తలపిస్తున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ
- చేసేది లేక తక్కువ ధరకు అమ్ముకుంటున్న రైతులు
- 5,020 టన్నులు లక్ష్యం కాగా.. కొన్నది 217 టన్నులే
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి, పార్టీ ముఖ్య నేతలు
- క్షేత్రస్థాయిలో అన్నదాతల సమస్యలను తెలుసుకున్న నాయకులు

తూములూరు గ్రామంలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే శివకుమార్, సమన్వయకర్తలు

కొల్లిపర: గుంటూరు జిల్లాలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు సక్రమంగా జరగటం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. రైతులను ఆదుకోవటంలో పౌరసరఫరాల శాఖ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ధాన్యం అమ్మకాలకు రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో జిల్లా పార్టీ తెనాలి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు అంబటి మురళి, దొంతిరెడ్డి వేమారెడ్డి, నూరి ఫాతిమా, బలసాని కిరణ్ కుమార్, డైమండ్ బాబులతో కలిసి శుక్రవారం సాయంత్రం అంబటి కొల్లిపర మండలానికి వచ్చారు. స్థానిక నాయకులతో కలిసి తూములూరు, దావులూరు గ్రామాల్లో పర్యటించారు. ఆరబోసిన ధాన్యం రాశులను పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దావులూరు గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో ఇప్పటి వరకు జరిగిన కొనుగోళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎప్పటికి కొంటారు?

అనంతరం అంబటి మాట్లాడుతూ నిన్నటి వరకు అకాల వర్షాలు, తుఫాన్ కారణంగా ప్రతి సంవత్సరం కన్నా ధాన్యం దిగుబడి తగ్గి రైతులకు నష్టం జరిగిందన్నారు. దావులూరు కొనుగోలు కేంద్రంలో 5,020 టన్నుల ధాన్యం లక్ష్యం కాగా, తొమ్మిది రోజుల్లో కేవలం 217 టన్నులను 36 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారని చెప్పారు. కొనుగోళ్లు ఇలా సాగితే రైతుల దగ్గరున్న ధాన్యాన్ని ఎప్పటికి కొంటారని ప్రశ్నించారు. తేమ 17 శాతం కన్నా తక్కువ ఉంటే కొంటామని చెప్పటంతో రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని రోడ్లు, డొంకలు, ఖాళీస్థలాల్లో ఆరబోస్తున్నారని చెప్పారు. మట్టి గెడ్డలు, చెత్తపరకల తొలగింపు కోసం అదనంగా కూలీలతో జల్లిస్తున్నారని తెలిపారు. ఇంతా చేసి కేంద్రానికి ధాన్యం తీసుకెళితే, తేమ 17 శాతం కన్నా తక్కువ ఉన్న వాటిని లోడ్ చేసి మిల్లర్లకు పంపించగానే అక్కడ తేమ 20 శాతంగా ఉందంటున్నారని రాంబాబు అన్నారు. దీంతో చేసేదిలేక మిల్లర్లు చెప్పిన విధంగా బస్తాకు 4, 5 కిలోల తరుగు తీసి అమ్ముకుంటున్నట్టు రైతులు చెప్పారని తెలిపారు. గోతాలు, లారీలు సక్రమంగా అందకపోవటం, జీపీఎస్ పనిచేయక జాప్యం జరుగుతోందన్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ–క్రాప్ చేయని రైతుల నుంచి మధ్యవర్తులు 75 కిలోల బస్తాకు కేవలం రూ.1,200 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి రైతుకు ఈ–క్రాప్ నమోదు, బీమా చేసినట్టు గుర్తుచేశారు.

యాదవపాలెం వద్ద మట్టి గెడ్డలను జల్లిస్తున్న రైతుల సమస్యలు తెలుసుకుంటున్న నేతలు

కోతలు పూర్తవుతున్నా నిర్లక్ష్యం

తెనాలి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ మండలంలో 60 శాతం వరి కోతలు జరిగినప్పటికీ దావులూరు కొనుగోలు కేంద్రం ద్వారా 217 టన్నులే కొనుగోలు చేశారన్నారు. 4 రోజుల్లో మిగతా కోతలు పూర్తి కానున్నాయని గుర్తుచేశారు. సేకరణ ఇదే విధంగా కొనసాగితే కోతలు పూర్తయ్యేసరికే పావు వంతు కూడా ధాన్యం కొనుగోలు చేయలేక పోవచ్చునని అన్నారు. పార్టీ మండల రైతు అధ్యక్షుడు అవుతు సాంబిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి, పల్లె మధుసూదన రావు, ఈమని హరికోటిరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, బద్దిగం శ్రీనివాసరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, అవుతు పోతిరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, పిల్లి గంగాధర్, సుజాత, వంగా సుధాకర్‌రెడ్డి, మొర్ల శ్రీను, ఈద హర్షవర్ధన్‌రెడ్డి, ఉత్తేజ్‌రెడ్డి, కొల్లి రాఘవరెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, చెంచల రామిరెడ్డి, కళ్ళం వీరారెడ్డి, జొన్నల శివారెడ్డి, ఎ.కృష్ణారెడ్డి, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఒక రైతు పొలంలో తెల్లనల్లి ప్రభావం.. మరో రైతు నాటిన పైరులో ఇప్పుడిప్పుడే కనిపిస్తున్న పేనుబంక.. ఇంకో రైతు వేసిన మిర్చి చేనులో కొమ్మకుళ్లు తెగులు సోకే సూచనలు.. మరొకరి పంటలో తెల్లదోమ లక్షణాలు.. ఇప్పటికే కమ్మేసిన బొబ్బర తెగులు.. ఇలా ఒక్కో రైతుదీ ఒక్కో ఆందోళన. సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన హార్టికల్చర్ అధికారులు కంటికి కనిపించడం లేదు. ఫలితంగా తెగుళ్ల బారిన పడిన మిర్చి పంటను రైతులు పీకేస్తున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని వాపోతున్నారు.

ఉద్యానం... అధ్వానం

- అస్తవ్యస్తంగా ఉద్యాన శాఖ పనితీరు
- ఐదు మండలాలకు ఒక్కరే హార్టికల్చర్ అధికారి
- తెగుళ్ల బారిన మిర్చి పంట
- దిక్కుతోచని స్థితిలో పంటను పీకేస్తున్న రైతులు
- సలహాలు, సూచనలు ఇచ్చే వారే కరువు
- హెచ్‌వోల కొరతతో పత్తా లేని ఉద్యాన శాఖ అధికారులు

ప్రత్తిపాడులో బొబ్బర తెగులు సోకడంతో మిర్చి పంటను పీకేస్తున్న రైతులు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో ఉద్యాన శాఖ పనితీరు అధ్వానంగా మారింది. ఇక్కడ ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లోని రైతులు ఉద్యాన పంటలైన మిరప, బొప్పాయి, పూలతోటలు, కూరగాయలు సాగు చేశారు. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో వీచిన ఈదురుగాలులకు పంటలు నేలవాలి దెబ్బతిన్నాయి. మిరప నీట మునిగింది. ఎలాగోలా సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను ఓ దారికి తెచ్చుకోగలిగారు. కానీ ప్రస్తుతం మిర్చి పంటను తెగుళ్ల ఆశిస్తున్నాయి. ఇప్పటికే బొబ్బర తెగులు పంటను కబళించింది. మొక్కలు వాడిపోయి, ఆకులు ముడుచుకుపోయాయి. పూత రాలిపోతోంది. కొన్ని సందర్భాల్లో అసలు పూత రావడం లేదు. ఈ నేపథ్యంలో దిగుబడి ఎలాగూ రాదని భావించి రైతులు పంటను పీకేస్తున్నారు.

ఒక్కరే అధికారి..

ఐదు మండలాలకు ఒక్క చోట కూడా తుపానుకు ముందు వరకు ఉద్యాన శాఖ అధికారులు లేరు. రైతులకు విపత్తు వేళ మాట సాయం కూడా కరువైంది. సలహాలు, సూచనలు ఇచ్చి పంటను ఎలా కాపాడుకోవాలో చెప్పే దిక్కులేకుండా పోవడంతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

తుపాను తరువాత ఓ హార్టికల్చర్ అధికారిని గుంటూరుకు డెప్యూటేషన్‌పై తీసుకువచ్చారు. ఆయన రాక కూడా చుట్టం చూపుగానే ఉండటంతో రైతులకు మాట సాయం కరువైంది. మండలాలవారీగా చూస్తే ప్రత్తిపాడులో 352, పెదనందిపాడులో 187, వట్టిచెరుకూరులో 421, కాకుమానులో 11 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. మరికొన్ని ఎకరాల్లో కూరగాయలు, పూలతోటలు కూడా సాగులో ఉన్నాయి.

హెచ్‌వోల కొరత

ఉద్యాన శాఖ సస్యరక్షణపై రైతులను చైతన్య పరచాలి. తెగుళ్లను నివారించడానికి, పైరు నిలదొక్కుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పాలి. క్షేత్ర పర్యటనలు చేసి పరిస్థితులను అంచనా వేయాలి. కానీ హార్టికల్చర్ అసిస్టెంట్ల కొరతతో ఇవేమీ జరగడం లేదు.

రైతులకు సలహాలు ఇస్తున్నాం

హార్టికల్చర్ అసిస్టెంట్ల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. తాజాగా ప్రభుత్వం గుంటూరు రూరల్‌కు ఒక హెచ్‌వోను డెప్యూటేషన్‌పై నియమించింది. క్షేత్ర పర్యటనలు నిర్వహించి మిర్చి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– బి.రవీంద్రబాబు, డీడీ, ఉద్యాన శాఖ, గుంటూరు జిల్లా

కూరగాయల దుకాణం

చుక్కల్లో చిక్కుడు ధర

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- హడలిపోతున్న వినియోగదారులు
- సామాన్యులకు తప్పని అదనపు భారం

తాడేపల్లి రూరల్: ధరలు ఒక్కసారిగా పెరగడంతో కూరగాయలు కొనాలంటేనే వినియోగదారులు హడలిపోతున్నారు. సాధారణంగా చలికాలం వచ్చిందంటే దాదాపుగా అన్ని రకాల కూరగాయల ధరలు అదుపులో ఉంటాయి. చిక్కుడు ధర కచ్చితంగా తగ్గుతుంది. కానీ ఇప్పుడు అదే మిగతా వాటి కంటే ఎక్కువ పలుకుతోంది. నాటువి కిలో రూ. 120 ఉండగా, మిగిలిన కూరగాయలు కూడా రూ.50కిపైనే అమ్ముతున్నారు. కొనాలంటేనే సామాన్యులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఎండలకు కూరగాయల దిగుబడి బాగా తగ్గడం, నీరు లేక పంటలు దెబ్బతినడంతో ఇప్పుడు సరఫరా తగ్గిందని విక్రయదారులు చెబుతున్నారు. అన్ని కూరగాయల ధరలు కిలోకు రూ. 25 నుంచి రూ. 35 వరకు పెరిగాయి. ముఖ్యంగా ఉల్లి, టమోటా, బీట్‌రూట్, బీన్స్, క్యాప్సికం ధరలు అధికంగా ఉన్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

కూరగాయలు	ధర (కిలో)
నాటు చిక్కుడు	120
క్యాప్సికం	100
బీన్స్	90
క్యారెట్	80
బీరకాయ	60
పచ్చిమిర్చి	60
టమాటా	60
బీట్‌రూట్	70
బెండకాయ	50
దోసకాయ	50
దొండకాయ	40
వంకాయ	40
అల్లం	120
వెల్లుల్లి	160

రెట్టింపు కష్టాలు

మూడు వారాల క్రితం టమోటా కిలో రూ.30 ఉంది. ఇప్పుడు రెట్టింపు అయ్యింది. క్యాప్సికం కూడా నెల క్రితం రూ. 40 ఉండగా, ఇప్పుడు రూ.100కు చేరుకుంది. పచ్చిమిర్చి ఇంకా ఘాటుగానే ఉంది. రూ.60 కి విక్రయిస్తున్నారు. బంగాళా దుంప, దొండ, ములక్కాయ, ఆనపకాయలు తదితర కూరగాయలపై రూ. 20 నుంచి రూ.30 వరకు పెరుగుదల కనిపిస్తోంది.

దిగుమతి చేసుకున్నందున..

గతంలో దుకాణానికి సంచి పట్టుకుని వెళితే రూ. 200 పెడితే వారం రోజులకు సరిపడా కూరగాయలు కొనుగోలు చేసుకునేవారు. ఇప్పుడు రూ. 300 నుంచి రూ. 500 వెచ్చిస్తేగానీ కొన్ని రకాలు రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. కూరగాయలకు ఇతర రాష్ట్రాలపై ఆధారపడడం, అక్కడి ధరల పెంపు ప్రభావం సామాన్యులపై పడింది. స్థానికంగా పండించే కూరగాయలు మార్కెట్‌లోకి వచ్చే వరకు ఈ పరిస్థితి తప్పదని వ్యాపారులు చెబుతున్నారు.

పరీక్షలు విద్యార్థులకా... వర్సిటీకా..!

- విశ్వవిద్యాలయానికే పరీక్షగా మారిన పీజీ పరీక్షల లోపాలు
- అన్నీ తెలిసినా చర్యలు తీసుకోని ఉన్నతాధికారులు
- అవకతవకలతో పీజీ ప్రశ్నపత్రాల ముద్రణే విద్యార్థులకు శాపం

పీజీ పరీక్షల నిర్వహణలో గత కొంతకాలంగా జరుగుతున్న తప్పులు చూస్తుంటే బాధ్యత లేని అధికారులు 'విద్యార్థులకు పరీక్షలు పెడుతున్నారా... వర్సిటీకే పరీక్ష పెడుతున్నారా' అనే సందేహం చైతన్యవంతమైన విద్యావంతుల్లో తలెత్తుతోంది. తప్పు చేసి ఒప్పుగా చిత్రీకరించేందుకు ఒకరు ప్రయత్నం చేస్తుంటే... తప్పు అని తెలిసినా మరొకరు చర్యలకు మీనమీషాలు లెక్కిస్తున్నారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

ఏఎన్‌యూ (పెదకాకాని): ఐదు దశాబ్దాలుగా పేరు ప్రఖ్యాతులున్న యూనివర్సిటీలో జరిగే పీజీ పరీక్షల్లో ఒకరోజు చేతితో రాసిన రైటింగ్‌తో ప్రశ్నపత్రాలు ఇస్తే... మరోసారి ఒకే పరీక్షా పేపరులో ఒకే రకమైన మూడు ప్రశ్నలు ఇవ్వడం ఇటీవల చోటుచేసుకుంది. తప్పును సరిదిద్దుకునే దిశగా అడుగులేయడం, పునరావృతం కాకుండా జాగ్రత్త వహించడం సహేతుకమనే చర్చ విద్యావేత్తల్లో జరుగుతోంది. డిగ్రీ పరీక్షలు సజావుగా సంవత్సరాల తరబడి కొనసాగుతున్నపుడు పీజీ పరీక్షల్లోనే పదే పదే తప్పులు ఎందుకు జరుగుతున్నాయో పాలకులు కూడా దృష్టి సారించడం లేదు. ఏది ఏమైనా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు.

ఎన్నో సందేహాలు

పీజీ ప్రశ్నపత్రాలను ఇతర విశ్వవిద్యాలయాలు, విద్యా కేంద్రాలలోని నిష్ణాతులైన ఆచార్యులు రూపొందించి ఇస్తున్నారా? అనే సందేహం తలెత్తుతోంది. మరేదైనా విధానంలో నమూనా ప్రశ్నపత్రాలనే ఇప్పటి పరీక్షా ప్రశ్నపత్రాలుగా మారుస్తున్నారా అని సందేహాలు వస్తున్నాయి. కొన్ని కోర్సులకు సంబంధించిన ప్రశ్నపత్రాలు దాదాపుగా నమూనా ప్రశ్నపత్రాలను పోలి ఉండటం ఈ వాదనకు మరింత బలం చేకూరుస్తోంది. అనుభజ్ఞులైన ఆచార్యులు ప్రశ్నపత్రం రూపొందిస్తే ఇలాంటి తప్పిదాలు జరిగే ఆస్కారం చాలా తక్కువగా ఉంటుందని ఆచార్యులు పేర్కొంటున్నారు. అసలు ప్రశ్నపత్రాలు ఎక్కడ, ఎప్పుడు, ఎవరు ఎలా రూపొందించారు? ఆ విధి నిర్వహణకు, ప్రశ్నపత్రాల రూపకల్పనకు, ప్రశ్నపత్రం రూపొందించిన ఆచార్యునకు ఎంత మొత్తం నగదును ఎవరికి చెల్లించారు? ప్రశ్నపత్రం రూపకల్పనకు అయ్యే ఖర్చుకు సంబంధించిన బిల్లులను ఎవరెవరికి ఇచ్చారు? అనే దిశగా విచారణ జరపాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

దళిత, బడుగు, బలహీన వర్గాలంటే అంత చులకనా?

వర్సిటీలో ఇటీవల ఇక్కడ వసతి గృహంలో ఆహారం పరిశుభ్రంగా లేదని ఓ మహిళా ప్రొఫెసర్ అయినటువంటి చీఫ్ వార్డెన్‌ను అప్పటికప్పుడు వర్సిటీ పాలకులు మార్చారు. విద్యార్థులకు అతి ముఖ్యమైన పరీక్షల నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా తప్పుల మీద తప్పులు జరుగుతున్నా సరిదిద్దుకోని అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వర్సిటీలో చర్చ జరుగుతోంది. మహిళలంటే చిన్నచూపా? దళిత, బడుగు, బలహీన వర్గాల వారిని ఒక రకంగా చూసి నిర్ణయాలు తీసుకుంటున్నారా? అని పక్షపాత వైఖరిపై పలువురు ప్రశ్నిస్తున్నారు.

పరిపాలన మెరుగు పడేనా?

పరిపాలన పరంగా గాడి తప్పుతున్న వర్సిటీపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నూతన వీసీ రాకకు జాప్యం అవుతుందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. గతంలో వర్సిటీ ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులలో ఉన్నప్పుడు ప్రభుత్వం ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ హోదాలో నియమించిన సందర్భాలు సైతం ఉన్నాయని సీనియర్ ఆచార్యులు గుర్తు చేసుకుంటున్నారు. గత 15 నెలలుగా తాత్కాలిక పాలనలో వర్సిటీలో జరిగిన, జరుగుతున్న లోపాలను, పరిపాలనలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించాలంటే ప్రస్తుత పాలనాధికారులను మార్చి గతంలో మాదిరిగా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థులు, సీనియర్ ఆచార్యులు సూచిస్తున్నారు. గతంలో సైతం ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు మంచి ఫలితాలు సాధించారని పలువురు సామాజిక విద్యావేత్తలు గుర్తు చేసుకుంటున్నారు. అనుభవజ్ఞులైన ఐఏఎస్ అధికారులనుగానీ, ఉపకులపతులనుగానీ ఇక్కడ నియమిస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పలువురు విద్యావేత్తలు భావిస్తున్నారు.

కురగల్లు పీఏసీఎస్ సీఈవో రమేష్‌పై కేసు

మంగళగిరి టౌన్: గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లు గ్రామ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)లో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చిన విషయం విదితమే. సొసైటీ సీఈవో రమేష్‌బాబు స్కాంకు పాల్పడిన ఘటనపై కురగల్లు, మంగళగిరి పీఏసీఎస్‌ల చైర్మన్లు శీలం గోపయ్య, గాదె పిచ్చిరెడ్డిలు పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి జీడీసీసీ బ్రాంచ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గోలి సాయిపవన్ ఈ ఘటన వివరాలను వెలుగులోకి తీసుకువచ్చారని, తదనంతరం గుంటూరు బ్రాంచ్ అధికారులు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుంకర శ్రీనివాస్‌ను విచారణ జరపమని ఆదేశాలు జారీ చేశారన్నారు. సుంకర శ్రీనివాస్ అక్టోబర్ 9న విచారణ పూర్తిచేసి నివేదికను గుంటూరు పరిపాలనా అధికార కార్యాలయంలో సమర్పించారని గుర్తుచేశారు. నకిలీ బాండ్లను తయారు చేసి సీఈవో రాయల రమేష్ మోసం చేసినట్లు నిర్ధారణ కావడంతో అక్టోబర్ నెలలో సస్పెండ్ చేశారన్నారు. కురగల్లు పీఏసీఎస్‌లో 72 మంది డిపాజిటర్లు 112 డిపాజిట్లతో రూ. 8,50,93,943 జమ చేయగా.. మంగళగిరి పీఏసీఎస్‌లో 11 మంది డిపాజిటర్లు రూ.1,16,65, 283 జమ చేశారు. వీరికి నకిలీ బాండ్లు ఇచ్చి, రికార్డులను తారుమారు చేసి ఆ నగదును సొంత ప్రయోజనాలకు రమేష్ వాడుకున్నట్లు ఆయా పోలీస్‌స్టేషన్లలో చైర్మన్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ, రూరల్ పోలీసులు వెల్లడించారు.

నగర పాలక సంస్థలో ఆర్ఐ బదిలీ

- కోడెల అల్లుడికి చెందిన హాస్పిటల్, మరో కాంప్లెక్స్‌కు పన్ను తగ్గింపుపై 'సాక్షి'లో కథనం
- పెద్ద తలకాయలను వదిలేసి ఆర్ఐను వేరే కారణంతో బదిలీ చేసిన అధికారులు

కాశయ్య బదిలీ ఉత్తర్వులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు ఇటీవల మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ అల్లుడికి చెందిన ఓ హాస్పిటల్‌కి రూ.లక్షల్లో పన్ను తగ్గించారు. దీంతోపాటు లాలాపేటలోని ఓ కమర్షియల్ కాంప్లెక్స్‌కూ పన్ను తగ్గించడంపై 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం 'కోడెల అల్లుడికి కార్పొరేషన్ నజరానా' పేరిట కథనం ప్రచురితమైంది. హాస్పిటల్ విషయంలో రివిజన్ పిటిషన్ ఫైల్ చూసిన ఆర్ఐ సుబ్బారావు ఇప్పటికే నగరపాలక సంస్థకు చెందిన గాంధీ పార్కు నగదును సొంతానికి వాడుకున్నట్లు రుజువు కావడంతో కొద్ది రోజుల క్రితమే సస్పెండ్ అయ్యారు. లాలాపేటలో కమర్షియల్ కాంప్లెక్స్‌కు పన్ను తగ్గింపు విషయంలో రివిజన్ పిటిషన్ ఫైల్‌ను ఆర్ఐ కాశయ్య చూశారు. శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా, కాశయ్యను టౌన్ ప్లానింగ్ సెక్షన్ జీ4కు బదిలీ చేస్తూ ఆర్డర్ ఇచ్చారు. వాస్తవానికి ఆర్ఐ కాశయ్యపై గతంలో కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు రావడంతో అదనపు కమిషనర్ ఈ నెల 7వ తేదీన షోకాజ్ నోటీసు ఇచ్చారు. అప్పటి నుంచి కాశయ్యను మార్చని అధికారులు... ఇప్పుడు అకస్మాత్తుగా బదిలీ చేయడం గమనార్హం. బదిలీకి కారణం ఈ ఫిర్యాదు అని చెప్పడం గమనించాల్సిన అంశం. సాధారణంగా పన్ను తగ్గించే అంశం అడ్మిన్, ఆర్ఐ, రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో), డిప్యూటీ కమిషనర్ (డీసీ), అదనపు కమిషనర్, కమిషనర్ వరకు వెళుతుంది. కమిషనర్ నిర్ణయం మేరకు పన్ను తగ్గించాల్సి ఉంటుంది. ఆర్ఐదే బాధ్యత అన్నట్లుగా పరోక్షంగా బదిలీ చేయడంలో మతలబు ఏంటని సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఖాళీగా ఉన్న ఈ రెండు ఆర్ఐ పోస్టులకు గతంలో పని చేసిన వారు గట్టిగా ప్రయత్నిస్తున్నారని సమాచారం.

పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 140

కొమ్ములు : 105 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,900	12,900	12,900

కాయలు : 35 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,900	12,900	12,900

మొత్తం అమ్మకాలు : 105 క్వింటాళ్లు

–దుగ్గిరాల

పలు బ్యాంక్ ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు

భూమిపూజ నిర్వహిస్తున్న సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ కళ్యాణ్‌కుమార్, జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్

నెక్లపాడు: అమరావతిలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ బ్యాంక్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 1,351 శాఖల ద్వారా ఒక కోటి మంది లక్షల ఖాతాదారులకు నాణ్యతతో కూడిన బ్యాంకింగ్ సేవలను అందిస్తూ, రాష్ట్రంలో అగ్రగామి బ్యాంకుగా ఎదుగుతోందన్నారు. ప్రస్తుతం ప్రధాన కార్యాలయం గుంటూరు బ్రాడీపేటలో పనిచేస్తోందని, అమరావతిలో కేటాయించిన స్థలానికి నిర్మాణ అనుమతులు రాగానే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

సెంట్రల్ బ్యాంకు కార్యాలయానికి శంకుస్థాపన

తాడికొండ: అమరావతిలో సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా కోసం కేటాయించిన స్థలంలో భూమిపూజ, నిర్మాణానికి పనులు శుక్రవారం నిర్వహించారు. ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ భూమి పూజ నిర్వహించారు. అమరావతిలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోసం కేటాయించిన భూమిలో బ్యాంక్ ఎండీ, సీఈఓ కళ్యాణ్‌కుమార్, జోనల్‌హెడ్ ధారా సింగ్‌నాయక్ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వేద పండితులు భూమి పూజ నిర్వహించిన అనంతరం శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతిలో మరింత విస్తరణకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఇది ఒక ప్రధాన అడుగుగా అభివర్ణించారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్ విజయవాడ పి.సతీష్‌బాబు, కడప రీజనల్ హెడ్ ఈ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మంగళగిరిలో ఏపీ ఉర్దూ అకాడమీ కేంద్ర కార్యాలయం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఫారుక్ షిబ్లీ

మంగళగిరి టౌన్: మంగళగిరిలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారుక్ షిబ్లీ పేర్కొన్నారు. ఈ భవనాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏపీ రాష్ట్ర ఉర్దూ అకాడమీ కేంద్ర కార్యాలయం విజయవాడ పరిధిలోని భవానీపురంలో ఉందని, త్వరలోనే మంగళగిరి ఆటోనగర్‌లో ఏపీఐఐసీ కార్యాలయ సమీపంలోని భవనంలోకి మార్చుతామని చెప్పారు. డిసెంబర్ 31కి ఏపీ రాష్ట్ర ఉర్దూ అకాడమీ స్థాపించి 5 దశాబ్దాలు పూర్తికానున్న నేపథ్యంలో మంగళగిరిలోని నూతన కేంద్ర కార్యాలయం నుంచి పరిపాలన ప్రారంభించనున్నట్లు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170),
విజయవాడ, లోపేమ్: 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

(Rule 8(1) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 వంటరి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు:** 1. శ్రీ కాకర్ల వెంకట శివ రామారావు, తండ్రి: కృష్ణ మూర్తి, డి.నెం. 19-3-35, పరాశ్వవారి వీధి, సంగడిగుంట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. **2. శ్రీమతి కాకర్ల కాశీ రత్న కుమారి,** భర్త: వెంకట శివ రామారావు, డోర్ నెం. 19-3-35, పరాశ్వవారి వీధి, సంగడిగుంట, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్-522003. **హామీదారు: శ్రీ ...** [illegible], తండ్రి: కృష్ణ మూర్తి, డోర్ నెం. 24-9-23, ఆర్ అగ్రహారం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002 వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 69,92,077.06** (...) + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేదీ. 26.08.2025**న డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

[illegible] **26-11-2025**న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనది ... [illegible]

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 69,92,077.06** (...) + వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జికి లోబడి ఉండునని ... [illegible]

[illegible]

స్థిరాస్తి వివరములు

1. గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, సంగడిగుంట, పరాశ్వవారి వీధి, టి.ఎస్. నెం. 360, అసెస్మెంట్ నెం. 28184 & 26185, పాత వార్డ్ నెం. 14, బ్లాక్ నెం. 5, డి.నెం. 19-3-35 & డి.నెం. 19-3-36లో గల విస్తీర్ణం 105.0/9 చ.గ.ల స్థలం మరియు అందులో గల ఆర్.సి.సి. భవనం శ్రీ కాకర్ల వెంకట శివ రామారావు గారి పేరున కలదు. (రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 12663/2010, తేదీ 27.12.2010 ప్రకారం): **తూర్పు:** [illegible] **పడమర:** [illegible] **ఉత్తరం:** [illegible] **దక్షిణం:** మున్సిపల్ కార్పోరేషన్ రోడ్డు.

2. గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, సంగడిగుంట, పరాశ్వవారి వీధి, టి.ఎస్. నెం. 360, అసెస్మెంట్ నెం. 28186, పాత వార్డ్ నెం. 14, బ్లాక్ నెం. 5, డి.నెం. 19-3-37లో గల విస్తీర్ణం 104.1/2 చ.గ.ల స్థలం మరియు అందులో గల ఆర్.సి.సి. భవనం శ్రీమతి కాకర్ల కాశీ రత్న కుమారి గారి పేరున కలదు. (రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 12664/2010, తేదీ 27.12.2010 ప్రకారం): **తూర్పు:** [illegible] **దక్షిణం:** మున్సిపల్ కార్పోరేషన్ రోడ్డు.

తేది: 26-11-2025 — అధీకృత అధికారి
ప్రదేశము: విజయవాడ — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వైద్యుల సమస్యల పరిష్కారం కోసం
24 గంటలు అందుబాటులో ఉంటాం

ప్రారంభోత్సవంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు, డాక్టర్ జయధీర్, డాక్టర్ రమేష్

గుంటూరు మెడికల్: ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.జయధీర్‌బాబు చెప్పారు. శుక్రవారం గుంటూరు కన్నావారితోట 4వ లైనులో ఏపీజీడీఏ సెంట్రల్ కార్యాలయం ప్రారంభోత్సవం జరిగింది. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కాలేజీ ఈఎన్‌టీ రిటైర్డ్ హెచ్‌ఓడీ డాక్టర్ మహేంద్ర ముఖ్య అతిథులుగా విచ్చేసి కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయధీర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయాక పదేళ్ల అనంతరం గుంటూరులో సంఘ కార్యాలయాన్ని నూతనంగా ఏర్పాటు చేశామన్నారు. వైద్యుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నామని, 1996 నుంచి తమ పోరాటం కొనసాగుతూనే ఉందన్నారు.

● ముఖ్య అతిథి బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుల సమస్యలను గతంలో బయటకు వచ్చి చెప్పేందుకు ఎవరూ ముందుకు వచ్చేవారు కాదన్నారు. డాక్టర్ జయధీర్ వైద్యుల సమస్య పట్ల చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్నారని, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో సంఘ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యుల సమస్యలపై పోరాటానికి తమ జేఏసీ అండగా ఉంటుందన్నారు.

కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.రమేష్‌కుమార్, కోశాధికారి డాక్టర్ పి.జె.శ్రీనివాస్, పలు జిల్లాలకు చెందిన నేతలు, గుంటూరు జిల్లా నేతలు, ఏపీ హంస సంఘం నేతల అరవపాల్, డ్రైవర్స్ అసోసియేషన్, నాలగవ తరగతి ఉద్యోగుల సంఘం, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 8,00 గరిష్టం : రూ. 1,200

మోడల్ ధర రూ. 1,000

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)

వచ్చిన బస్తాలు	24,794
అమ్మకాలు	30,872
నిల్వ	6,632

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,000
నంబరు–5	11,000–15,000
341	10,500–17,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	11,000–17,000
నంబరు–5	10,500–15,800
341	12,000–17,000
4884	12,000–14,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,600
బాడిగ–355	10,500 – 17,600
దేవనూరు డీలక్స్	11,000 – 16,800
ఆర్మూర్	10,000 – 13,500
తాలుకాయలు	5,200 – 8,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,500–15,300
బాడిగ – 355	11,000–17,700
దేవనూరు డీలక్స్	10,500–16,200
తాలు	5,200 – 8,000

–కొరిటెపాడు (గుంటూరు)

డిసెంబర్ 7న భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు డిసెంబర్ 7న శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శిక్షణ తరగతుల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ బ్రాడీపేట 2/6లోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న శిక్షణ తరగతులకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. రాష్ట్ర స్థాయి సబ్జెక్టు నిపుణులైన ఆర్.శివనాగేశ్వరరావు, కె.కృష్ణసాయి, బుద్దా శ్రీనివాస్, ఆగస్త్య ఫౌండేషన్ ప్రతినిధి నరేష్‌బాబు రీసోర్స్ పర్సన్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. శిక్షణ తరగతులకు హాజరు కానున్న ఉపాధ్యాయులు 83099 65083, 90004 53600, 97035 79996 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, టీఆర్ రమేష్, ఎస్ఎం సుభానీ, గురవయ్య, ఇ. అనిల్‌కుమార్, షేక్ రెహ్మాన్, జి.శివపూర్ణయ్య పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం

ఏఎస్ఐ సమస్య ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బంది సమస్యలకు నిర్ణీత వేళల్లో పరిష్కారం చూపుతామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) శుక్రవారం పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే నిర్వహించారు. వ్యక్తిగత, సర్వీస్, బదిలీలు, పరిపాలనా సమస్యలపై వినతులు అందించారు. పదిహేను మంది వినతులు అందించగా, వారి సమస్యలను జిల్లా ఎస్పీ ఆలకించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదు నిర్ణీత వేళలో పరిష్కారమయ్యేలా దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.

వర్సిటీ పురుషుల వాలీబాల్ జట్టు ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పురుషుల వాలీబాల్ జట్టు ఎంపిక చేసినట్టు కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపల్, వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ టోర్నమెంట్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా కళాశాలలో నిర్వహించిన టోర్నమెంట్‌లో క్రీడాకారుల ఆటతీరు, ఫిట్‌నెస్, నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకొని 14 మందితో కూడిన జట్టును సెలక్షన్ కమిటీ ఎంపిక చేసినట్టు వివరించారు. జట్టులో ఐ.కళ్యాణ్‌కుమార్, ఏ.ఉమామహేశ్వరరావు, ఎం.మణికంత, జె.నితిన్‌కుమార్ (కృష్ణవేణి డిగ్రీ కళా శాల, నరసరావుపేట), బి.మనోజ్, పి.శ్రీను, సీహెచ్.కోటి, వి.శంకర్ (వర్సిటీ వ్యాయామ కళాశాల, ఏఎన్‌యూ), బి.విజయ్‌కుమార్‌రెడ్డి, డి.బాలరెడ్డి (బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, బాపట్ల), షేక్.ఉస్మాన్ (ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల, ముప్పాళ్ల), కె.శేఖరబాబు (ఏపీఆర్‌డీసీ, నాగార్జునసాగర్), బి.వెంకటేష్ (కేబీఆర్ కళాశాల, నరసరావుపేట), వై.అశోక్‌బాబు, (వేద ఫార్మసీ కళాశాల) ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా వై.కుమార్, ఎన్.సబీర్, సయ్యద్ అబ్బాస్, కె.భానుప్రకాష్‌ను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎంపికైన జట్టు డిసెంబర్ 10 నుంచి 14వ తేదీ వరకు జేఎన్‌టీయూ కాకినాడలో నిర్వహించనున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల టోర్నమెంట్‌లో ఏఎన్‌యూ కు ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ పి.గౌరీశంకర్, డాక్టర్ పి.శ్రీనివాసరావు, జె.ప్రేమ్‌కుమార్, వర్సిటీ పరిశీలకుడు డాక్టర్ డి.సూర్యనారాయణరావు, కళాశాల వైస్‌ప్రిన్సిపల్ ఎంఆర్‌కె సతీష్ బాబు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈదర ఆదిబాబు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి వెటర్న్ క్రీడా పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): జిల్లాస్థాయిలో క్రీడా పోటీలను ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు మాదల చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 నుంచి 90 ఏళ్ల వయసు మధ్య మహిళలకు, పురుషులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాకింగ్, త్రో, రన్నింగ్, జంపింగ్ తదితర పోటీలను మహిళలకు, పురుషులకు విభాగాల వారీగా వేర్వేరుగా జరుగుతాయని చెప్పారు. జిల్లా స్థాయిలో ఆయా విభాగాల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి వెటరన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పోటీల వివరాలను 9000979056, 9949526697లో సంప్రదించాలని కోరారు. దీనికి సంబంధించిన క్రీడా పోస్టర్‌ను అసోసియేషన్ సెక్రెటరీ జి.రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ విజయ్ కిరణ్, ఈసీ మెంబర్ జి.గోపీనాథ్, ట్రెజరర్ సత్యనారాయణ ఎన్టీఆర్ స్టేడియంలో విడుదల చేస్తామన్నారు.

జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఐదుగురు ఎంపిక

తూములూరు(కొల్లిపర): ఆంధ్ర ప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజయవాడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల నున్నలో అండర్–19, 14 విభాగాలల్లో తూములూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.నాగలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు పాఠశాలలో పీడీ ఎస్.సాంబశివరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

'మా–ఏపీ' సభ్యులు రెన్యువల్ చేయించుకోవాలి

తెనాలి రూరల్: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్–ఏపీలో రెండేళ్ల సమయం పూర్తయిన సభ్యులందరరూ తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలని 'మా–ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా చెప్పారు. తెనాలి మండలం పెదరావూరు ఫిలిం స్టూడియోలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మార్చి 31లోగా రెన్యువల్ చేయించుకోవాలని, జీవిత కాలం సభ్యత్వం ఉన్న వారికి మినహాయింపు ఉందని, సభ్యత్వ నమోదు ఉచితమని తెలిపారు.

కొత్త గోరంట్ల దేవాలయంలో చోరీ

సత్తెనపల్లి: దేవాలయంలో చోరీ జరిగిన సంఘటన సత్తెనపల్లి మండలం కొత్త గోరంట్ల గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్త గోరంట్ల గ్రామంలోని శివారున పొలాల సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి గోపయ్య తండ్రి దేవస్థానంలో గుర్తు తెలియని దుండగులు తలుపు పగలగొట్టి రెండు పంచలోహ విగ్రహాలను, రూ.10 వేల నగదు అపహరించుకుపోయారు. ప్రతి శుక్రవారం, ఆదివారం దేవాలయాన్ని శుభ్రపరిచేందుకు వచ్చిన నంబూరు ఏడుకొండలు తలుపు పగలగొట్టి ఉండడాన్ని గమనించి లోపల పరిశీలించాడు. రెండు పంచలోహ విగ్రహాలు, రూ.10 వేలు నగదు అపహరణకు గురైనట్లుగా గుర్తించి సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ తెనాలి దగ్గర అంగలకుదురులో 80అ॥ రోడ్డు, 2వ బిట్, 113 చ॥గ॥ ఇల్లు 25లక్షలు మాత్రమే ప్లాన్ అప్రూవల్, లోన్ సౌకర్యం. సంప్ర॥ 97046 99997

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

BUSINESS OFFER

■ గుంటూరు జిటి రోడ్డులో బాగా రన్నింగ్‌లో ఉన్న పేరొందిన ఫ్రాంచైజ్ రెస్టారెంట్ అమ్మకమునకు కలదు. సంప్ర॥ 76709 89630

WANTED

■ అరండల్‌పేట 8/1లోని ఫ్రూట్ జ్యూస్ షాప్‌లో పనిచేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. సంప్రదించండి. 9618936240

■ ప్రముఖ ఇంటి ఆహార వాణిజ్య సంస్థ "హోమ్‌థాలి" గుంటూరు, నల్లపాడు, హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్టీసీ కాలనీ, గాంధీ నగర్, పరిసర ప్రాంతాలకు చెందిన వారు మీ ఇంటి నుంచే మీ తీరిక వేళలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ వంట చేయుటకు. 9888562228, 9381982818

■ Wanted primary lady principal, Vice Principal, AO, Incharge, English, Maths, Science and Mother Teachers, Apple Techno School, Krishna Babu Nagar, Gujjanagundla, Guntur. Contact: Phone: 6301036083

■ గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ పురుగు మందుల కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15000+3000. సం॥ 9121469383

■ తెనాలిలోని సన్‌రైజ్‌కారకేర్ నందు అనుభవం గల కంప్యూటర్ ఆపరేటర్, మేనేజర్, కార్ వాషింగ్ చేయుటకు సర్వీసింగ్ బాయ్స్, అనుభవం గల మెకానిక్ వర్కర్స్ తెనాలి పరిసర ప్రాంతాల వారు కావలెను. 9985982838

■ ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ఇంట్లో వుండి వంట చేయుట కొరకు, పెద్దవారిని చూసుకొనుటకు లేడీస్ కావలెను. వివరాలకు సంప్ర. 93916 95903

■ Paparao High School, K.Uppalapadu, Prakasam(dt). Wanted High School telugu Teacher & Primary Hindi Teacher & PET (Male & Female), Female Wardens. Free Boarding & Lodging. Salary Negotiable. Cont.7019326579,9392182210

■ బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్, గృహిణులు, రియల్ ఎస్టేట్, మార్కెటింగ్, టీచర్స్, RMP డాక్టర్స్ కావలెను. Q: 10th / ఇంటర్ / డిగ్రీ. ✆ 70134 81406

■ మంగళగిరి DGP Office సమీపంలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ: 18,000/- PF&ESI కటింగ్ పోను, 10th, Age 45 లోపు. ✆ 88014 97437, 97034 65118

■ త్రివేణి హోంకేర్. హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K-20K. Ph: 9640400073, 9160900024

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించి, పెరిపు ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్లకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
Bank of Maharashtra
జోనల్ కార్యాలయం, విజయవాడ, 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నం.59ఎ-21-7/3, సిద్ధార్థ రోడ్, పటమట, విజయవాడ, ఆం.ప్ర-520007. ఫోన్ : 0866-2431225, ఇ-మెయిల్ : dmvijayawada@mahabank.co.in

(అనుబంధం–IVA) (రూల్ 8(6)లోని నిబంధనలను చూడండి)

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

[illegible]

1. రిజర్వ్ ధర : రూ.27,00,000/- [illegible]
2. ధరావతు : రూ.2,70,000/- [illegible]
3. బిడ్ పెంపుదల మొత్తం : రూ.25,000/- [illegible]

ఆస్తి వివరణ : (CERSAI ASSET ID: 200054594812)

[illegible]

ఇ-వేలం తేదీ: 15-12-2025 [illegible]

[illegible] support.BAANKNET@psballiance.com, ఫోన్: 8291220220 [illegible] www.bankofmaharashtra.in/eropsale.asp [illegible] BAANKNET [illegible] (https://baanknet.com) [illegible]

తేది : 28.11.2025, ప్రదేశం : విజయవాడ — అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170),
విజయవాడ, లోపేమ్: 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

(Rule 8(1) of Security Interest (Enforcement) Rules 2002)

[illegible] **రూ. 6,17,48,381.49** [illegible] **తేది. 26.08.2025**న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది. [illegible]

26-11-2025న [illegible]

[illegible] **రూ. 6,17,48,381.49** [illegible]

స్థిరాస్తి వివరములు

1. ఆంధ్రప్రదేశ్, గుంటూరు, పొన్నూరు రోడ్డు, [illegible]
2. గుంటూరు జిల్లా, [illegible]
3. [illegible]
4. [illegible]
5. గుంటూరు జిల్లా, [illegible]
6. గుంటూరు జిల్లా, [illegible]

తేది: 26-11-2025 — అధీకృత అధికారి
ప్రదేశము: విజయవాడ — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పూలే ఆశయాలను సాధించుకుందాం

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త వేమారెడ్డి

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త వేమారెడ్డి

మంగళగిరి టౌన్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతి వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని.. తన ఐదేళ్ల పరిపాలనలో సంక్షేమ సామ్రాట్‌గా దేశ వ్యాప్తంగా ఆయన ఖ్యాతి గడించారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మంగళగిరి మండల పరిధి ఆత్మకూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పూలే వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మురుగుడు, వేమారెడ్డి మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతి కోసం పాటుబడిన నాయకులు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఆయన గొప్పతనాన్ని నేటితరం విద్యార్థులు స్మరించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ, మండల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకటేశ్వరరావు, తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి సుధారాణి, రాష్ట్ర మున్సిపాలిటీ విభాగ అధ్యక్షులు వివేకానందరెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ షాలిని, నాయకులు గంజి షణ్ముఖ్, గోరేబాబు, ఈపూరి ఆదాం, మాలక్ బాబు, సంకె సునీత, కుంచాల కృష్ణకిషోర్, దుర్గా నాయక్, గాలయ్య, సుబానీ, రఘు, శామ్యూల్, సుబ్బారావు, నూతక్కి జోష్, మహమ్మద్ ఫిరోజ్, ఎలీషా, గంగాధరరావు, టి.రాంబాబు, సురేష్, పి.రాంబాబు, నీలిమ, నిర్మల, పద్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త పూలే..

పూలే గొప్ప సంఘ సంస్కర్త అని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిధి ఆత్మకూరు గ్రామ ఆర్చి వద్ద శుక్రవారం పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పులివర్తి రాంబాబు, విజయ్ బాబు, నాగభూషణం, సుభాకర్, నందిగం ఆకాష్, జి.గంగాధర్, వెంగళ విజయ్, జాలాది ప్రేమ్‌చంద్, కోటేశ్వరరావు, సాంబయ్య, పాములు, ప్రభుదాస్, ప్రకాష్, మేరుగ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బీసీ సంఘ కార్యాలయంలో..

స్థానిక రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం పూలే వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, సంఘ నాయకులు కుమ్మర క్రాంతికుమార్, పారేపల్లి మహేష్, సత్యనారాయణ, వరప్రసాద్, దానా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే..

ఫిరంగిపురం: దేశప్రజలకు గొప్ప ఆదర్శనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎంఈవోలు షేక్ మహబూబ్‌సుబానీ, రవికాంత్‌లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహోన్నత ఆశయాలు కలిగిన వ్యక్తి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ, పీఆర్‌టీయూ, యూటీఎఫ్ సంఘాల నాయకులు పి.ప్రసాద్, జి.కార్తీక్ శ్రీనివాస్, రజాక్‌లు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఆర్చి వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

ఎంఈవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు

దుగ్గిరాల: చేతికొచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు తెలిపారు. దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకటనలతో మెప్పిస్తున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో రైతాంగాన్ని మాటలతో నెట్టుకొస్తుందని విమర్శించారు. 22 శాతం కన్నా తక్కువ ధాన్యాన్ని ఇంకా ఆరబెట్టాలని.. మిల్లు దగ్గరికు వెళ్లి మాట్లాడుకోవాలని.. ట్రాన్స్‌పోర్ట్, కాటా కూలి వంటివి మీరే భరించాలని రైతులకు సిబ్బంది సూచిస్తున్న సూచనలపై ఆయన మండిపడ్డారు. ఒకవైపు వాతావరణం అనుకూలంగా లేకపోవడం.. మరో వైపు కొనుగోళ్లు నత్తనడకన నడవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి దర్పణం పడుతుందన్నారు. తేమ ఎక్కువగా ఉన్నా ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన పేర్కొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

తెనాలి రూరల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తెనాలి మండల పరిధిలోని పలు గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం పర్యటించారు. తేలప్రోలు, బుర్రిపాలెం గ్రామాల్లో తహసీల్దార్ గోపాలకృష్ణ, మండల వ్యవసాయ అధికారి సుధీర్ బాబు పర్యటించి కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు.

క్లుప్తంగా

అంకిత భావంతో పనిచేయాలి

ఫిరంగిపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మండల ప్రత్యేకాధికారి వి.శంకర్ మాట్లాడుతూ.. సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం క్యాటిల్ షెడ్, ఈకేవైసీ, హార్టికల్చర్ వంటి వాటిపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. పనిపట్ల సరైన అవగాహన కలిగి ఉండాలని.. అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం, ఏపీవో నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీతో రైతులకు మేలు

ఫిరంగిపురం: ఉపాధి హామీ పథకంతో రైతులకు మేలు చేకూరుతోందని మండల ప్రత్యేకాధికారి వి.శంకర్ అన్నారు. మండలంలోని రేపూడి, సుదురుపాడు, అమీనాబాద్ గ్రామాల్లో రైతన్న మీకోసం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు మోహన్‌రావు మాట్లాడారు.. పత్తి రైతులు ప్రభుత్వం సూచించిన గిట్టుబాటు ధరకే అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో వాసంతి, ఎం.నరసింహారావు, షేక్.సుబాని, నాగేశ్వరరావు, రాంబాబు, తేజస్విని, సాంబశివరావులు పాల్గొన్నారు.

తెనాలిలో స్వచ్ఛభారత్ బృందం పర్యటన

తెనాలిఅర్బన్: తెనాలి పూలే కాలనీలోని మురుగు నీటి శుద్ధి ప్లాంట్(ఎస్‌టీపీ)ను శుక్రవారం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర బృంద సభ్యులు జెబీ.రవీంద్ర, దీపక్ గోయల్, నాగేశ్వరావు, వినయ్‌లు పరిశీలించారు. ప్లాంట్‌లోని అన్ని విభాగాలను పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ పి.శ్రీకాంత్, ఆరోగ్యాధికారి డాక్టర్ ముచ్చా యేసుబాబు, ప్రజా ఆరోగ్యశాఖ డీఈ శివరామకృష్ణ, ఏఈలు సునీల్, ఫణీ పాల్గొన్నారు.

నేటి నుంచి స్వరలయ తెనాలి ఉత్సవ్

తెనాలి: స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శని, ఆదివారాల్లో 'స్వరలయ తెనాలి ఉత్సవ్' జరగనుందని పట్టణ సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయవేదిక వ్యవస్థాపకులు సాయి లక్ష్మరాజు చెప్పారు. మారీసుపేటలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, శనివారం సాయంత్రం 5 గంటలకు ఉత్సవాలు ప్రారంభిస్తామని తెలిపారు. తోలుబొమ్మలాట ప్రదర్శన, చెక్కభజన, గురుకుల విద్యార్థినులచే కోలాటం, నిర్మలా రమేష్ దర్శకత్వంలో తెనాలి ఉత్సవ గీత నృత్య ప్రదర్శన తదుపరి ప్రారంభ సభ ఉంటుందని చెప్పారు. వివిధ రంగాల్లోని 15 మందికి మందికి పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. ఆదివారం ఉదయం 10 గంట లకు రెండోరోజు కార్యక్రమాలు ఆరంభిస్తారు. కర్రసాము, కత్తి సాము, సాహిత్య సభ ఉంటాయన్నారు. సాయంత్రం తెనాలి ప్రాంత సినీ కవులైన మోదుకూరి జాన్సన్, బొల్లిముంత శివరామకృష్ణ, వేటూరి సుందరరామ్మూర్తి రచించిన గీతాలతో సంగీత విభావరి, తెనాలికి కీర్తి ప్రతిష్టలు తెచ్చి కీర్తి శేషులైన తెనాలి వాసుల సంస్మరణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ధాన్యం రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రత్తిపాడు: ధాన్యం రైతులు రైతు సేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కాకుమాను తహసీల్దార్ వెంకటస్వామి పేర్కొన్నారు. కాకుమానులోని కొనుగోలు కేంద్రాల ద్వారా జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను శుక్రవారం తహసీల్దార్ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం సిబ్బంది తేమ శాతం పరిశీలించిన తరువాత షెడ్యూల్ జనరేట్ చేశారన్నారు. అనంతరం ట్రక్ షీట్ జనరేట్ చేసి 150 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి పొన్నూరులోని శ్రీ సీతారామాంజనేయ రైస్ మిల్, బాలాజీ రైస్ మిల్‌కు పంపడం జరిగిందని చెప్పారు. అందంచేత రైతులందరూ కూడా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తేమశాతం పదిహేడు ఉన్నట్లయితే సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహసీల్దార్ కోరారు.

మెడికల్ కాలేజీలు నడిపే సత్తా లేకే ప్రైవేటుపరం

పూర్తయిన సంతకాల పత్రాలను వేమారెడ్డి అందజేస్తున్న పార్టీ నాయకులు

మంగళగిరి టౌన్: చంద్రబాబు ప్రభుత్వానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీలు నడిపే సత్తా లేక ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకున్నారని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా సేకరించిన పత్రాలను వేమారెడ్డికి పార్టీ నాయకులు శుక్రవారం అందజేశారు. మంగళగిరి పట్టణ పరిధి 31వ వార్డులో జరిగిన సంతకాల సేకరణ గురువారంతో పూర్తయిన సందర్భంగా ఆ ప్రతులను 31వ వార్డు నాయకులు వేమారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ చేస్తున్న ప్రజా ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజల మద్దతు అవసరమన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనా విధానాన్ని ప్రజలు ముక్తకంఠంతో ఖండిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని.. లేని పక్షంలో ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, పట్టణ మైనార్టీ విభాగ అధ్యక్షులు మాలక్ బాబు, పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు సంకె సునీత, నాయకులు అప్పారావు, కవిత, విజయ్‌కుమార్, షబ్బీర్ బాషా, వసంతకుమారి, లావణ్య, నవీన్, అరుణ, గుండమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మంగళగిరి టౌన్: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు టి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి శైలజారాణి పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిధి రామచంద్రాపురంలో శుక్రవారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి వ్యవసాయశాఖ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతన్న మీకోసం వారోత్సవాల్లో రైతులు తమ సూచనలను వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. రైతులు తమ ధాన్యం తేమశాతం 17% లోపల ఉండాలని పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. 75 కేజీల గ్రేడ్ ఎ రకం రూ.1,792, 75 కేజీల కామన్ రకం రూ.1,777లుగా ప్రభుత్వం నిర్ణయించిందని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో మంగళగిరి డిప్యూటీ తహసీల్దార్ అంకారావు, గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడిపై దాడిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధి ఆత్మకూరు రోడ్డులో గల శ్మశాన వాటిక వద్ద కాపలా ఉంటున్న మున్సిపల్ కార్మికుడు అంజిబాబుపై దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్పొరేషన్ కమిటీ డిమాండ్ చేసింది. ఇందులో భాగంగా ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట శుక్రవారం రాత్రి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ నాయకులు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు భద్రత లేకుండా పోతోందని మండిపడ్డారు. శ్మశాన వాటిక వద్ద పనిచేస్తున్న కార్మికుడు అంజిబాబు అక్కడ చెత్త వేయవద్దని చెప్పడంతో అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి దాడి చేయడం సరికాదన్నారు. ఘటనపై కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రం అందజేయడంతో పాటు మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, శివనాగేశ్వరరావు, తిరుపతమ్మ, మేరి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ పత్రాల అందజేత

మంగళగిరి టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.6.50 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను స్థానిక టీడీపీ నాయకులు లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. మంగళగిరి పట్టణ పరిధి టిప్పర్ల బజార్‌కు చెందిన రమేష్‌బాబుకు రూ.3,50,000, భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ఉమా మహేశ్వరరావుకు రూ.3 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

కార్మికుల సమస్యపై మంత్రి లోకేష్ స్పందించాలి

దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై మంత్రి నారా లోకేష్ స్పందించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 360వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని నాయకులు బూరగ అంకయ్య, సుభాని, సూర్యప్రకాష్‌లతో కలిసి స్టీవెన్ సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులను ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, హగ్గయ్య, యహోషువ, దుర్గారావు, ఆశీర్వాదం, ఏసోబు, షాంసుద్దీన్, ఇమాంబి, శివమ్మ, దుర్గాభవాని, శారమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. దీక్షల్లో డి.రమణమ్మ, ఎం.శారద, బి.శివమ్మ, రిబ్కా, సువర్ణకుమారి కూర్చున్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

తెనాలి రూరల్: పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసింది. పట్టణ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దాడిపై పోలీసులు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఐతానగర్ వైఎస్సార్ సర్కిల్ లో గాలి రవికుమార్ గృహంలో పేకాట ఆడుతున్నారని టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి సమాచారం అందింది. దీనిపై టాస్క్ ఫోర్స్ సీఐ ఆదేశాల మేరకు టూ టౌన్ ఎస్సై దుర్గాప్రసాద్ సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేసి, పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నా రు. వారి నుంచి 7 సెల్ ఫోన్లు, రూ.55 వేల నగదు స్వాధీనం చేసుకొని నిందితులను స్టేషన్‌కు తరలించారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోండి

వైద్యాధికారి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి

ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రమాదేవి

తెనాలిఅర్బన్: ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని గంగానమ్మపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మలేరియా శాఖ ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని వైవీఆర్ కాలనీలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవగాహనతోనే దోమల నియంత్రణ సాధ్యమన్నారు. పట్టణ సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. వీటి వలన దోమల వ్యాప్తి పెరిగి వ్యాధులకు కారణంగా మారనున్నాయని చెప్పారు. ప్రజలందరూ దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, సిబ్బంది షేక్ నవీద్, సంకా శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్‌కు ప్రభుత్వ రాయితీ

ప్రత్తిపాడు: సోలార్ పవర్‌కు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెదనందిపాడు ఎంపీడీఓ లక్ష్మీదేవి కోరారు. పెదనందిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు వీఓఏలకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పీఎం సూర్యఘర్ పథకంపై గ్రామగ్రామాన క్షేత్ర స్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. గృహాలపై సోలార్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసుకోవడం ద్వారా నెల నెలా విద్యుత్ చార్జీలను తగ్గించుకోవడంతో పాటు అనేకరకాల ప్రయోజనాలను పొందవచ్చని పేర్కొన్నారు. సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ సబ్సిడీలతో పాటు బ్యాంకర్లు రుణాలను కూడా విరివిగి అందిస్తున్నారన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ మురళీకృష్ణ, ఏపీఎం సుబ్బారావు, పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి బాధితులకు వెంటనే చికిత్స అందించాలి

ఇంటింటా వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

దుగ్గిరాల: కుష్ఠువ్యాధి బాధితులను గుర్తించి వారికి సత్వరమే చికిత్స అందించాలని లెప్రసీ విభాగ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎస్.దేవసాగర్ అన్నారు. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లెప్రసీ వ్యాధిగ్రస్తుల వివరాల ప్రకారం వారి ఇంటి దగ్గరకు వెళ్లి బాధితులతో మాట్లాడామన్నారు. వ్యాధిగ్రస్తులు మనో ధైర్యంగా ఉండాలని సూచించామన్నారు. వ్యాధి లక్షణాలు తుమ్మడం, దగ్గడం వంటివని.. ఈ లక్షణాలు పూర్తిగా బయటపడడానికి సుమారు 5 నుంచి 7 ఏళ్ల కాలం పట్టవచ్చునని పేర్కొన్నారు. శరీరంపై స్పర్శ తెలియని మచ్చలు, చర్మంపై రాగి మచ్చలు.. కాళ్లు, చేతులు, కండరాలలో బలహీనత, చేతులు, పాదాలు తిమ్మిర్లుగా అనిపించడం, నొప్పి కలుగని పుండ్లు చేతులు, పాదాలలో ఉండటం, కళ్లు పూర్తిగా మూసుకుపోవడం వంటి మొదలగు లక్షణాలు ఏమైనా ఉంటే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్స్ డాక్టరు అనూహ్య, డాక్టరు అర్చన, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జె.బసవయ్య, డాక్టరు ఇందిర, వి.సుబ్బారావు, వెంకటేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దు

తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ

కొలకలూరులో ధాన్యం రైతులతో కేవీ గోపాలకృష్ణ

తెనాలి: తుఫాన్‌హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం వరి నూర్పిడులు జరుగుతున్న నేపథ్యంలో నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు రోడ్లు, ఇతర ఖాళీస్థలాల్లో ఆరబెట్టుకుని వుంటున్నారు. ఆ ధాన్యాన్ని సత్వరం రైస్‌మిల్లులకు తరలించకపోతే తుఫాన్ కారణంగా వచ్చే వర్షానికి రైతులు నష్టపోయే ప్రమాదముంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాలతో తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, వ్యవసాయ అధికారి కె.సుధీర్‌బాబు శుక్రవారం తేలప్రోలు, బుర్రిపాలెం, ఖాజీపేట, కొలకలూరు గ్రామాలను సందర్శించారు. రైతులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని తేమశాతం పరీక్షించి, ఆరిన ధాన్యాన్ని దగ్గర్లోని రైస్‌మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశారు. రైతులు ఎవరూ తుఫాన్ భయంతో అయినకాడికి దళారులకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సూచించారు.

పేటెంట్, కాపీరైట్స్‌పై అవగాహన సదస్సు

అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం తదితరులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలో చలపతి ఫార్మసీ కళాశాలలో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్(ఐపీఎఫ్‌సీ), కళాశాల సంయుక్తాధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వశాఖ సహకారంతో విద్యార్థులకు మేధస్వామ్య హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ స్టార్టప్స్, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థుల్లో పేటెంట్లు, కాపీరైట్స్, ట్రేడ్‌మార్క్స్ వంటి మేధస్వామ్య హక్కుల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఎంఎస్ఎంఈ డీఎఫ్ఓ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కేఎల్ఎస్ రెడ్డి మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ రంగంలో పేటెంట్ల ప్రాధాన్యం, నూతన ఔషధాల అభివృద్ధిలో మేధస్వామ్య హక్కులు ఎంతటి రక్షణను కల్పిస్తాయో తెలిపారు. ఒక ఆవిష్కరణని మార్కెట్లోకి తీసుకురావడానికి అవసరమైన ఐపీ వ్యూహాలు, పరిశోధన పనులను ఎలా రక్షించుకోవాలో, జర్నల్స్ ప్రచురణకు ముందు పేటెంట్ దాఖలు ఎందుకు ముఖ్యమో, యూనివర్సిటీ స్థాయిలో ఇన్నోవేషన్ కల్చర్‌ను ఎలా ప్రోత్సహించాలి తెలిపారు. ఇట్టాన్ ఫార్మ డైరెక్టర్ సీఈఓ డాక్టర్ ప్రసన్నసాగర్ మాట్లాడుతూ పరిశ్రమ అకాడెమియా అవసరాలు, మేధస్వామ్య హక్కుల ప్రాముఖ్యత, పేటెంట్ ప్రాసెస్, పరిశోధనల రక్షణ ఇన్నోవేషన్, అకాడమిక్ రైటింగ్, ప్రాజెక్ట్ రిపోర్ట్స్, థీసిస్, ప్రెజెంటేషన్, కాపీరైట్ల ప్రాధాన్యం వివరించారు. ఐపీఆర్ అడ్వకేట్ వి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఒక పేటెంట్‌ను దాఖలు చేసే పూర్తి ప్రక్రియ పేటెంట్ శోధన, నావల్టీ చెక్, డాక్యుమెంటేషన్, ఫైలింగ్, పరీక్ష, గ్రాంట్ వరకు తీసుకునే ప్రతి దశను న్యాయపరమైన కోణంలో స్పష్టంగా వివరించారు. ఫార్మాస్యూటికల్ రంగంలో ఇన్నోవేషన్ ఎంత ముఖ్యమో, ఒక నూతన ఔషధం లేదా ఫార్ములేషన్‌ను అభివృద్ధి చేసే సమయంలో పేటెంట్లు ఎలా రక్షణ కల్పిస్తాయో ఎం.సుధీర్ వివరించారు.

పేదలకు అన్నదానం

తెనాలి: ప్రముఖ సినీ నిర్మాత, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యుడు దాసరి కిరణ్‌కుమార్ జన్మదినోత్సవాన్ని వివిధ సంస్థలు శుక్రవారం సేవాకార్యక్రమంతో జరుపుకున్నారు. పట్టణానికి చెందిన శ్రీశివలింగ భక్తబృంద సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను పర్యవేక్షణలో స్థానిక రైల్వేస్టేషను సెంటరులో పేదలు, వికలాంగులు, నిరాశ్రయులకు అన్నదానం చేశారు. దాసరి కిరణ్ మిత్రమండలి, షేక్ మీరావలి ఫ్రెండ్స్ సర్కిల్, కుర్రా శ్రీను ఫ్రెండ్స్ సర్కిల్ కలిసి ఈ సేవాకార్యక్రమాన్ని చేశారు. మునిపల్లి వంశీ, షేక్ కాలేషా, షేక్ మౌలాలి, షేక్ చిన్నబాజి, ఎస్.రాంబాబు, బి.పోతురాజు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
14	13
85,707	26,203

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,294	△	78
డోజోన్స్	47,672	△	245
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,719	△	25
డాక్స్	23,816	△	48
షాంఘై	3,889	△	13
నికాయ్	50,254	△	87

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	87.62	90.62
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	115.85	120.18
€	యూరో	థామస్‌కుక్	101.29	105.23
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	46.00	59.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	55.99	59.84
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.63	70.33
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.97	24.47
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.47	24.72
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.77	13.59

జీడీపీ... జైత్రయాత్ర

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 8.2 శాతం వృద్ధి
- జూన్ త్రైమాసికంలో 7.8 శాతమే
- పరిశ్రమలు, సేవల రంగాల్లో పటిష్ట పనితీరు
- అంచనాలకు మించి ఆర్థిక దూకుడు

న్యూఢిల్లీ: అంచనాలను మించి, విశ్లేషకులను ఆశ్చర్యపరుస్తూ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలోనూ (క్యూ2) బలమైన పనితీరు చూపించింది. ఆరు త్రైమాసికాల గరిష్ట స్థాయిలో 8.2 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతం కంటే మరింత బలపడింది. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గనుండడంతో డిమాండ్ పుంజుకుంటుందన్న అంచనాల మేరకు పరిశ్రమలు ఉత్పత్తిని పెంచడం, పండుగల సీజన్‌లో పెరిగిన వినియోగ వ్యయాలు వృద్ధికి అండగా నిలిచాయి. క్రితం ఆర్థిక సంవత్సరం (2024–25) క్యూ2లో జీడీపీ వృద్ధి 5.6 శాతంగా ఉండడం గమనార్హం. 2023–24 జనవరి–మార్చి క్వార్టర్‌లో నమోదైన 8.4 శాతం పూర్వపు గరిష్ట వృద్ధిగా ఉంది. మరోసారి భారత్ ప్రపంచంలోనే వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా మొదటి స్థానంలో నిలిచింది. ఈ కాలంలో 4.8% వృద్ధితో చైనా రెండో స్థానంలో నిలిచింది. ఎన్ఎస్‌వో సెప్టెంబర్ త్రైమాసికం జీడీపీ గణాంకాలను శుక్రవారం విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలంలో జీడీపీ వృద్ధి 8 శాతంగా ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 6.1% కంటే ఎంతో మెరుగుపడింది.

ముఖ్యాంశాలు..

- జీడీపీలో 57 శాతం వాటా కలిగిన ప్రైవేటు తుది వినియోగం 7.9 శాతం పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలంలో వృద్ధి 6.4 శాతంగా ఉంది. జూన్ త్రైమాసికంలో 7 శాతం వృద్ధి చెందడం గమనార్హం.
- తయారీ రంగంలో 9.1% స్థాయిలో బలమైన వృద్ధి నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ రంగంలో వృద్ధి 2.2 శాతమే. ఆగస్ట్ 15న స్వాతంత్ర్యదినం సందర్భంగా ప్రధాని జీఎస్టీ సంస్కరణలను ప్రకటించడంతో.. పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా పరిశ్రమలు ఉత్పత్తిని పెంచడం ఇందుకు దారితీసింది.
- సేవల రంగం లోనూ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, నిపుణుల సేవలు సహా) 10.2 శాతానికి వృద్ధి బలపడింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వృద్ధి 7.2 శాతంగా ఉంది.
- దేశంలో ఎక్కువ మందికి ఉపాధినిస్తున్న వ్యవసాయ రంగంలో మాత్రం వృద్ధి 3.5 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సాగు రంగం 4.1 శాతం వృద్ధిని చూపించడం గమనార్హం.
- ప్రభుత్వ వ్యయాలు క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ2తో పోల్చితే 2.7 శాతం తగ్గాయి. జూన్ త్రైమాసికంలో 7.4 శాతం పెరగడం గమనించొచ్చు. ప్రభుత్వ మూలధన వ్యయాలు క్యూ2లో 31 శాతం పెరిగాయి. జూన్ క్వార్టర్‌లో 52 శాతం పెరుగుదల కంటే తక్కువే.
- రియల్ జీడీపీ (స్థిర ధరల వద్ద/ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేసిన) సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.48.63 లక్షల కోట్లుగా ఉంది. 2024–25 క్యూ2లో రూ.44.94 లక్షల కోట్లతో పోల్చితే 8.2 శాతం పెరిగింది.
- నామినల్ జీడీపీ సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.85.25 లక్షల కోట్లుగా ఉంది. 2024–25లో రూ.78.40 లక్షల కోట్ల కంటే 8.7 శాతం వృద్ధి చెందింది.
- వ్యత్యాసాలు ఏకంగా రూ.1.62 లక్షల కోట్లకు పెరిగాయి. వివిధ నమూనాల ఆధారంగా జీడీపీ గణనలో వచ్చిన వ్యత్యాసాలు ఇవి.

ఎంతో ప్రోత్సాహకరం

2025–26 క్యూ2లో 8.2 శాతం వృద్ధి రేటు అన్నది చాలా ప్రోత్సాహకరంగా ఉంది. మేము చేపట్టిన సంస్కరణలు, వృద్ధి అనుకూల విధానాల ఫలితాన్ని సూచిస్తోంది. అంతేకాదు మన దేశ వ్యాపార సంస్థలు, ప్రజల కృషిని తెలియజేస్తోంది. మా ప్రభుత్వం సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లడం ద్వారా ప్రతి పౌరుడి జీవనాన్ని మరింత సులభతరం చేస్తుంది

– ప్రధాని నరేంద్ర మోదీ

దేశ ఆర్థిక శక్తికి నిదర్శనం

జీడీపీ అంచనాలు బలమైన ఆర్థిక వృద్ధి, ఆర్థిక కార్యకలాపాల వేగాన్ని సూచిస్తున్నాయి. 2025–26 క్యూ2లో 8.2 శాతం రియల్ జీడీపీ వృద్ధి రేటుతో భారత్ ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. నిలకడైన ద్రవ్య స్థిరీకరణ, లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వ పెట్టుబడులు ఉత్పాదకతను బలోపేతం చేశాయి. వ్యాపార సులభతర నిర్వహణను మెరుగుపరిచాయి. ప్రధాని ఆధ్వర్యంలో ఈ వృద్ధి జోరును కొనసాగించేందుకు, దీర్ఘకాలంలో ఆర్థిక వృద్ధికి అనుకూలించే సంస్కరణలను చేపట్టేందుకు కట్టుబడి ఉంది.

– ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

అంచనాల్లో 52 శాతానికి ద్రవ్యలోటు

ఏప్రిల్–అక్టోబర్ మధ్య రూ.8,25,144 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ చివరికి రూ.8,25,144 కోట్లుగా నమోదైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి జీడీపీలో ద్రవ్యలోటు 4.4 శాతం (15.69 లక్షల కోట్లు)గా ఉండొచ్చన్నది కేంద్రం అంచనా. ఇందులో మొదటి ఏడు నెలల కాలంలో 52.6 శాతానికి ద్రవ్యలోటు చేరినట్టు తెలుస్తోంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ద్రవ్యలోటు అంచనాల్లో 46.5 శాతంగా ఉండడం గమనార్హం. ప్రభుత్వ వ్యయాలు–ఆదాయం మధ్య అంతరమే ద్రవ్యలోటు. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) విడుదల చేసిన డేటా ప్రకారం.. అక్టోబర్ చివరికి ప్రభుత్వానికి రూ.18 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో రూ.12.74 లక్షల కోట్లు పన్ను రూపంలో రాగా, రూ.4.89 లక్షల కోట్లు పన్నేతర ఆదాయం. రుణేతర నిధుల వసూళ్లు రూ.37,095 కోట్లుగా ఉన్నాయి. ఇందులో రాష్ట్రాలకు రూ.8,34,957 కోట్లను కేంద్రం బదిలీ చేసింది. వ్యయాలు రూ.26.25 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇందులో రూ.20 లక్షల కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా, రూ.6.17 లక్షల కోట్లు మూలధన వ్యయాలకు సంబంధించి ఉన్నాయి.

మార్కెట్ అక్కడక్కడే

- జీడీపీ డేటా వెల్లడికి ముందు అప్రమత్తత
- స్వల్ప నష్టాల ముగింపు

ముంబై: దేశీయ జీడీపీ వృద్ధి గణాంకాల వెల్లడి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో దేశీయ స్టాక్ మార్కెట్ శుక్రవారం స్వల్ప నష్టంతో ముగిసింది. సెన్సెక్స్ 14 పాయింట్లు నష్టపోయి 85,707 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 13 పాయింట్లు కోల్పోయి 26,203 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ఆద్యంతం లాభ, నష్టాల మధ్య ఊగిసలాడాయి. సెన్సెక్స్ 329 పాయింట్ల పరిధిలో 85,578 వద్ద కనిష్టాన్ని, 85,970 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 26,172 – 26,281 శ్రేణిలో కదలాడింది. ఆసియాలో దక్షిణ కొరియా, హాంగ్ కాంగ్ సూచీలు నష్టపోగా, చైనా, జపాన్ మార్కెట్లు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.25% పెరిగాయి. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- సూచీలు జీవితకాల గరిష్ట స్థాయి పరిధిలో ట్రేడవుతున్న తరుణంలో కీలక రంగాల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. రంగాల వారీగా బీఎస్ఈ ఇండెక్సుల్లో ఆయిల్‌అండ్ గ్యాస్, టెలికమ్యూనికేషన్ 1%, ఇంధన, విద్యుత్, వినిమయ సూచీలు అరశాతం నష్టపోయాయి. స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 0.13%, 0.04 శాతం నష్టపోయాయి. మరోవైపు ఆటో, కన్జూమర్ డిస్క్రెషనరీ, ఫార్మా, మెటల్, సర్వీసెస్ షేర్లకు డిమాండ్ లభించింది.
- వడోదరకు చెందిన సుదీప్ ఫార్మా లిస్టింగ్ సక్సెస్ అయ్యింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.593)తో పోలిస్తే 24% ప్రీమియంతో రూ.734 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 34% పెరిగి రూ.796 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 30% లాభంతో రూ.774 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.8,739 కోట్లుగా నమోదైంది.

జియో కొత్త యూజర్లు @ 20 లక్షలు

48.47 కోట్లకు మొత్తం సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య

న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో యూజర్ల సంఖ్య సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్‌లో 19.97 లక్షలు ఎగిసి 48.47 కోట్లకు చేరింది. అటు భారతి ఎయిర్‌టెల్ మొబైల్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 12.52 లక్షలు పెరిగి 39.36 కోట్లకు పెరిగింది. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వీటి ప్రకారం ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ యూజర్ల పరిమాణం 2.69 లక్షలు పెరిగి 9.25 కోట్లకు చేరింది. మరోవైపు, వొడాఫోన్ ఐడియా 20.83 లక్షల సబ్‌స్క్రయిబర్స్‌ను కోల్పోయి 20.07 కోట్లకు పరిమితమైంది. మొత్తం మీద భారత టెలిఫోన్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 123.1 కోట్లకు (118.4 కోట్ల వైర్‌లెస్, 4.6 కోట్ల వైర్‌లైన్) పెరిగింది. అటు బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 99.56 కోట్ల నుంచి 99.98 కోట్లకు చేరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

29-11-2025	
విశాఖ	610–00
చిత్తూరు	663–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	620–00
విజయవాడ	640–00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	630–00
వరంగల్	632–00
రిటైల్ ధర	6.90

సాక్షి స్పోర్ట్స్

ఆస్ట్రేలియా ఓపెన్ మెయిన్ ‘డ్రా’కు నిక్కీ పునాచా-ఇసారో జోడీ అర్హత

చెంగ్డూ (చైనా): భారత టెన్నిస్ ఆటగాడు నిక్కీ పునాచా కొత్త సంవత్సరాన్ని కొత్త ఉత్సాహంతో ప్రారంభించనున్నాడు. సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మెయిన్ ‘డ్రా’ ఆడేందుకు భారత ఆటగాడు అర్హత సాధించాడు. థాయ్‌లాండ్ భాగస్వామి ప్రుచ్యా ఇసారోతో కలిసి అతను పురుషుల డబుల్స్‌లో ఆడనున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆసియా–పసిఫిక్ వైల్డ్‌కార్డ్ టోర్నీలో భారత్–థాయ్ జోడీ విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో నిక్కీ–ఇసారో ద్వయం 6–4, 6–3తో కుసుహర–నకగవా (జపాన్) జోడీపై నెగ్గింది. తద్వారా 30 ఏళ్ల భారత ఆటగాడు నిక్కీ పునాచా ఓ గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రాలో అరంగేట్రం చేయబోతున్నాడు. ఇన్నాళ్లు ఏటీపీ చాలెంజర్, ఐటీఎఫ్ సర్క్యూట్ ఈవెంట్లకే పరిమితమైన నిక్కీ కెరీర్‌లో ఇదో గొప్ప మైలురాయిగా నిలువనుంది.

సెమీఫైనల్లో శ్రీకాంత్

తన్వీ శర్మ, ఉన్నతి హుడా కూడా

లక్నో: సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ 21–14, 11–4తో భారత్‌కే చెందిన ప్రియాన్షు రజావత్‌పై గెలుపొందాడు. తొలి గేమ్‌ను నెగ్గిన శ్రీకాంత్, రెండో గేమ్‌లో ఏడు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నదశలో అతని ప్రత్యర్థి ప్రియాన్షు గాయం కారణంగా ఆటను కొనసాగించలేకపోయాడు. దాంతో రిఫరీ శ్రీకాంత్‌ను విజేతగా ప్రకటించారు. నేడు జరిగే సెమీఫైనల్లో భారత్‌కే చెందిన మిథున్ మంజునాథ్‌తో శ్రీకాంత్ తలపడతాడు. క్వార్టర్ ఫైనల్లో మిథున్ 21–18, 21–13తో భారత్‌కే చెందిన మన్‌రాజ్ సింగ్‌ను ఓడించాడు.

మహిళల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్స్ తన్వీ శర్మ, ఉన్నతి హుడా సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో 16 ఏళ్ల తన్వీ శర్మ 21–8, 21–15తో లో సిన్ యాన్ (హాంకాంగ్)పై, ఉన్నతి 21–15, 13–21, 21–16తో భారత్‌కే చెందిన రక్షిత శ్రీపై గెలుపొందారు. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో ఐదో సీడ్ హినా అకెచి (జపాన్)తో తన్వీ; నాలుగో సీడ్ నెష్లిహాన్ అరిన్ (టర్కీ)తో ఉన్నతి పోటీపడతారు.

గాయత్రి జోడీ జోరు

మహిళల డబుల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జోడీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రెసా ద్వయం 21–15, 21–16తో బెంగిసు ఎర్సెటిన్–నాజ్లికన్ ఇన్సి (టర్కీ) జంటను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో హరిహరన్–ట్రెసా జాలీ (భారత్) జోడీ సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో హరిహరన్–ట్రెసా జాలీ జంట 21–18, 21–14తో అందికా రామదియాన్సి–నొజోమి షిమిజు (ఆస్ట్రేలియా) జోడీపై గెలుపొందింది.

ప్రజ్ఞానందకు రెండో విజయం

లండన్: స్వదేశంలో జరిగిన ప్రపంచకప్ చెస్ టోర్నీలో నిరాశపరిచిన భారత యువ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ ఏడో ర్యాంకర్ ప్రజ్ఞానంద... లండన్ క్లాసిక్ టోర్నీలో శుభారంభం చేశాడు. ఆడిన తొలి రెండు గేముల్లోనూ విజయం సాధించాడు. స్టాన్లీ (ఇంగ్లండ్)తో జరిగిన తొలి గేమ్‌లో 56 ఎత్తుల్లో గెలిచిన ప్రజ్ఞానంద... ఎల్దర్ గసనోవ్ (ఉక్రెయిన్)తో జరిగిన రెండో గేమ్‌లో 32 ఎత్తుల్లో విజయం సాధించాడు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ప్రణవ్ ఆనంద్ కూడా ఆడిన రెండు గేముల్లో గెలుపొందాడు. తొలి గేమ్‌లో ప్రణవ్ 55 ఎత్తుల్లో పంజెర్ సిడ్నీ (జర్మనీ)పై, రెండో గేమ్‌లో 29 ఎత్తుల్లో టికా స్వెన్ (క్రొయేషియా)పై నెగ్గాడు.

రూ.1750 నుంచి రూ.13,500 వరకు...

- లయోనల్ మెస్సీ ‘షో’ టికెట్ల ధరలు
- డిసెంబర్ 13న హైదరాబాద్‌లో కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా సూపర్‌స్టార్ లయోనల్ మెస్సీ హైదరాబాద్ పర్యటన ఖరారైంది. ప్రత్యక్షంగా ఈ స్టార్ ప్లేయర్ ఆటను చూసే అవకాశం నగర అభిమానులకు కలుగుతోంది. ‘గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ టూర్ ఆఫ్ ఇండియా’లో భాగంగా డిసెంబర్ 13న మెస్సీ హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటాడు. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ షో నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా నాలుగు దిక్కుల్లో నాలుగు నగరాలు కోల్‌కతా, హైదరాబాద్, ముంబై, ఢిల్లీలలో అతని పర్యటన ఉంటుంది. ఇవన్నీ పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమాలు. ప్రముఖ ఈవెంట్ ఆర్గనైజర్ శతద్రు దత్తా ఈ టూర్ మొత్తానికి నిర్వాహకుడు. నాలుగు వేదికల్లో అభిమానుల కోసం నిర్వహిస్తున్న ఈవెంట్లు కాకుండా ముంబైలో వ్యక్తిగతంగా మెస్సీని కలిసి ఫోటో దిగే అవకాశం కూడా నిర్వాహకులు కల్పిస్తున్నారు. అయితే దీని కోసం ఒక్కొక్కరు సుమారు రూ.9.95 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది!

స్టేడియంలో కార్యక్రమం ఇదీ...

సాయంత్రం 7 గంటలకు మొదలై దాదాపు 3 గంటల పాటు మెస్సీ ‘షో’ సాగుతుంది. ఇందులో నాలుగు అంశాలు ఉన్నాయి. ఎంపిక చేసిన సెలబ్రిటీలతో ఎగ్జిబిషన్ మ్యాచ్... ఎంపిక చేసిన చిన్నారులతో ‘మాస్టర్ క్లాస్ విత్ యంగ్ టాలెంట్స్’... ‘పెనాల్టీ షూటౌట్’లో మెస్సీ పాల్గొంటాడు. ఆ తర్వాత మ్యూజికల్ కన్సర్ట్ ఉంటుంది. దీనికి సంబంధించి నిర్వాహకులు టికెట్ల వివరాలను ప్రకటించారు. ఇందులో వరుసగా రూ. 1750, రూ. 2000, రూ. 3250, రూ. 5000, రూ. 7000, రూ. 8000, రూ. 13500 విలువ గల టికెట్లు ఫ్యాన్స్ కోసం అందుబాటులో ఉన్నాయి. టికెట్లను https://www.district.in/events/goat-india-tour-2025-lionel-messi-hyderabad-buy-tickets వెబ్ సైట్ ద్వారా కొనుగోలు చేయవచ్చు.

భారత్ శుభారంభం

చిలీపై 7-0 గోల్స్‌తో ఘనవిజయం

చెన్నై: సొంతగడ్డపై జరుగుతున్న పురుషుల జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన పూల్ ‘బి’ తొలి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య భారత జట్టు 7–0 గోల్స్ తేడాతో చిలీ జట్టుపై ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున రోషన్ కుజుర్ (16వ, 21వ నిమిషాల్లో), దిల్‌రాజ్ సింగ్ (25వ, 34వ నిమిషాల్లో) రెండు గోల్స్ చొప్పున చేయగా... అజీత్ యాదవ్ (35వ నిమిషంలో), అన్‌మోల్ ఎక్కా (48వ నిమిషంలో), కెప్టెన్ రోహిత్ (60వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో ఒమన్ జట్టుతో భారత్ తలపడుతుంది. చిలీతో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న భారత్ ఆద్యంతం ఆధిపత్యం చలాయించింది. అయితే ఖాతా తెరవడానికి సమయం తీసుకుంది. తొలి క్వార్టర్‌లో గోల్స్ చేసేందుకు వచ్చిన అవకాశాలను భారత్ చేజార్చుకుంది. దాంతో తొలి క్వార్టర్‌లో రెండు జట్లు 0–0తో సమంగా నిలిచాయి. రెండో క్వార్టర్ మొదలైన తొలి నిమిషంలోనే భారత్ ఖాతా తెరిచింది. మన్‌మీత్ సింగ్ అందించిన పాస్‌ను ‘డి’ ఏరియాలో అందుకున్న రోషన్ కుజుర్ బంతిని లక్ష్యానికి చేర్చాడు. ఆ తర్వాత రోషన్, దిల్‌రాజ్ నాలుగు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేశారు. రెండో క్వార్టర్ ముగిసేసరికి భారత్ 3–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో క్వార్టర్‌లో భారత్ మరో మూడు గోల్స్ చేసింది. నిమిషం వ్యవధిలో దిల్‌రాజ్, అజీత్ ఒక్కో గోల్ చేశారు. మూడో క్వార్టర్ ముగిసేసరికి భారత్ 6–0తో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. చివరి క్వార్టర్‌లో చిలీ రక్షణపంక్తి అప్రమత్తంగా ఉండటంతో భారత్ ఒక్క గోల్ మాత్రమే చేయగలిగింది. మ్యాచ్ ఆఖరి నిమిషంలో కెప్టెన్ రోహిత్ గోల్‌తో భారత్ 7–0తో విజయాన్ని ఖరారు చేసుకుంది. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు ఆరు పెనాల్టీ కార్నర్‌లు లభించగా... రెండింటిని గోల్స్‌గా మలిచింది. లభించిన ఒక్క పెనాల్టీ స్ట్రోక్‌ను రోహిత్ సద్వినియోగం చేసుకున్నాడు.

టోర్నీ తొలి రోజు శుక్రవారం జరిగిన ఎనిమిది మ్యాచ్‌ల్లోనూ ఫలితాలు రావడం విశేషం. మదురైలో జరిగిన పూల్ ‘ఎ’ మ్యాచ్‌ల్లో జర్మనీ 4–0తో దక్షిణాఫ్రికాపై, ఐర్లాండ్ 4–3తో కెనడాపై గెలిచాయి. పూల్ ‘బి’ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ 4–0తో ఒమన్‌ను ఓడించింది. పూల్ ‘డి’ మ్యాచ్‌ల్లో బెల్జియం 12–1తో నమీబియాపై, స్పెయిన్ 8–0తో ఈజిప్ట్‌పై విజయం సాధించాయి. పూల్ ‘సి’ మ్యాచ్‌ల్లో అర్జెంటీనా 4–1తో జపాన్‌పై, న్యూజిలాండ్ 5–3తో చైనాపై గెలిచి శుభారంభం చేశాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

శ్రీలంకతో భారత మహిళల పోరు

- స్వదేశంలో 5 టి20లు ఆడనున్న టీమిండియా
- విశాఖపట్నంలో రెండు మ్యాచ్‌లు

హర్మన్

చమరి

న్యూఢిల్లీ: వన్డే వరల్డ్ కప్‌లో విజేతగా నిలిచిన తర్వాత భారత మహిళల జట్టు తొలిసారి వచ్చే నెలలో మళ్లీ మైదానంలోకి దిగనుంది. సొంతగడ్డపై హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 5 టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో శ్రీలంకతో తలపడుతుంది. డిసెంబర్ 21 నుంచి 30 తేదీల మధ్య ఈ సిరీస్‌ను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా తొలి 2 మ్యాచ్‌లు విశాఖపట్నంలో, తర్వాతి 3 మ్యాచ్‌లు తిరువనంతపురంలో జరుగుతాయని బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది. నిజానికి ఇవే తేదీల్లో బంగ్లాదేశ్‌తో భారత్ ఆడాల్సి ఉంది. అయితే ఇరు దేశాల మధ్య రాజకీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సిరీస్ వాయిదా పడింది. బోర్డు తాజా షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 21, 23 తేదీల్లో విశాఖపట్నంలో రెండు టి20లు, డిసెంబర్ 26, 28, 30 తేదీల్లో తిరువనంతపురంలో చివరి 3 మ్యాచ్‌లు జరుగుతాయి. భారత జట్టు చివరిసారిగా ఈ ఏడాది జులైలో ఇంగ్లండ్‌తో టి20ల్లో ఆడి 3–2తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.

1 నుంచి పులుల గణన

1, 2, 3 తేదీల్లో మాంసాహార, 6, 7, 8 తేదీల్లో శాకాహార వన్యప్రాణుల గుర్తింపు

ప్రత్యక్షంగా చూసి నమోదు

జనవరి 1 నుంచి కెమెరా ట్రాప్‌ల ఏర్పాటు

అనంతరం పులుల సంఖ్య ప్రకటన

నల్లమలలో సంచరిస్తున్న పెద్దపులులు

పెద్దదోర్నాల: రాష్ట్రంలో డిసెంబర్ 1వ తేదీ నుంచి వన్యప్రాణులను లెక్కించనున్నారు. 1, 2, 3 తేదీల్లో మాంసాహార జంతువులైన పెద్దపులి, చిరుతపులి, ఎలుగుబంట్లు, రేచుకుక్కలు, అడవిపిల్లులను, 6, 7, 8 తేదీల్లో గడ్డి జాతులను తిని బతికే దుప్పులు, సాంబార్, జింకలు, కుందేళ్లు తదితర శాకాహార వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూసి నమోదు చేయనున్నారు. వన్యప్రాణుల లెక్కింపు అయినా.. ప్రధానంగా పెద్దపులుల సంఖ్య ఎంత అనేది కీలకం. ఎందుకంటే అడవిలో పెద్దపులి సంచరిస్తుంటే ఆ అడవి సమతుల్యంగా ఉంటుంది. రాష్ట్రంలో పులుల సంతతి పెరిగేందుకు నల్లమల అడవి ఒక రక్షణ ఛత్రంగా మారింది. నల్లమలలో పులుల సంతతి గణనీయంగా పెరుగుతోంది. ఈ క్రమంలోనే రాజీవ్‌గాంధీ పులుల అభయారణ్యంగా ఏర్పాటైన నల్లమల పులుల అభయారణ్యం.. ప్రస్తుతం నాగార్జున సాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌గా ఉంది. దేశవ్యాప్తంగా నాలుగేళ్లకు ఒకసారి పులుల సంఖ్యను లెక్కిస్తారు. ఆలిండియా టైగర్ ఎస్టిమేషన్‌లో భాగంగా మన రాష్ట్రంలో అటవీశాఖ అధికారులు శాస్త్రీయంగా వీటిని లెక్కించనున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పెద్దపులుల సర్వే

1వ తేదీ నుంచి అడవిలో మాంసాహార, శాకాహార జంతువుల్ని ప్రత్యక్షంగా చూసి నమోదు చేయనున్నట్లు ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల అటవీ రేంజి అధికారి హరి తెలిపారు. నల్లమల అభయారణ్యంలోని ప్రతి బీట్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. పులుల గణనలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నామన్నారు. గతంలో పులులు, చిరుతలు, ఇతర వన్యప్రాణులను వాటి పాదముద్రల ఆధారంగా లెక్కించేవారు. అయితే, అవి అరణ్యంలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తుండటంతో కచ్చితమైన సంఖ్య తేలేది కాదు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. పులి సంచారం ఉన్న ప్రాంతాల్లో కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి నుంచి వెలువడే ఆల్ట్రారెడ్ బీమ్ పరిధిలోకి జంతువు రాగానే కెమెరా చిత్రీకరిస్తుంది. 15 క్షణాల్లో మళ్లీ కెమెరా సిద్ధమవుతుంది. చిత్రాల్లో పులి శరీరంపై చారికల ఆధారంగా లెక్కింపు చేపడతారు. దీంతోపాటు కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఎకోలాజికల్ యాప్‌ను ఉపయోగించి ఆండ్రాయిడ్ ఫోన్‌ల ద్వారా వన్యప్రాణుల వివరాలను సేకరిస్తారు. నూతన శాస్త్రీయ పరిజ్ఞానంతో పాటు, పులుల పాదముద్రలు, మలము, చెట్ల మొదళ్లపై పులుల గోళ్ల రక్కుల ఆనవాళ్లను సైతం పరిగణలోకి తీసుకుని పులుల గణనను పకడ్బందీగా నిర్వహిస్తారు. ఇందుకోసం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జనవరి 1వ తేదీ నుంచి నల్లమల అభయారణ్యంలోని దట్టమైన ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిలో నిక్షిప్తమైన పులుల చారికల ఆధారంగా పూర్తిస్థాయి సమాచారాన్ని క్రోడీకరించి పులుల సంఖ్యను ప్రకటిస్తారు.

గతంలో సర్వే నిర్వహించిన సంవత్సరం	పులుల సంఖ్య
2010	67 (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్)
2014	72 (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్)
2018	48 (ఆంధ్రప్రదేశ్)
2022	74 (ఆంధ్రప్రదేశ్)
2026	89కి పైగా ఉండవచ్చని అంచనా (ఆంధ్రప్రదేశ్)

పులుల సంఖ్య పెరిగేందుకు చర్యలు

దేశంలో పులుల సంతతి పెరిగేలా అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. వాటికి ఆహారంగా ఉపయోగపడే జింకలు, దుప్పులు, అడవిపందుల పెరుగుదలకు అనుకూల ఆవాసం కల్పించేందుకు నిరంతర కృషిచేస్తున్నారు. అడవిలోని నిషిద్ధ ప్రాంతాల్లోకి జనం వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. పెద్దపులి చాలావరకు మాటేసి ఆహారాన్వేషణ చేస్తుంది. పొదల్లో దాక్కుని, నీటి వనరులున్న ప్రాంతాల్లో నీరు తాగేందుకు వచ్చే జంతువులను మాటేసి పట్టుకుంటుంది. అడవుల్లో నివసించే పులి జీవితకాలం 10–15 ఏళ్లు మాత్రమే. సంరక్షణ కేంద్రాల్లో ఇవి 20 ఏళ్ల వరకు జీవిస్తాయి. పులి సంతానోత్పత్తి కాలం 93 నుంచి 112 రోజులు. సాధారణంగా నవంబర్–ఏప్రిల్ మధ్య వీటి సంతానోత్పత్తికి అనుకూలం. ఆడపులి కలయికకు కొన్ని రోజులు మాత్రమే అనుకూలంగా ఉంటుంది. ఒక కాన్పులో 3–4 పిల్లలను కంటాయి. పిల్లల సంరక్షణ సాధారణంగా ఆడపులే చూస్తుంది. వీటిలో మరణాల రేటు కూడా అధికంగానే ఉంటుంది. పులిచర్మం, దంతాలు, ఎముకలు, వెంట్రుకలకు గిరాకీ ఉండటంతో వేటగాళ్ల బారిన పడుతుంటాయి. వాటి తగ్గుదలకు ఇది ఓ ప్రధాన కారణం.

చెన్నకేశవస్వామీ బిక్కు 'బి'క్కు!

160 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయ నిర్మాణానికి పచ్చబ్యాచ్ అడ్డంకులు

2024 మార్చిలో నూతన ఆలయ నిర్మాణానికి రూ.98 లక్షలు మంజూరు

- అదే నెలలో టెండర్ పిలిచి పనులు ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ సర్కారు
- ప్రభుత్వం మారగానే కాంట్రాక్టర్‌కు ప్రజాప్రతినిధి భర్త బెదిరింపులు
- రూ.15 లక్షలు బీ-ట్యాక్స్ ఇచ్చాకే పనులు ప్రారంభించాలని హుకుం
- 17 నెలలుగా రేకుల షెడ్డులోనే పూజలందుకుంటున్న చెన్నకేశవ స్వామి
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదంటున్న గ్రామస్తులు

సాక్షి, నంద్యాల: తెలుగుదేశం పార్టీ నాయకుల ధన దాహానికి దేవుడు కూడా దిక్కులేని వాడైపోతున్నాడు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం నల్లగట్ల గ్రామంలో పురాతన చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. అధికార పార్టీ నాయకులకు బీ–ట్యాక్స్ ఇచ్చుకోలేక కాంట్రాక్టరు పనులను వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో స్వామి 17 నెలలుగా నిలువ నీడలేక బిక్కుబిక్కుమంటూ దీనస్థితిలో ఉండిపోయాడు. నల్లగట్లలో చెన్నకేశవ ఆంజనేయస్వామి ఆలయాన్ని 1865లో నిర్మించారు. స్వామివారి పూజా కైంకర్యాలకు అప్పట్లో దాతలు 84 ఎకరాలను మాన్యంగా ఇచ్చారు. అయితే, ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆలయ నిర్మాణానికి 2024 ప్రారంభంలో రూ.98 లక్షలను కేటాయించింది. టెండర్ ప్రక్రియ పూర్తిచేసి మార్చిలో భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు శిథిలావస్థకు చేరిన ప్రాంతాలను తొలగించే పనులు చేపట్టారు. ఎన్నికలు ముగిసిన తర్వాత టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆలయ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

కమీషన్ ఇచ్చాకే పనులు చేపట్టండి..

ఇప్పుడీ ఆలయంపై ప్రజాప్రతినిధి భర్త కన్నుపడింది. బీ–ట్యాక్స్ కడితేనే పనులు ప్రారంభించాలని ఆయన ఖరాఖండిగా చెప్పేశారు. డబ్బులు ఇవ్వకుండా ఒక్క ఇటుక కూడా పేర్చొద్దని అల్టిమేటం జారీచేశారు. మొత్తం రూ.15 లక్షలు ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలని హుకుం జారీచేశారు. అంత డబ్బు తాను ఇచ్చుకోలేనని.. దేవుడి గుడి కావడంతో లాభం ఆశించకుండా పనులు చేస్తున్నానని కాంట్రాక్టరు చెప్పినా ఫలితంలేకుండా పోయింది.

పూర్తిగా శిథిలావస్థకు చేరిన చెన్నకేశవ ఆంజనేయస్వామి ఆలయం

రేకుల షెడ్డులో పూజలు..

అధికార పార్టీ నాయకుడి నిర్వాకంతో చెన్నకేశవ స్వామికి నిలువ నీడ లేకుండాపోయింది. గ్రామస్తులంతా కలిసి రేకుల షెడ్డు వేయించి అందులోనే స్వామివారి విగ్రహాలను ఉంచి పూజలు చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి ధన దాహంతో 160 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం బోసిపోతోంది. ఇదే విషయమై గ్రామస్తులు పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి స్పందన కరువైంది. ఇక 2007 నుంచి ఆలయ భూములను వేలం ద్వారా కౌలుకు ఇస్తున్నారు. ఇలా ఆలయానికి రూ.కోటి యాభై లక్షల వరకు నిధులున్నాయి. అలాగే, నేషనల్ హైవే కింద వచ్చిన పరిహారాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయడం ద్వారా మరో రూ.కోటి యాభై లక్షల వరకు నిధులున్నాయి. మరోవైపు.. ఆలయానికి సంబంధించి నిధుల వివరాలు వెల్లడించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నా ఈఓ సాయి జయచంద్రారెడ్డి స్పందించడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు. నిధులను ఈఓ పక్కదారి పట్టిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ వైర్లతో విద్యార్థులపై దాడి

పెదఖేర్జిల గిరిజన ఆశ్రమ పాఠశాలలో దారుణం

విద్యార్థుల శరీరాలపై కమిలిన గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స

విద్యార్థుల వీపులపై కమిలిన గాయాలు

పార్వతీపురం రూరల్: సాక్షాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సొంత జిల్లా అయిన పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం పెదఖేర్జిల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో సెల్‌ఫోన్ వ్యవహారం ఇద్దరు విద్యార్థులపై తీవ్ర స్థాయిలో భౌతిక దాడికి దారితీసింది. వీరిపై సహచర విద్యార్థులే విద్యుత్ వైర్లతో దాడి చేశారు. ఈ ఘటన అధికారులు, ఉపాధ్యాయుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

అసలేం జరిగిందంటే?: పెదఖేర్జిల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తాడంగి ఆరెంజ్ (పూడేసు గ్రామం), పువ్వల వరుణ్ (కోన గ్రామం)ను అదే పాఠశాలకు చెందిన తోటి విద్యార్థులు మంగళవారం రాత్రి చితకబాదారు. ఓ విద్యార్థికి చెందిన సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో కొందరు విద్యార్థులు అనుమానంతో ఆరెంజ్, వరుణ్‌ను విచక్షణారహితంగా విద్యుత్ వైర్లతో కొట్టారు. మరుసటి రోజు ఉదయానికల్లా ఫోన్ తెచ్చి ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలుంటాయని, ఉపాధ్యాయులకు చెబితే చంపేస్తామని హెచ్చరించారు. దీంతో భయపడిన ఆ ఇద్దరు విద్యార్థులు బుధవారం ఉదయం స్కూల్ నుంచి పారిపోయారు. కాలినడకన 8 కిలోమీటర్ల దూరంలోని బంధువుల ఇంటికి చేరుకున్నారు. అటునుంచి గురువారం ఉదయం 11 గంటలకు కాలినడకన ఇళ్లకు చేరుకున్నారు. గాయపడిన ఆరెంజ్‌ను తల్లి తాడింగి పార్వతి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేర్చింది. మరో విద్యార్థి వరుణ్‌కు నామమాత్రపు మందులతో సరిపెట్టారు. ఈ విషయం బయటకు పొక్కకుండా పాఠశాల సిబ్బంది ప్రయత్నించడం గమనార్హం. ఈ ఘటనపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఆశ్రమ పాఠశాలల్లో సెల్‌ఫోన్ల సంస్కృతికి అడ్డుకట్ట వేసి, పటిష్టమైన పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

శ్రీవారి నిత్యాన్నదానానికి రూ.కోటి విరాళం

చెక్కు అందజేస్తున్న రామకృష్ణ

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ప్రవాస భారతీయుడు కిలారు రామకృష్ణ తిరుమల నిత్యాన్నదానానికి కోటి రూపాయల విరాళమిచ్చారు. తన తల్లిదండ్రులు కిలారు రమేష్‌బాబు, బాలసరస్వతితో కలిసి శుక్రవారం టీటీడీ జేఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి రూ.కోటి చెక్కును అందజేశారు.

చంద్రబాబు సర్కార్‌లో దళితులకు అన్యాయం

మార్టూరు సీఐపై చర్యలు తీసుకోరా? • దేగరమూడి బాధితుల ఆవేదన

మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్, జ్యోతి

మార్టూరు: తమపై మార్టూరు సీఐ మద్దినేని శేషగిరిరావు తప్పుడు కేసులు బనాయించి స్టేషన్లో దాడిచేసి రెండునెలలు గడుస్తున్నా న్యాయం జరగలేదని బాపట్ల జిల్లా దేగరమూడి గ్రామానికి చెందిన దళిత యువకులు అల్లడి ప్రమోద్‌కుమార్, జ్యోతి పోతులూరి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు సర్కారులో దళితులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చెప్పిన వివరాల ప్రకారం దేగరమూడిలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహస్థాపనలో వీరిద్దరూ కీలకపాత్ర పోషించారు. ఈ విషయమై గ్రామంలో రెండువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ క్రమంలో గత సెప్టెంబర్ 26న మార్టూరు సీఐ మద్దినేని శేషగిరిరావు ఆదేశాలతో పోలీసులు వీరిద్దరిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ సీఐ వీరిని అసభ్యకరంగా దూషించారు. గోడపక్కన కాళ్లుచాపి కూర్చోబెట్టారు. సీఐ బూటుకాళ్లతో వారి కాళ్లను తొక్కిపెట్టగా కానిస్టేబుళ్లు సాగర్, వలి లాఠీలతో వారి అరికాళ్లపై తీవ్రంగా కొట్టారు. అరికాళ్లు బొబ్బలెక్కిన వీరిని సీఐ స్టేషన్ వెనక వైపున్న కంకరరాళ్ల గుట్టపై సుమారు గంటసేపు నడిపించారు. తర్వాత తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకుని ఎవరికైనా చెబితే తాటతీస్తానని హెచ్చరించి ఇంటికి పంపించారు. బాధితులు ఈ విషయాన్ని అదేరోజు సాయంత్రం గ్రామంలో విలేకరుల ముందు చెప్పారు. దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, చార్వాక, ప్రజాసంఘాల నాయకులు బాధిత యువకులతో కలిసి సీఐ శేషగిరిరావుపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సెప్టెంబర్ 29న మార్టూరు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు.. మార్టూరు సీఐ శేషగిరిరావుపై విచారణ జరిపించి ఈ ఆరోపణలు వాస్తవమని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోజులు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో అక్టోబర్ 9న, 24న బాధిత యువకులు ఎస్పీని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి న్యాయం చేయాలని కోరారు. తమకు న్యాయం జరగకపోవడానికి డీఎస్పీ రామాంజనేయులు కారణమని హైకోర్టుకు, డీఐజీకి, మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బాధిత యువకులు మాట్లాడుతూ దళిత మహిళ వంగలపూడి అనిత హోం మంత్రిగా ఉన్నా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రవర్ణాలకు చెందిన పోలీసు అధికారుల వలన తమకు న్యాయం జరగదన్నారు. హోం మంత్రి జోక్యం చేసుకుని మార్టూరు సీఐ, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

నిసార్ ఉపగ్రహం యాంటెన్నా రిఫ్లెక్టర్ విజయవంతం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) సంయుక్తంగా ఈ ఏడాది జూలై 30న ప్రయోగించిన నిసార్ ఉపగ్రహానికి అమర్చిన 12 మీటర్ల వ్యాసార్థం కలిగిన యాంటెన్నా రిఫ్లెక్టర్ విజయవంతంగా అమల్లోకి వచ్చిందని, అంటే విచ్చుకుందని ఇస్రో శుక్రవారం తన వెబ్‌సైట్ ద్వారా తెలియజేసింది. ఈ యాంటెన్నా రిఫ్లెక్టర్ ఇస్రోకు చెందిన ఎస్–బ్యాండ్, నాసాకు చెందిన ఎల్–బ్యాండ్ సింథటిక్ ఆపార్చర్ రాడార్ (సర్) పేలోడ్లు రెండింటికి కీలకమైన పాత్ర పోషిస్తుంది. యాంటెన్నాను 9 మీటర్లు పొడవైన బూమ్‌పై నిల్వ చేసిన స్థితిలో ప్రయోగించారు. దీన్ని ఉపగ్రహానికి దగ్గరగా ఉంచారు. ఈ యాంటెన్నా, బూమ్‌ని నాసా శాస్త్రవేత్తలు రూపొందించారు. యాంటెన్నా వ్యవస్థల పనితీరు సంతృప్తికరంగా ఉందని, ఈ మొత్తం ఆపరేషన్‌ను జేపీఎల్–నాసా సహకారంతో ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ (బెంగళూరు) నుంచి విజయవంతంగా నిర్వహించామని ఇస్రో పేర్కొంది.

ఎస్వీ వెటర్నరీ విద్యార్థినికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి

చంద్రగిరి: తిరుపతి ఎస్వీ వెటర్నరీ కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న ప్రియదర్శిని హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పౌల్ట్రీ ఎక్స్‌పోలో ప్రథమ బహుమతి అందుకుంది. శుక్రవారం జరిగిన ఈ సదస్సులో కోళ్లలో సంక్రమించే కొకిడియోసిస్ అనే వ్యాధి నివారణకు 'సహజ ఆహార యాజమాన్య పద్ధతులు' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. దేశం నలమూలల నుంచి సుమారు 95 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రియదర్శిని ప్రథమ బహుమతిని గెలుచుకుంది. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

మరోసారి వార్తల్లోకి బెంగళూరు రోడ్లు

దొడ్డబళ్లాపురం: బెంగళూరులో గుంతలమయమైన రోడ్లు మరోసారి వార్తల్లో నిలిచాయి. బెంగళూరులో పని చేస్తున్న ఉత్తర భారతదేశానికి చెందిన సౌరభ్ పాండే బైక్‌పై వెళ్తూ పెద్ద గుంత కారణంగా కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆస్పత్రిలో బెడ్‌పై ఉండగా అతని స్నేహితురాలు సెల్ఫీ వీడియో తీసి బెంగళూరు రోడ్లపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'నా స్నేహితుడు ఈరోజు గాయాలతో ఆస్పత్రిలో ఉండడానికి కారణం బెంగళూరులో అధ్వానంగా ఉన్న రోడ్లే. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది' తెలిపింది. బెంగళూరులో ద్విచక్ర వాహనాలను నిషేధించండి అంటూ క్యాప్షన్ పెట్టి ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది.

బంగారు ఆర్బీకేలు

వైఎస్ జగన్ రైతు భరోసా కేంద్రాలకు అంతర్జాతీయ గుర్తింపు



ఇంగ్లాండ్‌లోని బర్మింగ్ హాం విశ్వవిద్యాలయం

సాక్షి, అమరావతి: విత్తు నుంచి విపణి వరకు ఐదేళ్ల పాటు రైతులను గ్రామస్థాయిలో చేయిపెట్టి నడిపించిన రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే) వ్యవస్థకు మరోసారి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థ ఇప్పటికే జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రశంసలు, అవార్డులు, రివార్డులు అందుకున్న విషయం తెలిసిందే. తాజాగా ప్రపంచంలోనే అత్యుత్తమ యూనివర్సిటీ అయిన ఇంగ్లాండ్‌లోని బర్మింగ్ హాం విశ్వవిద్యాలయం ఆర్బీకేలను సువర్ణ యజ్ఞంగా గుర్తించింది. యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎంబీఏ) చదువుతున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థిని నిరోషా ఆర్బీకేలపై ప్రదర్శించిన ప్రాజెక్టుకు గోల్డ్‌మెడల్ బహూకరించింది.

వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన మహత్తర వ్యవస్థ

వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన మహత్తర వ్యవస్థే ఆర్బీకేలు. పౌరసేవలను ప్రజల ముంగిట తీసుకెళ్లే లక్ష్యంతో రెండు వేల జనాభాకొక గ్రామసచివాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చిన వైఎస్ జగన్ వాటికి అనుబంధంగా గ్రామస్థాయిలో ఒకేసారి 10,77 8రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సర్టిఫై చేసిన సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఆక్వా ఫీడ్, పశువుల దాణా వంటి ఉత్పాదకాలతోపాటు రైతు సంక్షేమ ఫలాలను ఈ కేంద్రాల ద్వారానే కర్షకుల ముంగిటకే అందించారు. వ్యవసాయ అనుబంధ యూనివర్శిటీలకు ఆర్బీకేలు కేంద్రంగా చేసి ఇంటర్న్‌షిప్‌లనూ నిర్వహించారు. దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిన ఆర్బీకే వ్యవస్థను గతంలోనే జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలతోపాటు ఎన్నో అవార్డులు, రివార్డులు వరించాయి. ఆర్బీకేల స్ఫూర్తితోనే జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసింది. కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలతోపాటు ఇథియోపియా వంటి దేశాలూ ఆర్బీకే వ్యవస్థపై అధ్యయనం చేసి వీటి స్ఫూర్తితో తమ ప్రాంతాల్లో గ్రామస్థాయిలో రైతులకు మెరుగైన సేవలందించే దిశగా అడుగులు వేశాయి. అంత గొప్ప కీర్తిగడించిన ఆర్బీకే వ్యవస్థను గడిచిన 18 నెలలుగా చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ఇదిలా ఉంటే ఆర్బీకేలపై ప్రాజెక్టు ప్రెజెంట్ చేసిన నిరోషా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారానే బర్మింగ్ హాం వర్సిటీలో ఎంబీఏ చేస్తున్నారు. చివరి ఏడాది సమర్పించే ప్రాజెక్టుగా ఆర్బీకేల అంశాన్ని ఆమె ఎంపిక చేసుకుంది. ఈ వ్యవస్థను అధ్యయనం చేసి ఆర్బీకేల ద్వారా రైతులకు అందిన సేవలపై సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును సమర్పించింది. ఈ ప్రాజెక్టును బర్మింగ్ హాం యూనివర్సిటీ బెస్ట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రేయాస్ ఫీల్డ్ అవార్డుతోపాటు గోల్డ్ మెడల్ బహూకరించింది. ఈ గోల్డ్‌మెడల్‌ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే అంకితం ఇస్తున్నట్టు నిరోషా సగర్వంగా ప్రకటించడం గమనార్హం.

కర్ణాటకం.. ఓవర్ టు ఢిల్లీ

సోనియా నేతృత్వంలో నేడు ఏఐసీసీ పెద్దల సమావేశం

బెంగళూరు ప్యాలెస్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

సాక్షి, బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అధికార పంచాయితీ ఢిల్లీకి చేరింది. ముఖ్యమంత్రి మార్పుపై జరుగుతున్న రగడకు తెరదించేందుకు అధిష్ఠానం సిద్ధమైంది. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో శనివారం సాయంత్రం 5 గంటలకు అగ్ర నేత సోనియాగాంధీ నేతృత్వంలో హైకమాండ్ భేటీ కానుంది. ఈ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, పార్టీ జాతీయ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలా పాల్గొననున్నారు. సీఎం పదవి నుంచి సిద్ధరామయ్యను తప్పించడం వల్ల జరిగే పరిణామాలు, తలెత్తే ఇబ్బందులు ఎలా ఉంటాయి? ఆయనను కొనసాగిస్తే ఎదురయ్యే సమస్యలపై హైకమాండ్ చర్చించనుంది. ఈ నేపథ్యంలోనే సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను ఆదివారం ఢిల్లీ రావాలని అధిష్ఠానం కోరింది. దీంతో కర్ణాటకలో నెలకొన్న సందిగ్ధతకు తెరపడే సూచనలున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అధిష్ఠానం తీసుకునే నిర్ణయం మేరకు, సిద్ధరామయ్య, శివకుమార్‌తో మాట్లాడి, ఇద్దరినీ ఒప్పించే ప్రయత్నం చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

విదేశాల నుంచి సోనియా రాకతో...

కర్ణాటకలో ఓవైపు సిద్ధు, డీకే వర్గాలు ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తుండగా... కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ఓసారి (గురువారం) సమావేశమై రాష్ట్ర నాయకత్వ మార్పుపై సుదీర్ఘంగా చర్చించింది. అయితే, విదేశాల్లో ఉన్న సోనియా అనుమతి లేకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోకూడదని నిర్ణయించింది. కేవలం నాయకుల సలహాలు తీసుకుని భేటీని ముగించారు. ఇక విదేశాల నుంచి తిరిగి వచ్చిన సోనియా శనివారం అందుబాటులో ఉండనున్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ కమిటీ సమావేశం కూడా జరగనుంది. ఇందులో సోనియాతో పాటు అధిష్ఠానం పెద్దలు కర్ణాటకపై చర్చించి తుది నిర్ణయానికి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. అందుకే సిద్ధు, డీకేను ఢిల్లీ రమ్మని కోరినట్లు సమాచారం. వారితో సమాలోచనలు చేసి ఆదివారం సాయంత్రంలోగా సమస్యకు పరిష్కారం చూపాలని భావిస్తున్నట్లు పేర్కొంటున్నారు. తమ నిర్ణయాన్ని వెల్లడించి... ఇద్దరినీ సముదాయించి పార్టీకి నష్టం కలగకుండా చూసే యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు.

నేడు డీకే-సిద్ధు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

హైకమాండ్ పిలిస్తే తప్పకుండా ఢిల్లీకి వెళతానని సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేశారు. వారు ఏమి తీర్మానిస్తే దాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తానన్నారు. కాగా, నాయకత్వ మార్పుపై సిద్ధు, డీకే కూర్చుని మాట్లాడుకుని ఒక నిర్ధారణకు వచ్చాకనే ఢిల్లీకి రావాలని అధిష్ఠానం పెద్దలు సూచించినట్లు సమాచారం. అధిష్ఠానం సూచనలతో డీకేను శనివారం తన నివాసం కావేరికి బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించానన్నారు. ఇద్దరం మాట్లాడుకుని ఢిల్లీకి వెళతామని తెలిపారు.

ఒకే వేదికపై సీఎం, డిప్యూటీ సీఎం.. కానీ, మాటల్లేవ్

ఓవైపు కుర్చీలాట కొనసాగుతున్నా.. సిద్ధు, డీకే శుక్రవారం బెంగళూరు ప్యాలెస్ మైదానంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒకే వేదికను పంచుకున్నారు. పక్కపక్కనే కూర్చొన్నప్పటికీ మాట్లాడుకోలేదు. ఇద్దరు నేతలు చూసీ చూడనట్లుగా ప్రవర్తించడం గమనార్హం. డీకే కుర్చీలో కూర్చొనే సమయంలో సిద్ధు వైపు చూసేందుకు ప్రయత్నించలేదు. ఇదంతా గమనించిన సిద్ధు ఆహ్వాన పత్రం చదువుకుంటూ ఉండిపోయారు.

జోరందుకున్న విందు రాజకీయాలు

అధికార మార్పిడిపై సీఎం, డిప్యూటీ సీఎం వర్గాలు ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. ఎప్పటికప్పుడు నేతలతో రహస్య చర్చలు, సమావేశాలు నిర్వహిస్తూ తమ వర్గాన్ని బలపరుచుకునే ప్రయత్నాలు సాగిస్తున్నాయి. దీంతో బ్రేక్‌ఫాస్ట్, డిన్నర్ పాలిటిక్స్ జోరందుకున్నాయి. శుక్రవారం మంత్రి కేహెచ్ మునియప్ప నివాసంలో అహింద నాయకుల సమావేశం జరిగింది. ఇందులో ఏఐసీసీ కార్యదర్శి మోహన్ కూడా పాల్గొన్నారు. ఈ అల్పాహార విందులో హైకమాండ్ వద్ద పరపతి ఉన్న ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ కూడా పాల్గొనడం విశేషం. వీరితోపాటు మాజీ మంత్రి ఆంజనేయ, మాజీ ఎంపీ చంద్రప్ప, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణయ్య తదితరులు గంటకుపైగా సమావేశమై ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించుకున్నారు. ఏ ఒక్కరి వల్లనో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని, అనేక సామాజికవర్గాలు, సంఘాలు, కాంగ్రేసేతర సంస్థలు శ్రమించాయని బీకే హరిప్రసాద్ స్పష్టం చేశారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలను అధిష్ఠానం చాలా సీరియస్‌గా తీసుకుందని, ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఒక మంచి నిర్ణయాన్ని వెల్లడిస్తుందన్నారు. మునియప్ప మాట్లాడుతూ అధికార మార్పిడి వివాదాన్ని హైకమాండ్ వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. అవసరమైతే తాను కూడా వెళ్లి హైకమాండ్‌తో మాట్లాడతానని వెల్లడించారు.

డీకేకు మద్దతుగా ఒక్కలిగలు

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పట్టనాయకనహళ్లికి చెందిన నంజావధూత స్వామిజీతో సమావేశమవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అధికార మార్పిడిపై మాట తప్పితే పరమాత్మ అభినందించడని నంజావధూత పదేపదే మాట్లాడుతూ డీకేకు మద్దతుగా నిలుస్తుండడం గమనార్హం. కాగా, డీకే శివకుమార్ సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్ ఢిల్లీ చేరుకుని అధిష్ఠానం పెద్దలతో మాట్లాడే ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పటికే ఢిల్లీకి వెళ్లి డీకేను సీఎం చేయాలనే తమ డిమాండ్ వినిపించారు.

నమ్మకాన్ని మించిన గుణం లేదు

అన్ని వర్గాలు నాకు మద్దతు ఇస్తున్నాయి నా కులం కాంగ్రెస్ పార్టీ..: డీకే

'ఇచ్చిన మాట' విషయమై గురువారం సిద్ధు, డీకే మధ్య ట్వీట్ల వార్ జరిగిన సంగతి తెలిసిందే. ఇక శుక్రవారం ఓ బహిరంగ సమావేశంలో డీకే చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయంగా మారాయి. ''నిమ్మ కంటే పులుపైన వస్తువు ఇంకోటి లేదు. శంభు అంటే పరమేశ్వరుడు. ఆయన కంటే దేవుడు లేదు. నమ్మకం కంటే ఇంకో గుణం లేదు'' అంటూ సర్వజ్ఞ వచనాలను ఉటంకిస్తూ హైకమాండ్‌పై తన నమ్మకాన్ని, విశ్వాసం గురించి పరోక్షంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ముందు మీడియాతో ఆయన మాట్లాడుతూ ''ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నాకు దేవాలయం. ఢిల్లీలో మాకు ఎన్నో ముఖ్యమైన పనులుంటాయి. అందుకే అక్కడికి వెళ్తుంటాం. నాకు ఎలాంటి సామాజికవర్గాల వ్యాఖ్యానాలు, మద్దతు అవసరం లేదు. నా కులం కాంగ్రెస్ పార్టీ. అన్ని వర్గాలు నాకు మద్దతుగా ఉన్నాయి. ఏ ఒక్క వర్గానికో నేను పరిమితం కాదు'' అని పేర్కొన్నారు.

సీఎంకు మద్దతుగా కురబలు

డీకే వర్గం ప్రయత్నాలకు ప్రతిగా సిద్ధు వర్గం మంత్రులు, ఎమ్మెల్యేలు గళం వినిపిస్తున్నారు. ఐదేళ్లు సిద్ధునే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రులు సంతోష్‌లాడ్, జమీర్ అహ్మద్‌ఖాన్, హెచ్‌సీ మహదేవప్ప, రామలింగారెడ్డి తదితరులు, పలువురు ఎమ్మెల్యేలు వీరిలో ఉన్నారు. సిద్ధు సొంత సామాజిక వర్గం కురుబ వర్గానికి చెందిన స్వామిజీలు, నేతలు ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. బలప్రదర్శనకు కూడా కురుబలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

'ఈనాడు' బరితెగింపు..

అవే అబద్ధాలు.. అదే దుష్ప్రచారం

- ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసు పేరిట వైఎస్ జగన్‌పై విష ప్రచారం
- చిన్న వ్యాపారాలు చేసుకునే సునీల్‌రెడ్డి.. వైఎస్ జగన్‌కు సన్నిహితుడంటూ అవాస్తవాలు
- కేవలం ముఖ పరిచయం ఉన్నవారిని బినామీలని చిత్రీకరణ
- ఆ సూత్రం ప్రకారం.. రామోజీ కుటుంబం, రాధాకృష్ణ, బీఆర్ నాయుడు, గీతం మూర్తి.. చంద్రబాబుకు బినామీలనుకోవాలా?
- ఎమ్మార్ కేసుతో వైఎస్ జగన్‌కు ఏం సంబంధం?.. అసలు ఎమ్మార్ ప్రాపర్టీస్‌కు భూములిచ్చిందే బాబు.. ఇస్తేగిస్తే ముడుపులు ఆయనకే ఇవ్వాలి!
- కాంగ్రెస్, టీడీపీ కుమ్మక్కు కుట్రతోనే వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు

సాక్షి, అమరావతి: టీడీపీ భజంత్రీ పత్రిక, దుష్ప్రచార విష పుత్రిక 'ఈనాడు' మరోసారి తన మార్కు కుట్రకు బరితెగించింది! దశాబ్దాలుగా అవాస్తవాలు వండివార్చి నిత్యం ఉషోదయంతో ప్రజలను తప్పుదారి పట్టించే కుతంత్రాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది. ఎన్నికల మేనిఫెస్టో అమలులో దారుణంగా విఫలమైన చంద్రబాబుకు రక్షా కవచంగా మరోసారి దుష్ప్రచారానికి దిగింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏమాత్రం సంబంధంలేని ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసుతో ఆయనకు ముడిపెట్టేందుకు యత్నిస్తోంది. ఆ కేసులో నిందితుడుగా ఉన్న సునీల్‌రెడ్డి ఆయనకు సన్నిహితుడు అంటూ నిస్సిగ్గుగా అవాస్తవ కథనాన్ని ప్రచురించి తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. సునీల్‌రెడ్డిని సిట్ విచారించిన సమాచారాన్ని వార్తా కథనంగా ప్రచురిస్తూ, అందులో ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసు వివరాలను వక్రీకరిస్తూ దుష్ప్రచారానికి తెగబడింది. కేవలం ముఖ పరిచయం ఉన్నవారిని బినామీలని చిత్రీకరిస్తోంది. మరి అదే సిద్ధాంతం ప్రకారం.. చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన రామోజీ కుటుంబం, రాధాకృష్ణ, బీఆర్ నాయుడు, గీతం మూర్తి ఆయనకు బినామీలనుకోవాలా? చిన్నా చితక వ్యాపారాలు చేసుకుంటున్న సునీల్‌రెడ్డి దుబాయ్‌లో పెట్టుబడులు పెట్టాడని, వైఎస్ జగన్‌కు సన్నిహితుడని ఎల్లో మీడియా బురద చల్లుతోంది. లేని ఆస్తులను, లేని నగదును సునీల్‌వంటూ దుష్ప్రచారం చేస్తోంది. అసలు ఎమ్మార్ కేసుతో వైఎస్ జగన్‌కు ఏం సంబంధం? ఈ వ్యవహారంతో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని సీబీఐ చార్జిషీట్‌లోనే పేర్కొంది. ఇంకా చెప్పాలంటే.. ఆ కంపెనీకి నాడు భూములిచ్చిందే చంద్రబాబు. దాని ప్రమోటర్ ఆయనకు అత్యంత సన్నిహితుడు. ఇస్తేగిస్తే చంద్రబాబుకే ముడుపులివ్వాలి! వైఎస్ జగన్‌పై అక్రమ కేసుల నమోదు చంద్రబాబు, నాడు కాంగ్రెస్ కుట్రే! టీడీపీ నేతలతో కలసి కేసులు వేయించి నాడు కిరణ్‌కుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారును కాపాడింది చంద్రబాబే!

ఏది నిజం?

'ఈనాడు' దుష్ప్రచార కుట్ర

తన పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే చంద్రబాబు డైవర్షన్ కుట్రలో భాగంగానే ఈనాడు పత్రిక ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసును వక్రీకరిస్తూ కథనాన్ని ప్రచురించింది. ఆ కేసులో ఏ–7గా ఉన్న హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, చిన్నా చితకా వ్యాపారాలు చేసుకునే నర్రెడ్డి సునీల్‌రెడ్డి మాజీ సీఎం వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడని చెప్పుకొచ్చింది. ఆయన చెప్పిన పనులను ఎడమ చేతికి తెలియకుండా నమ్మకంగా పని చేసే కుడిభుజం అంటూ పచ్చి అవాస్తవాలు ప్రచురించడం విస్మయపరుస్తోంది. ఈ పదేళ్లలో కలిసినట్లు ఒక్క ఫొటో చూపగలదా? చూపలేదు. ఎందుకంటే దశాబ్దంపైగా వైఎస్ జగన్‌ను సునీల్‌రెడ్డి ఏనాడూ వ్యక్తిగతంగా కలవనే లేదు. అయినప్పటికీ ఎల్లో మీడియా పాత ఫోటో ప్రచురించి విష ప్రచారానికి తెగబడింది. సునీల్‌రెడ్డి గత కొన్నేళ్లలో వైఎస్ జగన్‌ను ఎప్పుడైనా కలిసినట్లు ఈనాడు గానీ, చంద్రబాబు గానీ చూపించగలరా..?

ఆ కుటుంబాల ఆస్తులన్నీ బాబు బినామీయేనా...!

ఫొటోలు దిగితేనే సన్నిహితుడు, బినామీ అయితే... చంద్రబాబు, లోకేశ్ ఎందరెందరితోనో ఫొటోలు దిగుతూ ఉంటారు. వారంతా ఆ తండ్రీకుమారులకు బినామీలుగానే పరిగణించాలా మరి...! అసలు క్విడ్‌ప్రోకో, బినామీ అనే పదాలు చంద్రబాబుకే వర్తిస్తాయి. 'ఈనాడు' రామోజీరావు కుటుంబం, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ కుటుంబం, టీవీ 5 బీఆర్ నాయుడు కుటుంబం, విశాఖపట్నం టీడీపీ ఎంపీ ఎం. భరత్ కుటుంబం... ఇలా ఈ జాబితాకు అంతే లేదు. వారందరూ చంద్రబాబుకు అత్యంత సన్నిహితులే కాదు... ఆయన రాజకీయ కుట్రలో భాగస్వాములు కూడా. 1995లో వైస్రాయ్ హోటల్ ఎపిసోడ్‌తో ఎన్టీరామారావుకు వెన్నుపోటు కుట్రలో వారందరూ భాగస్వాములే కదా. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టగానే రామోజీ కుటుంబ అక్రమ ఆర్థిక సామ్రాజ్య విస్తరణకు పూర్తిగా సహకరించారు. ఎన్టీ రామారావు అమలు చేసిన సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని తొలగించారు. రామోజీ ఫిల్మ్ సిటీ వ్యాపార ప్రయోజనాల కోసమే ఇదంతా చేశారు. టీడీపీ ప్రభుత్వ అండతోనే రామోజీ రావు కుటుంబం రంగారెడ్డి జిల్లాలో వేలాది ఎకరాల అసైన్డ్ భూములను చెరబట్టి ఫిల్మ్ సిటీ నిర్మించింది. ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిటర్స్ రూ.వేల కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలకు పాల్పడింది. అదే రీతిలో ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, విశాఖపట్నంలో 'గీతం' ఎంవీవీఎస్ మూర్తి (ప్రస్తుత టీడీపీ ఎంపీ భరత్ తాత) కుటుంబాల ఆస్తులు అమాంతంగా పెరిగిన విషయం బహిరంగ రహస్యమే. అదంతా చంద్రబాబు క్విడ్ ప్రోకో కుట్రనే. అంటే రామోజీ కుటుంబం, రాధాకృష్ణ, టీవీ 5 బీఆర్ నాయుడు, 'గీతం' ఎంవీవీఎస్ మూర్తి కుటుంబాల ఆస్తులన్నీ చంద్రబాబు బినామీ ఆస్తులేనన్నది స్పష్టమవుతోంది.

'ఎమ్మార్ ప్రాపర్టీస్'కు భూములిచ్చింది బాబే

అసలు వాస్తవం ఏమిటంటే... ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రాజెక్టుకు 1999–2004 మధ్య టీడీపీ హయాంలో ఆమోదం తెలిపింది అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబే. భూములు కేటాయించింది అప్పటి టీడీపీ ప్రభుత్వమే. ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రమోటర్లు, డైరెక్టర్లు చంద్రబాబుకే సన్నిహితులు.

బాబు కుట్రతోనే వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు

వైఎస్ జగన్‌పై అక్రమ కేసుల నమోదు చంద్రబాబు, అప్పటి కాంగ్రెస్ కుట్రేనన్నది బహిరంగ రహస్యం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణానంతరం కాంగ్రెస్ అధిష్ఠానంతో జట్టు కట్టి చంద్రబాబు ఈ కుట్రకు తెరతీశారు. అప్పటి కాంగ్రెస్ మంత్రి శంకర్‌రావు, టీడీపీ నేతలు అశోక్ గజపతిరాజు, ఎర్రన్నాయుడు కలిసే వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలు చేయడమే అందుకు తార్కాణం. ఇక అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు అప్పటి కిరణ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడింది చంద్రబాబే. ఆ విధంగా కాంగ్రెస్, టీడీపీ కలిసే వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు నమోదు చేయించాయన్న వాస్తవం ప్రజలందరికీ తెలుసు. అదే కుట్రను కొనసాగిస్తూ ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసు పేరిట వైఎస్ జగన్‌పై ఈనాడు పత్రిక విష ప్రచారం చేస్తోంది. చంద్రబాబు ఆదేశాలతోనే అవాస్తవ కథనాలను ప్రచురిస్తోంది.

కూతురు సునీతే అంతా చేశారు

- మానసికంగా, ఆర్థికంగా తీవ్ర వేధింపులకు గురిచేశారు
- వైఎస్ వివేకా రెండో భార్య ఇదే వాంగ్మూలమిచ్చారు
- అడుగడుగునా హంతకుడిని కాపాడేందుకు సునీత చర్యలు
- అయినా ఆ దిశగా దర్యాప్తు జరపని సీబీఐ అధికారులు
- మూడేళ్ల దర్యాప్తు చేశారు.. ఇంకా ఎన్నాళ్లు కావాలి
- ట్రయల్ ప్రారంభం ఎప్పుడు.. పూర్తయ్యేది ఎన్నడు?
- మరింత లోతైన దర్యాప్తు కోరడంలో అర్థంలేదు
- సీబీఐ కోర్టులో ప్రతివాదుల వాదనలు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని ఆయన కూతురు నర్రెడ్డి సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి మానసికంగా, ఆర్థికంగా తీవ్ర వేధింపులకు గురిచేశారని సీబీఐ కోర్టుకు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు విన్నవించారు. ఆయనకు కనీసం తిండి పెట్టేవారు లేకుండా చేశారంటూ వివేకా రెండో భార్య షమీమ్ ఇచ్చిన వాంగ్మూలాన్ని చదివి వినిపించారు. 'బావమరిది, భార్య కూడా ఆయనను చేరదీయలేదు. కుమారుడి గురించి ఆందోళన చెందారు. ఆయన చెక్‌పవర్ తొలగించి, ఆర్థిక దిగ్బంధం చేశారు. కుమారుడి పేరిట కొంత ఆస్తి ఇవ్వాలని భావించినా కూతురు, అల్లుడు, బావమరిది అడ్డుకున్నారు' అంటూ ఆమె వాంగ్మూలంలో పేర్కొన్న అంశాలను ప్రస్తావించారు. కొంత డబ్బును ఆమెకు ఇవ్వాలనుకున్న క్రమంలో హత్యకు గురయ్యారని పేర్కొన్నారు. ఇంత స్పష్టంగా వాంగ్మూలం ఇచ్చినా సీబీఐ అధికారులు ఆ దిశగా దర్యాప్తు చేయకపోవడం ఆశ్చర్యకరమని నివేదించారు. హత్యకు ముందు వివేకా రాసిన లేఖను కూడా అల్లుడు మాయ చేసేందుకు యత్నించారన్నారు. హంతకుడు షేక్ దస్తగిరికి అనుకూలంగా వ్యవహరిస్తుండటం తీవ్ర అనుమానాస్పదమని వివరించారు. వైఎస్ వివేకా హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు చేపట్టేలా కేంద్ర దర్యాప్తు సంస్థను ఆదేశించాలని కోరుతూ సీబీఐకోర్టులో సునీత పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి డాక్టర్ టి.రాఘురామ్ శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు కోర్టుకు వాదనలు వినిపించారు. అనంతరం తదుపరి వాదనల నిమిత్తం పిటిషన్‌ను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. ప్రతివాదుల తరఫు వాదనల్లో ముఖ్యాంశాలు...

ఇతరులను ఇరికించడమే ఉద్దేశం..

'కూతురు, అల్లుడితో తీవ్ర ఆర్థిక, కుటుంబ విభేదాలున్న అంశాన్ని కూడా ఈ కోర్టు పరిగణనలోకి తీసుకోవాలి. అనుమానం వారిపైకి రాకుండా ఉండేందుకు ఇతరులపై మళ్లించే ప్రయత్నం జరుగుతోంది. అవినాశ్‌రెడ్డి ఓ పార్టీ ఎంపీ కావడంతో ఆయనను నేరుగా ఎదుర్కోలేక అక్రమ మార్గంలో ఎదుర్కొనడానికి మరో వర్గం సునీతను ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగానే పిటిషన్లపై పిటిషన్లు దాఖలవుతున్నాయి. రాజకీయంగా కొందరిని ఇరికించాలన్నదే ప్రధాన ఉద్దేశ్యం. సునీత అంతా తాను అనుకున్నట్లే జరగాలని భావిస్తున్నారు. ఈ తీరు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. చార్జిషీట్ దాఖలయిన చాలా కాలం తర్వాత.. రోజువారీ విచారణ చేసి ఆరు నెలల్లో పూర్తి చేసేలా సీబీఐ కోర్టును ఆదేశించాలంటూ సునీత హైకోర్టులో (సీఆర్‌ఎల్‌పీ 1270/2025) దాఖలు చేశారు. ఈ పిటిషన్ ఇంకా పెండింగ్‌లో ఉంది. ఇప్పుడు ఇంకా దర్యాప్తు కోరుతూ పిటిషన్ వేశారు. ఒక్కో కోర్టులో ఒక్కో విధంగా పిటిషన్లు వేస్తూ న్యాయస్థానం విలువైన సమయాన్ని వృథా చేయడమే కాకుండా ట్రయల్‌ను అడ్డుకుంటున్నారు' అని న్యాయవాది నివేదించారు.

ఎన్నాళ్లు కోర్టు చుట్టూ తిరగాలి..

'చార్జిషీట్, రెండు అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేసి ఏళ్లు గడుస్తున్నా.. ట్రయల్ ఇంకా ప్రారంభం కాలేదు. సాక్ష్యాధారాలు లేకుండా నిందితులుగా చేర్చిన వారు ఎన్నాళ్లు కోర్టు చుట్టూ తిరగాలి? అది వారికున్న రాజ్యాంగ హక్కులను హరించడమే. ఏ కేసులోనైనా నిందితుల హక్కులను హరించే అధికారం ఎవరికీ లేదు. ఇదే విషయాన్ని ఇటీవల సుప్రీంకోర్టు పేర్కొంది. వీలైనంత సత్వరం విచారణ పూర్తి చేసి తీర్పులివ్వాలని ఆదేశించింది. ఈ కేసులో శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా కూడా అత్యున్నత న్యాయస్థానం ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. దర్యాప్తు చేయమని కోర్టు ఆదేశిస్తే చేస్తామని సీబీఐ చెప్పడం సబబుకాదు. హత్య జరిగి దాదాపు ఏడేళ్లు కావొస్తున్నా ఇంకా దర్యాప్తు కొనసాగిస్తూపోతే విచారణ ముగిసేదెప్పుడు? దర్యాప్తు కొనసాగింపు అవసరం లేదు'అని ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

రికార్డులు రాస్తాం.. రారండి..



ఇంటర్ విద్య.. పరీక్షలు ప్రహసనంలా మారుతున్నాయి. ర్యాంకులే పరమావధిగా భావిస్తున్న యాజమాన్యాలు.. విద్యార్థుల్లో నైపుణ్యాలను తీర్చిదిద్దేలా ఏ మాత్రం చొరవ చూపలేకపోతున్నాయి. తాజాగా జరుగుతున్న పరిణామాలే ఈ ఉదంతాలకు అద్దం పడుతున్నాయి. వాస్తవానికి ఇందులో రికార్డులు రాయడాన్ని పెద్ద ప్రాజెక్టుగా గతంలో భావించేవారు. దీంతో సబ్జెక్టుల్లో ప్రావీణ్యాన్ని సాధించేవారు. అయితే ప్రస్తుతం రికార్డులు అనే అర్థాన్నే సమూలంగా మార్చేశారు. అద్దె ప్రాతిపదికన రికార్డులు రాసేందుకు నెల్లూరు నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బోర్డులు వెలియడం గమనార్హం. మరికొందరు గ్రూపులుగా ఏర్పడి ఒక్కో దానికి ఒక్కో ధరను నిర్ణయించి.. సోషల్ మీడియాలో ప్రచారాలు చేస్తుండటం విస్మయానికి గురిచేస్తోంది.

సోషల్ మీడియాలో ప్రచారం

ప్రోత్సహిస్తున్న కళాశాలల నిర్వాహకులు

క్యూ కడుతున్న విద్యార్థులు

ర్యాంకులే తప్ప నైపుణ్యాలపై దృష్టి సారించని యాజమాన్యాలు

ప్రహసనంలా మారిన ఇంటర్ పరీక్షలు

ఇదే అంశమై వెలసిన బోర్డులు

నెల్లూరు జిల్లాలో ఇలా..	జూనియర్ కళాశాలలు 185	విద్యార్థులు 30వేల మందికిపైగా
		ఎంపీసీ, బైపీసీ 25 వేల మంది

నెల్లూరు(టౌన్): విద్యార్థి జీవితాన్ని నిర్ణయించేది ఇంటర్ విద్యే. ఇందులో ఎంత బాగా చదివి.. అంత బాగా విద్యను ఆకళింపు చేసుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవడం సులభమవుతుంది. అయితే ప్రస్తుతం మార్కులు.. ర్యాంకులే పరమావధిగా భావిస్తున్న యాజమాన్యాలు వీటిని ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. రోజుకో రకంగా వ్యవహరిస్తూ తమ సంస్థల పేరు ప్రతిష్టలు పెంచుకునేందుకే పెద్దపీటేస్తున్నాయి.

బయటే రాయించుకోండి..!

ఇంటర్‌లో పాఠ్యాంశాలను చదవడం ఓ ఎత్తయితే.. ఫిజిక్స్, కెమిస్ట్రీ.. బోటనీ.. జువాలజీకి సంబంధించిన రికార్డులు రాయాల్సి ఉండటం మరో చాలెంజ్. దీని ద్వారా సదరు సబ్జెక్టుల్లో మంచి పట్టు సాధించేందుకు అవకాశం ఉంటుంది. గతంలో ఈ వ్యవహారం పక్కాగా సాగేది. అయితే ప్రస్తుతం యాజమాన్యాలు తమ తీరును మార్చుకుంటున్నాయి. రికార్డులను బయటే రాయించుకోవాలంటూ వీరు పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. ఈ పరిణామాల క్రమంలో వీటిని రాసే దుకాణాలు, వ్యక్తుల వద్దకు విద్యార్థులు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

రసాయనాలా.. అంటే..?

ప్రాక్టికల్స్‌లో ఏయే రసాయనాలు ఉంటాయనే అంశం చాలా మంది విద్యార్థులకు తెలియదంటే అతిశయోక్తి కాదు. ఇందులో ఏదో ఒక తరహాలో ప్రలోభాలు పెట్టి మార్కులేయించొచ్చనే ధీమాతో థియరీపైనే యాజమాన్యాలూ దృష్టి సారిస్తున్నాయి. నైపుణ్యాలు, విలువలతో కూడి విద్యను విస్మరించి.. బట్టీ కొట్టుడు విధానాలకే జై కొడుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

నెల్లూరు జిల్లాలో 185 జూనియర్ కళాశాలలుండగా.. కార్పొరేట్, ప్రైవేట్‌కు సంబంధించనవే 119 ఉన్నాయి. ఇందులో ఎంపీసీకి సంబంధించి 18 వేలు.. బైపీసీ చదువుతున్న వారు ఏడు వేల మంది ఉన్నారు. మరోవైపు ప్రాక్టికల్స్‌ను ఫిబ్రవరి ఒకటి నుంచి నిర్వహించనున్నామంటూ షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు ప్రకటించింది. రికార్డులను డిసెంబర్ నెలాఖరులోపు అందజేయాల్సి ఉంది. ప్రాక్టికల్స్‌లో రికార్డులనూ పరిగణనలోకి తీసుకోనున్నారు. ఫిజిక్స్‌లో 20.. కెమిస్ట్రీలో 35.. బోటనీలో 65.. జువాలజీలో 50 ప్రయోగాలకు సంబంధించి రికార్డులు రాయాల్సి ఉంది. అయితే బయట ఎవరితోనైనా రాయించుకోవాలంటూ యాజమాన్యాలు ప్రోత్సహిస్తున్నాయి. దీంతో విద్యార్థులు సైతం దానికే మొగ్గు చూపాల్సి వస్తోంది.

యాజమాన్యాల అదనపు వసూళ్లు

కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు మాత్రం ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థుల వద్ద రూ.1500 నుంచి రూ.రెండు వేల వరకు వసూలు చేస్తున్నాయి. రికార్డులెవరు రాసినా.. సక్రమంగా లేకపోయినా.. ప్రాక్టికల్స్‌లో మార్కులేయించేందుకు ఈ మొత్తాన్ని తీసుకుంటున్నామని బహి రంగంగానే చెప్తున్నారు.



సోషల్ మీడియాలో వ్యాప్తిలో ఉన్న పోస్ట్

ముడుపుల మత్తులో జోగుతూ..

కార్పొరేట్ యాజమాన్యాల ఆగడాలు జిల్లా ఇంటర్ బోర్డు అధికారులకు తెలిసినా, వారి నుంచి ముడుపులు పుచ్చుకొని మిన్నకుండిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఏ కార్పొరేట్ కళాశాలలోనూ విద్యార్థులకు ప్రాక్టికల్స్ క్లాసులను నిర్వహిస్తున్న పరిస్థితి లేదు. రికార్డులను బయట రాయిస్తున్నారనే విషయం తెలిసినా ఏ మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒక్కో దానికి.. ఒక్కో రేటు

ఈ వ్యవహారాల నడుమ రికార్డులు రాసేందుకుగానూ నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో దుకాణాలు, వ్యక్తులు గ్రూపులుగా ఏర్పడి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేసుకుంటున్నారు. సబ్జెక్టుల వారీగా ధరనూ నిర్ణయించారు. ఫిజిక్స్‌కు రూ.780 నుంచి రూ.800.. కెమిస్ట్రీకి రూ.820 నుంచి రూ.900.. బోటనీకి రూ.880 నుంచి రూ.900.. జువాలజీకి రూ.920 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. రికార్డుల్లో పొందుపర్చాల్సినవన్నీ తమ బాధ్యతేననీ చెప్తున్నారు. దీనికిగానూ అడ్వాన్స్‌ను ముందే పుచ్చుకుంటున్నారు. వీటిని వారం, పది రోజుల్లో పూర్తి చేస్తున్నారు.

మా దృష్టికొచ్చింది

రికార్డులను బయట రాయిస్తున్నారనే విషయం నా దృష్టికొచ్చింది. ఆయా కళాశాలల నుంచి కొన్ని రికార్డులను తెప్పించి పరిశీలిస్తా. వీటిని విద్యార్థులే రాయాల్సి ఉంటుంది. ఇలాంటి వాటిని యాజమాన్యాలు ప్రోత్సహించకూడదు. ప్రతి కళాశాలలో ప్రాక్టికల్స్ తరగతులను నిర్వహించేలా చర్యలు చేపట్టాం.

– వరప్రసాద్‌రావు, ఆర్ఐఓ

విద్యార్థి మిత్ర కిట్‌ల కొనుగోలుకు ఆదేశాలు

సాక్షి, అమరావతి: సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌ల కొనుగోలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2026–27కిగాను వీటి సేకరణకు విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్ చివరి నాటికి టెండర్లు ఖరారు చేసి సరఫరాకు ఆదేశాలు ఇవ్వనున్నారు. ఈ కిట్లను వచ్చే ఏడాది జూన్ 12న విద్యార్థులకు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

టీచర్లకు సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలి

సీఎం చంద్రబాబుకు ఆప్టా లేఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయులకు వెంటనే సరెండర్ లీవ్ బకాయిలను చెల్లించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు శుక్రవారం సీఎంకు లేఖ రాశారు. వెకేషన్ డిపార్ట్‌మెంట్ కాబట్టి ఉపాధ్యాయులకు ఏడాదికి 6 మాత్రమే సరెండర్ లీవ్‌లు వస్తాయని, వాటిని ఎన్‌క్యాష్ చేసుకోవాడానికి వెళ్లితే ఏళ్లతరబడి పెండింగ్ పెట్టారన్నారు.

నిధులు రాబట్టాలి

ఎంపీలకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సూచన

సాక్షి,అమరావతి: రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు నిధులు మంజూరయ్యేలా ఎంపీలు చురుకైన పాత్ర పోషించాలని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆ పార్టీ ఎంపీలకు సూచించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సిన విధానాలపై శుక్రవారం దిశానిర్దేశం చేశారు. పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ కేంద్ర పథకాల ద్వారా మంజూరయ్యే నిధులు, ఈ ఆర్థిక సంవత్సరం రావాల్సిన నిధులు రాబట్టేలా కేంద్ర మంత్రులతో చర్చించాలని పేర్కొన్నారు. జాతీయ ప్రయోజనాలపై జరిగే చర్చల్లో గళం విప్పాలని సూచించారు. సమావేశంలో ఎంపీలు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్లాస్ట్‌ఫర్నేస్ కన్వేయర్‌ను కోసిన గుర్తు తెలియని వ్యక్తులు

స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3కు చెందిన మెయిన్ చార్జింగ్ కన్వేయర్ (ఎంబీ–2)ను గుర్తు తెలియని వ్యక్తులు కోసేశారు. దీంతో బీఎఫ్–3 ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. దీనిపై స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం శుక్రవారం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విభాగం డీజీఎం (ఆపరేషన్స్) కె.సాల్మన్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... ఈనెల 22న ఫర్నేస్ షట్‌డౌన్ సందర్భంగా ఎంబీ–2కు కొత్త కన్వేయర్ అమర్చారు. అప్పటి నుంచి ఉత్పత్తి ప్రక్రియ కొనసాగుతుంది. ఈనెల 25న సాయంత్రం 5 గంటలకు ఆయనకు కన్వేయర్ ఆగినట్టు సమాచారం అందింది. అక్కడకు వెళ్లి చూడగా ఎంబీ–2 బెల్ట్ కోసి వేయబడి ఉంది. అధికారులు పరిశీలించగా అది కావాలని కోసినట్టు గుర్తించారు. దాని వల్ల విభాగం ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఆ కన్వేయర్ ఖరీదైనది మాత్రమే కాకుండా దానిని మరమ్మతులు చేయడానికి అధిక వ్యయం అవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూడ్ చిత్రం నుంచి ఆ పాటను తొలగించండి

చిత్ర నిర్మాణ సంస్థకు మద్రాసు హైకోర్టు ఆదేశం

తమిళ సినిమా(చెన్నై): డ్యూడ్ చిత్రంలోని 'కరుత్త మచ్చాన్' పాట ఇళయరాజా పాత పాటల పవిత్రతను దెబ్బతీసేలా ఉందని, తక్షణమే దాన్ని తొలగించాలని చిత్ర నిర్మాణ సంస్థను మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఎన్.సెంథిల్‌కుమార్ ఆదేశించారు. వివరాల్లోకెళ్తే.. ఇళయరాజా గతంలో సంగీతం అందించిన చిత్రాల్లోని 'కరుత్త మచ్చాన్' 'నూరు వరుషం' అనే పాటలను ఆయన అనుమతి లేకుండా ఈ చిత్రంలో వాడుకున్నారు. దీంతో తన అనుమతి లేకుండా ఆ పాటలను వాడుకున్నారని, తక్షణమే చిత్రం నుంచి ఆ పాటను తొలగించాల్సిందిగా ఇళయరాజా మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి తక్షణమే ఆ పాటను తొలగించాలని చిత్ర నిర్మాణ సంస్థను ఆదేశించారు. కాగా తాము ఉపయోగించిన పాటల హక్కులు సోనీ సంస్థ పొందిందని, ఆ సంస్థ నుంచి తాము అనుమతి పొందినట్లు చిత్ర నిర్మాణ సంస్థ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆ పాటను తొలగించడానికి 7 రోజులు గడువు కావాలని కోరారు. దీనికి నిరాకరించిన న్యాయమూర్తి రిట్ పిటిషన్ దాఖలు చేయాల్సిందిగా చిత్ర నిర్మాణ సంస్థకు ఆదేశాలు జారీ చేసి, విచారణను జనవరి 7కి వాయిదా వేశారు.

ఒకే చోట చేనేత, హస్త కళ, జీసీసీ ఉత్పత్తుల అమ్మకాలు

మంత్రి సవిత

సాక్షి, అమరావతి: ఒకే చోట ఆప్కో, లేపాక్షి, గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఉత్పత్తులను విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. విజయవాడలో శుక్రవారం చేనేత, జౌళి శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఆప్కో, లేపాక్షి, అరకు కాఫీతో కూడిన జీసీసీ ఉత్పత్తుల వాణిజ్య సముదాయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేశంలో ప్రధాన నగరాలైన ఢిల్లీ, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తిరుపతిలో డిసెంబర్ 20 నుంచి జనవరి 10వ తేదీ వరకు 22 రోజులపాటు చేనేత, హస్త కళల ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. దేశవ్యాప్త లేపాక్షి వారోత్సవాల్లో భాగంగా ఏపీలో వచ్చే నెల 8 నుంచి 14వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

అణగారిన వర్గాలు, స్త్రీల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనుభావుడు జ్యోతిరావు పూలే అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్. సవిత కొనియాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. దేశం గర్వించదగ్గ సంఘ సంస్కర్తల్లో పూలే ముందు వరుసలో ఉంటారన్నారు. అణగారిన వర్గాలు, స్త్రీల అభ్యున్నతి కోసం ఆయన ఎంతో కృషిచేశారన్నారు.

పెంచలయ్య హత్యను ఖండించిన సీపీఎం

సాక్షి, అమరావతి: నెల్లూరు పట్టణం వేదాయపాళెం సమీపంలో ఆర్డీటీ కాలనీలో సీపీఎం యువనాయకుడు, కళాకారుడు కె.పెంచలయ్య హత్యను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అసాంఘిక గంజాయి గూండాల దాడిలో హత్యకు గురైన పెంచలయ్య మృతికి సంతాపం ప్రకటించారు. హత్య చేసిన గూండాలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలో గంజాయి బారిన పడకుండా యువతను చైతన్య పరుస్తున్నందున ఓర్చుకోలేని గంజాయి వ్యాపారం చేస్తున్న ముఠా ఈ అఘాయిత్యానికి పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ముఠాలను కఠినంగా అణచి వేయాలని శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

సినీ నటులు అంబిక, రాధకు మాతృవియోగం

తమిళ సినిమా (చెన్నై): సీనియర్ నటీమణులు అంబిక, రాధ తల్లి సరసమ్మ(86) గురువారం కన్నుమూశారు. కేరళకు చెందిన ఆమె కొన్నేళ్ల క్రితం చెన్నైలో స్థిరపడ్డారు. ఈమెకు మల్లిక అనే మరో కూతురు, మల్లికార్జున్, సురేశ్ అనే ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. సరసమ్మ భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. సరసమ్మ, మహిళల హక్కుల కోసం పోరాటం చేశారు. అలా ఆమె కేరళ రాష్ట్ర రాజకీయాల్లోకి ప్రవేశించి 2014 వరకూ కేరళ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పని చేశారు. కాగా, ప్రస్తుతం కేరళలోని స్వగ్రామం కల్లారాలో నివశిస్తున్న సరసమ్మ వృద్ధాప్యం కారణంగా తుదిశ్వాస విడిచారు. ఆమె భౌతికకాయానికి శనివారం సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

సీఎం కుర్చీలో కూర్చొన్న డిప్యూటీ సీఎం

శివాజీనగర: బెంగళూరులోని ప్యాలెస్ మైదానంలో శుక్రవారం కర్ణాటక సమగ్ర శిశు అభివృద్ధి పథకం సువర్ణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ హాజరయ్యారు. వేదికపై నుంచి సీఎం సిద్దరామయ్య కొంతసేపు లేచి బయటికి వెళ్లారు. ఆ సమయంలో డీకే శివకుమార్ సీఎం కుర్చీలో కూర్చొని మార్గరెట్ ఆల్వాతో కొంతసేపు చర్చించారు. ఆ తరువాత ఆయన ముందుగా కూర్చొన్న సీట్లోకి వెళ్లారు. అంతలో బయటికి వెళ్లిన సీఎం సిద్దరామయ్య మళ్లీ తిరిగి వచ్చారు.

మంత్రి నిమ్మలతో కర్ణాటక మంత్రి బోసు రాజు భేటీ

సాక్షి, అమరావతి: జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడితో కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో సమావేశమయ్యారు. మంత్రాలయం ఎగువన కర్ణాటక పరిధిలో తుంగభద్రపై బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణానికి అంగీకరించాలని మంత్రి నిమ్మలను కర్ణాటక మంత్రి బోసు రాజు కోరారు. ఈ అంశంపై ప్రభుత్వంతో చర్చించి, నిర్ణయం చెబుతామని నిమ్మల చెప్పారు. తుంగభద్ర డ్యామ్ గేట్లను మార్చేందుకు రూ.54 కోట్లు మంజూరు చేశామని.. అందులో రూ.20 కోట్లు తుంగభద్ర బోర్డుకు విడుదల చేశామన్నారు. డ్యామ్‌కు కొత్త గేట్లను వేగంగా అమర్చేలా చర్యలు తీసుకోవాలని కర్ణాటక మంత్రి బోసు రాజును మంత్రి నిమ్మల కోరారు.

అన్న క్యాంటీన్‌లకు స్థాయి సలహా కమిటీలు

సాక్షి, అమరావతి: అన్న క్యాంటీన్‌లలో ఆహార పదార్థాల నాణ్యత, శుభ్రత, నిర్వహణ తదితర అంశాలపై పర్యవేక్షణకు స్థాయి సలహా కమిటీ(లెవల్ అడ్వైజరీ కమిటీ)లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మున్సిపల్ చైర్మన్/చైర్‌పర్సన్ లేదా జిల్లా ఇన్‌చార్జి మంత్రి నామినేట్ చేసిన కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ అన్న క్యాంటీన్ లెవల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అన్న క్యాంటీన్ పరిధిలోని వార్డుకు సంబంధించిన శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, వార్డు ఉమెన్, వీకర్ సెక్షన్స్ ప్రొటెక్షన్ సెక్రటరీ, స్థానిక స్వచ్ఛంద సంస్థ నుంచి ఒక ప్రతినిధి, స్వయం సహాయక సంఘాల నుంచి ఒకరు సభ్యులుగా ఉండే ఈ కమిటీకి అన్న క్యాంటీన్ నోడల్ ఆఫీసర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు శుక్రవారం పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొండలరావుకు ప్రత్యేక వసతులకు అనుమతి

విజయవాడలీగల్: అగ్నిమాపక శాఖకు పొరుగు సేవలు అందించకుండా నిధులు మంజూరు చేయించుకున్నారనే ఆరోపణలపై నమోదైన కేసులో విజయవాడ జైలులో ఉన్న బికిని కొండలరావుకు వసతులు కల్పించాలని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి పి.భాస్కరరావు శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. జైలులో మంచం, కుర్చీ, ఇంటి నుంచి రోజూ భోజనం, దోమతెర, ప్రోటీన్ పౌడర్, మినరల్ వాటర్, అవసరమైతే డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌పై మందులు ఏర్పాటు చేయాలని ఆదేశాలలో పేర్కొన్నారు. ఇదే కేసులో ఎ–1గా ఐపీఎస్ అధికారి సంజయ్ విజయవాడ జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న విషయం విదితమే.

శ్రీవారి దర్శనానిక కొనసాగుతున్న నమోదు ప్రక్రియ

తిరుమల: శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరుగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి మొదటి మూడు రోజుల ఆన్‌లైన్ ఈ–డిప్ భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన డిప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యాయి. మొదటి రెండు రోజుల్లో రికార్డు సాయిలో 17,40,686 మంది భక్తులు నమోదు చేసుకున్నారు. ఇందులో టీటీడీ వెబ్‌సైట్‌లో 2,57,938 మంది యూజర్లు రాగా 6,71,651 రిజిస్టర్ చేసుకున్నారు. ఇక మొబైల్ యాప్‌లో 3,85,263 మంది యూజర్లు రాగా 9,61,607 పేర్లు నమోదు చేసుకున్నారు. ఏపీ గవర్నమెంట్ వాట్సాప్ బాట్లో 42,589 యూజర్లు రాగా 1,07,428 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీ మూడు రోజులకు సంబంధించి గురువారం నుంచి ఐదు రోజులపాటు టోకెన్ల నమోదుకు అవకాశం ఉంది. డిసెంబర్ 2వ తేదీన ఈ–డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులకు ఫోన్ ద్వారా సందేశం పంపుతారు. మొదటి మూడు రోజులు ఆన్‌లైన్‌లో టోకెన్లు కలిగిన వ్యక్తులకు మాత్రమే వైకుంఠద్వార దర్శనానికి పంపుతారు. చివరి ఏడు రోజులు ఎలాంటి టోకెన్లు లేని భక్తులకు వైకుంఠద్వార దర్శనాన్ని కల్పిస్తారు.

కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామంలో రైతు సాగు చేసిన యాపిల్ పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి

అనంత ఇంట... వైవిధ్య పంట..

జిల్లాలో 150 రకాలకు పైగా పంటలు..

శీతల ప్రాంతంలోనే పండే యాపిల్ కూడా 30 ఎకరాల్లో సాగు

రాష్ట్రంలో మరెక్కడా ఇంత వైవిధ్యం లేదంటున్న అధికారులు

కరువు సీమగా పేరొందిన అనంతపురం జిల్లా నేడు వైవిధ్యభరిత పంటలకు నిలయంగా మారింది. ఇన్నాళ్లూ యాపిల్ ఒక్కటీ మిగిలి పోయిందని అనుకుంటుండగా... ఈ ఏడాది అది కూడా సాగైంది. కుందుర్పి, పెద్దపప్పూరు, గార్లదిన్నె మండలాల్లో అభ్యుదయ రైతులు 30 ఎకరాల్లో యాపిల్ సాగు చేయడం గమనార్హం. యాపిల్ అనేది కశ్మీర్, సిమ్లా లాంటి శీతల ప్రాంతాల్లోనే పండుతుందని తెలిసినా... రైతులు సవాల్‌గా తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఇలా వివిధ రకాల పంటల సాగుకు 'అనంత' నేల ప్రయోగశాలగా తయారైంది.

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన, పట్టుశాఖ అసిస్టెంట్లు ఆర్‌ఎస్‌కే వేదికగా చేపట్టిన ఈ–క్రాప్ (డిజిటల్ క్రాప్ సర్వే)లో అనంతపురం జిల్లావ్యాప్తంగా ఏకంగా 150 రకాలకు పైగా పంటలు సాగులో ఉన్నట్లు వెల్లడైంది. అందులో 30 రకాల వరకు వ్యవసాయ పంటలు ఉండగా మరో 30 రకాల ఉద్యాన పంటలు విస్తరించాయి. 50 రకాలకు పైగా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. అలాగే మల్బరీ, పూలతోటలు, ఔషధ పంటలు, ఇతరత్రా గడ్డి రకాల పంటలు 40 రకాల వరకు సాగు చేశారు. సంప్రదాయ, ఇతరత్రా అరుదైన అన్ని రకాల పంటలు ఇక్కడ పండిస్తున్నారు. పదేళ్ల క్రితం వరకు కొన్ని వ్యవసాయ, మరికొన్ని ఉద్యాన పంటలు, కూరగాయలు, పూల తోటలు... ఇలా అన్నీ కలిపినా 40 నుంచి 50 రకాలకు మించి ఉండే పరిస్థితి లేదు.

మారిన పరిస్థితులు...

ఇటీవల జిల్లాలో పంటల సాగుకు సంబంధించి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఉష్ణోగ్రతలు, వర్షపాతం, పొడి వాతావరణం, నేల రకాలు దాదాపు అన్ని రకాల పంటల సాగుకు అనువుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొందరు రైతులు అరుదైన పంటలు సాగు చేస్తూ విజయవంతమవుతున్నారు. తాజాగా కుందుర్పి, గార్లదిన్నె, పెద్దపప్పూరు మండలాల్లో ఆపిల్ కూడా వేయడం గమనార్హం. ఈ ఖరీఫ్‌కు సంబంధించి 'ఈ–క్రాప్'లో 150కు పైగా రకాలు నమోదయ్యాయంటే పంటల వైవిధ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇన్ని రకాల వ్యవసాయ, ఉద్యాన, కూరగాయ, ఆకుకూరల పంటలు బహుశా ఏ జిల్లాలోనూ సాగులో ఉండే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

పంటల జాబితా ఇలా..

ఈ ఖరీఫ్‌లో వేరుశనగ, కంది, జొన్న, మొక్కజొన్న, వరి, పత్తి, ఆముదం, ఉలవ, సజ్జ, కొర్ర, పొద్దుతిరుగుడు, మినుము, అలసంద, పెసర, కుసుమ, పొగాకు, చెరకు, రాగి, నువ్వులు, గోధుమ, శనగ, అండుకొర్ర, సామ, మేత జొన్న, మేత మొక్కజొన్న, జీలుగ, జనుము, పిల్లిపెసర, జనపనార, నేపియర్, సరుగుడు, పారాగ్రాస్, హెడ్జిలూసర్న్ తదితర వ్యవసాయ, పచ్చిరొట్ట, గడ్డి పంటలు సాగు చేశారు. అలాగే యాపిల్, చీనీ, బత్తాయి, కమలా, అరటి, మామిడి, నిమ్మ, దానిమ్మ, సపోటా, జామ, ద్రాక్ష, బొప్పాయి, అల్లనేరేడు, రేగు, పామాయిల్, కొబ్బరి, డ్రాగన్, ఖర్జూరం, సీతాఫలం, అంజూర, ఉసిరి, వెదురు, అశ్వగంధ, కోకో, ధనియాలు, జీడిమామిడి, స్ట్రాబెర్రీ, కళింగర, కర్బూజా, దోస, చింత, శ్రీగంధం, ఆకులు, వక్క, వాము, అశ్వగంధ, పసుపు, నన్నారి తదితర ఉద్యాన, ఔషధ పంటలు సాగు చేశారు. ఇక టమాట, వంకాయ, బెండ, ఎండుమిరప, పచ్చిమిరప,ఉల్లి, అనుములు, గోరుచిక్కుడు, సోయాబీన్స్, సాంబార్‌దోస, చిక్కుడు, స్వీట్‌కార్న్, బీర, కాకర, గుమ్మడి, సొర, పొట్ల, కొత్తిమీర, అవకాడో, మకాడమియా, అవిశలు, క్యాప్సికం, క్యారెట్, బంగాళాదుంప, ముల్లంగి, బీట్‌రూట్, పాలకూర, గోంగూర, తోటకూర, గోబీపువ్వు, మునగ, చుక్కాకు, ఉల్లికాడలు, నేలవాము, జనపనార, సెలెరీ, ఎర్రపప్పు, పచ్చిబఠానీ, అల్లం, దబ్బపండు, గజనిమ్మ తదితర కూరగాయలు, ఆకుకూరల పంటలు సాగులోకి వచ్చాయి. అలాగే బంతి, చామంతి, లిల్లీ, మల్లె, కనకాంబరం, గులాబీ, మహాగని, కాగడామల్లి, విరజాజి తదితర పూలతోటలు ఉన్నాయి.

● ఫొటో చెప్పిన కథ

నీలి చిలుకలు

చిలుకలు ఆకుపచ్చగా ఉంటాయి కదా. ఇక్కడ ఉన్నది నీలి చిలుకలు. నిజానికి ఇవి చిలుక జాతికే చెందినా వీటిని పారెట్స్ అని కాకుండా మకావ్స్ అంటారు. నీలి రంగు మకావ్స్‌ని 'స్పిక్సస్ మకావ్స్' లేదా 'స్పిక్సస్ మకోర్స్' అనిఅంటారు. మకావ్స్ పుట్టినిల్లు అమెరికా. అయితే స్పిక్సస్ మకావ్స్ అంటే నీలి చిలుకలు బ్రెజిల్‌లో మాత్రమే కనపడతాయి. ఒక దశలో ఇవి అంతరించిపోయాయని పర్యావరణ ప్రేమికులు ఎంతో బాధ పడ్డారు. కాని అదృష్టం కొద్ది వీటిని సంరక్షించి, ఆర్టిఫీషియల్ బ్రీడింగ్ ద్వారా వీటి సంతతిని పెంచారు. ప్రస్తుతం ఇవి బ్రెజిల్ అడవుల్లో కొన్ని, అక్కడి సా పోలో జూలో కొన్ని ఉన్నాయి. నవంబర్ 27వ తేదీన ఫొటోగ్రాఫర్‌కు ఇలా నీలి కాంతులు చిందుతూ కనిపించాయి.

● మీకు తెలుసా

గుండె చప్పుడు వినే స్టెతస్కోప్.. ఎలా పుట్టింది?



పిల్లలూ! మీరు హాస్పిటల్‌కు వెళ్లినప్పుడు డాక్టర్లను చూసే ఉంటారు కదా! తెల్లకోటులో ఉండే డాక్టర్ల మెడలో స్టెతస్కోప్ వేలాడుతూ ఉంటుంది. వైద్యులు దాన్ని మీ గుండెపై పెట్టి, మీ గుండె చప్పుడు వింటారు. ఆ తర్వాత మీ సమస్య తెలుసుకొని మందులు రాసిస్తారు. చూసేందుకు ఆ స్టెతస్కోప్ చాలా ముచ్చటగా ఉంటుంది. అసలది ఎప్పుడు పుట్టిందో, దాని వల్ల ప్రయోజనాలేమిటో తెలుసా? స్టెతస్కోప్‌ని మొట్టమొదటిసారిగా 1816లో కనుక్కున్నారు. ఫ్రాన్స్‌కు చెందిన రెన్ లానెక్ అనే వైద్యుడు దీనికి రూపకల్పన చేశారు. ఆయనకు దీన్ని తయారు చేయాలన్న ఆలోచన ఎందుకొచ్చిందో తెలుసా? స్టెతస్కోప్ లేని కాలంలో రోగుల గుండె పరిస్థితిని తెలుసుకునేందుకు వైద్యులు తమ చెవిని వారి గుండె మీద పెట్టేవారు. ఎన్నో ఏళ్లు ఇదే పద్ధతి కొనసాగింది. అయితే కొందరు పేషంట్లకు ఇది ఇబ్బందికరంగా, మొహమాటంగా ఉండేది. దీనికి ప్రత్యామ్నాయంగా ఏం చేయాలని ఆలోచించిన డాక్టర్ లానెక్ తొలి స్టెతస్కోప్‌ని తయారు చేశారు. అయితే ప్రస్తుతం మనం చూసే స్టెతస్కోప్‌లకూ ఆయన తయారు చేసిన దానికీ చాలా తేడా ఉంది. మొదట్లో ఒక ట్యూబ్ సాయంతో దీన్ని తయారు చేశారు. అనంతరం కొంతకాలానికి అందులో మరిన్ని మార్పులు చేసి ప్రస్తుతం మనం చూసే స్టెతస్కోప్‌ని రూపొందించారు. ప్రస్తుతం ఉన్న స్టెతస్కోప్‌లు గుండె చప్పుడు స్పష్టంగా వినేందుకు తోడ్పడుతున్నాయి. దీనివల్ల రోగుల ఆరోగ్య స్థితి తెలుసుకోవడం వైద్యులకు సులువవుతుంది.

● మహనీయులు

తెలుగు నాటకరంగ పితామహుడు...
రామకృష్ణమాచార్యులు

పిల్లలూ! మీరెప్పుడైనా నాటకాలు చూశారా? వేదికపై నటీనటులు నాటకం ప్రదర్శిస్తుంటే చూడటం గొప్ప అనుభూతి. ఆ అనుభూతిని మీరు తప్పకుండా పొందండి. తెలుగు నేల మీద ఎంతోమంది మహనీయులు నాటకరంగానికి సేవలందించారు. వారిలో 'ఆంధ్ర నాటక పితామహుడు'గా పేరొందినవారు ధర్మవరం రామకృష్ణమాచార్యులు

1853లో అనంతపురం జిల్లా ధర్మవరంలో జన్మించిన రామకృష్ణమాచార్యులు తండ్రి వద్దనే ఆంధ్ర, సంస్కృత, కన్నడ భాషలు నేర్చుకున్నారు. 1870లో మెట్రిక్యులేషన్ పాసయ్యారు. తండ్రి, తాత పండితులు కావడంతో చిన్ననాటి నుంచే ఆయనకు సాహిత్యంపై ఆసక్తి మెండుగా ఉండేది. ఆ వయసులోనే ఉద్గ్రంథాలు చదివారు. చదువు పూర్తయ్యాక బళ్ళారికి వెళ్లి, అక్కడ మేజిస్ట్రేటు కోర్టులో ప్రైవేటు వకీలుగా పనిచేశారు. అనంతరం న్యాయవాదవృత్తిలో అంచెలంచెలుగా ఎదిగారు. 1886లో బళ్లారిలో 'సరసవినోదిని సభ' అనే నాటకసభను నెలకొల్పిన రామకృష్ణమాచార్యులు మొదట 'స్వప్నానిరుద్ధ' అనే కన్నడ నాటకాన్ని ప్రదర్శించారు. 1887లో 'చిత్రనళీయం' అనే తెలుగునాటకాన్ని బళ్లారి పట్టణంలో మొదటిసారిగా ప్రదర్శించారు. ఆయన నాటకాలకు ఆయనే నటుడు, దర్శకుడు. సంగీతంలో కూడా ఆయనకు ప్రవేశం ఉండటంతో పాటలు, పద్యాలకు తనే రాగాలు నిర్ణయించేవారు. దశరథ, బాహుళ, రాజరాజనరేంద్రుడు, చిరకారి, అజామిళ తదితర పాత్రలు ఆయనకు పేరు తెచ్చిపెట్టాయి.

ఆ రోజుల్లో తెలుగులో నాటక రచన ఇంకా మొదలవలేదు. దీంతో ఆయన పూనుకొని తెలుగులో నాటకాలు రాయడం మొదలుపెట్టారు. ఆయన కృషిని గుర్తించి గద్వాల మహారాజా 1910లో ఆయనకు 'ఆంధ్రనాటక కవితా పితామహుడు' అనే బిరుదు ఇచ్చారు. 1912 నవంబర్ 30న ఆయన మరణించారు.

● పుస్తకాలు

బడి పిల్లల జీవితంపై అక్షర సుమాలు



బడి పిల్లల జీవితంలో జరిగే రకరకాల అంశాలను 15 కథలుగా అల్లి రచయిత గరిపల్లి అశోక్ రాసిన పుస్తకం ఇది. బడిలో పిల్లలు ఎలా ఉంటారో, బడి జీవనం ఎలా ఉంటుందో, విద్యార్థుల వ్యవహారపు తీరు పట్ల ఉపాధ్యాయులు తీసుకోవాల్సి జాగ్రత్తలేమిటో ఈ కథల ద్వారా వివరించారు. ఇందులోని 'కరపత్రం, బొంతలు, నీళ్లు, చెత్త బుట్టలు, నిజాయితీ, ఫిల్టర్లు' తదితర కథలన్నీ పాఠకులను అలరిస్తాయి.

మహిళల విజయాలు, వారి సాహసాలను వివరించే పుస్తకం



చరిత్రలో అత్యంత తెలివైన, అత్యంత ప్రభావవంతమైన మహిళల విజయాలు, వారి సాహసాలను పిల్లలకు వివరించే పుస్తకం ఇది. వారి జీవితాల్లోని అంశాలను కథల రూపంలో ఆసక్తిగా చెప్పడంతో ఆ పుస్తకం చిన్నారులకు నచ్చుతుంది. ఎలిజబెత్ బ్లాక్‌వెల్, క్యూ జిన్, బౌడికా, ఫ్లోరా డ్రమ్మండ్, పోకాహొంటాస్, నూర్ ఇనాయత్ ఖాన్, మేరీ షెల్లీ తదితర అనేక మంది మహిళా విజేతల గురించి ఇందులో ఉంది. పిల్లలకు ప్రపంచ చరిత్రను నేర్పేందుకు ఉపకరించే పుస్తకం.

తాత వస్తాడు

పిల్లలూ.... క్రిస్మస్ సీజన్ వచ్చేసింది. జీసస్ తర్వాత క్రిస్మస్ అనగానే మనకు గుర్తొచ్చేది – ఎర్రటి కోటేసుకోని, ముఖం నిండా తెల్లటి గడ్డంతో, పొట్టిగా, తలమీద సాంటా హ్యాట్ పెట్టుకోని, చిరునవ్వుతో కనిపించే సాంటా రూపమే కదా. అసలెవరు ఈ సాంటా? అతనికి క్రిస్మస్ కి సంబంధం ఏంటి? సాంటా నిజమా లేక కల్పితమా అనేది ఎప్పుడైనా ఆలోచించారా?

నాలుగవ శతాబ్దంలో జీవించిన సెంట్ నికోలస్ నుండి ఈ కథ ప్రారంభమయింది. ప్రస్తుత టర్కీ ప్రాంతంలోని మైరా నగరానికి బిషప్‌గా పనిచేసిన సెంట్ నికోలస్, పేదవాళ్లకు రహస్యంగా బహుమతులు ఇవ్వడం, పిల్లలకు సహాయం చేయడం వల్ల ప్రసిద్ధిచెందాడు. అతని మంచి పనులు, దయగల స్వభావం ప్రజల కథల్లో, క్రైస్తవ సమాజంలో ప్రత్యేక స్థానం సంపాదించాయి.

తరువాత డచ్ ప్రజలు ఈ బిషప్‌ను సింటర్‌క్లాస్ అని పిలవడం ప్రారంభించారు. డచ్ వలసదారులు అమెరికాకు చేరినప్పుడు, ఈ సింటర్‌క్లాస్ కథ అక్కడి సంస్కృతిలో కలిసిపోయి, ఆ పేరు ఆంగ్లంలో 'సాంటా క్లాజ్'గా మారిపోయింది. ఈ దశలోనే తెల్లటి గడ్డం, ఎర్రని వస్త్రాలు, బహుమతులు ఇచ్చే సంప్రదాయం వంటి లక్షణాలు కూడబలికాయి.

అమెరికాలో 1823లో వచ్చిన ''ట్వాస్ ది నైట్ బిఫోర్ క్రిస్మస్'' అనే కవితలో సాంటాను హర్షపూర్వకంగా, ముద్దుగా, రెయిన్‌డీర్‌లతో ప్రయాణించే రూపంలో వివరించారు. దీనివల్ల సాంటా రూపం మరింత దగ్గరవుతూ, ప్రజల్లో ప్రాచుర్యం పొందింది. తరువాత 1930లలో వచ్చిన కోకా–కోలా ప్రకటనలు సాంటా యొక్క ఎర్రని కోటు, పెద్ద మంచు గడ్డం, ఆనందోత్సాహ భరితమైన ముఖంతో ఉన్న ఆధునిక రూపాన్ని ప్రపంచానికి పరిచయం చేశాయి.

ఈరోజు సాంటా క్లాజ్ అనగానే మనకు కనిపించే రూపం – ఉత్తర ధృవంలో నివసిస్తూ, క్రిస్మస్ ఈవ్ రోజున పిల్లలకి బహుమతులు అందించే దయగల వృద్ధుడు – వేర్వేరు దేశాల చరిత్రలు, పురాణాలు, సంప్రదాయాలు కలిసి ఏర్పడిన ఒక అద్భుతమైన సాంస్కృతిక ప్రతిరూపం ఈ సాంటా.

● భలే బడి

భలే ఉందే! ఆ స్కూల్లో పరీక్షలే ఉండవు

పిల్లలూ! తర్వలో మీకు హాఫ్ ఇయర్లీ పరీక్షలు వస్తున్నాయా? ప్రతి సంవత్సరం ఇలా పరీక్షలు రాయడం, తక్కువ మార్కులు వస్తే తిట్లు తినడం ఇబ్బందిగా ఉందా? కాని బెంగళూరు నగరం దక్షిణ ప్రాంతంలో ఉన్న 'తపస్ ఎడ్యుకేషన్' అనే స్కూల్లో చదివే విద్యార్థులకు ఈ బాధ ఉండదు. ఎందుకంటే అక్కడ పరీక్షలే ఉండవు. నిజం. చదువడం అంటే జీవితానికి సిద్ధం చేయడం అని అక్కడి వారు నమ్ముతారు. అందుకే పరీక్షలనే ఆలోచనే అక్కడ ఉండదు. అందుకే అక్కడి పిల్లలు చాలా ఆనందంగా, ఉత్సాహంగా గడుపుతారు.

చాలా స్కూళ్లల్లో పిల్లలు ఒకే రకమైన పద్ధతిని ఫాలో అవుతుంటారు. ఏడాది మొత్తం పుస్తకాల్లో ఉన్నది బట్టీ కొట్టడం, చివరకు పరీక్షల్లో అదంతా రాసి మార్కులు తెచ్చుకోవడం. ఇంతకుమించి మరో రకమైన విధానం వారికి తెలియదు. ఇలా కాకుండా పిల్లలకు పరీక్షల ఒత్తిడి, మార్కుల భయం లేకుండా, వారు పనులు చేస్తూ నేర్చుకునే విధానంతో స్కూల్ ప్రారంభించాలని కొందరు యోచించారు. అలా పుట్టిందే 'తపస్ ఎడ్యుకేషన్'. పంచధాతువుల(అస్తిత్వ, చక్ర, ప్రాణ, తత్వ, ఆనంద) ప్రమాణంగా ఇక్కడ విద్య నేర్పుతారు.

ఇక్కడ చదువుకునే విధానం వేరుగా ఉంటుంది. ఏ పని అయినా చేస్తూ నేర్చుకునేలా చూస్తారు. పిల్లలు ఆడుతూ పాడుతూ కొత్త విషయాలు నేర్చుకుంటారు. పిల్లలను బృందాలుగా ఏర్పరిచి, వారికి కొన్ని ప్రాజెక్టులు అప్పగిస్తారు. దాని ద్వారా వారి బుద్ధి వికసిస్తుందని నిర్వాహకుల అభిప్రాయం. నగరం నమూనా రూపొందించడం, పాఠశాల పాడ్‌కాస్ట్ ప్రారంభించడం, వ్యర్థాల నిర్వహణపై ప్రచారం చేయడం..ఇలాంటి అభ్యాసాల ద్వారా ఇక్కడి విద్యార్థులు సైన్స్, గణితం, భాష నేర్చుకుంటారు. అన్నీ పరిశోధిస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ వారే సొంతంగా ఇవన్నీ అర్థం చేసుకుంటారు. ఇక్కడుండే టీచర్లు వారికి సాయం చేస్తారు తప్ప మొత్తం తామే నేర్పించరు. పిల్లలు సొంతంగా ఎదిగేందుకు వారు తోడ్పడతారు. ఇలాంటి అభ్యాసాలతోపాటు వంట చేయడం, తోటపని చేయడం, కొత్త వస్తువులు తయారు చేయడం వంటి అంశాల్లో కూడా ఇక్కడి పిల్లలకు శిక్షణ ఇస్తారు. దీంతోపాటు చిత్రలేఖనం, సంగీతం వంటి అంశాలనూ పిల్లలు ఇక్కడ ఇష్టంగా నేర్చుకోవచ్చు. భలే ఉందిగా పరీక్షలు లేని బడి.

● కథ

సూది దూలం



అనగనగా ఓ ఊళ్లో విప్రశర్మ అనే పండితుడు ఉండేవాడు. ఆయన వద్ద నలుగురు శిష్యులు విద్య నేర్చుకునేవారు. వారిది మందబుద్ధి. గురువు చెప్పిన పనికి కూడా మేమంటే మేమంటూ తగవులాడుకొని, చివరకు ఆ పనిని భ్రష్టు పట్టించేవారు. ఈ వ్యవహారం విప్రశర్మకు తలనొప్పిగా ఉండేది. దీంతో ఏ పని చేసినా అందరూ కలిసి చేయాలని వారిని ఆదేశించాడు.

ఒకసారి విప్రశర్మకు సూది అవసరమైంది. బజారుకు వెళ్లి సూది తీసుకురమ్మని శిష్యుల్ని పంపించారు. వారు వెళ్లి సూది కొన్నారు. అయితే దాన్ని ఎవరు తీసుకువెళ్లాలనే మీమాంస వచ్చింది. 'గురువు గారికి నేనే ప్రియశిష్యుణ్ని' అని ఒకరు, 'మీ అందరికంటే నేనే వయసులో పెద్దవాణ్ని' అని ఒకరు, 'గురువు గారి వద్దకు నేనే ముందు వచ్చానని' ఒకరు, 'గురువు గారి నా మీదే ప్రేమ ఎక్కువ' అని మరొకరు వారిలో వారు వాదించుకున్నారు. గంటసేపు వాదించుకున్నా వారి తగవు తీరలేదు. తగవు తీరకుండా సూదిని తీసుకెళ్లే ప్రసక్తే లేదని అందరూ పట్టు మీద ఉన్నారు.

ఇంతలో దారి వెంట వెళ్తున్న ఓ బాటసారి వారి వద్దకు వచ్చి విషయం కనుక్కున్నాడు. అతనికి విషయమంతా చెప్పి, తమలో ఎవరు సూది తీసుకువెళ్లాలో తేల్చమని అడిగారు నలుగురూ. వారి మందబుద్ధి గ్రహించిన ఆ బాటసారి 'ఎందుకు ఇంత చిన్న విషయానికి మీలో మీరు గొడవ పడతారు? మీరు ఓ దూలం కొనుక్కుని, ఈ సూదిని ఆ దూలానికి గుచ్చి దాన్ని నలుగురూ మోసుకెళ్లండి' అని సలహా ఇచ్చి తన దారిన తాను వెళ్లిపోయాడు.

నలుగురు శిష్యులూ అక్కడే ఓ దూలం కొనుక్కొని, దానికి సూదిని గుచ్చి ఇంటి వరకూ మోసుకువెళ్లారు. దూలం మోసుకు వచ్చిన శిష్యుల్ని చూసి విప్రశర్మ కంగారు పడి జరిగిందేమిటో కనుక్కున్నారు. వారు జరిగిన విషయం చెప్పారు. వారు మందబుద్ధికి విచారించిన ఆయన 'సరే..ఆ సూది ఇలా తీసుకురండి' అని నిట్టూర్చాడు. శిష్యులు దూలం మొత్తం వెతికినా సూది కనిపించలేదు. దీంతో వచ్చేదారిలో సూది ఎక్కడో పడిపోయుంటుందని అనుకున్నారు. చేసేది లేక బిక్కమొహం వేసుకొని గురువు వంక చూశారు. వారు చేసిన పనికి విప్రశర్మకు కోపం వచ్చినా, 'ఏ పని చేసినా నలుగురూ కలిసి చేయండి' అన్న తన మాటను అక్షరాలా పాటించినందుకు వారిని క్షమించాడు.

కాంస్యంతో కాకుండా...

లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో కొత్త చరిత్రపై గురి

● కాంస్యం కంటే మెరుగైన పతకం సాధించాలన్నదే లక్ష్యం
● భారత మహిళల బాక్సింగ్ జట్టు కొత్త హెడ్ కోచ్ సాంటియాగో నియెవా వ్యాఖ్య

న్యూఢిల్లీ: వచ్చే ఒలింపిక్స్‌లో ఒకటి కంటే ఎక్కువ పతకాలు సాధించాలనే లక్ష్యంగా జట్టును తీర్చిదిద్దుతానని భారత మహిళల బాక్సింగ్ కొత్త హెడ్ కోచ్ సాంటియాగో నియెవా అన్నారు. 2028 లాస్ ఏంజెలిస్ విశ్వ క్రీడల్లో కాంస్యానికంటే మెరుగైన పతకంతో చరిత్ర సృష్టించాలనే పట్టుదలతో ఉన్నట్లు ఆయన చెప్పారు. నిజానికి నియెవా భారత బృందంతో పనిచేయడం ఇప్పుడే కొత్త కాదు. 2017 నుంచి 2022 వరకు ఆరేళ్ల పాటు పురుషుల బాక్సింగ్ జట్టుకు హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్‌గా పని చేశారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అమిత్ పంఘాల్ రజతం గెలుపొందడంలో ఆయన కృషి ఉంది. తర్వాత ఆస్ట్రేలియా జట్టుకు సేవలందించేందుకు వెళ్లిన ఆయనను భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) ఈసారి అమ్మాయిల జట్టు కోసం తీసుకొచ్చింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న ఆయన వచ్చే నెలలో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆయనతో భారత మీడియా ముచ్చటించింది. నియెవా ప్రణాళికలెంటో ఆయన మాటల్లోనే...

పతకాలు గెలిచే సత్తా జట్టుకు ఉంది

భారత మహిళల జట్టు పటిష్టంగా ఉంది. పారిస్ ఒలింపిక్స్‌లో గెలవలేకపోయిన పతకాల్ని తర్వాత జరిగే ఒలింపిక్స్‌లో గెలుస్తారనే నమ్మకం నాకుంది. ప్రస్తుత జట్టులో ఒకరిద్దరు కాదు చాలామందే ప్రతిభావంతులు ఉన్నారు. తప్పకుండా వీరంతా లాస్ ఏంజెలిస్‌లో సత్తా చాటుతారు. ముందుగా నేను జట్టుతో కలుస్తాను. వారెలా సన్నద్ధమవుతున్నారో పరిశీలిస్తాను. వారి నమూనా ఏంటో... అదెలా పనిచేయగలదో విశ్లేషించాకే తదుపరి కార్యాచరణ అమలు చేస్తాను.

వచ్చే ఏడాది కీలకం

కీలకమైన 2026 సీజన్ మొదలవనుంది. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లాంటి మెగా ఈవెంట్లున్నాయి. కాబట్టే ఒక్కో అంచెను విజయవంతంగా దాటేందుకు జట్టును సన్నద్ధపరచాల్సి ఉంటుంది. బీఎఫ్ఐ ఎంపిక చేసిన జట్టు నుంచే పతకాలు గెలిచే సత్తా ఉన్న అమ్మాయిల్ని సానబెట్టాలి. నిజానికి అంతర్జాతీయ బాక్సింగ్‌లో మేరీకోమ్, లవ్లీనా లాంటి వారు స్ఫూర్తిగా ఉన్నారు. వీరిలాగే మరికొందరిని నా శైలి కోచింగ్‌తో తీర్చిదిద్దేందుకు శ్రమిస్తాను.

ఏదైనా సరే దశల వారీగానే...

ముందు భారత్‌కు వెళ్లాలి. రెండు వారాలపాటు అక్కడి పరిస్థితుల్ని క్షుణ్నంగా పరిశీలించాకే ఏదైనా సరే దశల వారిగానే చేయాల్సి ఉంటుంది. ఒక్కసారిగా నా శైలి మార్పుల్ని అందరిపై ఒకేలా రుద్దలేం. ఎక్కడ మెరుగుపడాలో అక్కడే మార్పులుంటాయి. అవసరాన్ని బట్టే మార్గదర్శనం ఉంటుంది. కానీ అన్నీ కూడా ఒకేసారి ఉండవు.

పోర్చు'గోల్' చేరింది

● తొలిసారి 'ఫిఫా' అండర్-17 ప్రపంచకప్ టైటిల్ సొంతం
● ఫైనల్లో ఆస్ట్రియాపై 1-0 గోల్ తేడాతో గెలుపు

దోహా: పోర్చుగల్ ఫుట్‌బాల్ అంటే ముందుగా గుర్తుకొచ్చే పేరు క్రిస్టియానో రొనాల్డో. వరుసగా ఆరో ప్రపంచకప్ ఆడబోతున్న రొనాల్డోకు ప్రపంచ కప్ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షగానే ఉంది. అయితే రొనాల్డో కలను పోర్చుగల్ యువ జట్టు మరో రూపంలో నెరవేర్చింది. తొలిసారి అండర్-17 ప్రపంచకప్‌లో పోర్చుగల్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన పోర్చుగల్ యువ జట్టు గురువారం అర్ధ రాత్రి దాటాక జరిగిన ఫైనల్లో 1-0 గోల్ తేడాతో ఆస్ట్రియాపై విజయం సాధించింది. ఈ టోర్నీ నిర్వహించడం ఇది 20వ సారి కాగా... పోర్చుగల్ తొలిసారి విజేతగా నిలిచింది. మూడో స్థానం కోసం జరిగిన 'షూటౌట్ పోరు'లో ఇటలీ 4-2 గోల్స్ తేడాతో బ్రెజిల్‌పై విజయం సాధించింది. తుదిపోరులో పోర్చుగల్ జట్టు తరఫున అన్‌సియో కాబ్రాల్ (32వ నిమషంలో) ఏకైక గోల్ సాధించాడు. ఈ టోర్నీలో కాబ్రాల్‌కు ఇది ఏడో గోల్ కావడం విశేషం. ఆస్ట్రియాకు చెందిన జొహాన్నెస్ మోసెర్ 8 గోల్స్‌తో 'గోల్డెన్ బాల్' అవార్డు అందుకున్నాడు. మొత్తం 48 దేశాల జట్లు పోటీపడిన ఈ టోర్నమెంట్‌లో తొలి మూడు స్థానాలు యూరప్ జట్లే దక్కించుకోవడం విశేషం. ఖతర్ వేదికగా జరిగిన ఈ టోర్నీ లీగ్ దశలో గ్రూప్ 'బి'లో రెండో స్థానంలో నిలిచిన పోర్చుగల్ ఆ తర్వాత 2-1 గోల్స్ తేడాతో బెల్జియంపై, ప్రీక్వార్టర్స్‌లో 5-0తో మెక్సికోపై గెలిచింది. క్వార్టర్ ఫైనల్లో పోర్చుగల్ జట్టు 2-0 గోల్స్ తేడాతో స్విట్జర్లాండ్‌ను చిత్తు చేసింది. హోరాహోరీగా సాగిన సెమీఫైనల్లో షూటౌట్‌లో 6-5 గోల్స్ తేడాతో నాలుగుసార్లు చాంపియన్ బ్రెజిల్‌పై గెలిచి ఫైనల్లో అడుగు పెట్టింది. తుదిపోరులో సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తూ ప్రపంచకప్ ట్రోఫీ కైవసం చేసుకుంది.

హరియాణా 'సూపర్' విక్టరీ

హోరాహోరీ పోరులో పంజాబ్ ఓటమి ● సత్తా చాటిన అన్షుల్ కంబోజ్
విదర్భపై ముంబై ఘనవిజయం ● సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీ

అన్షుల్ కంబోజ్
నిశాంత్

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హరియాణా జట్టు 'సూపర్ ఓవర్'లో పంజాబ్‌పై విజయం సాధించింది. టీమిండియా బ్యాటర్ అభిషేక్ శర్మను విజయవంతంగా అడ్డుకున్న హరియాణా జట్టు ఈ టోర్నీలో తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా సికింద్రాబాద్ జింఖానా మైదానంలో శుక్రవారం జరిగిన 'సూపర్ ఓవర్'లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టును హరియాణా పేస్ బౌలర్ అన్షుల్ కంబోజ్ హడలెత్తించాడు. మూడు బంతుల్లో ఒక పరుగు మాత్రమే ఇచ్చి అభిషేక్ శర్మ (0), సాన్‌వీర్ సింగ్ (0)లను అవుట్ చేశాడు. దీంతో రెండు పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హరియాణా తొలి బంతికే నిషాంత్ (4 నాటౌట్) ఫోర్ కొట్టడంతో విజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన హరియాణా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. కెప్టెన్ అంకిత్ కుమార్ (26 బంతుల్లో 51; 5 ఫోర్లు, 4 సిక్సలు), నిశాంత్ (32 బంతుల్లో 61; 8 ఫోర్లు, 3 సిక్సలు) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. ఆఖర్లో సుమిత్ కుమార్ (14 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడాడు. పంజాబ్ బౌలర్లలో అశ్వని కుమార్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి సరిగ్గా 207 పరుగులు చేసింది. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ (6) విఫలం కాగా... అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (37 బంతుల్లో 81; 8 ఫోర్లు, 5 సిక్సలు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. సాన్‌వీర్ సింగ్ (16 బంతుల్లో 30 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సలు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (10 బంతుల్లో 20; 1 ఫోర్, 2 సిక్సలు), సలీల్ అరోరా (22; 2 ఫోర్లు, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. హరియాణా బౌలర్లలో అన్షుల్ కంబోజ్, యుజువేంద్ర చహల్, సామంత్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. రెండుసార్లు అభిషేక్‌ను అవుట్ చేయడంతో పాటు పరుగులు కట్టడి చేసిన హరియాణా పేసర్ అన్షుల్ కంబోజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇదే గ్రూప్‌లో జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో పుదుచ్చేరి జట్టు 17 పరుగుల తేడాతో బరోడాపై, హిమాచల్ ప్రదేశ్ జట్టు 83 పరుగుల తేడాతో సర్వీసెస్‌పై, బెంగాల్ జట్టు మూడు వికెట్ల తేడాతో గుజరాత్‌పై విజయాలు సాధించాయి.

సూర్య, ఆయుశ్

ఆయుశ్ మాత్రే అజేయ శతకం

లక్నో: యువ ఓపెనర్ ఆయుశ్ మాత్రే (53 బంతుల్లో 110 నాటౌట్; 8 ఫోర్లు, 8 సిక్సలు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. ఫలితంగా ఎలైట్ గ్రూప్ 'ఎ'లో ముంబై జట్టు వరుసగా రెండో విజయం ఖాతాలో వేసుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు 7 వికెట్ల తేడాతో విదర్భపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన విదర్భ 20 ఓవర్లలో 9 వికెట్లకు 192 పరుగులు చేసింది. ఓపెనర్లు అథర్వ తైడె (36 బంతుల్లో 64; 9 ఫోర్లు, 1 సిక్స్), అమన్ (30 బంతుల్లో 61; 7 ఫోర్లు, 2 సిక్సలు) మెరుపు అర్ధశతకాలు సాధించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 9.1 ఓవర్లలోనే 115 పరుగులు జోడించడంతో విదర్భకు గట్టి పునాది దక్కింది. అయితే ఆ తర్వాత తేరుకున్న ముంబై బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొడుతూ విదర్భను మరింత భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. ధ్రువ్ షొరే (1), యశ్ రాథోడ్ (23), హర్ష్ దూబే (10), వరుణ్ బిస్ట్ (5), దర్శన్ నల్కండే (7) విఫలమయ్యారు. ముంబై బౌలర్లలో శివమ్ దూబే, సాయిరాజ్ పాటిల్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో ముంబై 17.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ఆయుశ్ మాత్రే అదరగొట్టగా... టీమిండియా టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (35; 4 ఫోర్లు, 1 సిక్స్), పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే (39 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్సలు) రాణించారు. ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో రైల్వేస్ జట్టు 32 పరుగుల తేడాతో కేరళపై గెలిచింది. ఎలైట్ గ్రూప్ 'బి'మ్యాచ్‌ల్లో ఉత్తరప్రదేశ్ జట్టు 109 పరుగుల తేడాతో జమ్మూకశ్మీర్‌పై, మధ్యప్రదేశ్ జట్టు 62 పరుగుల తేడాతో బిహార్‌పై విజయాలు సాధించాయి. ఎలైట్ గ్రూప్ 'డి'లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో తమిళనాడుపై, రాజస్తాన్ 5 వికెట్ల తేడాతో త్రిపురపై, ఉత్తరాఖండ్ 6 వికెట్ల తేడాతో సౌరాష్ట్రపై నెగ్గాయి.

ఆయుశ్ అరుదైన రికార్డు

ముంబై ఓపెనర్ ఆయుశ్ మాత్రే అరుదైన రికార్డు ఖాతాలో వేసుకున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలో సెంచరీలు చేసిన పిన్నవయస్కుడిగా అతడు రికార్డు సృష్టించాడు. ఇప్పటికే ఫస్ట్ క్లాస్ క్రికెట్, లిస్ట్ 'ఎ'లో శతకాలు నమోదు చేసుకున్న మాత్రే... తాజాగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో విదర్భతో మ్యాచ్‌లో టి20 ఫార్మాట్‌లోనూ మూడంకెల స్కోరు చేశాడు. తద్వారా చిన్న వయసు (18 సంవత్సరాల 135 రోజులు)లో ఈ ఘనత సాధించిన ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు.

ఆరోన్ జార్జికు చోటు

ఆసియా కప్ అండర్-19 టోర్నీ భారత జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: వచ్చే నెలలో 12 నుంచి 21 వరకు దుబాయ్ వేదికగా జరిగే అండర్-19 ఆసియా కప్ టోర్నీలో పోటీపడే భారత జట్టును ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ఆరోన్ జార్జికు ఈ జట్టులో స్థానం లభించింది. ఆరోన్ జార్జి సారథ్యంలో ఇటీవలే హైదరాబాద్ జట్టు వినూ మన్కడ్ ట్రోఫీలో తొలిసారి విజేతగా నిలిచింది. 15 మంది సభ్యులతో కూడిన భారత అండర్-19 జట్టుకు ముంబైకు చెందిన ఆయుశ్ మాత్రే సారథిగా వ్యవహరిస్తాడు. విహాన్ మల్హోత్రా వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. వన్డే ఫార్మాట్‌లో జరగనున్న ఈ టోర్నీలో ఆయుశ్ మాత్రే, వైభవ్ సూర్యవంశీ వంటి యువ ఆటగాళ్లపై అందరి దృష్టి నిలవనుంది. వచ్చే ఏడాది ఆరంభంలో జింబాబ్వే, నమీబియా వేదికగా అండర్-19 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో... ఈ టోర్నమెంట్ భారత జట్టుకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఇటీవల రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో 32 బంతుల్లోనే సెంచరీ చేసిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ... ఈ టోర్నీలో ఎలాంటి ప్రదర్శన కనబరుస్తాడనేది ఆసక్తికరం. టోర్నీలో భాగంగా డిసెంబర్ 12న భారత జట్టు తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే ప్రత్యర్థి ఇంకా తేలలేదు. రెండో మ్యాచ్‌లో 14న చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడనుంది. డిసెంబర్ 16న మూడో లీగ్ మ్యాచ్ ఆడనుంది. డిసెంబర్ 19న సెమీఫైనల్స్, 21న ఫైనల్ జరగనున్నాయి.

భారత అండర్-19 జట్టు: ఆయుశ్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్, హర్వన్ష్, యువరాజ్ గోహిల్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్, నమన్, దీపేశ్, హెనిల్, కిషన్ కుమార్ సింగ్, ఉధవ్ మోహన్, ఆరోన్ జార్జి. **స్టాండ్‌బై ప్లేయర్లు:** రాహుల్, హెమ్‌చుడెశన్, కిషోర్, ఆదిత్య రావత్.

'గులాబీ' టెస్టుకు కమిన్స్ దూరం

ఇంగ్లండ్‌తో రెండో టెస్టుకు ఆస్ట్రేలియా జట్టు ప్రకటన

కమిన్స్

సిడ్నీ: గాయంతో ఇబ్బంది పడుతున్న ఆస్ట్రేలియా టెస్టు జట్టు రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ 'యాషెస్ సిరీస్'లో రెండో టెస్టుకూ దూరమయ్యాడు. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా ఘనవిజయం సాధించగా... డిసెంబర్ 4 నుంచి బ్రిస్బేన్‌లో జరగనున్న రెండో టెస్టు (డే అండ్ నైట్) కోసం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) శుక్రవారం 14 మందితో జట్టును ప్రకటించింది. తొలి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో బోణీ కొట్టిన కంగారూలు... 'గులాబీ' టెస్టుకు అదే జట్టును కొనసాగించారు. కమిన్స్ గైర్హాజరీలో మరోసారి సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. ప్రస్తుతం నెట్స్‌లో శ్రమిస్తున్న కమిన్స్ మూడో టెస్టు వరకు పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కమిన్స్, హాజల్‌వుడ్ లేకపోవడంతో గత మ్యాచ్ ద్వారా టెస్టు అరంగేట్రం చేసి 5 వికెట్లతో ఆకట్టుకున్న బ్రెండన్ డగెట్‌కు మరోసారి అవకాశం దక్కడం ఖాయమే. డగెట్, స్కాట్ బోలాండ్‌తో కలిసి మిచెల్ స్టార్క్ పేస్ భారం మోయనున్నాడు. తొలి టెస్టు సందర్భంగా కండరాలు పట్టేయడంతో ఇబ్బంది పడిన ఉస్మాన్ ఖ్వాజా జట్టులో చోటు నిలుపుకున్నాడు. అయితే మ్యాచ్ రోజు వరకు అతడు ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంది. ఒకవేళ అతడు ఫిట్‌గా లేకపోతే జోష్ ఇన్‌గ్లిస్, వెబ్‌స్టర్‌లో ఒకరికి తుది జట్టులో అవకాశం దక్కొచ్చు.

రెండో టెస్టుకు ఆస్ట్రేలియా జట్టు: స్మిత్ (కెప్టెన్), బోలాండ్, కేరీ, డగెట్, గ్రీన్, హెడ్, ఇన్‌గ్లిస్, ఖ్వాజా, లబుషేన్, లయన్, నెసెర్, స్టార్క్, జేక్ వెదరాల్డ్, వెబ్‌స్టర్.

ఆర్చరీలో చికితకు రజతం

జైపూర్: ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ (కేఐయూజీ)లో తెలంగాణ ఆర్చర్ తానిపర్తి చికిత రజత పతకంతో మెరిసింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో చికిత ద్వితీయ స్థానం దక్కించుకుంది. ఈ క్రీడల్లో చికిత లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ తరఫున బరిలోకి దిగింది. టోర్నీ ఆసాంతం రాణించిన తెలంగాణ ఆర్చర్ ఫైనల్లో ప్రపంచ చాంపియన్ అదితి గోపీచంద్ స్వామి (శివాజీ యూనివర్సిటీ) చేతిలో ఓడి రజత పతకం కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్లో చికిత 143-147తో అదితి చేతిలో పోరాడి ఓడింది. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పసిడి నెగ్గిన అదితి... ఇక్కడ కూడా అదే జోరు కనబర్చింది. మధుర (కరమ్‌వీర్ పాటిల్ యూనివర్సిటీ)కు కాంస్య పతకం దక్కింది. కాంపౌండ్ టీమ్ విభాగంలో చికిత ప్రాతినిధ్యం వహించిన లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీకి స్వర్ణ పతకం దక్కగా... గురు కాశీ యూనివర్సిటీ రజతం, పంజాబ్ యూనివర్సిటీ కాంస్యం గెలుచుకున్నాయి. స్విమ్మింగ్‌లో ఒలింపియన్ శ్రీహరి నటరాజన్ తొమ్మిది పసిడి పతకాలతో సత్తాచాటాడు. రాజస్తాన్‌లోని పలు నగరాల్లో జరుగుతున్న ఈ క్రీడల్లో 222 యూనివర్సిటీలకు చెందిన 4448 మంది అథ్లెట్లు 23 క్రీడాంశాల్లో పోటీపడుతున్నారు. ఐదో రోజు పోటీలు ముగిసేసరికి జైన్ యూనివర్సిటీ 45 పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. స్విమ్మింగ్‌లోనే 27 స్వర్ణాలు, 9 రజతాలు, 9 కాంస్యాలు సాధించింది. లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ 22 స్వర్ణాలతో రెండో స్థానంలో ఉంది.

'చీర్స్'బాబు చిక్కాడు

చిరుత బోనులో చొరబడిన మందుబాబు

బహ్రైచ్ (యూపీ): చిరుతపులిని బంధించడానికి అటవీ శాఖ అధికారులు రాత్రింబవళ్లు కష్టపడ్డారు.. దాన్ని పట్టుకోవడానికి బోను కూడా ఏర్పాటు చేశారు. చిరుత చిక్కలేదు.. కానీ అందులో ఒక మందుబాబు చిక్కుకుపోయాడు. ఫక్రూర్ ప్రాంతంలోని ఉమ్రి దేహ్లో గ్రామంలో బుధవారం ఓ మహిళను చిరుత చంపింది. దీంతో అధికారులు గ్రామం బయట మేకను ఎరగా పెట్టి ఓ బోనును సిద్ధం చేశారు. కానీ, గురువారం రాత్రి, స్థానిక యువకుడు ప్రదీప్ బాగా మందుకొట్టి.. దారిలో ఈ బోనును చూశాడు. 'బోను ఎంత గట్టిగా ఉందో చూద్దాం.. అనుకున్నాడో.. చిరుత లోపల ఉందో లేదో? చెక్ చేద్దాం అనుకున్నాడో'తెలీదు.. లోపలికి అడుగు పెట్టాడు. అంతే.. ఆటోమేటిక్ తలుపు దడాల్న మూసుకుపోయింది. తాను చిక్కుకున్నానని ఎట్టకేలకు గ్రహించిన ప్రదీప్ గ్రామపెద్దకు ఫోన్ చేశాడు. సమాచారం అందుకున్న ఈ అటవీ, పోలీసు శాఖాధికారులు హుటాహుటిన రాత్రిపూట ఆ ప్రాంతానికి చేరుకున్నారు. 'ఆ యువకుడిని బయటకు తీయడానికి రెండు గంటల సమయం పట్టింది. మందు మత్తులో ఉన్నాడు'.. అన్నారు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ రామ్ సింగ్ యాదవ్. చివరకు ప్రదీప్‌ను బయటకు తీసి, తీవ్రంగా హెచ్చరించి ఇంటికి పంపేశారు.

'స్కై-డైనింగ్' రెస్టారెంట్‌లో చిక్కుకున్న పర్యాటకులు

సురక్షితంగా దించిన అగ్నిమాపక శాఖ

ఇడుక్కి (కేరళ): ఇడుక్కి జిల్లా అనాచల్ సమీపంలో ఒక క్రేన్ సహాయంతో సుమారు 150 అడుగుల ఎత్తుకు తీసుకెళ్లిన 'స్కై-డైనింగ్' రెస్టారెంట్‌లో కోజికోడ్‌కు చెందిన నలుగురు పర్యాటకులు, ఒక రెస్టారెంట్ ఉద్యోగి చిక్కుకుపోయారు. వీరిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. ఆ రెస్టారెంట్‌ను పైకి లేపిన క్రేన్ మొరాయించడంతో ఈ ఘటన జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. క్రేన్ హైడ్రాలిక్స్ వ్యవస్థలో లోపం వల్ల.. రెస్టారెంట్ సుమారు వంద అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో గాల్లో నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సాయంత్రం 4.30 గంటలకల్లా.. తొలుత తల్లి, ఇద్దరు పిల్లలను కిందకు దించారు, ఆ తర్వాత తండ్రి, రెస్టారెంట్‌లోని మహిళా ఉద్యోగిని సురక్షితంగా రక్షించారు. రెస్టారెంట్ యాజమాన్యం సమాచారం ఇవ్వలేదని అగ్నిమాపక అధికారి, అడిమాలి పోలీసు అధికారి తెలిపారు. స్థానికులు అప్రమత్తం చేయడం వల్లే మున్నార్, అడిమాలి అగ్నిమాపక శాఖ యూనిట్లు హుటాహుటిన రంగంలోకి దిగాయని వారు స్పష్టం చేశారు.

ఆ వెదురులో మంచుయుగపు గుట్టు

ఇంఫాల్ లోయలో వెదురు శిలాజాలు

ఆసియాలోనే అతి పురాతనమైనవి

వెదురులో మురళి దాగుంటుందన్నది తెలిసిందే. అయితే మణిపూర్‌లోని అతి పురాతన వెదురు శిలాజాల్లో మాత్రం మన దేశపు మంచు యుగానికి సంబంధించిన పలు రహస్యాలే దాగున్నాయి! అంతేనా? భారత్‌తో పాటు ఆసియా ఖండపు వృక్షశాస్త్ర చరిత్ర గతినే అవి సమూలంగా మార్చేసినా ఆశ్చర్యం లేదంటున్నారు...!

అది అలాంటిలాంటి శిలాజం కాదు. ఏకంగా 37,000 ఏళ్లనాటి వెదురు తాలూకు అత్యంత అరుదైన శిలాజం. ఎందుకంత అరుదైనదీ అంటే వెదురు శిలాజ రూపు దాల్చడం కనాకష్టం. దాని లోపలంతా బోలుగా ఉండటమే అందుకు కారణం. దాంతో అతి త్వరగా కుళ్లి మట్టిలో కలిసిపోతుంది. అలాంటి వెదురు తాలూకు అతి పురాతన శిలాజాన్ని మణిపూర్‌లోని ఇంఫాల్ లోయ ప్రాంతంలో సైంటిస్టులు తాజాగా కనుగొన్నారు. అది ఇప్పటిదాకా వెల్లడించిన, ఇకపై జరిపే పరిశోధనల్లో బయటపెట్టబోయే రహస్యాలు భారత్‌తో పాటు ఆసియా వృక్షశాస్త్ర చరిత్రనే తిరగ రాయగలవని భావిస్తున్నారు.

ఇంఫాల్ లోయ ప్రాంతంలో చిరాంగ్ నదీ తీరాన ఇసుక మేటలు అధికంగా ఉండే చోట ఈ వెదురు శిలాజాలు వెలుగు

చూశాయి. ఆసియా ప్రాంతంలో మంచు యుగపు అత్యంత ప్రతికూల పరిస్థితులను కూడా తట్టుకుని వెదురు తన ఉనికిని కాపాడుకుందనేందుకు ఈ శిలాజాలు తిరుగులేని నిదర్శనమని సైంటిస్టులు చెబుతున్నారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ బృందంతో కలిసి బీర్బల్ సాహ్ని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలియోసైన్సెస్ (బీఎస్ఐపీ) సైంటిస్టులు ఈ శిలాజాలపై ముమ్మరంగా పలు పరిశోధనలు జరుపుతున్నారు. వాటి తాలూకు పలు భాగాలను ఒక్కొక్కటిగా దుర్భిణి వేసి మరీ పరిశీలిస్తున్నారు. నాటి ప్రతికూల పరిస్థితుల్లో ఉనికిని కాపాడుకునేందుకు అవి ఎలాంటి పద్ధతులను అవలంబించిందీ క్రమంగా వెలుగులోకి వస్తోందని వారు చెబుతున్నారు. శిలాజ రూపు దాల్చిన వెదురు జాతిని జెనస్ చిమొనోబాంబూసాగా గుర్తించారు.

సహచరులు మాయమైనా...

మంచుయుగం తాలూకు అతి ప్రతికూల పరిస్థితులకు తట్టుకోలేక ప్రపంచవ్యాప్తంగా చాలారకాల వెదురు జాతులు అంతర్ధానమైపోయాయి. యూరప్ మొదలుకుని అమెరికా ఖండాల దాకా ఇదే పరిస్థితి. అయినా మణిపూర్‌లోని ఈ జెనస్ జాతి తట్టుకుని నిలవడానికి కారణాలన్నింటినీ కనిపెట్టేందుకు సైంటిస్టుల బృందం అన్నిర కాలుగానూ ప్రయత్నిస్తోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో శిలాజాల తాలూకు విడిభాగాలను ఒక్కొక్కటిగా మథిస్తోంది. ''ఈశాన్య భారతంలోని అపార జీవ వైవిధ్యం కారణంగా మంచుయుగపు ప్రభావం ఇక్కడ మరీ ఎక్కువగా పడి ఉండకపోవచ్చు. ఈ వెదురు జాతులు ఆ కష్టకాలాన్ని గట్టెక్కి మనుగడ సాగించేందుకు అదే కారణం కావచ్చు''అన్న వాదనల్లోని నిజానిజాలను కూడా నిగ్గుదేల్చేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. ఈ పరిశోధన వివరాలను పాలయోబోటనీ, పాలియాలజీ జర్నల్ రివ్యూలో ప్రచురించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికాతో భారత్ రూ.7,995 కోట్ల ఒప్పందం

సీహాక్ హెలికాప్టర్ల నిర్వహణ, మరమ్మతుల కోసమే..

న్యూఢిల్లీ: భారత్-అమెరికా మధ్య కీలక ఒప్పందం కుదిరింది. భారత నావికాదళంలోని 24 ఎంహెచ్-60ఆర్ సీహాక్ హెలికాప్టర్ల నిర్వహణ, మరమ్మతులు, శిక్షణ వంటి వాటి కోసం ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఒప్పందం విలువ రూ.7,995 కోట్లు. ఈ హెలికాప్టర్లను అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్ కార్పొరేషన్ తయారు చేసింది. నావికాదళం అవసరాల కోసం మొత్తం 24 హెలికాప్టర్లు కొనడానికి భారత్ ప్రభుత్వం 2020 ఫిబ్రవరిలో అమెరికాతో అగ్రిమెంట్ చేసుకుంది. అవి మారిటైమ్ వేరియంట్ బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు. తొలుత 2021లో మూడు హెలికాప్టర్లు భారత్‌కు చేరాయి. తర్వాత దశలవారీగా 24 హెలికాప్టర్లను అమెరికా అందజేసింది. వీటి నిర్వహణ, విడిభాగాల సరఫరా, మరమ్మతు, శిక్షణ, సాంకేతిక సహకారం కోసం రూ.7,995 కోట్లతో భారత్ తాజాగా ఒప్పందం చేసుకుంది. ఐదేళ్లపాటు ఈ ఒప్పందం అమల్లో ఉంటుంది. ఒకవైపు అమెరికా-భారత్ మధ్య సంబంధాలు బలహీనపడుతున్న తరుణంలో ఇరుదేశాల మధ్య కొత్త ఒప్పందం కుదరడం గమనార్హం.

రూపాయి చాలు!

రూ. 31 లక్షల కట్నాన్ని తిరస్కరించిన వరుడు

కట్నం వద్దని తిరస్కరిస్తున్న అవధేశ్

వరకట్నం మహమ్మారి కోరల్లో చిక్కుకుని అనేక కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి, అత్తింటి వేధింపులకు వధువుల బతుకులు బలవుతున్నాయి. సరిగ్గా అలాంటి పరిస్థితులలో.. అత్తింటివారు ఇచ్చిన రూ.31 లక్షల కట్నాన్ని ఒక వరుడు పెళ్లి వేదికపైనే తిరస్కరించడం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ఆ గొప్ప మనసున్న వరుడే అవధేశ్ రానా.

శభాష్ అవధేశ్ రానా..

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నగ్వా గ్రామానికి చెందిన అవధేశ్ రానా, షాహబుద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన అదితి సింగ్‌ల వివాహం నవంబర్ 22న ముజఫర్‌నగర్‌లో జరిగింది. వివాహంలో ముఖ్య ఘట్టమైన గోరా తిలక్ (బహుమతులు ఇచ్చే వేడుక) సందర్భంగా వధువు అదితి కుటుంబ సభ్యులు వరుడికి రూ.31 లక్షల భారీ మొత్తాన్ని కట్నంగా సమర్పించడానికి సిద్ధమయ్యారు.

నా మనస్సాక్షికి విరుద్ధం..

సరిగ్గా అప్పుడే.. అక్కడే అవధేశ్ ప్రకటించిన నిర్ణయం అతిథుల్ని నిశ్చేష్టుల్ని చేసింది. 'క్షమించండి, ఈ డబ్బును నేను స్వీకరించలేను. కట్నం తీసుకోవడం మా సిద్ధాంతాలకు, నా మనస్సాక్షికి విరుద్ధం'.. అని అవధేశ్ స్పష్టం చేశాడు. వేలాది మంది అతిథులు హాజరైన ఆ శుభకార్యంలో, అవధేశ్ చేతులు జోడిస్తూ.. కట్నం మొత్తాన్ని వధువు కుటుంబానికి తిరిగి ఇచ్చేశాడు. ఈ అపూర్వ ఘట్టంతో పెళ్లి పందిరి మొత్తం ఒక్కసారిగా చప్పట్లతో మార్మోగిపోయింది.

మా బంధం రూపాయితో మొదలైంది..

తన నిర్ణయం గురించి అవధేశ్ మాట్లాడుతూ.. 'నేను కట్నాన్ని బలంగా వ్యతిరేకిస్తాను. ఇది పూర్తిగా తప్పు. ఈ దురాచారం సమాజం నుంచి పూర్తిగా అంతమవ్వాలి. ఒక తండ్రి తన కూతురి పెళ్లి కోసం జీవితాంతం కష్టపడటం లేదా అప్పులు చేయవలసిన అవసరం లేదు'.. అన్నాడు. 'మా సంబంధం కేవలం రూపాయి విలువతో మొదలైంది. దానికి మించి నేను ఎలా తీసుకోగలను? రూపాయితో మొదలైంది, రూపాయి దగ్గరే ముగుస్తుంది'.. అని వ్యాఖ్యానించాడు. అవధేశ్ చర్య.. కేవలం నిరసన కాదు, అది దురాచారానికి వ్యతిరేకంగా వినిపించిన ధైర్యగీతం. ఈ తరం యువతరం ఆలోచనా విధానాన్ని మార్చేందుకు ఆయన తీసుకున్న ఆదర్శ నిర్ణయం పెళ్లి బంధానికి సరైన నిర్వచనం.

- సాక్షి, నేషనల్ డెస్క్

శ్రీలంకలో తీవ్ర తుఫాను 80 మంది మృతి

కొలంబో: శ్రీలంకను శుక్రవారం దిత్వాహ్ తుఫాను అతలాకుతలం చేసింది. వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 80 మంది ప్రాణాలు కోల్పోయారు. మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మతాలె, పొలన్నరువా, యువ ప్రావిన్స్‌లను కలిపే వంతెనలు కొట్టుకుపోవడంతో ఆయా ప్రాంతాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కేబుళ్లు తెగిపోవడంతో రెండు పవర్ ప్లాంట్లను మూసివేశారు. విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతింది. రాజధాని కొలంబోతోపాటు అత్యధిక జనాభా కలిగిన గంపాహా జిల్లా తీవ్రంగా దెబ్బతిన్నాయి. కెలనీ, అట్టనగలు నదులు పొంగిపొర్లాయి. మొత్తం 80 మంది చనిపోగా 34 మంది జాడ గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. సుమారు 14 వేల మందిని 195 అత్యవసర కేంద్రాలకు తరలించామన్నారు. 'ఆపరేషన్ సాగర్ బంధు'భారత ప్రభుత్వం శ్రీలంకకు ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ ఉదయగిరి ద్వారా మొదటి విడత తుఫాను సాయంగా ఆహార పదార్థాలను పంపించింది. ఇలా ఉండగా, తుఫాను ప్రభావం గత పది రోజుల వ్యవధిలోనే 100 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. గత 24 గంటల వ్యవధిలో కొండప్రాంతాల్లో 50 సెంటీమీటర్ల వాన కురిసిందని వివరించింది.

ఉక్రెయిన్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ రాజీనామా

- ప్రకటించిన అధ్యక్షుడు జెలెన్‌స్కీ
- అవినీతి ఆరోపణల నేపథ్యంలో పరిణామం

కీవ్: రష్యా దురాక్రమణను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీకి రాజకీయ పరంగా గట్టి ఎదురుదెబ్బే తగిలింది. ఆయన సన్నిహితుడు, చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా వ్యవహరిస్తున్న ఆండ్రీ యెర్మాక్(54) పదవికి రాజీనామా చేశారు. అవినీతి వ్యతిరేక విభాగం అధికారులు శుక్రవారం రాజధాని కీవ్‌లోని ఆయన నివాసంతోపాటు ఆఫీసులో సోదాలు జరిపారు. ఈ నేపథ్యంలోనే ఆండ్రీ రాజీనామా చేసినట్లు జెలెన్‌స్కీ ప్రకటించారు. తప్పు చేసినట్లు ప్రత్యేకంగా ఎలాంటి అభియోగాలు లేనప్పటికీ, రాజీనామా చేయాలన్న ఒత్తిళ్లు ఇటీవల ఆండ్రీపై పెరిగాయి. రష్యా దండయాత్రకు ముగింపు పలికేలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో త్వరలో జరగాల్సిన చర్చల బాధ్యతను జెలెన్‌స్కీ ఈయనకే అప్పగించారు. అయితే, ఎలాంటి వదంతులు, ఊహాగానాలు రాకూడదనేదే తన లక్ష్యమని జెలెన్‌స్కీ చెప్పారు. ఆండ్రీ స్థానంలో ఎవరికి బాధ్యతలు అప్పగించేదీ సంప్రదింపుల అనంతరం అతి త్వరలో ప్రకటిస్తానన్నారు. ఒక దేశ భక్తుడిగా ఉక్రెయిన్‌ను ధీటైన స్థానంలో నిలబెట్టినందుకు ఆయన ఆండ్రీకి ధన్యావాదాలు తెలిపారు. ఆండ్రీ యెర్మాక్ కూడా అధికారుల సోదాలపై స్పందించారు. 'దర్యాప్తు బృందానికి ఎటువంటి అభ్యంతరాలు తెలపలేదు. వారితో పూర్తిగా సహకరిస్తున్నా. నా లాయర్లు కూడా నాతో ఉన్నారు'అని టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు. ఇంధన రంగంలో రూ.835 కోట్లఅవినీతి జరిగిందంటూ వస్తున్న ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో జెలెన్‌స్కీ మాజీ వ్యాపార భాగస్వామి తిమూర్ మిండిచ్ కీలకంగా ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

ఢిల్లీ కాలుష్యంపై పార్లమెంట్‌లో చర్చించాలి

- ప్రధాని మోదీ మౌనం అనుమానాస్పదం
- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తీవ్రరూపం దాల్చిన వాయు కాలుష్యంపై పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చర్చకు పెట్టాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి ప్రకటించకుండా ప్రధాని మోదీ మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందన్నారు. కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు వెంటనే కఠినమైన, ఆచరణ సాధ్యమైన ప్రణాళికను పక్కాగా అమలు చేయాలన్నారు. ఇంత తీవ్రమైన సమస్యపై మోదీ ప్రభుత్వం స్పందించకపోవడమేంటని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం తన నివాసంలో తనను కలిసేందుకు వచ్చిన మహిళలతో మాట్లాడారు. అనంతరం ఇందుకు సంబంధించిన వీడియోను రాహుల్ విడుదల చేశారు. 'కాలుష్యం ప్రభావం చిన్నారుల ఆరోగ్యంపై తీవ్రంగా పడుతోంది. నా వద్దకు వచ్చిన ప్రతి మహిళా కాలుష్యం గురించే ఆందోళన వ్యక్తం చేశారు. ఎదిగే చిన్నారులు విషవాయువులను పీల్చుతున్నారంటూ వారు ఆగ్రహం, ఆందోళన చెందుతున్నారు. మీరెందుకు ఇది అత్యవసర సమస్య అని భావించడం లేదు? బాధ్యతగా ఎందుకు తీసుకోవడం లేదు?'అంటూ ఆయన ప్రధాని మోదీని ప్రశ్నించారు. 'మన చిన్నారులకు కావాల్సింది స్వచ్ఛమైన గాలి.. సాకులు గానీ, పక్కదారి పట్టించే చర్యలు గానీ కాదు' అని రాహుల్ పేర్కొన్నారు. ఢిల్లీలో జీవించే అత్యంత నిరుపేదల నుంచి అత్యంత ధనికుల వరకు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. కాలుష్యంతో లాభాలను ఆర్జిస్తున్న వారు బాధితుల కంటే శక్తివంతమైన వారు కావడం వల్లే ఈ సమస్య తీవ్ర రూపం దాలుస్తోందంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. కలుషిత గాలిని పీల్చుతూ దేశంలో రోజుకు 500 మంది వరకు చిన్నారులు చనిపోతున్నారని రాహుల్ చెప్పారు. అయినప్పటికీ దీనినో అత్యవసర అంశంగా ప్రభుత్వం భావించడం లేదని నిప్పులు చెరిగారు. బాధితులుగా ఉన్న సామాన్యులకు సంఘటితమైన రాజకీయ శక్తి లేకపోవడం వల్లే సమస్య తీవ్ర రూపం దాలుస్తోందని ఆయన తెలిపారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై చర్చ జరపాల్సిందేనన్నారు. 'గడిచిన 15 ఏళ్లుగా ఢిల్లీలో వాయు నాణ్యత అత్యంత తీవ్ర స్థాయికి పడిపోయింది. వచ్చే పదేళ్లలో మరింత అధ్వానంగా మారనుంది. ఇప్పటికీ స్పందించకుంటే ఇదో విస్ఫోటంలా మారుతుంది'అని ఈ సందర్భంగా ఓ మహిళ రాహుల్‌తో అన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

ఎస్ఐఆర్ ఉద్యోగుల మృతి వెనుక ఈసీ హస్తం ఉంది

ఈసీకి ఫిర్యాదు చేసిన టీఎంసీ ఎంపీలు

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కు సంబంధించిన 40 మంది మరణించారని టీఎంసీ శుక్రవారం భారత ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. దీని వెనుక రాష్ట్రంలోని పోల్ ప్యానెల్ చీఫ్ హస్తం ఉందని ఆరోపించింది. టీఎంసీ రాజ్యసభ సభ్యుడు డెరెక్ ఓబ్రియన్ నేతృత్వంలో పది మంది ఎంపీల ప్రతినిధి బృందం శుక్రవారం సీఈసీ అధికారులను కలిసింది. అనంతరం మీడియాతో మాట్లాడిన ఓబ్రియన్.. తమ పార్టీ ఐదు ప్రశ్నలను సీఈసీ ముందుంచిందని, కానీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎలాంటి సమాధానం ఇవ్వలేదని తెలిపారు. తాము ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించడం లేదని, ఈసీ పనిచేస్తున్న తీరుపై తమకు అభ్యంతరం ఉందని నొక్కి చెప్పారు. కమిషన్ దానిని కేవలం ఆరోపణలుగా తోసిపుచ్చిందని లోక్‌సభ ఎంపీ మహువా మొయిత్రా తెలిపారు. సీఈసీని కలిసిన ప్రతినిధి బృందంలో లోక్‌సభ ఎంపీలు శతాబ్దిరాయ్, కళ్యాణ్ బెనర్జీ, ప్రతిమా మండల్, సజ్దా అహ్మద్, రాజ్యసభ ఎంపీలు డోలా సేన్, మమతా ఠాకూర్, సాకేత్ గోఖలే, ప్రకాష్ చిక్ బారిక్ ఉన్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ విధుల్లో నిమగ్నమైన బూత్ స్థాయి అధికారులు మరణాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న పశ్చిమబెంగాల్, తమిళనాడు ఈ సంఖ్య అధికంగా ఉంది. ఒక్క పశ్చిమబెంగాల్‌లోనే 40 మంది మరణించినట్లు వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. బీఎల్‌ఓల మరణాలపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా ఇతర ప్రతిపక్ష నేతలు ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఎస్ఐఆర్ సంస్కరణ కాదని, విజయం కోసం బీజేపీ చేస్తున్న నియంతృత్వ పాలనని విమర్శిస్తున్నారు.

సస్పెండైన కాంగ్రెస్ ఎమ్మెల్యేపై లైంగిక దాడి కేసు

తిరువనంతపురం: సస్పెన్షన్‌కు గురైన కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మమ్‌కూట్టతిల్‌పై శుక్రవారం లైంగిక దాడి కేసు నమోదైంది. పలుమార్లు లైంగిక దాడికి పాల్పడటంతోపాటు బలవంతంగా గర్భస్రావంచేయించారంటూ ఆయనపై గురువారం రాత్రి ఓ మహిళ ఫిర్యాదు చేశారు. ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ఉదయం వలియమల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాధితురాలు గురువారం సీఎం విజయన్‌కు ఫిర్యాదు చేయడం, ఆడియో క్లిప్పులు, ఛాట్ వివరాలు బయటపెట్టడం సంచలనం రేపింది. ఈ కేసుపై ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది.

మహిళా పారిశుద్ధ్య కార్మికులను రుతుస్రావం రుజువు అడిగిన వర్సిటీ

కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీస్

న్యూఢిల్లీ: హరియాణాలోని మహర్షి దయానంద్ వర్సిటీ యంత్రాంగం మహిళా పారిశుద్ధ్య కార్మికులను రుతు స్రావం రుతుస్రావం అయినట్లుగా ప్రైవేట్ పార్టుల ఫొటోలను చూపాలని కోరడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇది వారి మానసిక స్థాయికి ఇదో నిదర్శనమని మండిపడింది. ఈ మేరకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ మహదేవన్‌ల ధర్మాసనం కేంద్రానికి, హరియాణా ప్రభుత్వానికి శుక్రవారం నోటీసులు జారీ చేసింది. 'ఇది వారి మానసిక వైఖరికి అద్దంపడుతోంది. ఒక వైపు కర్ణాటకలో పీరియడ్స్ సమయంలో లీవు ఇస్తుంటే..ఇక్కడేమో లీవు కోసం ఆధారాలు అడుగుతున్నారు'అని జస్టిస్ బీవీ నాగరత్న వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను డిసెంబర్ 15వ తేదీకి వాయిదా వేశారు. ఏమైందంటే..అక్టోబర్ 26వ తేదీన మహర్షి దయానంద్ వర్సిటీని గవర్నర్ అషిమ్ కుమార్ ఘోష్ సందర్శించారు. అందుకు కొద్ది గంటల ముందు ముగ్గురు మహిళా పారిశుద్ధ్య కార్మికులను క్యాంపస్ శుభ్రం చేయాలంటూ ఇద్దరు సూపర్ వైజర్లు ఒత్తిడి చేశారు. పీరియడ్స్ కారణంగా తాము చేయలేకపోతున్నామనగా, అందుకు తగిన ఆధారాలను, ప్రైవేట్ భాగాల ఫొటోలను చూపించాలని వారు కోరారు. నిరాకరించడంతో పని నుంచి తొలగిస్తామంటూ బెదిరించారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కేసు నమోదైంది. వర్సిటీ యాజమాన్యం ఆ ఇద్దరు సూపర్‌వైజర్లను తొలగించింది.

హిందూ చట్టాల వర్తింపుపై బౌద్ధుల పిటిషన్

లా కమిషన్‌కు పంపించిన సుప్రీం

న్యూఢిల్లీ: హిందూ చట్టాలకు సంబంధించిన కొన్ని నిబంధనలను బౌద్ధులకు వర్తింప జేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు లా కమిషన్ సాయం కోరింది. హిందూ చట్టాల్లోని కొన్ని అంశాలను తమకు వర్తింప జేయడం మత స్వేచ్ఛ తదితర ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని పిటిషనర్ బుద్ధిస్ట్ పర్సనల్ లా యాక్షన్ కమిటీ ఆరోపించింది. దీనిపై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం విచారణ చేపట్టింది. కొన్ని చట్టపరమైన నిబంధనలు బౌద్ధుల ప్రాథమిక హక్కులు, ఆచార సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్నందున, చేపట్టాల్సిన రాజ్యాంగ, చట్టబద్ధమైన మార్పులను సూచించాలని లా కమిషన్‌ను ధర్మాసనం కోరింది. ఇదే అంశాన్ని ఇప్పటికే 21వ లా కమిషన్ పరిశీలిస్తున్నట్లు న్యాయశాఖ తమకు సమాచారమిచ్చినట్లు ధర్మాసనం తెలిపింది. ఈ విషయాన్ని లా కమిషన్ పరిశీలించి తగు సిఫారసులను చేస్తుందని వివరించింది. తాజా పిటిషన్‌ను కూడా లా కమిషన్ పరిశీలనకు పంపుతామంది. ఈ విషయంలో ఇప్పటికిప్పుడు ఎలాంటి ఆదేశాలను జారీ చేయలేమని స్పష్టం చేసింది.

మత మార్పిడి చట్టంపై రాజస్తాన్‌కు నోటీస్

న్యూఢిల్లీ: రాజస్తాన్‌లో ఇటీవలే అమల్లోకి వచ్చిన అక్రమ మత మార్పిడి నిరోధక బిల్లు-2025పై సుప్రీంకోర్టు శుక్రవారం ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీస్ పంపింది. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ తదితరులు వేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. చట్టంలోని నిబంధనలు ఏకపక్షం, అక్రమం, అహేతుకంగా ఉన్నాయని, రాజ్యాంగ వ్యతిరేకమని పిటిషన్ పేర్కొంది. ఇలాంటి పిటిషన్‌పై ఈ నెల 17వ తేదీన రాజస్తాన్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీస్ పంపించింది. ఇదే అంశంపై పలు పిటిషన్లు దాఖలయ్యాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. దీంతో, ఈ మొత్తం పిటిషన్లన్నిటినీ కలిపి ఒకే దఫా విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, కర్నాటక ప్రభుత్వాలు అమలు చేస్తున్న మత మార్పిడి చట్టాలను సవాల్ చేస్తూ వేసిన పలు పిటిషన్లు అత్యున్నత న్యాయస్థానంలో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నాయి.

ఫలితాలు తీర్పుపై ఆధారపడి ఉంటాయి

తక్షణమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. సంస్థల ఎన్నికల ఫలితాలు తమ తీర్పుపై ఆధారపడి ఉంటాయని స్పష్టం చేసింది. స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించిన 27 పిటిషన్లను 2026 జనవరి 21న ధర్మాసనం తుది విచారణకు స్వీకరిస్తుందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జాయ్ మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎన్నికలు నాలుగు నెలల్లోగా నిర్వహించాలని ఈ ఏడాది మేలోనే ధర్మాసనం ఆదేశించింది.

కెనడా అగ్ని ప్రమాద మృతుల్లో 5గురు ఇండియన్స్

ఒట్టావా: కెనడాలోని ఒంటారియా ప్రావిన్స్‌లో ఉన్న బ్రాంప్టన్‌లో జరిగిన అగ్నిప్రమాద మృతుల్లో ఐదుగురు భారతీయులున్నారు. పంజాబ్‌కు చెందిన ఒకే కుటుంబానికి ఐదుగురున్నారని, బాధిత కుటుంబానికి తాము సహాయ సహకారాలు అందిస్తున్నామని టొరంటోలోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా తెలిపింది. 'అగ్ని ప్రమాదంలో భారతీయ పౌరులు మరణించడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ అపార దుఃఖ సమయంలో కాన్సులేట్ వారికి తోడుగా నిలుస్తుంది'అని భారత కాన్సులేట్ జనరల్ ఎక్స్ వేదికగా తెలిసింది. నవంబర్ 20న తెల్లవారుజామున 2.15 నిమిషాల ప్రాంతంలో బ్రాంప్టన్‌లో మంటలు చెలరేగాయి. ఈ అగ్ని ప్రమాద మృతుల్లో ముగ్గురు మహిళలు, ఒక పసిపిల్లాడు కూడా ఉన్నారు. మంటల నుంచి తప్పించుకోవడానికి కిటికీ నుంచి దూకిన గర్భిణీ స్త్రీ గాయాలతో బయటపడింది. కానీ ఆమె కడుపులో బిడ్డ ప్రాణాలు నిలవలేదు. ఆస్పత్రిలో ఉన్న మరో నలుగురు వ్యక్తుల పరిస్థితి విషమంగా ఉంది. కొందరి పరిస్థితి విషమంగా ఉంది.

థాయ్‌లాండ్‌లో వరద బీభత్సం..

145కి చేరుకున్న మృతుల సంఖ్య

బ్యాంకాక్: దక్షిణ థాయ్‌లాండ్‌లో వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించాయి. 12 ప్రావిన్సుల్లో మరణించిన వారి సంఖ్య 145కి చేరుకుంది. వరదల కారణంగా 12లక్షలకు పైగా ఇళ్లు ప్రభావితమయ్యాయి. 36 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. వర్షాలు ఆగిపోయి, వరద తగ్గుముఖం పట్టినా ఇంకా ముప్పు పొంచి ఉంది. వరద నీరు తగ్గుముఖం పట్టడంతో అధికారులు సహాయక చర్యలు వేగవంతం చేశారు. దీంతో మునిగిపోయిన ఇళ్ల నుంచి మృతదేహాలు బయటికి తీస్తున్నారు. సాంగ్‌ఖ్లా నగరంలోనే మృతుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వ ప్రతినిధి సిరిపాంగ్ తెలిపారు.

సిరియాపై ఇజ్రాయెల్ దాడులు..13 మంది మృతి

డెమాస్కస్: సిరియా దక్షిణ ప్రాంతంపై శుక్రవారం ఇజ్రాయెల్ బలగాలు జరిపిన దాడిలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరంతా సామాన్య పౌరులని సిరియా అధికారులు తెలిపారు. బెయిట్ జిన్ గ్రామంలో ఇస్లామిక్ ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో అక్కడికి వెళ్లామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. అయితే, ముష్కరులు జరిపిన కాల్పుల్లో కనీసం ఆరుగురు సైనికులు గాయపడ్డారంది. వైమానిక దళం సాయంతో ఉగ్రవాదులందరినీ పట్టుకున్నామని, కొందరు ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపింది. ఇదే గ్రామంపై ఇజ్రాయెల్ ఆర్మీ జూన్‌లోనూ దాడి జరిపింది.

ఇండోనేసియాలో వరదలు.. 164కు చేరిన మృతులు

పడంగ్: ఇండోనేసియాలోని సుమత్ర దీవిలో భారీ వర్షాలు, వరదల్లో మరణించిన వారి సంఖ్య శుక్రవారం 164కు చేరుకుంది. మరో 79 మంది జాడ తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. రహదారులు, వంతెనలు తీవ్రంగా దెబ్బతినడంతోపాటు భారీ యంత్ర సామగ్రి కొరత కారణంగా సహాయ చర్యలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. మంగళవారం సుమత్రలో కురిసిన కుంభవృష్టితో కొండప్రాంతాల్లోని గ్రామాలు తుడిచి పెట్టుకుపోయాయి. కనీసం 3,200 ఇళ్లు దెబ్బతినడంతో 3 వేలకు పైగా కుటుంబాలకు నిలువ నీడ కరువైంది.

కలకత్తాలో సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

బ్రిటిషర్ల కాలంలో చేసిన చట్టాలు

ఆంగ్లేయులు భారతదేశానికి ప్రధానంగా వ్యాపారం కోసం వచ్చినప్పటికీ ఆ తర్వాత క్రమంగా ఇక్కడ పరిపాలనపై పట్టు సాధించారు. ఇందులో భాగంగా అనేక చట్టాలకు రూపకల్పన చేశారు. వైస్రాయ్‌లు, గవర్నర్ జనరల్స్ భారతదేశంలో వివిధ సంస్కరణలు ప్రవేశపెట్టారు. మనదేశంలో ప్రస్తుతం అమలవుతున్న అనేక చట్టాలు ఈ రూపం సంతరించుకోవడానికి బ్రిటిషర్ల కాలంనాటి విధానాలు, ఉద్యమాలు, సంస్కరణలు దోహదం చేశాయి. వీటికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను పరిశీలిద్దాం..

- మనదేశంలో స్థానిక స్వపరిపాలన చట్టాలను 1880–84లో చేశారు. లార్డ్ రిప్పన్‌ను భారతదేశంలో స్థానిక పరిపాలనా పితామహుడిగా పేర్కొంటారు.
- లార్డ్ రిప్పన్ 'ఇల్బర్టు బిల్లు'ను ప్రవేశపెట్టాడు. దీన్ని గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలో న్యాయశాఖ సభ్యుడైన ఇల్బర్ట్ రూపొందించాడు. దీని ద్వారా భారతీయ మెజిస్ట్రేట్లకు యూరోపియన్ నిందితులను విచారించడానికి అధికారం లభించింది.
- లార్డ్ లాన్స్‌డౌన్ గవర్నర్ జనరల్ కాలంలో 'రెండో కర్మాగారాల చట్టం' అమల్లోకి వచ్చింది.
- భారతదేశంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను 1866లో ఏర్పాటు చేశారు. దీన్ని లార్డ్ డఫ్రిన్ నెలకొల్పారు.
- 'రైతు బాంధవుడు'గా గుర్తింపు పొందిన వైస్రాయ్ లార్డ్ కర్జన్. ఇతడినే 'డూ క్విక్ వైస్రాయ్'గా పేర్కొంటారు.
- లార్డ్ కర్జన్ భారతదేశంలో ప్రత్యేక పురావస్తు శాఖను ఏర్పాటు చేశాడు. పురావస్తు శాఖ మొట్టమొదటి డైరెక్టర్ జనరల్‌గా సర్ జాన్ మార్షల్ పని చేశాడు.
- 1859లో బెంగాల్‌లో భూమిశిస్తు చట్టాన్ని ప్రవేశపెట్టారు.
- దేశభాషా పత్రికల చట్టాన్ని అమలు జరిపిన గవర్నర్ జనరల్ 'లార్డ్ లిట్టన్'.
- లార్డ్ కానింగ్ 1862లో స్వదేశీ సంస్థానాధిపతుల బ్రిటిష్ రాజప్రతినిధులను సామంతులుగా ప్రకటించాడు.
- విక్టోరియా రాణి 1877లో 'భారతదేశ చక్రవర్తి' అనే బిరుదు ధరించారు.
- 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది.
- లార్డ్ కర్జన్ శాశ్వత కౌలు పద్ధతి ద్వారా నిజాం నుంచి బీరార్ ప్రాంతాన్ని వేరు చేసి బ్రిటిష్ పాలిత ప్రాంతాల్లో విలీనం చేశాడు.
- భూటాన్‌ను ఆక్రమించిన గవర్నర్ జనరల్ 'జాన్ లారెన్స్'. బ్రిటిష్ ఇండియా, భూటాన్ మధ్య జరిగిన సంధి పేరు 'సించులా'.
- లార్డ్ కర్జన్ భారత్‌లో తొలిసారిగా సీఐడీలను ప్రవేశపెట్టాడు. ఇతడు విశ్వవిద్యాలయాల చట్టాన్ని కూడా రూపొందించాడు. 1901లో బెంగాల్‌లోని 'పూసా'లో ఇంఫీరియల్ అగ్రికల్చరల్ ఇన్‌స్టిట్యూట్ (వ్యవసాయ పరిశోధనా కేంద్రం) నెలకొల్పాడు.
- 1905లో బెంగాల్‌ను విభజించిన బ్రిటిష్ రాజప్రతినిధి 'లార్డ్ కర్జన్'. ఇతడి కాలంలోనే ప్రత్యేక రైల్వే బోర్డును నెలకొల్పారు.
- 1906లో అఖిల భారత ముస్లింలీగ్‌ను స్థాపించారు. ఇదే సంవత్సరం కేంద్ర వ్యవసాయ శాఖను ఏర్పాటు చేశారు.
- జాతీయ కాంగ్రెస్‌ను, ముస్లింలను సంతృప్తిపరచడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1909లో మింటో మార్లే సంస్కరణల చట్టం ప్రవేశపెట్టింది. ఈ సంస్కరణలు 'విభజించు, పాలించు' విధానానికి నాంది పలికాయి.
- 1911లో హార్డింజ్ కాలంలో దేశ రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చారు. సుతమతి, కాశీఘట్టం, గోవిందపూర్ గ్రామాల కలయికతో కలకత్తా నగరం ఏర్పడింది.
- ఇంగ్లండ్ చక్రవర్తి అయిదో జార్జ్ భారతదేశాన్ని 1911లో సందర్శించాడు.

భారతదేశంలో 1773–1857 మధ్యకాలంలో ఈస్టిండియా కంపెనీ వ్యాపార, వ్యవహారాలను నియంత్రించడానికి బ్రిటిష్ పార్లమెంటు కొన్ని చట్టాలను రూపొందించింది. వీటినే 'చార్టర్ చట్టాలు' అంటారు.

రెగ్యులేటింగ్ చట్టం-1773

భారతదేశానికి వ్యాపార రీత్యా వచ్చిన ఈస్టిండియా కంపెనీ వ్యవహారాలను నియంత్రించడానికి బ్రిటిష్ పార్లమెంట్ చేసిన తొలి చట్టం ఇది. దీన్ని భారతదేశానికి సంబంధించి 'మొట్టమొదటి లిఖిత చట్టం'గా పేర్కొంటారు. ఈస్టిండియా కంపెనీకి ఈ చట్టం ద్వారా మొదటిసారిగా రాజకీయ, పరిపాలన అధికారాలు సంక్రమించాయి. కంపెనీ వ్యవహారాలను నియంత్రించే ఉద్దేశంతో రూపొందించడం వల్ల దీన్ని 'రెగ్యులేటింగ్ చట్టం' అంటారు. దీని ద్వారా బెంగాల్ గవర్నర్ హోదాను 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్'గా మార్చారు. ఇతడికి సలహాలు ఇవ్వడానికి నలుగురు సభ్యులతో కార్యనిర్వాహక మండలిని ఏర్పాటు చేశారు. 'వారన్ హేస్టింగ్స్'ను తొలి గవర్నర్ జనరల్‌గా నియమించారు. కౌన్సిల్‌లో మెజారిటీ ఆధారంగా నిర్ణయాలు తీసుకునేవారు. గవర్నర్ జనరల్‌కు కాస్టింగ్ ఓటు మాత్రమే ఉండేది. 1774లో ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయమూర్తులతో కలకత్తాలో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. 'ఎలిజా ఇంఫే' సుప్రీంకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించాడు.

పిట్స్ ఇండియా చట్టం-1784

రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాలను సవరించడానికి బ్రిటిష్ పార్లమెంటు ఈ చట్టాన్ని 1784లో ఆమోదించింది. నాటి బ్రిటన్ ప్రధాని 'విలియం పిట్' ఈ చట్టాన్ని ప్రతిపాదించారు. దీని ద్వారా 'బోర్డ్ ఆఫ్ కంట్రోల్' అనే నూతన విభాగాన్ని ఏర్పాటు చేసి కంపెనీ రాజకీయ వ్యవహారాలను దానికి అప్పగించారు. అప్పటికే ఉన్న కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్‌ను వాణిజ్య వ్యవహారాలకే పరిమితం చేశారు. గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలికి ప్రెసిడెన్సీ ప్రాంతాలపై ప్రత్యక్ష నియంత్రణ అధికారాన్ని ఇచ్చారు. కార్యనిర్వాహక మండలి సభ్యుల సంఖ్యను నాలుగు నుంచి మూడుకు తగ్గించారు.

చార్టర్ చట్టం-1793

ఈ చట్టం ద్వారా గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా అధికారాలను విస్తృతం చేశారు. కంపెనీ వ్యాపార గుత్తాధిపత్యాన్ని మరో 20 ఏళ్లకు పొడిగించారు. బోర్డు కార్యదర్శిని పార్లమెంటులో కూర్చోవడానికి అనుమతించారు. బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఉద్యోగుల జీతభత్యాల ఖర్చును భారత రెవెన్యూ నుంచి వినియోగించేవిధంగా, యుద్ధ అవసరాలకు మొత్తం రెవెన్యూను మళ్లించే విధంగా మార్పులు చేశారు.

చార్టర్ చట్టం-1813

ఈస్టిండియా కంపెనీ చార్టర్‌ను మరో 20 ఏళ్లు పొడిగించారు. భారతదేశ వర్తకంపై కంపెనీ గుత్తాధిపత్యాన్ని తొలగించి కేవలం పాలనాపరమైన సంస్థగా మార్చారు. పన్నులు విధించడం, అవి చెల్లించని వారిపై చర్యలను తీసుకునే అధికారాన్ని స్థానిక సంస్థలకు ఇచ్చారు. భారతీయులకు మత, విద్యాపరమైన అధ్యయనం కోసం లక్ష రూపాయలతో నిధి ఏర్పాటు చేశారు. సివిల్ సర్వెంట్లకు శిక్షణా సదుపాయాన్ని కల్పించారు. ఈ చట్టం ద్వారా భారత్‌లో వర్తకం చేయడానికి అందరికీ అవకాశం కల్పించారు.

చార్టర్ చట్టం-1833

ఈస్టిండియా కంపెనీ పాలనను మరో 20 ఏళ్లకు పొడిగించారు. బెంగాల్ గవర్నర్ జనరల్ హోదాను 'ఇండియన్ గవర్నర్ జనరల్'గా మార్చారు. ఈ హోదాలో భారత మొదటి గవర్నర్ జనరల్ విలియం బెంటింగ్. రాష్ట్ర ప్రభుత్వాల శాసనాధికారాలను రద్దు చేసి కార్యనిర్వాహక మండలి సమేతుడైన గవర్నర్ జనరల్‌కు పూర్తి శాసనాధికారాలు కల్పించారు. భారతీయ శాసనాలను క్రోడీకరించడానికి భారతీయ 'లా' కమిషన్‌ను నియమించారు. దీనికి తొలి అధ్యక్షుడు లార్డ్ మెకాలే.

చార్టర్ చట్టం-1853

చార్టర్ చట్టాల్లో చివరిది. అతి తక్కువ కాలం అమల్లో ఉన్న చార్టర్ చట్టం ఇదే. దీని ద్వారా కంపెనీ పాలనను పొడిగించలేదు. ఇకపై ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కాంపిటేటివ్ పరీక్షల ఆధారంగానే జరుగుతుందని నిర్దేశించారు. గవర్నర్ జనరల్ సాధారణ మండలి అధికారాలను శాసన, కార్యనిర్వాహక విధులుగా విభజించారు. శాసనాలు రూపొందించే ప్రక్రియ కోసం 'ఇండియన్ సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్'ను ఏర్పాటు చేశారు. ఇది బ్రిటిష్ పార్లమెంటులా విధులు నిర్వర్తిస్తుంది. అందువల్ల దీన్ని 'మినీ పార్లమెంట్'గా పేర్కొంటారు. కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొదటిసారిగా స్థానిక ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించారు.

భారత రాజ్యాంగ చట్టం-1858

1857 సిపాయిల తిరుగుబాటుతో భారతదేశంలో కంపెనీ పాలన అంతమై చక్రవర్తి (బ్రిటిష్ రాజు/రాణి) పరిపాలన వచ్చింది. బ్రిటిష్ రాణి 1858 నవంబర్ 1న భారత పరిపాలనా అధికారాన్ని నేరుగా చేపడుతూ ఒక ప్రకటన జారీ చేశారు. గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాను వైస్రాయ్ ఆఫ్ ఇండియాగా మార్చారు. ఇతడు బ్రిటిష్ రాణి పేరుపై దేశ పాలన నిర్వహిస్తాడు. మొదటి వైస్రాయ్ చార్లెస్ కానింగ్. 'భారత రాజ్య కార్యదర్శి' అనే కొత్త పదవిని సృష్టించారు. ఇతడు బ్రిటిష్ మంత్రి వర్గానికి చెందిన వ్యక్తి. అన్ని విషయాల్లో ఇతడిదే తుది నిర్ణయం. ఇతడి కార్యాలయం లండన్‌లోనే ఉండేది. ఇతడికి సహాయంగా 15 మంది సభ్యులతో సలహా మండలి ఏర్పాటు చేశారు. మొదటి కార్యదర్శి చార్లెస్ వుడ్.

కౌన్సిల్ చట్టం-1861

దీని ద్వారా గవర్నర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల సంఖ్యను అయిదుకు పెంచి ఒక్కో సభ్యుడికి ఒక్కో అంశంపై అధికారం ఇచ్చారు. సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. దీనికి నామమాత్రపు అధికారాలు ఇచ్చారు. 1860లో బడ్జెట్ పద్ధతి ప్రవేశపెట్టారు.

కౌన్సిల్ చట్టం-1892

కౌన్సిల్ చట్టం–1861లోని లోపాలను సరిదిద్దడానికి ఈ చట్టం చేశారు. కేంద్ర శాసనసభలో అనధికార సభ్యుల సంఖ్య 10కి తగ్గకుండా 16 కంటే మించకుండా.. రాష్ట్ర శాసనసభల్లో 8 మందికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా నియంత్రించారు. ఈ చట్టం ద్వారా శాసన మండలి అధికారాలను విస్తృతం చేశారు. బడ్జెట్‌పై చర్చించడం లాంటి అధికారాలను కల్పించారు. గవర్నర్/ గవర్నర్ జనరల్ ముందస్తు అనుమతితో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా శాసనసభల్లో ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నలు వేయడానికి సభ్యులకు అవకాశం కల్పించారు.

మింటో-మార్లే సంస్కరణలు-1909

సెంట్రల్, స్టేట్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుల సంఖ్యను, అధికారాలను పెంచారు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నిక విధానం ప్రవేశపెట్టారు. ముస్లింలకు ప్రత్యేకంగా నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు. వైస్రాయ్, గవర్నర్ల కార్యనిర్వాహక మండలిలో తొలిసారిగా భారతీయులకు సభ్యత్వం కల్పించారు. ఈవిధంగా సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా.

మాంటెగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు-1919

ఇవి నూతన రాజ్యాంగ సంస్కరణలకు సంబంధించినవి. రాష్ట్రాల్లో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టారు. ప్రజల ద్వారా ఎంపికైన ముఖ్యమంత్రి నాయకత్వంలోని మంత్రి మండలికి విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం మొదలైన అంశాలపై అధికారం కల్పించారు. వీటిని బదిలీ చేసిన అధికారాలుగా పేర్కొన్నారు. రెవెన్యూ, ఆర్థిక, శాంతి భద్రతలు మొదలైన అంశాలను రిజర్వ్‌డ్ అధికారాల పేరుతో బ్రిటిష్ గవర్నర్ చేతికి ఇచ్చారు. మత ప్రాతినిధ్యాన్ని సిక్కులు, క్రిస్టియన్లు, ఆంగ్లో–ఇండియన్లు, ఐరోపా వారికి కూడా వర్తింపజేశారు. దేశంలో మొదటిసారి కేంద్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు. ఎగువసభను రాష్ట్రాల మండలి (కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్), దిగువసభను కేంద్ర శాసనసభ (సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ)గా వ్యవహరించారు.

భారత ప్రభుత్వ చట్టం -1935

దీని ప్రకారం అఖిల భారత సమాఖ్య ఏర్పాటుకు నిర్ణయించారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య 3 జాబితాల ప్రకారం అధికార విభజన చేశారు. రాష్ట్రాల్లోని ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేసి కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రతిపాదించారు. కేంద్రంలో పాలనాంశాలను రిజర్వుడు, ట్రాన్స్‌ఫర్డ్ అంశాలుగా విభజించారు. ఈ చట్టం ద్వారా బర్మాను భారతదేశం నుంచి వేరు చేశారు. ఒరిస్సా, సింధ్ అనే రెండు కొత్త ప్రావిన్సులను ఏర్పాటు చేశారు. కేంద్రంలో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్రాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటు చేశారు. భారతదేశంలో విత్త విధానం, రుణ నియంత్రణ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను స్థాపించారు..

హైడ్రోజన్ బాంబు పని చేసే సూత్రం?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్

ఆధునిక భౌతిక శాస్త్రం

1. సహజ రేడియోధార్మికతలో విడుదలయ్యే కిరణాలేవి?
జ. α, β, γ
2. α, β, γ కిరణాలకు మరో పేరు?
జ. బెక్వరల్ కిరణాలు
3. α–కణం విడుదలైనప్పుడు పరమాణు సంఖ్యలో తగ్గుదల?
జ. 2 యూనిట్‌లు
4. α–కణం విడుదలైనప్పుడు ద్రవ్యరాశి సంఖ్యలో తగ్గుదల?
జ. 4 యూనిట్‌లు
5. α–కణాన్ని కనుగొన్న శాస్త్రవేత్త?
జ. రూథర్‌ఫర్డ్
6. అత్యధిక అయనీకరణ సామర్థ్యం ఉన్న కణం?
జ. α–కణం
7. అత్యధిక చొచ్చుకుపోయే సామర్థ్యం ఉన్న కణం?
జ. γ–కణం
8. సహజ రేడియోధార్మికత ప్రక్రియలో β కణం విడుదలైనప్పుడు పరమాణు సంఖ్యలో పెరుగుదల?
జ. 1 యూనిట్
9. β–కణాన్ని కనుగొన్నవారు?
జ. రూథర్‌ఫర్డ్
10. γ–కణం విడుదలైనప్పుడు పరమాణు సంఖ్య, ద్రవ్యరాశి సంఖ్యలో మార్పు?
జ. ఉండదు
11. γ–కణాన్ని కనుగొన్నవారు?
జ. విల్లార్డ్
12. రేడియోధార్మిక శ్రేణులు ఎన్ని రకాలు?
జ. నాలుగు రకాలు. అవి..
ఎ. థోరియం శ్రేణి లేదా 4n శ్రేణి
బి. యురేనియం శ్రేణి లేదా 4n+2 శ్రేణి
సి. ఆక్టీనియం శ్రేణి లేదా 4n+3 శ్రేణి
డి. నెప్ట్యూనియం శ్రేణి లేదా 4n+1 శ్రేణి
13. సహజ రేడియోధార్మిక శ్రేణుల్లో చిట్టచివరి మూలకం?
జ. సీసం (పరమాణు సంఖ్య = 82, లాటిన్ నామం ప్లంబం pb)
14. రేడియోధార్మికతకు ప్రమాణాలేవి?
జ. బెక్వరల్, రూథర్‌ఫర్డ్, క్యూరి
(రేడియోధార్మికతకు చిన్న ప్రమాణం Bq (బెక్వరల్)
Bq = విఘటనం/ సెకన్
రూథర్‌ఫర్డ్ (R.d) $= 10^6$ విఘటనం/సెకన్
రూథర్‌ఫర్డ్ (R.d) $= 10^6$ Bq
క్యూరీ (C.I) $= 3.7\times10^{10}$ విఘటనం/సెకన్
$= 3.7\times10^{10}$ Bq
$= 3.7\times10^4 \times 10^6$ Bq
క్యూరీ (C.I) $= 3.7\times10^4$ R.d
(R.d - రూథర్‌ఫర్డ్)
రేడియోధార్మికతకు అతి పెద్ద ప్రమాణం క్యూరీ.
15. ప్రకృతిలోని ప్రాథమిక బలాల్లో అత్యంత బలమైంది?
జ. బలమైన కేంద్రక బలం
16. కేంద్రక బలాలను మీసాన్ సిద్ధాంతంతో వివరించిందెవరు?
జ. యుకావా
17. పరమాణు కేంద్రకం పాల్గొనే చర్యలు?
జ. కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనం
18. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియను వివరించిందెవరు?
జ. అట్టోహాన్, స్ట్రాస్‌మన్, లిసేవెయిట్‌నర్
19. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియ జరగడానికి ఉపయుక్తమైన కణం?
జ. ఉష్ణీయ న్యూట్రాన్
20. ఉష్ణీయ న్యూట్రాన్ అంటే?
జ. తక్కువ వేగం ఉన్న న్యూట్రాన్
(ఉష్ణీయ న్యూట్రాన్ శక్తి 0.04 ev కంటే తక్కువగా ఉంటుంది)
21. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియలో విడుదలయ్యే న్యూట్రాన్లు ఏ శ్రేణిలో ఉంటాయి?
జ. గుణ శ్రేణి
న్యూట్రాన్లు విడుదలయ్యే క్రమం:
3, 9, 27, 81, 243, 729....
22. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియ ఒక యురేనియం మూలకం అంతరించిపోయే వరకు జరుగుతుంది. ఈ చర్య పేరు?
జ. శృంఖల చర్య
23. శృంఖల చర్య ఎన్ని రకాలుగా జరుతుంది?
జ. రెండు రకాలుగా. అవి..
ఎ. అనియంత్రిత శృంఖల చర్య
బి. నియంత్రిత శృంఖల చర్య
24. అనియంత్రిత శృంఖల చర్య ఆధారంగా పనిచేసేది?
జ. ఆటమ్ బాంబు (అణు బాంబు)
25. అణు బాంబు సృష్టికర్తలు?
జ. అట్టోహాన్, స్ట్రాస్‌మన్
26. అణు బాంబును మొట్టమొదటిసారిగా ఏ దేశంపై ప్రయోగించారు?
జ. జపాన్
27. అణు బాంబును మొదటిసారిగా ఏ నగరంపై విసిరారు?
జ. హిరోషిమా
ఆగస్టు 6న హిరోషిమాపై అణు బాంబు వేశారు. కాబట్టి ఆగస్టు 6ను హిరోషిమా డే అని పిలుస్తారు. హిరోషిమాపై విసిరిన బాంబు పేరు లిటిల్ బాయ్.
28. అణు బాంబును జపాన్‌లోని 'నాగసాకి' నగరంపై వేసిన రోజు?
జ. ఆగస్టు 9. అందుకే ఆగస్టు 9ని నాగసాకి డే అని పిలుస్తారు. నాగసాకి నగరంపై వేసిన బాంబు పేరు ఫ్యాట్‌మాన్.
29. నియంత్రిత శృంఖల చర్య ఆధారంగా పని చేసే పరికరం?
జ. న్యూక్లియర్ రియాక్టర్
30. న్యూక్లియర్ రియాక్టర్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
జ. ఎన్‌రిక్ ఫెర్మి
అమెరికాకు చెందిన ఫెర్మి 1942 డిసెంబర్‌లో న్యూక్లియర్ రియాక్టర్‌ను రూపొందించాడు. ఇతణ్ని న్యూక్లియర్ రియాక్టర్ పితామహుడిగా పిలుస్తారు. ఫెర్మి గౌరవార్థం పరమాణు కేంద్రక పరిమాణాన్ని ఫెర్మిలలో కొలుస్తారు. పరమాణు కేంద్రక వ్యాసార్ధం విలువ $=10^{-15}$ m
31. న్యూక్లియర్ రియాక్టర్‌లో ఎన్ని ప్రధాన భాగాలుంటాయి?
జ. 5
32. న్యూక్లియర్‌లో ఉపయోగించే ఇంధన పదార్థాలు ఏవి?
జ. యురేనియం, థోరియం, ఫ్లూటోనియం.
ఈ ఇంధన పదార్థాలను స్తూపాకార అల్యూమినియం గొట్టాల్లో నింపుతారు.
33. న్యూక్లియర్ రియాక్టర్‌లోని మితకారి పదార్థం ప్రయోజనం?
జ. న్యూట్రాన్‌ల వేగం తగ్గించడం
34. న్యూక్లియర్ రియాక్టర్‌లో మితకారిగా ఉపయోగించే పదార్థాలు?
జ. భారజలం, గ్రాఫైట్, బెరీలియం, పారఫిన్.
భారజలానికి మరో పేరు డ్యూటీరియం ఆక్సైడ్. దీన్ని యురే అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.
- ప్రస్తుతం ఇండియాలో 9 భారజల కేంద్రాలు ఉన్నాయి.
- భారతదేశంలో మొదట పంజాబ్‌లోని నంగాల్‌లో భారజల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక భారజల కేంద్రం ఖమ్మం జిల్లాలోని మణుగూరులో ఉంది.
- గ్రాఫైట్‌ను లెడ్ పెన్సిళ్ల తయారీలో, భారీ యంత్రాల్లో కందెనగా ఉపయోగిస్తారు.
- లెడ్ పెన్సిల్‌లో లెడ్ ఉండదు.
- గ్రాఫైట్ కార్బన్ రూపాంతరం.
- కార్బన్‌కు అలోహ ధర్మం ఉన్నప్పటికీ గ్రాఫైట్ లోహ ధర్మాన్ని పాటిస్తుంది.
- కార్బన్‌ను 'కింగ్ ఆఫ్ ది ఎలిమెంట్స్' అని పిలుస్తారు.

35. న్యూక్లియర్ రియాక్టర్‌లో వాడే నియంత్రణ కడ్డీల ప్రయోజనం?
జ. చర్యా వేగాన్ని తగ్గించడం
36. న్యూక్లియర్ రియాక్టర్‌లో ఉపయోగించే నియంత్రణ కడ్డీలు?
జ. బోరాన్, కాడ్మియం
37. న్యూక్లియర్ రియాక్టర్‌లో జరిగే కేంద్రక చర్యల వల్ల విడుదలయ్యే ఉష్ణాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ఉపయోగపడేది?
జ. శీతల కారిణి
(శీతల కారిణిగా ఉపయోగించే పదార్థాలు భారజలం, ద్రవ సోడియం)
38. కేంద్రక సంలీన చర్యలకు మరో పేరు?
జ. ఉష్ణకేంద్రక చర్యలు
39. సూర్యుడు, నక్షత్రాల్లో నిరంతరం జరిగే చర్యలు ?
జ. కేంద్రక సంలీన చర్యలు
40. సూర్యుడి నుంచి లభించే విటమిన్?
జ. విటమిన్–డి
41. హైడ్రోజన్ బాంబు ఏ సూత్రం ఆధారంగా పనిచేస్తుంది?
జ. అనియంత్రిత కేంద్రక సంలీన చర్య
హైడ్రోజన్ బాంబును ఎడ్వర్డ్ టెల్లర్ తయారు చేశారు. ఇతడిని హైడ్రోజన్ బాంబు పితామహుడిగా పిలుస్తారు. మొదటి హైడ్రోజన్ బాంబు పేరు మైక్.
42. కేంద్రక సంలీన చర్యలు భూమి, చంద్రుడిపై జరగకపోవడానికి కారణం?
జ. హైడ్రోజన్‌కు ఉన్న స్వల్ప పలాయన వేగం. వాయు కణాలు తప్పించుకొని పోయేందుకు కావల్సిన కనీస వేగాన్ని పలాయన వేగం (Ve) అంటారు.
- భూమిపై హైడ్రోజన్ పలాయన వేగం? 11.2 కి.మీ./సెకన్
- చంద్రుడిపై హైడ్రోజన్ పలాయన వేగం? 2.38 కి.మీ./సెకన్
- సూర్యుడిపై హైడ్రోజన్ పలాయన వేగం? 620 కి.మీ./సెకన్

43. కేంద్రక సంలీన చర్యలో పాల్గొనే మూలకం?
జ. హైడ్రోజన్
44. కేంద్రక సంలీన చర్య జరిగిన తర్వాత ఏర్పడే మూలకం?
జ. హీలియం
45. సూర్యుడికి మరో పేరు?
జ. హీలియో

గతంలో అడిగిన ప్రశ్నలు

1. థర్మల్ రియాక్టర్‌లో శక్తిని విడుదల చేసే ముఖ్యమైన మూల పదార్థం?
ఎ) యురేనియం– 235
బి) యురేనియం – 238
సి) యురేనియం– 233
డి) ఫ్లుటోనియం–233
2. సూర్యుడిలో శక్తికి మూలాధారం?
ఎ) కేంద్రక విచ్ఛిత్తి
బి) ద్రవ్యరాశి లోపం
సి) రేడియో ధార్మికత
డి) కేంద్రక సంలీనం
3. బీటా కిరణాలు వేటిని కలిగి ఉంటాయి?
ఎ) ఎలక్ట్రాన్లు బి) ప్రోటాన్లు
సి) పాజిట్రాన్లు డి) న్యూట్రాన్లు
4. న్యూక్లియర్ రియాక్టర్‌ను విస్ఫోటక దశ నుంచి రక్షించడానికి వాడేవి?
ఎ) కాడ్మియం కడ్డీలు
బి) కార్బన్ కడ్డీలు
సి) భారజలం
డి) అల్యూమినియం కడ్డీలు
5. హైడ్రోజన్ బాంబు పని చేసే సూత్రం?
ఎ) కేంద్రక విచ్ఛిత్తి
బి) కేంద్రక సమ్మేళనం
సి) కృత్రిమ రేడియోధార్మికత
డి) సహజ రేడియోధార్మికత
6. న్యూక్లియర్ రియాక్టర్‌లో న్యూట్రాన్‌ల వేగాన్ని తగ్గించేది?
ఎ) భారజలం బి) పాదరసం
సి) హైడ్రోజన్ డి) ఆల్కహాల్
7. అణు రియాక్టర్‌లో ఇంధనంగా ఉపయోగించేది?
ఎ) బొగ్గు బి) యురేనియం
సి) రేడియం డి) భారజలం
8. భారజలం అంటే?
ఎ) మంచు గడ్డ కట్టడం
బి) డ్యూటీరియం ఆక్సైడ్
సి) పొడి మంచు
డి) పైవేవీ కావు
9. భారత అణుశక్తి పితామహుడు?
ఎ) రాజా రామన్న
బి) విక్రమ్ సారాబాయి
సి) సి.వి. రామన్
డి) హోమి జహంగీర్ బాబా
10. రేడియోధార్మికత శక్తిని కనుగొన్నవారు?
ఎ) బెక్వరల్ బి) ఛాడ్విక్
సి) బోర్ డి) లీనార్డ్
11. అణు బాంబు ఆవిష్కర్త?
ఎ) డాల్టన్ బి) అట్టోహాన్
సి) న్యూటన్ డి) ఐన్‌స్టీన్

సమాధానాలు

1) ఎ; 2) డి; 3) ఎ; 4) సి;
5) బి; 6) ఎ; 7) బి; 8) బి;
9) డి; 10) ఎ; 11) బి.

వనపర్తి సంస్థాన స్థాపకుడు ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

తెలంగాణలో ముఖ్యమైన సంస్థానాలు

తెలంగాణ సంస్కృతి నిర్మాణంలో, సాహిత్య వికాసంలో సంస్థానాల పాత్ర మరువలేనిది. ఆంధ్ర ప్రాంతంలో నాయక రాజులు పోషించిన పాత్రను తెలంగాణలో సంస్థానాలు పోషించాయి.

ఆత్మకూరు సంస్థానం

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆత్మకూరు సంస్థానం వైశాల్యం 190 చ.కి.మీ. దీని తొలి రాజధాని తివుడంపల్లి. వర్ధమానపురం పాలకుడైన గోన బుద్ధారెడ్డి తిరుపతి వెళ్లినప్పుడు చంద్రగిరికి చెందిన గోపాలరెడ్డి అతడికి సకల సౌకర్యాలు కల్పించాడు. గోపాలరెడ్డి ఆతిథ్యానికి ముగ్ధుడైన బుద్ధారెడ్డి అతణ్ని మగతలనాడు గౌడ పదవిలో నియమించాడు. ఇతణ్నే ఈ సంస్థాన స్థాపకుడిగా చెప్పవచ్చు. ఇతడి చిన్న కుమారుడు చినగోపిరెడ్డి యుద్ధాల్లో బహమనీ సుల్తాన్లకు సహకరించాడు. ఇందుకు ప్రతిఫలంగా ముజఫర్ పరగణాలో నాడగౌడ, సర్నాడ గౌడ, దేశ్‌ముఖ్, దేశ్‌పాండ్య, దేశాయిగిరి పదవులను పొందాడు.

చినగోపిరెడ్డి మనవడు రెండో గోపిరెడ్డి. ఇతడు అబ్దుల్లా కుతుబ్‌షా సమకాలీనుడు. రెండో గోపిరెడ్డి కుతుబ్‌షా దగ్గర నుంచి అల్లిపురం జాగీర్‌ను పొందాడు. గోపిరెడ్డి సోదరుడు సాహెబ్‌రెడ్డి. కడేచూరు, మగతల సీమలను పాలించేందుకు సాహెబ్‌రెడ్డికి కుతుబ్‌షా అనుమతిచ్చాడు. గోపిరెడ్డి తర్వాత సర్వారెడ్డి ఈ సంస్థానాన్ని పాలించాడు. సర్వారెడ్డి మనవడు రెండో సర్వారెడ్డి. ఇతడు యుద్ధాల్లో ఔరంగజేబుకు సహకరించి దుప్పల్లి జాగీర్‌ను పొందాడు. ఇతడి కుమారుడైన మొదటి తిమ్మారెడ్డి తర్వాతి కాలంలో రాజ్యాన్ని పాలించాడు. తిమ్మారెడ్డి మనవడు రెండో సాహెబ్‌రెడ్డి. ఇతడు కర్ణాటక దండయాత్రల్లో అసఫ్‌జాహీలకు సహకరించి 'సవైరాజా' బిరుదును పొందాడు. ఈ వంశంలో రెండో సాహెబ్‌రెడ్డి తర్వాత ఏడో తరానికి చెందినవాడు పెద వెంకటరెడ్డి. ఇతడు నిజాం రాజైన సికిందర్‌జాకు యుద్ధాల్లో సహకరించాడు. ప్రతిఫలంగా అమరచింత, వడ్డెమాను పరగణాల పట్టా పొందాడు. ఇతడు రాజధానిని తివుడంపల్లి నుంచి ఆత్మకూరుకు మార్చాడు. పెద వెంకటరెడ్డి తర్వాత అతడి కుమారుడు బాలకృష్ణారెడ్డి, మనవడు సోమభూపాలరావు సంస్థానాన్ని పరిపాలించారు. సోమభూపాలరావు అమరచింత, వడ్డెమాను పరగణాలను శాశ్వతంగా బిల్‌మఖ్తాగా పొందాడు. సోమభూపాలుడి కుమారుడు రాజా సీతారామభూపాలరావు. ఇతడి కుమారుడైన సవైరాజా రామభూపాలరావు బల్వంత్ బహద్దూర్ సంస్థానాన్ని పరిపాలించాడు. ఇతడు ప్రజలకు ఉపయోగపడే అనేక నిర్మాణాలను చేపట్టాడు. ఇతడి మరణానంతరం భార్య భాగ్యలక్ష్మమ్మ నిజాం నుంచి పరిపాలనా అనుమతి పొందింది. ఈమె కాలంలోనే ఈ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

నారాయణపురం, రాజాపేట

ఇవి నల్లగొండ జిల్లాకు చెందిన చిన్న సంస్థానాలు వీటికి సొంత అధికారాలు ఉండేవి కావు. నిజాం ఉల్‌ముల్క్ కాలంలో నల్లగొండ జిల్లా గట్టుప్పల్ ప్రాంతంలో ఒక గజదొంగ దురాగతాలకు పాల్పడేవాడు. మంచల్‌రెడ్డి అనే వ్యక్తి ఆ దొంగను చంపి, నారాయణపురం ప్రాంతాన్ని ఇనామ్‌గా పొందాడు. ఇతడి సోదరుడు సోమిరెడ్డి నారాయణపురం పటేల్‌గా నియమితుడయ్యాడు. తర్వాత మంచల్‌రెడ్డి కుమారుడైన రాయన్‌రెడ్డి పాలకుడయ్యాడు. నిజాంను ధిక్కరించిన ఒక సామంతరాజును ఇతడు బంధించి తెచ్చాడు. ఈ చర్యకు మెచ్చిన నిజాం ఇతడికి సర్‌మన్నెవార్, సర్దేశ్‌ముఖ్, సర్దేశ్‌పాండే, సర్‌నాడగౌడ బిరుదులు ఇచ్చి గౌరవించాడు. తర్వాత ఇతడిని రాచకొండ, భువనగిరి, అడవిమర్రి, షాద్‌నగర్, నర్సికొండ, ఇందుర్తి, ఇంద్రియాల, ఇబ్రహీంపట్నం పరగణాల మీద అధికారం కల్పించాడు.

రాయన్‌రెడ్డి 1775లో రాజాపేట కోటను నిర్మించాడు. 1782లో ఇతడి కుమారుడు వెదిరె వెంకట నారాయణరావు పాలకుడయ్యాడు. ఇతడే నారాయణపురం సంస్థానాన్ని స్థాపించాడు. ఇతడి కుమారుడైన రాయన్న మీర్ లాయక్ అలీ, సాలార్జంగ్ లాంటి గొప్ప వారితో కలిసి చదువుకున్నాడు. ఇస్లాం మతాన్ని స్వీకరించాడు. ఇతడికి ఆరుగురు భార్యలు. చివరి భార్య హుస్సేన్ బేగంకు మాత్రమే ఒక కూతురు జన్మించింది. ఆమె పేరు జహీరున్నీసా బేగం. ఆమే ఈ సంస్థాన చివరి పాలకురాలు. రాజాపేట సంస్థానం పరిధిలో కుర్రారం, నమిలె, మాసాయిపేట, కోరుకొండ, పెదపాడు, సాదువెల్లి, చల్లూరు, వెంకిర్యాల, రాజాపేట గ్రామాలుండేవి..

పాపన్నపేట సంస్థానం

పాపన్నపేట అతి ప్రాచీన సంస్థానం. ఇది ఒకప్పుడు అన్ని సంస్థానాల కంటే పెద్దది. మెదక్ జిల్లా మొత్తం ఈ సంస్థాన పరిధిలో ఉండేది. రాణి శంకరమ్మ పాలనా కాలం నుంచి సంస్థాన చరిత్ర తెలుస్తోందని బి.ఎన్.శాస్త్రి తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి కూడా గోల్కొండ పత్రికలో ఈ సంస్థాన చరిత్రను రాశారు. అందులో రాణి శంకరమ్మ, సదాశివరెడ్డి గురించి మాత్రమే పేర్కొన్నారు. తర్వాతి కాలంలో కొన్ని గ్రంథాల ద్వారా ఈ సంస్థాన చరిత్ర కొంత వెలుగులోకి వచ్చింది.

చిదిరె వంశీయులు ఈ సంస్థాన రాజపురోహితులు. ఈ వంశానికి చెందిన చిదిరె లక్ష్మణశాస్త్రి 1928–29లో సంస్థాన చరిత్రను రచించాడు. ఇందుకోసం రాణి లింగాయమ్మ రాసిన మా పూర్వ వంశావళి, రాజా వెంకట నరసింహారెడ్డి ఉర్దూలో రాసిన మా వంశ చరిత్ర, వెంకటాద్వరి రచించిన మా సంస్థాన చరిత్ర, లింగాయమ్మ చరిత్ర; తిరుమలాచార్యుల శౌర్యరాజ్య వంశావళి, ముదిగొండ రామకృష్ణ కవి శ్రీమజ్జోగినాథ చరిత్ర అనే గ్రంథాలను ఆధారంగా చేసుకున్నాడు. వీటితోపాటు తమ పూర్వీకులు చెప్పిన విషయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాడు. లక్ష్మణశాస్త్రి సంస్థాన చరిత్ర రాతప్రతిని సురవరం, బిరుదురాజు రామరాజుకు ఇచ్చాడు. కానీ కొన్ని కారణాల వల్ల దాన్ని తిరిగి పొందలేదు. దీంతో తన వద్దనున్న చిత్తుప్రతి ఆధారంగా 1979–80లో మెదక్ రాజుల చరిత్రను ముద్రించాడు. ముడుంగ రంగ కృష్ణమాచార్యులు 2006–07లో 'ఆందోల్–జోగిపేట', 2012లో 'శౌర్యవీర్యరెడ్డి త్రయం' అనే పుస్తకాలు రాశాడు.

ఆందోల్ రాజుల చరిత్ర, మెదక్ రాజుల చరిత్ర, రంగంపేట చరిత్ర అనే వివిధ పేర్లతో పాపన్నపేట సంస్థాన రాజుల చరిత్ర వ్యవహారంలో ఉంది. కాకతీయుల సేనానుల్లో అనంతరెడ్డి ఒకరు. కాకతీయ రాజ్య పతనం తర్వాత ఇతడు సంగారెడ్డి సమీపంలోని కల్పగూరు వచ్చి స్థిరపడ్డాడు. ఇతడు నాటి పాలకులకు సాయం చేసి, వారి నుంచి కల్పగూరు పరగణాను పొందాడు. ఇతడే ఈ వంశ స్థాపకుడు. తర్వాత ఇతడి మనవడైన రామినేడు 1398లో పట్టాభిషిక్తుడయ్యాడని ఆందోల్ తహశీల్దార్ రాసిన మెదక్ చరిత్రలో ఉంది. రామినేడు ఆందోల్ కోటను నిర్మించాడు. 1418లో ఆందోల్‌ను రాజధానిగా చేసుకున్నాడు. కొండాపూర్, ఓంకారపురం, పొటన్ చెర్వు (పటాన్ చెరువు), తెలంగాణాపురం, రుద్రారం, మెతుకు, కాపాల, అతినగరం, డాకూరు మొదలైనవి ఇతడి సంస్థానంలో భాగంగా ఉండేవి. తర్వాత భువనగిరి, నిజాంపేట, చందంపేట, దేవరకొండ, నర్సాపూర్, దౌల్తాబాద్ తదితర ప్రాంతాలు కూడా ఇతడి సంస్థానంలో భాగమయ్యాయి.

రామినేడు తర్వాత ముసలారెడ్డి, పెద్దరెడ్డి, అల్లమయ్య చౌదరి, రామిరెడ్డి, మొదటి సదాశివరెడ్డి, పెద్దనరసింహారెడ్డి, లింగాయమ్మ, లింగారెడ్డి తదితరులు ఈ సంస్థానాన్ని పరిపాలించారు. రామదుర్గా వెంకట నరసింహారెడ్డి (1720–60) కాలంలో ఈ సంస్థాన పరిధి తగ్గి చిన్న సంస్థానంగా మారింది. శంకరమ్మ పరాక్రమం చూసిన నరసింహారెడ్డి ఆమెను వివాహమాడాడు. నరసింహారెడ్డి మరణం తర్వాత శంకరమ్మ సంస్థాన పాలన బాధ్యతలను చేపట్టాల్సింది. కానీ ఒక కుట్ర వల్ల రెండో లింగాయమ్మ రాణి అయింది. ఈమె 1760–64 వరకు సంస్థానాన్ని పాలించింది. మహారాష్ట్ర పీష్వాలు నిజాం రాజ్యంపై దండెత్తారు. కానీ శంకరమ్మ తన శక్తియుక్తులతో వారిని ఓడించింది. దీంతో నిజాం ఆమెకు రాయ్‌భాగన్ (ఆడ సింహం లాంటి రాణి) అనే బిరుదునిచ్చి రాణిగా నియమించాడు. 1764లో అధికారంలోకి వచ్చిన శంకరమ్మ రాజ్యాన్ని పునర్ నిర్మించింది. తన తండ్రి పేరు మీద సంగారెడ్డిని, తల్లి పేరు మీద రాజంపేటను నిర్మించింది. తన పేరు మీద శంకరంపేటను, మీరెల్లి పాపన్న పేరు మీద పాపన్నపేటను నిర్మించింది. ఈమె గొప్ప పరాక్రమవంతురాలు, పరిపాలనాదక్షురాలు. శంకరమ్మ పేరు మీద అనేక జానపదులు, వీరగాథలు ప్రచారంలో ఉన్నాయి. అందుకే చరిత్రకారులు ఈమెను రుద్రమదేవి, అహల్యాబాయితో పోల్చారు. వ్యవసాయాభివృద్ధికి శంకరమ్మ అనేక చెరువులు నిర్మించింది. ఈమె గొప్ప సంస్కరణశీలి. దళితుడైన నీరుడి పాపన్నను దళపతి చేసింది.

శంకరమ్మకు సంతానం లేదు. అందువల్ల పెదబాలుడైన సదాశివరెడ్డిని దత్తత తీసుకుంది. 1774లో ఈమె మరణించింది. దీంతో సదాశివరెడ్డి రాజ్యానికి వచ్చాడు. గద్వాల సంస్థానాధీశుడైన సోమనాథ భూపాలుడు ఇతడి ధైర్య సాహసాలకు ముగ్ధుడయ్యాడు. అందుకే ఇతడికి తన కుమార్తె అయిన పార్వతీదేవినిచ్చి వివాహం చేశాడు. సదాశివరెడ్డి కూడా మరాఠా పీష్వాలను ఓడించి నిజాం అలీఖాన్ (రెండో అసఫ్‌జా)కు సహాయం చేశాడు. నిజాం అలీఖాన్ పెద్ద కుమారుడు అక్బర్ అలీ. ఇతడు తండ్రి మీద తిరుగుబాటు చేసి సదాశివరెడ్డి, గాలిబ్‌జంగ్ సహాయం కోరాడు. ఈ సందర్భంగా జరిగిన మూడు యుద్ధాల్లో సదాశివరెడ్డి గెలుపొందాడు. కానీ చివరి యుద్ధంలో ఓటమిపాలై హత్యకు గురయ్యాడు. తర్వాత ఇతడి భార్య పార్వతీదేవి అధికారంలోకి వచ్చింది. రాజా రామచంద్రారెడ్డి బహద్దూర్ ఈ సంస్థాన చివరి పాలకుడు. ఇతడి కాలంలోనే పాపన్నపేట సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

వనపర్తి సంస్థానం

తెలంగాణలోని పెద్ద సంస్థానాల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి సంస్థానం ఒకటి. ఈ సంస్థానం సాహిత్యంలో మేటి. దీని పరిధిలో 124 గ్రామాలుండేవి. నూగూరు రాజధానిగా పాలించారు కాబట్టి వీరిని నూగూరు సంస్థానాధీశులని పిలిచేవారు. వీరి పూర్వీకులు నంద్యాలకు చెందినవారు. ఈ సంస్థాన స్థాపకుడు జనుంపల్లి వీరకృష్ణారెడ్డి. ఈ వంశంలో నాలుగో తరం వాడు వేమడి వెంకటరెడ్డి(1625–53). నెల్లూరు, ఉదయగిరి దుర్గాలను జయించడంలో అబ్దుల్లా కుతుబ్‌షాకు ఇతడు సహాయపడ్డాడు. ఈ వంశంలో అష్టభాషా గోపాలరావు ప్రసిద్ధుడు. ఇతడు రెండో వెంకటరెడ్డి కుమారుడు. ఈ వంశంలో బహరి బిరుదును పొందిన తొలి వ్యక్తి గోపాలరావు. ఇతడు 8 భాషల్లో ప్రసిద్ధుడు. ఇతడు రామచంద్రోదయం అనే కావ్యాన్ని, బాణం అనే సంస్కృత గ్రంథాన్ని రచించాడు. మిన్‌జానీబ్ సర్కారు తరఫున గోపాలరావు రెండేళ్లపాటు జటప్రోలు సంస్థానాన్ని పాలించాడు. ఇతడి దత్తపుత్రుడు మూడో వెంకటరెడ్డి. ఢిల్లీ సుల్తాన్ ఇతడికి సవై బిరుదును ఇచ్చాడు. వెంకటరెడ్డి తన తండ్రి పేరు మీద గోపాలపేట సంస్థానాన్ని స్థాపించాడు.

నూగూరు సంస్థానంలోని 12 గ్రామాలను అందులో చేర్చి, దానికి తన సోదరుడైన రంగారెడ్డిని పాలకుడిగా నియమించాడు. ఈ కాలంలో మొగలుల పరిస్థితి దిగజారింది. ఇదే అదనుగా వెంకటరెడ్డి పన్ను ఎగ్గొట్టాడు. దీంతో సుల్తాన్ సైన్యం ఇతడిపై దండెత్తింది. ఈ దాడిలో ఓడిపోయిన వెంకటరెడ్డి 1711లో ఆత్మహత్య చేసుకున్నాడు. గోపాలరావు కాలంలో ముద్రించిన నూగూరు సిక్కాలు (నాణేలు) సంస్థానానికి ఎంతో పేరు తెచ్చాయి. కానీ 'నూగూరు వెట్టి' వల్ల ఈ సంస్థానం అప్రతిష్ట పాలైంది. తర్వాతి కాలంలో ఈ వంశంలో చెప్పుకోదగిన వ్యక్తి మొదటి రామకృష్ణారావు (1807–1822). ఇతడు సంస్థానాన్ని వనపర్తికి మార్చాడు. నిజాం ఇతడికి 1817లో రాజబహద్దూర్ బిరుదునిచ్చాడు. ఇతడు మంచి పండితుడు. చాలా మంది ఫకీర్లు ఇతడి స్నేహితులుగా ఉండేవారు.

ఈ సంస్థానంలో అందరిలోకెల్లా ప్రసిద్ధి చెందినవాడు రాజా రామేశ్వరరావు. ఇతడిలో ఆధునిక భావాలు మెండు. ఆంగ్ల విద్య ఆవశ్యకతను గుర్తించిన రామేశ్వరరావు మద్రాస్ వెళ్లి ఆంగ్లం నేర్చుకున్నాడు. 1802లో రెవెన్యూ సెటిల్‌మెంట్ భూమిని కొలిచి సర్వే నంబర్లు వేశాడు. రైతులకు పట్టాలు ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టాడు. తెలంగాణలో రైతులకు పట్టాలు ఇచ్చిన తొలి సంస్థానం ఇదే. సాలార్జంగ్ కంటే ముందే ఇక్కడ సంస్కరణలు చేపట్టారు. అందుకే సాయుధ పోరాటం ఇక్కడ ప్రభావం చూపలేదు. రాజా రామేశ్వరరావు కులాంతర ప్రేమ వివాహం చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. సంస్థానంలో ఆధునిక సిద్ధాంతాలను ప్రవేశపెట్టి నిజాం సర్వసైన్యాధ్యక్ష పదవి పొందాడు. బ్రిటిషర్లు ఇతడికి 'హిస్ హైనెస్' అనే బిరుదును ప్రకటించారు. మూడో రామేశ్వరరావు కాలంలో ఈ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

Another term for hyperlink is..

BANK EXAMS

COMPUTER AWARENESS

The Internet is a worldwide network of networks. It can be defined as a global network of over millions of smaller heterogeneous computer networks consists of a set of national, regional and private. The internet is the common language where by dissimilar computers with various operating systems, are able to communicate with each other using a standard set of protocols.

The Internet is the world's largest computer network, a distinction it has earned by virtue of being a "network of networks." The Internet is an outgrowth of a network (ARPANET) established roughly a quarter-century ago to meet the needs of researchers working in the defense industry in the United States and a few of their colleagues in other countries.

The ARPANET grew slowly, from a handful of computers in 1971 to more than 1000 in 1984. Working with the ARPANET researchers came to regard high-speed computer networks as an indispensable tool for academic research in all fields and in 1986 the US National Science Foundation established NSFNET to provide network connections to more research institutions and improve international network cooperation. In 1987, the Internet served more than 10,000 computers. By 1989 the network had grown to more than 100,000.

Evolution of Internet

- The origin of Internet can be traced to a U.S. Department of Defense (DoD) organization called Advanced Research Projects Agency (ARPA).
- ARPA developed a four node packet switching network called ARPANET in 1969. The network was intended to support the military research on fault tolerant computer networks. DoD wanted to ensure a reliable data transfer in the event of a nuclear war, even if parts of the network has been destroyed.
- As the years pass by, the network grew in size and by 1st January 1983, the ARPANET no longer remained an experimental network but its control was passed over to Defense Communications Agency (DCA).
- The network then became available for the academic research, government employee and contractors.
- The world's fastest and most powerful computers were made available to an academic and scientific community.
- In 1990 the ARPANET was officially decommissioned.

Some of the major networks contributing to the growth of the internet are as follows:

- ARPANET
- USENET (User's network)
- CSNET (Computer science network)
- BITNET (Because it's time network)
- NSFNET (National science foundation network)
- WWW (World Wide Web)
- NREN (National research and education network)
- Intranet It is said that the Internet is growing at a rate of 20% per month. The data speeds have gone up considerably, which makes the access even faster.
- The event which started as a military assistance program is now largely a private enterprise.

Services on the Internet

The services that are available on the Internet can be classified into two categories:

- Communication services (electronic mail (e-mail))
- Information retrieval services (Web (pages with links and multimedia content of its Web sites))

Applications of Internet

Traditionally the internet has the following applications.

1) E-mail 2) News
3) Remote login
4) File transfer
5) World wide web (www).

MODEL QUESTIONS

1. A ______ is a named location on a disk where files are stored.
1) Folder 2) Pod 3) Version
4) Bag 5) None of the above
2. The ______ allows you to choose where to go and is located below the Standards Buttons toolbar.
1) System menu
2) Address bar 3) Menu bar
4) Tool bar
5) None of the above
3. A _____ is a set of computer instructions that carry out a task on the computer.
1) Program 2) Database
3) Memory file 4) Folder
5) None of the above
4. An operating system version designed for home use is Microsoft Windows XP______
1) Home Edition
2) Media Center Edition
3) Tablet PC Edition
4) All of the above 5) None
5. A user-interface that is easy to use is considered to be______
1) user-happy 2) user-simple
3) user-friendly 4) Interface
5) None of the above
6. When you press and release the secondary mouse button you are______
1) Right-clicking
2) Left-clicking
3) Either 1 or 2
4) All of the above
5) Neither 1 nor 2
7. Another term for hyperlink is_______
1) Link 2) Source
3) Bar 4) All of the above
5) None of the above
8. A graphical user interface displays_________
1) Graphics 2) Text
3) Both 1 and 2
4) Neither 1 nor 2 5) None
9. The ______ program compresses larger files into a smaller file.
1) Win Zip 2) Win Shrink
3) Win Style 4) Win small
5) None of the above
10. The efficient data structure to insert/delete a number in a stored set of numbers is _________.
1) Queue 2) Linked list
3) Doubly linked list
4) Binary tree
5) None of the above
11. Caps lock, Num-lock are known as _______.
1) Modifier key 2) Toggle key
3) Function key 4) Numeric key
5) None of these
12. Which of the following memories must be refreshed many times per second?
1) Static RAM
2) Dynamic RAM 3) EPROM
4) ROM 5) None of these
13. Anurag is a supercomputer developed in _____
1) China 2) USA 3) India
4) England 5) None of these
14. A result of a computer virus can not lead to_______.
1) Disk Crash
2) Mother Board Crash
3) Corruption of program
4) Deletion of files
5) None of these
15. Choose the correct way to indicate that a line in a C++ program is a comment line, that is/a line they will not be executed as an instruction.
1) Begin the line with a # sign
2) Begin the line with double slashes (/ /)
3) Begin and end the line with double hyphens (-_-)
4) Indent the line
5) None of these
16. Programming language built into user programs such as Word and Excel are known as_____.
1) 4GLs 2) Macro languages
3) Procedure-oriented languages
4) Visual programming languages
5) None of these
17. Firewalls are used to protect against _______.
1) Unauthorized Attacks
2) Virus Attacks
3) Data Driven Attacks
4) Fire Attacks
5) All of these
18. System software is the set of programs that enables your computer's hardware devices and ______software to work together.
1) Management 2) Processing
3) Utility 4) Application
5) None of these
19. RAM can be thought of as the ________ for the computer's processor.
1) Factory 2) Operating room
3) Waiting room
4) Planning room
5) None of these
20. The CPU and memory are located on the ________.
1) Expansion board
2) Motherboard
3) Storage device
4) Output device
5) None of these
21. Word processing, spreadsheet and photo-editing are examples of ________.
1) Application software
2) System software
3) Operating system software
4) Platform software
5) None of the above
22. To hyperlink on the web page through HTML language, _____ tag is used.
1) <ahref> 2) <a> 3) <link>
4) <hlink> 5) <href>
23. Drop cap option found in which menu?
1) Insert 2) Format 3) Edit
4) Tools 5) None of these
24. A half byte is known as_______.
1) Data 2) Bit 3) Half byte
4) Nibble 5) All of these
25. A piece of computer hardware that is physically placed between two devices each of which manages data in a different way is called_______.
1) Modern 2) Interface
3) Clue 4) Data bus
5) All of these
26. ______ tags, when placed on an animal, can be used to record and track in a database all of the animals movements.
1) POS 2) RFID 3) PPS
4) GPS 5) None of these
27. Format for musical data communication between two devices such as computer and synthesizer is called_______.
1) HTML 2) MP3 3) MPEG
4) MIDI 5) None of these
28. Every computer connected to an intranet or extranet must have a distinct________.
1) Firewall 2) Proxy server
3) IP address 4) Domain name
5) None of these
29. A file extension is separated from the main file name with a (n) _______, but no spaces.
1) Question mark
2) Exclamation mark
3) Underscore
4) Period
5) None of these
30. A tuple is a______.
1) Column of a table
2) Two-dimensional table
3) Row of a table
4) Key of a table
5) None of these
31. Primary memory is used by the_____.
1) User 2) Input device
3) CPU 4) All of these
5) None of these
32. _____ was the precursor to internet as we know it today.
1) ARPANET 2) USENET
3) TELNET 4) DBMS
5) None of these
33. The ____________ enables you to simultaneously keep multiple web pages open in one browser window.
1) Tab bar 2) pop-up helper
3) Tab row 4) Address bar
5) None of these

KEY

1) 1	2) 2	3) 1	4) 1
5) 3	6) 1	7) 1	8) 3
9) 1	10) 3	11) 2	12) 2
13) 3	14) 2	15) 2	16) 4
17) 1	18) 4	19) 3	20) 2
21) 1	22) 1	23) 1	24) 4
25) 2	26) 2	27) 4	28) 3
29) 4	30) 3	31) 3	32) 1
33) 3			